www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి





మంగళవారం | 20-3-2018 | పేజీలు: 18 + 28 | వెల: రూ.5.00 | సంపుటి: 58 సంచిక: 334 | శ్రీవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: తదియ సా. 4.51 తదుపరి చవితి; నక్షత్రం: అశ్విని రా. 7.45 తదుపరి భరణి; వర్జ్యం: మ. 3.48-5.22, తె. 5.03 మొ.; దుర్ముహూర్తం: ఉ. 8.48-9.36, రా. 10.19-11.05; అమృతఘడియలు: మ. 12.40-2.14; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.24; సూర్యాస్తమయం: 6.23 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai


# ప్రజా ఫ్రంట్

## మాది ఒకటి రెండు పార్టీల కూటమి కాదు: కేసీఆర్



కోల్‌కతా రైటర్స్ బిల్డింగ్‌లో సమావేశం అనంతరం మమతతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న కేసీఆర్

- కోల్‌కతాలో మమతా బెనర్జీతో చర్చలు
- కాంగ్రెస్‌తో ప్రయోజనం లేదని స్పష్టీకరణ
- తృణమూల్ అధినేత్రి సానుకూల స్పందన
- దేశ ప్రజలను ఏకం చేయడమే లక్ష్యం
- ప్రజల అజెండాయే కూటమి అజెండా
- దేశంలోనే అతి పెద్దదిగా ఆవిర్భావం
- మాది సమష్టి, సమాఖ్య నాయకత్వం
- కూటమికి కోల్‌కతాలో శుభారంభం
- మిగిలిన నేతలతోనూ త్వరలో భేటీలు
- విలేకరులతో కేసీఆర్ వ్యాఖ్యలు
- ఆయనకు ఆత్మీయ స్వాగతం, వీడ్కోలు
- ఇతరులనూ కలుపుకెళ్తాం: మమత

బీజేపీ పోతే కాంగ్రెస్ వస్తుంది. అయితే ఏమవుతది? వాళ్లేమైనా అద్భుతం సృష్టిస్తారా? దేశానికి గొప్ప మార్పు అవసరం. దేశ పునర్నిర్మాణం అవసరం. అందుకే, ప్రత్యామ్నాయ అజెండా, ప్రత్యామ్నాయ అభివృద్ధి, ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి అవసరం. ఈ క్రమంలో మేం జరిపిన చర్చలు ఎంతో కీలకం"

-ముఖ్యమంత్రి కేసీఆర్

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): "దేశ ప్రజల కోసం 2019 ఎన్నికల్లోగా ఫెడరల్ ఫ్రంట్ అవసరం. కొంతమంది అనుకుంటున్నట్లు ఇది రాజకీయ ఫ్రంట్ కాదు. ఒకటి, రెండు పార్టీలను ఏకం చేయడం కాదు. దేశ ప్రజలను ఏకం చేయడమే లక్ష్యం. దేశ ప్రజల కోసం ఏర్పాటు చేయబోయే సమాఖ్య కూటమి ఇది" అని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. తాము ఏర్పాటు చేయబోయే కూటమి అతి పెద్దదిగా అవతరించబోతోందని, సమష్టి, సమాఖ్య నాయకత్వం ఉండబోతోందని చెప్పారు. ప్రజల అజెండాయే కూటమి అజెండా అన్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం మధ్యాహ్నం కోల్‌కతా సచివాలయంలో భేటీ అయ్యారు. సుమారు 2 గంటలపాటు

మిగతా 6వ పేజీలో...



## ఆరు వారాలు ఆగండి

ఎన్నికల ప్రక్రియ ఇప్పుడే వద్దు

సీల్డ్ కవర్‌లో వీడియో ఫుటేజీ ఇవ్వండి

23లోగా కౌంటర్లు దాఖలు చేయండి

ప్రభుత్వం, ఈసీలకు హైకోర్టు ఆదేశం

కోమటిరెడ్డి, సంపత్ పిటిషన్లపై విచారణ

హైదరాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఖాళీ అయినట్లు ప్రకటించిన నల్లగొండ, అలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరు వారాల పాటు ఎన్నికల ప్రక్రియ చేపట్టరాదని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను ఉమ్మడి హైకోర్టు ఆదేశించింది. ఈ నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్‌ల శాసనసభ సభ్యత్వాలు రద్దు కావడం తెలిసిందే. అసెంబ్లీలో ఈ నెల 12న గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలో వారిద్దరూ అనుచితంగా ప్రవర్తించారంటూ స్పీకర్ వేటు వేశారు. తమ శాసనసభ సభ్యత్వాలను రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ కోమటిరెడ్డి, సంపత్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్లను న్యాయమూర్తి జస్టిస్ బి.శివశంకర్ రావు సోమవారం మరోసారి విచారించారు. ఈ నెల 12న అసెంబ్లీలో జరిగిన ఘటన పూర్తి వీడియో ఫుటేజీని సీల్డ్ కవర్‌లో సమర్పించాలని అసెంబ్లీ కార్యదర్శిని న్యాయమూర్తి ఆదేశించారు. ఈ నెల 23లోగా కౌంటర్లు దాఖలు చేయాలని ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ కార్యదర్శిని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 27కు

మిగతా 2వ పేజీలో...





## పెళ్లికానుక రూ. 1,00,116

కల్యాణ లక్ష్మి ఆర్థిక సాయం పెంపు

మేనిఫెస్టోలో పెట్టకపోయినా అమలు

శాసనసభలో సీఎం కేసీఆర్ ప్రకటన

మండలిలో ప్రకటించిన డిప్యూటీ సీఎం

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నిరుపేద అమ్మాయిల వివాహాలకు రాష్ట్ర ప్రభుత్వం కల్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ పథకం కింద అందిస్తున్న ఆర్థికసాయాన్ని పెద్దమొత్తంలో పెంచింది. ఈ పథకం కింద ప్రస్తుతం రూ.75,116 ఇస్తుండగా, దానిని రూ.1,00,116కు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తెలిపారు. సోమవారం శాసనసభలో ఈ మేరకు ఆయన ప్రకటన చేశారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల ఆడపిల్లలు, వారి తల్లిదండ్రుల నుంచే కాకుండా సమాజహితం కోరే వారందరి నుంచి హర్షామోదాలు లభిస్తాయని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. "పేదరికం మనుషులను అనేక రకాలుగా వేధిస్తుంది. పేదరికంతో బాధపడేవారికి కొన్ని సందర్భాల్లో సంప్రదాయాలు కూడా భారంగా పరిణమిస్తాయి. మన సమాజంలో పెళ్లి అన్నది ఖర్చుతో కూడుకున్న అంశం. అందులోనూ ఆడపిల్ల పెళ్లి మరింత భారంగా పరిణమించింది. ఇంటి మహాలక్ష్మిగా భావించాల్సిన ఆడపిల్లను గుండెలమీద కుంపటిగా పరిగణించే స్థితికి తల్లిదండ్రులు చేరుకుంటున్నారు. ఆడపిల్ల పెళ్లి కోసం చేయాల్సిన ఖర్చును

మిగతా 2వ పేజీలో...

జూనియర్ కళాశాలలుగా **గురుకులాలు** | త్వరలో ప్రభుత్వ ఉత్తర్వులు జారీ 13

శ్రీరామనవమి ఎప్పుడు?

ఆంధ్రప్రదేశ్‌లో 25న 2

తెలంగాణలో 26న

# మళ్లీ అదే సీన్!

## చర్చకు రాని అవిశ్వాస తీర్మానాలు.. అన్నాడీఎంకే, టీఆర్ఎస్ నిరసనలు

- కేంద్రానికి కలిసొచ్చిన 'ఆందోళన'
- వందమందికి పైగా మద్దతున్నా వృథా
- పరిగణనలోకి తీసుకోవాలని టీడీపీ, వైసీపీ, విపక్షాల విన్నపం
- ఎవరు ఎటువైపో తెలియడంలేదన్న స్పీకర్
- నోటీసులను పక్కన పెట్టేసిన సుమిత్ర
- మరోమారు నోటీసులిచ్చిన టీడీపీ, వైసీపీ

న్యూఢిల్లీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అనుకున్నదే జరిగింది! అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభలో శుక్రవారం నాటి దృశ్యం పునరావృతమైంది. తెలుగుదేశం, వైసీపీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలపై చర్చ చేపట్టేందుకు అవసరమైనదానికంటే ఎక్కువ మద్దతు ఉన్నప్పటికీ, అవి మరోసారి 'గందరగోళం'లో కలిసిపోయాయి. వాటిని లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ పరిగణనలోకి తీసుకోలేదు. శుక్రవారం అన్నాడీఎంకే, టీఆర్ఎస్ సభ్యుల ఆందోళన నేపథ్యంలో... సభ సవ్యంగా లేదంటూ అవిశ్వాస తీర్మాన నోటీసులను స్పీకర్ తోసిపుచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో టీడీపీ లోక్‌సభా పక్ష నేత తోట నరసింహం, గల్లా జయదేవ్‌తోపాటు వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి వేర్వేరుగా అవిశ్వాస

మిగతా 18వ పేజీలో...

### టీడీపీ నిరసనలకు మేం అడ్డుకాదు

- రిజర్వేషన్లపై పోరాడుతూనే ఉంటాం
- అవిశ్వాసం వేరు.. మా పోరాటం వేరు
- 11వ రోజూ సభను అడ్డుకున్న టీఆర్ఎస్
- 20 సెకన్లలోనే లోక్‌సభ వాయిదా 18



16

## బీజేపీలో లుకలుకలు!

**అవిశ్వాసంపై ఓటింగ్ జరిగితే ఎంపీలు డుమ్మా?**

అందుకే తీర్మానంపై చర్చకు వెనుకంజ.. చర్చకు వెళదామన్న రాజ్‌నాథ్

వైఫల్యాలు బయటపడతాయి.. కర్ణాటక ఎన్నికల్లో దెబ్బతింటాం

మోదీ, షాల భయం.. ఈ వారంలోనే పార్లమెంటు నిరవధిక వాయిదా?



## వాట్సా్ప్‌లో టెన్త్ ప్రశ్నపత్రం!

రెండు జిల్లాల్లో ఇంగ్లిష్ పేపర్ బయటికి

మహబూబ్‌నగర్‌లో ఐదుగురిపై కేసు

ఆదిలాబాద్ జిల్లాలో నలుగురి సస్పెన్షన్

లీక్ కాదు.. మాల్ ప్రాక్టీస్: సర్కారు



లీక్ అయిన ఇంగ్లిష్ ప్రశ్నప్రతం ఇదే

హైదరాబాద్/మరికల్/నార్నూర్/ఉట్నూర్, మార్చి 19: పదో తరగతి ఇంగ్లిష్ పేపర్1 ప్రశ్నపత్రం సోమవారం వాట్సాప్‌లో ప్రత్యక్షమైంది! పరీక్ష ప్రారంభమైన గంటసేపటికే ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రెండు జిల్లాల్లో ప్రశ్నపత్రం ఇలా వాట్సాప్‌లో చక్కర్లు కొట్టింది. తొలుత మహబూబ్‌నగర్ జిల్లా మరికల్‌లో ప్రశ్నపత్రాన్ని ఫొటో తీసిన నిందితులు దాన్ని వనపర్తి జిల్లాలోని ఆత్మకూర్‌లో ఓ వ్యక్తికి వాట్సాప్‌లో పంపడంతో విషయం బయటకొచ్చింది. ఆదిలాబాద్ జిల్లాలోని నార్నూర్ మండలంలో కూడా ప్రశ్నపత్రం వాట్సాప్‌లో ప్రత్యక్షమైంది. మహబూబ్‌నగర్ జిల్లా మరికల్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ఉదయం విద్యార్థులు పదో తరగతి ఇంగ్లిష్-1 పరీక్ష రాస్తున్నారు. అదే గ్రామానికి చెందిన నవీన్

మిగతా 2వ పేజీలో...



హెచ్ఎండీఏ ప్లాట్ల వేలానికి సంబంధించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్, ప్రిన్సిపల్ సెక్రటరీ అర్వింద్‌కుమార్, హెచ్ఎండీఏ కమిషనర్ టి.చిరంజీవులు తదితరులు

# ప్లాట్లోయ్ ప్లాట్లు!

## పుష్కరం తర్వాత హెచ్ఎండీఏ వేలం

229 ప్లాట్లు.. లక్ష గజాల విస్తీర్ణం.. ఆదాయ లక్ష్యం 300 కోట్లు

హెచ్ఎండీఏ నోటిఫికేషన్ జారీ.. మొత్తం ప్రక్రియ ఆన్‌లైన్లో

మార్గదర్శకాలు విడుదల చేసిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్లాట్ల వేలానికి హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) నోటిఫికేషన్ జారీ చేసింది. ఆన్‌లైన్‌లో వేలం వేసే ప్లాట్లకు సంబంధించిన సమగ్ర సమాచారంతో పాటు నియమ నిబంధనలతో కూడిన బుక్‌లెట్‌ను మంత్రి కేటీఆర్ సోమవారం ఆవిష్కరించారు. సుమారు 12 ఏళ్ల తర్వాత

మిగతా 13వ పేజీలో...




13

### విమానాశ్రయం రూట్లో నేల దిగనున్న మెట్రో

- ఇంటర్‌చేంజ్‌ల వద్దనే పిల్లర్లు
- 18 నెలల్లో కారిడార్ నిర్మాణం
- గచ్చిబౌలి నుంచి 18 నిమిషాలే

## బతికినంతకాలం ఏలాలా?



- వందేళ్లూ పదవిలోనే ఉండాలా?
- అది హాస్యాస్పదం... నాకిష్టం లేదు
- స్టాలిన్ తీరు, చైనా పరిణామాలపై ఘాటు విమర్శలు చేసిన పుతిన్

**77 శాతం ఓట్ల రికార్డు ఆధిక్యతతో నాలుగోసారి రష్యా అధ్యక్షునిగా ఎన్నిక**

18

## చిరుద్యోగులకు పెద్ద కానుక?

- కనీస మూలవేతనం రూ.21,000
- ఏడో వేతన సంఘం సూచించింది 18,000
- అంతకుమించి పెంచనున్న కేంద్ర ప్రభుత్వం!
- త్వరలోనే నిర్ణయం.. ఏప్రిల్ నుంచి అమలు

## నిరాధార్!

6

- ఆధార్ ఇచ్చేందుకు 17.14 లక్షలమంది విముఖత
- 55 లక్షల ఖాతాలకే పంట సాయం, పాస్‌పుస్తకం



# చిరునవ్వుతో మరణించాలంటే..

**అంతకాలేచ మామేవ స్మరన్ ముక్త్వా కళేబరం**
**యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః**

"అంత్యకాలములో నన్ను స్మరించుచు దేహాన్ని, త్యాగం చేసినవాడు నన్ను నా స్వరూపాన్ని పొందగలడు. ఇందు ఎంతమాత్రము సంశయములేదు" అని దీని అర్థం. మనిషి జీవితమంతా ఎలా గడిచినా.. చివరిక్షణాల్లో అతనికి భగవంతుడు ఏ రూపంలో ఏ భావనలో ఉంటాడో అదే రూపంలో సాక్షాత్కరించి ముక్తిని కలిగిస్తాడు. వారి వారి మనోభావాలకి అనుకూలంగా (యద్భావం తద్భవతి) పరమపదప్రాప్తి కలుగజేస్తాడు. అయితే, కొంతమంది ఈ శ్లోకాన్ని అలుసుగా తీసుకుని.. 'బతికినంతకాలం విచ్చలవిడిగా యథేచ్ఛగా జీవించి మరణసమయంలో భగవంతుడిని స్మరిస్తే సరిపోతుందిగా' అని అంటుంటారు. కానీ మరణసమయం ఎలా ఉంటుందో మన బంధువుల అవసాన దశ చూస్తే బోధ పడుతుంది. దగ్గు, శ్లేష్మం, ఆయాసం వంటి వాటితో.. సర్వ ఇంద్రియాలూ చేష్టలుడిగి మరణయాతన అనుభవిస్తుంటే.. ఇహపరములు ఏకీకృతంగా కనపడుతుంటే.. అన్నాళ్లూ చేసిన పాపాలు కళ్ల ముందు కదులుతుంటే.. బంధుమిత్రుల రోదనల మధ్య భగవన్నామ స్మరణ గుర్తురాదు. అందుకే.. తనువునందు ఆ రూఢి ఉన్నప్పుడే, శరీరం వ్యాధిగ్రస్తమై శిథిలం కాకముందే.. మనసు వశమునందున్నప్పుడే.. వివేకివై భగవన్నామస్మరణం అనే ఆస్తిని సంపాదించి పెట్టుకుని మరణసమయాన చిరునవ్వుతో అందరికీ వీడ్కోలు పలుకడానికి సిద్ధంగా ఉండాలి.

-వేదాంతం జగన్నాథాచార్య



Paramjyothi పరంజ్యోతి

# 'కారుణ్యం' కోసం కార్పొరేట్ మెడికల్ బోర్డు

**▸ సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ**

మంచిర్యాల/రుద్రంపూర్, మార్చి 19, (ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాల ప్రక్రియలో సింగరేణి యాజమాన్యం తొలి అడుగు వేసింది. ఇందుకోసం సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్(సీఎంవో) చైర్మన్‌గా కార్పొరేట్ మెడికల్ బోర్డును ఏర్పాటు చేసింది. ఇందుకు సంబంధించిన సర్క్యులర్ ఈ నెల 9వ తేదీనే విడుదలైనా, సోమవారం బహిర్గతమైంది. దీని ప్రకారం ఉద్యోగులకు సంబంధించి ఫిట్, అన్‌ఫిట్‌ను నిర్ణయించే అధికారాన్ని కార్పొరేట్ మెడికల్ బోర్డుకు ఇచ్చారు. మెడికల్ బోర్డులో సీఎంవోతోపాటు ప్రభుత్వం నామినేట్ చేసిన ఇద్దరు లేదా ముగ్గురు నిపుణులు సభ్యులుగా ఉంటారు. భూగర్భ గనుల్లో పని చేయలేని వారికి వేతన నష్టం జరగకుండా ఉపరితల గనుల్లో సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ఇవ్వాలని నిర్ణయించారు. ఇదిలా ఉండగా, మెడికల్ ఇన్‌వ్యాలిడిటీ పరిధిలో 16 రకాల వ్యాధులను చేర్చారు. పక్షవాతం, మూత్రపిండాల వ్యాధులు, కాలేయ సంబంధిత, కేన్సర్, మెదడు సంబంధిత వ్యాదులు, పార్కిన్‌సన్స్, చేతులు-కాళ్లు కోల్పోయే పరిస్థితి, గుండె సంబంధిత వ్యాధులు, టీబీ, హెచ్‌ఐవీ, కుష్ఠు, తీవ్ర కీళ్ల నొప్పులు, కంటి జబ్బులు, వినికిడి లోపం, మానసిక వ్యాధిగ్రస్థులు, శ్వాసకోశ వ్యాధులు, ప్రమాదాల్లో గాయపడి ఉద్యోగం చేయలేని వారిని మెడికల్ ఇన్‌వ్యాలిడిటీ (అన్‌ఫిట్)గా గుర్తించనున్నారు. ప్రస్తుతానికి మెడికల్ బోర్డు వద్ద 1500కుపైగా దరఖాస్తులు ఉండగా, మరి కొంత మంది దరఖాస్తు చేసుకునే అవకాశాలున్నాయి.

# కేటీఆర్.. ఇప్పుడెవర్ని చెప్పుతో కొట్టాలి?

## లంచం అడిగితే అలా చేయమంది మీరే కదా!.. సిరిసిల్ల మునిసిపల్ చైర్‌పర్సన్ ఆరోపణలపై ఏమంటారు?

**▸ టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూటి ప్రశ్నలు**

**▸ ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని స్పష్టీకరణ**



న్యూఢిల్లీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): లంచం అడిగితే చెప్పుతో కొట్టాలన్న మంత్రి కేటీఆర్.. సిరిసిల్ల మునిసిపల్ చైర్‌పర్సన్ పావని చేసిన ఆరోపణలపై ఏమంటారని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. ప్లీనరీ సమావేశాల నేపథ్యంలో ఢిల్లీ వచ్చిన ఆయన సోమవారం ఏఐసీసీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ సొంత నియోజకవర్గం సిరిసిల్లలో అవినీతి జరుగుతోందన్న విషయాన్ని పావని బయటపెట్టారని, దీన్ని బట్టి ఇప్పుడెవర్ని చెప్పుతో కొట్టాలో మంత్రి సమాధానమివ్వాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. నైతికంగా కేటీఆర్ మంత్రిగా కొనసాగకూడదని, వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రి సహకారంతోనే కమీషన్ల దందా నడుస్తోందని, ఇందుకు మునిసిపల్ చైర్‌పర్సన్ చేసిన వ్యాఖ్యలే నిదర్శనమన్నారు. ఎస్సీ వర్గీకరణకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. మాదిగల కోసం దశాబ్దాలుగా పోరాడుతున్న మంద కృష్ణను ఉద్దేశపూర్వకంగా జైల్లో పెట్టి హత్యాయత్నానికి పాల్పడ్డ అంశంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. స్థానిక పోలీసులపై నమ్మకం లేకనే సీబీఐ విచారణ కోరుతున్నట్లు తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం ఆది నుంచి దళితుల విషయంలో అమానవీయంగా ప్రవర్తిస్తోందని ఆరోపించారు. మంత్రి మండలిలో సైతం ఒక్కరికీ చోటు ఇవ్వలేదని, ఉన్న ఒక్క ఉప ముఖ్యమంత్రినీ బర్తరఫ్ చేశారని దుయ్యబట్టారు. దళితుల గొంతుకగా పనిచేస్తున్న సంపత్ శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేశారని మండిపడ్డారు.

### కేసీఆర్ ఫ్రంట్.. కొత్త డ్రామా

ప్రత్యామ్నాయ కూటమి తెస్తానని కేసీఆర్ కొత్త డ్రామా ఆడుతున్నారని ఉత్తమ్ విమర్శించారు. మమతా బెనర్జీని కలవడం కూడా అందులో భాగమేనన్నారు. ప్రజలు ప్రశ్నిస్తారు కాబట్టే వారి దృష్టి మరల్చేందుకు ఫ్రంట్ అనే స్టంట్ తెచ్చారని దుయ్యబట్టారు.

### మంత్రులు కుట్ర చేశారు: మంద కృష్ణ

తనను జైల్లో ఉంచి హతమార్చేందుకు రాష్ట్ర మంత్రులు, ఒక ఎమ్మెల్యే కుట్ర చేశారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆరోపించారు. దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వారి వివరాలు జాతీయస్థాయి నాయకుల సమక్షంలో వెల్లడిస్తానని తెలిపారు. వర్గీకరణపై కాంగ్రెస్ మద్దతు కోరామని, దీనికి సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు.

### ఎన్డీయేతో ఉన్నారో లేదో చెప్పాలి: ఖుంటియా

ఫ్రంట్ పేరుతో జాతీయస్థాయి మద్దతు కూడగడతానన్న కేసీఆర్.. ఎన్డీయేతో ఉన్నారో లేదో మొదట స్పష్టత ఇవ్వాలని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి ఖుంటియా డిమాండ్ చేశారు. ఆ ఫ్రంట్ విపక్షాలను కలుపుకొని వెళ్లేదా, లేక ఎన్డీయేకు అనుకూలంగా ప్రతిపక్షాలను విభజించడానికా చెప్పాలన్నారు. శాసనసభ్యుల సభ్యత్వాలను రద్దు చేసినంత మాత్రాన కాంగ్రెస్ గొంతు నొక్కలేరని హెచ్చరించారు. అసెంబ్లీ కమిటీ, ఎథిక్స్ కమిటీ దృష్టికి కూడా విషయాన్ని తీసుకెళ్లకుండా అప్రజాస్వామికంగా ఎమ్మెల్యేల సభ్యత్వాలను రద్దు చేయడంపై పోరాటం మొదలైందని ఆ పార్టీ నేత సంపత్ తెలిపారు. ఆ దిశగానే ప్రస్తుతం హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందని, ఇది శుభపరిణామని అన్నారు.

# ఫాసిస్టు శక్తులకు చెక్ పెట్టాలి

## వామపక్ష, అంబేడ్కర్‌వాదులు ఏకం కావాలి

**▸ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లకు అడ్డుకట్ట వేయాలి: జిగ్నేశ్**

**▸ దేశంలో కృత్రిమ సంక్షోభాన్ని సృష్టిస్తున్నారు: గద్దర్**

**▸ బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కార్యాలయం ప్రారంభం**




సమావేశంలో మాట్లాడుతున్న జిగ్నేశ్ మేవాని

చిక్కడపల్లి/హైదరాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వామపక్ష, అంబేడ్కర్‌వాదుల కలయికతో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిస్టు శక్తులను నిరోధించాలని గుజరాత్ ఎమ్మెల్యే, ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు జిగ్నేశ్ మేవాని పిలుపునిచ్చారు. మహాజన పాదయాత్ర ముగింపు వార్షికోత్సవం సందర్భంగా 'నేటి రాజకీయాలు-వామపక్ష సామాజిక శక్తుల కర్తవ్యం' అనే అంశంపై సోమవారం నాడిక్కడ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కాకి మాధవరావు అధ్యక్షతన సెమినార్ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిగ్నేశ్ మాట్లాడుతూ.. సిద్ధాంతపరమైన సమస్యలను వామపక్షాలు, అంబేడ్కర్‌వాదులు అంతర్గతంగా పరిష్కరించుకుంటూ ముందుకెళ్తే దేశానికి ఒక దశ, దిశ లభిస్తుందన్నారు. బీజేపీ, సంఘ్‌పరివార్ శక్తులకు అడ్డుకట్ట వేయకుంటే దేశంలో ప్రమాదకర పరిస్థితులు ఎదురవుతాయని హెచ్చరించారు. ఎన్నికలు 2018లోనే జరిగే అవకాశాలున్నాయని, బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ అధికారంలోకి వస్తే దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ముఖ్యంగా కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా గాయకుడు గద్దర్ మాట్లాడుతూ.. పాలకులు మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు దేశంలో కృత్రిమ రాజకీయ సంక్షోభాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలోనూ ఇదే పరిస్థితి కనబడుతోందన్నారు. త్యాగాల తెలంగాణ ఫలితాలు రాష్ట్ర ప్రజలకు చేరకముందే దేశాన్ని ఉద్ధరిస్తామంటూ కేసీఆర్ కొత్త రాజకీయ అస్త్రాన్ని తెరపైకి తెచ్చారన్నారు. బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ చైర్మన్ నల్లా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. బీఎల్‌ఎఫ్ బలపడుతోందని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలోనూ తేలడంతో కేసీఆర్ బృందంలో జలదరింపు ప్రారంభమైందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. మహాజన పాదయాత్ర తెలంగాణ సామాజిక ఉద్యమంలో ఓ మలుపుగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి కోసం బహుజన వామపక్ష శక్తులను ఐక్యం చేయడంలో టీమాస్ ఎంతో దోహదం చేసిందన్నారు. అనంతరం గోల్కొండ చౌరస్తాలో బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కార్యాలయాన్ని జిగ్నేశ్ ప్రారంభించారు. కాగా, ప్రారంభోత్సవానికి తనను ఆహ్వానించలేదంటూ గద్దర్ అలిగారు. జనం మధ్యలో కూర్చున్న గద్దర్‌ను నాయకులు వేదికపైకి ఆహ్వానించినా వెళ్లలేదు. వక్తలు మాట్లాడుతుండగానే ఆయన సభ నుంచి వెళ్లిపోయారు.

# కేసీఆర్‌ను గద్దె దించడమే లక్ష్యం

**▸ విలువలతో కూడిన రాజకీయాలు చేద్దాం: కోదండ**



హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ సర్కారు.. పాలనలో పూర్తిగా విఫలమయిందని టీజేఏసీ చైర్మన్ కోదండరాం అన్నారు. కేసీఆర్‌ను గద్దె దించడమే తమ ఏకైక లక్ష్యమని తెలిపారు. కోదండరాం నేతృత్వంలో ఏర్పాటు కానున్న పార్టీ సన్నాహక కమిటీ సోమవారం ఎల్బీ నగర్‌లో సమావేశమైంది. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ కలిసివచ్చే వారందరినీ కలుపుకొని ముందుకు సాగుతామన్నారు. కొత్తగా స్థాపించనున్న పార్టీ తరపున విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ ఆవిర్భావ సభను అంబేద్కర్ జయంతి అయిన ఏప్రిల్ 14న నిర్వహించాలని కోదండరాం నిర్ణయించినట్లు, వచ్చే నెల 10లోగా జిల్లా కమిటీల ఏర్పాటు పూర్తి కావాలని సూచించినట్లు తెలిసింది.



కల్యాణ లక్ష్మి పథకం కింద ఆర్థిక సాయం పెంచినందున సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న మహిళా ఎమ్మెల్యేలు

# పెళ్లికానుక రూ. 1,00,116

(మొదటిపేజీ తరువాయి..)

తలచుకుని కొందరు తల్లిదండ్రులు భ్రూణ హత్యలకూ పాల్పడుతున్న అమానుష సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. పేదల ఇళ్లలో కొన్నిసార్లు ఆడపిల్లలు పెళ్లిళ్లు కాకుండానే మిగిలిపోతున్నారు. ఆడపిల్లల పెళ్లి కోసం కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయి. అందుకే.. ఆడపిల్లలు ఎదుర్కొంటున్న కష్టాన్ని, వారి తల్లిదండ్రులు అనుభవిస్తున్న ఆవేదనను తీర్చాలని భావించాం. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించకపోయినా కల్యాణలక్ష్మి అన్న శుభప్రదమైన పేరుతో ఆడపిల్లల పెళ్లికి అండగా నిలవాలని 2014 అక్టోబరు 2న ఈ పథకాన్ని ప్రవేశపెట్టాం. ఈ పథకం ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచింది. వ్యక్తిగతంగా నాకిది ఎంతో దగ్గరైన పథకం. అంతకంటే ఎక్కువగా ప్రజలు మెచ్చిన పథకం" అని సీఎం కేసీఆర్ అన్నారు.

### కల్యాణలక్ష్మితో ప్రభుత్వానికి దీవెనలు..

కల్యాణలక్ష్మి పథకంతో ప్రభుత్వానికి గొప్ప దీవెనలు అందుతున్నాయని సీఎం కేసీఆర్ తెలిపారు. "కల్యాణలక్ష్మి పథకాన్ని మొదట రూ.51 వేలు అందించేలా ప్రారంభించాం. ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు సామాజికవర్గంతో నిమిత్తం లేకుండా నిరుపేదలందరికీ వర్తింపజేశాం. ఈ పథకం ప్రయోజనాన్ని మరింత విస్తరించాలన్న ఉద్దేశంతో దీని కింద అందించే మొత్తాన్ని గత ఏడాది రూ.75,116కు పెంచాం. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 3.60 లక్షల మందికి లబ్ధి చేకూరింది. కల్యాణలక్ష్మి చెక్కులు తీసుకుంటున్న సమయంలో ఆడపిల్లల తల్లులు ఆనందబాష్పాలతో ప్రభుత్వాన్ని దీవిస్తున్నారు. ఈ పథకం ఇతర సామాజిక ప్రయోజనాలనూ సాధించింది. పథకం కింద లబ్ధి పొందేందుకు కనీస వయోపరిమితిని 18ఏళ్లుగా నిర్ణయించడంతో అమ్మాయిలకు బాల్య వివాహాలు చేయకుండా తల్లిదండ్రులు వేచి ఉంటున్నారు. కల్యాణలక్ష్మి సాయమందుకున్న వివాహాలకు ప్రభుత్వ గుర్తింపుతో పాటు చట్టబద్ధత కూడా చేకూరుతుండటం ఈ పథకం సాధించిన మరో ప్రయోజనం. ఇకపై పథకం కింద ఆర్థిక సాయాన్ని రూ.75,116 నుంచి రూ.1,00,116కు పెంచుతున్నాం. దీనికి అందరి హర్షామోదాలు లభిస్తాయని విశ్వసిస్తున్నాను.వారి ఆశీర్వాదమే కొండంత అండగా తెలంగాణను సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలియజేస్తున్నా" అని ముఖ్యమంత్రి వివరించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద ఆర్థికసాయం పెంచుతున్న విషయాన్ని శాసనమండలిలో ఉప ముఖ్యమంత్రి కడియం ప్రకటించారు.

# వాట్సా‌ప్‌లో టెన్త్ ప్రశ్నపత్రం!

(మొదటిపేజీ తరువాయి..)

తన చెల్లెలు రాస్తున్న ప్రశ్నపత్రాన్ని కిటికీ నుంచి తీసుకొని మరో యువకుడి మొబైల్‌తో ఫొటో తీసి ముగ్గురు స్నేహితులకు వాట్సాప్ ద్వారా పంపించాడు. విషయాన్ని గుర్తించిన పరీక్ష విభాగం అధికారులు మహబూబ్‌నగర్ అధికారులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న అధికారులు మరికల్ చేరుకొని నిందితుడు నవీన్‌పాటు బాలకృష్ణ, మోహన్, ప్రవీణ్, పరీక్ష రాస్తున్న విద్యార్థి హరీశ్‌పై కేసు నమోదు చేశారు. రెండు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలను కూడా విచారిస్తున్నామన్నారు. ఇక ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని తాడిహత్నూర్ పదో తరగతి పరీక్షా కేంద్రం నుంచి ఇంగ్లిష్ ప్రశ్నపత్రం లీకై వాట్సాప్‌లో దర్శనమిచ్చింది. ఈ ఘటనలో చీఫ్ సూపరింటెండెంట్ భరత్ చౌహాన్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ జగన్మోహన్, కస్టోడియన్ నాగోరావుతో పాటు ఇన్విజిలేటర్ కృష్ణవేణిని సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ దివ్య చెప్పారు. 15న ఉట్నూర్‌లోని బాలికల ఆశ్రమ పాఠశాలలో మాల్‌ప్రాక్టీస్‌ను ప్రోత్సహించినందుకు సీఎస్ జాదవ్ సుమన్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ యాసిన్ షరీఫ్, ఇన్విజిలేటర్లు చంద్రకళ, రమేశ్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కిషన్ సోమవారం రాత్రి హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ఇది పేపర్ లీకేజీ కాదని, మాల్ ప్రాక్టీస్ మాత్రమేనని స్పష్టత ఇచ్చారు. ఆదిలాబాద్‌లో ఇన్విజిలేటర్ ప్రశ్నపత్రం ఫొటో తీసి వాట్సాప్ ద్వారా ఇతరులకు పంపినట్లు విచారణలో తేలిందన్నారు. మహబూబ్‌నగర్‌లో రెండు ప్రైవేటు కళాశాలల ప్రమేయం ఉందని తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రెండు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించామన్నారు. విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరీక్షలు యథాతథంగా జరుగుతాయని చెప్పారు.

● సూర్యాపేట జిల్లా కోదాడలో శ్రీచైతన్య పాఠశాలకు చెందిన 265 మంది విద్యార్థులకు మూడు కేంద్రాలే కేటాయించడంపై ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది.

### ఒక ప్రశ్నలో తప్పు

పదో తరగతి ఇంగ్లిష్ పేపర్-1 ప్రశ్నప్రతం సులువుగానే ఉన్నప్పటికీ ఒక ప్రశ్నలో తప్పు దొర్లినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. 20వ ప్రశ్నలో ఫిల్ ఇన్ ద బ్లాంక్‌కు సంబంధించిన సమాధానాన్ని ప్రశ్నలోనే ఇచ్చారని పేర్కొన్నారు.

### ప్రభుత్వ అసమర్థతతోనే లీకేజీ: సండ్ర

టీఆర్ఎస్ హయాంలో ప్రశ్నపత్రాల లీకేజీ సాధారణ విషయంగా మారిందని టీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. నాలుగేళ్లలో ఇంటర్, ఎంసెట్ ప్రశ్నపత్రాలు లీకయ్యాయని గుర్తు చేశారు. ప్రభుత్వ అసమర్థత వల్లే ఇలాంటివి జరుగుతాయన్నారు. శాసనసభ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. ఈ లీకేజీలతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారన్నారు.

# 6 వారాలు ఆగండి

(మొదటిపేజీ తరువాయి..)

వాయిదా వేశారు. రాజ్యాంగ పదవిలో ఉన్న గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలో కోమటిరెడ్డి, సంపత్‌కుమార్‌లు సభా మర్యాదలకు భంగం కలిగేలా అనుచితంగా ప్రవర్తించారని అడ్వకేట్ జనరల్ ప్రకాశ్‌రెడ్డి కోర్టుకు తెలిపారు. పిటిషనర్ల తరపు న్యాయవాదుల వాదనలు ఇప్పటికే ముగిసిన నేపథ్యంలో ఏజీ వాదనలు వినిపించారు. కోమటిరెడ్డి, సంపత్‌కుమార్‌ల ప్రపవర్తనపై సభలో తీర్మానం పెట్టి బహిష్కరించారని చెప్పారు. బహిష్కరణ నిర్ణయం స్పీకర్ తీసుకున్నది కాదని, సభ తీసుకున్నదని తెలిపారు. కోమటిరెడ్డి విసిరిన ఇయర్‌ఫోన్‌తో మండలి చైర్మన్ కంటికి గాయమైందని, అయినా కోమటిరెడ్డిలో కనీసం పశ్చాత్తాపం లేదని పేర్కొన్నారు. సభ్యుల ప్రవర్తన ఆధారంగా చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉందని, ఈ మేరకు సుప్రీం కోర్టు తీర్పులు ఉన్నాయని తెలిపారు. సభ కార్యకలాపాలకు విఘాతం కలిగించలేదని పిటిషనర్లు ఎక్కడా పేర్కొనలేదని, అలాగే అసెంబ్లీ తీర్మానాన్ని ఎక్కడా సవాల్ చేయలేదని, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వరాదని విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ స్థానాలు ఖాళీ అయినట్లుగా ప్రకటించి నోటిఫికేషన్ ఇచ్చామని, ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ఎన్నికల కమిషన్‌దేనని వివరించారు. సభలో ఆరు కెమెరాలు పనిచేశాయని, ఇందులో గవర్నర్ వైపు ఉన్న రెండు కెమెరాల ఫుటేజీని కోరుతున్నామని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. మొత్తం వీడియో ఫుటేజీని సమర్పిస్తామని ఏజీ నివేదించారు. ఎన్నికల కమిషన్‌ను వివరణ కోరగా పది రోజుల వరకు ఎన్నికల ప్రక్రియ చేపట్టబోమని కమిషన్ తరపు న్యాయవాది అవినాష్ దేశాయ్ నివేదించారు. భజరంగ్ బహదూర్‌సింగ్ కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఎన్నికల కమిషన్ విధులు నిర్వహిస్తుందని నివేదించారు. ఈ విషయాన్ని నమోదు చేసిన న్యాయమూర్తి... ఆరు వారాల పాటు ఎన్నికల ప్రక్రియ నిర్వహించరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

# శ్రీరామనవమి ఎప్పుడు?

**▸ తెలంగాణలో 26న.. ఏపీలో 25న**

భద్రాచలం/అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పర్వదినాన్ని ఎప్పుడు నిర్వహించుకోవాలి? ఆంధ్రప్రదేశ్‌లో 25న నిర్వహించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించగా.. తెలంగాణ ప్రభుత్వం భద్రాచలంలో ఈ నెల 26న నవమి వేడుకలు జరపాలని నిర్ణయించింది. తిరుమల తిరుపతి దేవస్థానం రూపొందించిన క్యాలెండర్ ప్రకారం 25న వేడుకలు నిర్వహించనున్నట్లు ఏపీ దేవాదాయ శాఖ వర్గాలు తెలిపాయి. అయితే, అష్టమితో కూడిన నవమి పనికిరాదని, ధర్మసింధు ఇదే స్పష్టం చేస్తోందని కొందరు పండితులు చెబుతున్నారు. ఆ ప్రకారమే, భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం వైదిక కమిటీ నిర్ణయించిన మేరకు తెలంగాణ ప్రభుత్వం అక్కడ 26న సీతారామకల్యాణం జరిపించనుంది. మరికొందరు పండితులు ఇందుకు భిన్న వాదన వినిపిస్తున్నారు. "నవమి తిథి ఈనెల 25న సూర్యోదయం అయ్యాక వస్తుంది. 26వ తేదీ సూర్యోదయానికి ముందే ముగిసి, సూర్యోదయ సమయానికి దశమి వచ్చేస్తుంది. ధర్మసింధు ప్రకారం.. అష్టమితో కూడిన నవమిని శ్రీరామనవమిగా పరిగణించడానికి వీల్లేదు. ఆ లెక్క ప్రకారం 25న శ్రీరామనవమి కాదు. కానీ, అదే ధర్మ సింధు ప్రకారం.. అష్టమితో కూడిన నవమి వచ్చినప్పుడు, మర్నాడు సూర్యోదయం తర్వాత కూడా మూడున్నర ఘడియలపాటు నవమి ఉంటే మర్నాటినే శ్రీరామనవమిగా పరిగణించాలి. కానీ, 26న సూర్యోదయానికి ముందే నవమి వెళ్లిపోతోంది. అలాంటి సందర్భాల్లో ముందు రోజునే నవమి వేడుకలు నిర్వహించాలని ధర్మసింధు చెబుతోంది" అని వారు వివరిస్తున్నారు. రెండో రోజు నవమి లేకపోతే ముందురోజే సర్వ మతస్తులు నవమి జరుపుకోవాలని ఉందంటున్నారు.

# మెహ్రాం కోటాలో హజ్‌కు సీట్ల పెంపు

హైదరాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మెహ్రాం కోటా కింద హజ్‌కు వెళ్లే మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా మరో 500 సీట్లు పెంచిందని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ మసియుల్లా ఖాన్ తెలిపారు. హజ్-2018కు ఇప్పటికే ఎంపికైన యాత్రికుల సమీప బంధువులైన మహిళలు ఈ కోటా కింద మంగళవారంలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలను రాష్ట్ర హజ్ కమిటీ కార్యాలయంలో లేదా 040-23298793కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

## లోకం తీరు




### ఉష్ణోగ్రతలు

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఖమ్మం | 39.0 | 22.0 |
| నిజామాబాద్ | 37.5 | 22.0 |
| రామగుండం | 37.2 | 21.0 |
| అదిలాబాద్ | 37.0 | 16.5 |
| హైదరాబాద్ | 35.8 | 21.0 |

## సర్వదర్శనానికి 7 గంటలు

తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దాదాపు 65 వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి సుమారు 7 గంటలు, దివ్యదర్శనానికి సుమారు 2 గంటల సమయం పడుతోంది. బుధవారం సేవలకు సంబంధించి విజయాబ్యాంకులో మంగళవారం లాటరీ ద్వారా జారీచేసే టిక్కెట్లు.. సుప్రభాతం:50, కల్యాణోత్సవం:80, డోలోత్సవం:25, అర్చన:26, ఆన్‌లైన్‌లో రూ.300 టిక్కెట్లు పొందడానికి www.ttdsevaonline.com లో సంప్రదించాలి.

- ఆంధ్రజ్యోతి, తిరుమల



## మోదీ లేని భారత్ రావాలి

" ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర ప్రభుత్వ తప్పుడు వాగ్దానాలతో దేశం విసిగిపోయింది. అందుకే 2019 ఎన్నికల్లో మోదీ లేని భారత్(మోదీ ముక్త్ భారత్) రావాలి. దానికోసం ప్రతిపక్ష పార్టీలన్నీ ఒక్కతాటిపైకి రావాలి."

- రాజ్ ఠాక్రే, ఎంఎన్ఎస్ చీఫ్



## యోగి ఆత్మపరిశీలన చేసుకోవాలి

" ప్రభుత్వ పాలన ఎలా ఉండకూడదో చెప్పడానికి ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ఏడాది పాలనను ఉదాహరణగా చూపొచ్చు. గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్ లోక్‌సభ ఎన్నికల్లో వారికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు. ఇప్పటికైనా ఏడాది పాలనపై బీజేపీ వేడుకలు చేసుకోవడం మాని ఆత్మపరిశీలన చేసుకోవడం మంచిది."

- మాయావతి, బీఎస్పీ చీఫ్

### నేటి పెట్రో ధరలు (లీ.)

| పెట్రోల్ | డీజిల్ |
|---|---|
| పాత ధర రూ.76.44 | పాత ధర 68.15 |
| కొత్త ధర రూ.76.46 | కొత్త ధర 68.23 |
| పెరుగుదల: 2 పైసలు | పెరుగుదల: 8 పైసలు |



## వీర్యకణాల సంఖ్య తగ్గితే అనారోగ్యానికి సూచిక

లండన్, మార్చి 19: పురుషుల్లో వీర్య కణాల సంఖ్య తగ్గితే వారు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఎక్కువని ఇటలీలోని యూనివర్సిటీ ఆఫ్ పడోవా శాస్త్రవేత్తలు తెలిపారు.సంతానోత్పత్తి విశ్లేషణకు 5,177 మంది పురుషుల వీర్య కణాల నాణ్యత, పునరుత్పత్తి పనితీరు, జీవక్రియ విధానాన్ని పరిశీలించగా వీర్య కణాల సంఖ్య పడిపోయిన వారు రోగాల బారిన పడ్డారని వెల్లడించారు.

## బరువు తగ్గించే మధుమేహం మందు

న్యూయార్క్, మార్చి 19: ఆంత్రము నుంచి చక్కెరను గ్రహించడాన్ని నెమ్మదించి, ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచి బరువు నియంత్రణలో ఉండేలా చేసే హార్మోన్.. 'గ్లూకోగాన్ లైక్ పెప్టైడ్ 1' అచ్చం ఈ హార్మోన్‌లాగే పనిచేసి బరువును తగ్గించేందుకు 'సెమాగ్లూటైడ్' అనే రసాయన సమ్మేళనాన్ని అమెరికాలోని సౌత్ కరోలినా వర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. దీంతో సత్ఫలితాలు సాధించినట్లు తెలిపారు.



విలపిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

# నలుగురు చిన్నారుల జలసమాధి

**▸ ప్రాణాలు తీసిన ఈత సరదా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విషాదం**

టేకులపల్లి, మార్చి 19: ఆడుకుందామని చెరువువద్దకు వెళ్లిన నలుగురు చిన్నారులు జలసమాధి అయ్యారు. ఈత సరదా వారి ప్రాణాలు తీసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన బానోతు దిలీప్(10), బానోతు సంతోష్(14), బానోతు సిద్ధు(12), లావుడ్యా సౌజన్(13) స్థానిక హైస్కూల్‌లో ఐదు, ఆరు, ఎనిమిదో తరగతులు చదువుతున్నారు. ఒక్కపూట బడులు కావడంతో వారు సోమవారం మధ్యాహ్నం గ్రామంలోని సాయమ్మ చెరువుకు వెళ్లారు. అక్కడ సీమచింత(గుబ్బ) కాయలు కోసుకొని తిన్నారు. తర్వాత సరదాగా ఈత కొట్టేందుకు చెరువులోకి దిగారు. ఈ చెరువులో ఇటీవల మిషన్ కాకతీయ పథకం కింద పునరుద్ధరణ పనులు జరగ్గా అక్కడ గుంతలు ఏర్పడ్డాయి. చిన్నారులు ఆ గుంతల్లో మునిగి ప్రాణాలు విడిచారు. తల్లిదండ్రుల రోదనలతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## చెరువుల వద్దకు వెళ్లకుండా చూడాలి

**▸ తల్లిదండ్రులకు హరీశ్‌రావు విజ్ఞప్తి**



హైదరాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లలు చెరువుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు మంత్రి హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. త్వరలో వేసవి సెలవులు రానుండటంతో మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. చిన్నారులకు నిర్ణీత వయస్సు వచ్చాక ఈత నేర్పించాలని సూచించారు. ఈత రాకపోవడమే ప్రమాదాల తీవ్రతను మరింత పెంచుతోందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ అవసరాల కోసం మట్టి తరలింపు సమయంలో చెరువు గట్టు, కట్టకు సమీపంలో లోతైన గుంతలు తవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. దేవరకొండ, కౌడిపల్లి తరహా ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించానని చెప్పారు.

### ఇళ్ల స్థలాల కోసం మంత్రులకు జర్నలిస్టుల వినతిపత్రం

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు విషయమై మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌కు జర్నలిస్టుల హౌసింగ్ కో ఆర్డినేషన్ కమిటీ వినతిపత్రం సమర్పించింది. దీర్ఘకాలికంగా పెండింగులో ఉన్న ఈ సమస్యను పరిష్కరించాలని మంత్రులను కమిటీ ప్రతినిధులు కోరారు. అడ్వకేట్ జనరల్‌తో మాట్లాడి త్వరలోనే ఓ సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రులు హామీ ఇచ్చారు. ఈ విషయమై డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డితో కూడా జర్నలిస్టుల ప్రతినిధులు చర్చించారు.

# ఉద్యోగార్థులకు చేయూత

**▸ గ్రూప్-2 కోసం నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ**

**▸ మధ్యాహ్నం భోజన వసతి కూడా కల్పిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండల్‌రెడ్డి**

**▸ రూ.40 లక్షల సొంత డబ్బుతో 130 రోజుల శిక్షణ**



శిక్షణ తరగతులకు హాజరైన అభ్యర్థులు

వికారాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రతిభ ఉన్నా సరైన శిక్షణ తీసుకునే ఆర్థిక స్థోమత లేక లక్ష్యసాధనకు దూరంగా మిగిలిపోతున్న యువత ఎందరో. అలాంటి వారికి నిపుణులతో శిక్షణ ఇప్పించి వారి కలను సాకారం చేసేందుకు కృషి చేస్తున్నారు వికారాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సనగారి కొండల్‌రెడ్డి. గ్రూప్-2 రాసి మంచి ఉద్యోగం సాధించాలనుకునే నిరుద్యోగ యువతీ యువకులకు స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఉచిత శిక్షణ ఇప్పిస్తున్నారు. హైదరాబాద్‌లోని ప్రముఖ శిక్షణ సంస్థల్లో పనిచేస్తున్న నిపుణులతో తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 4న ప్రారంభమైన ఈ శిక్షణ తరగతులు రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 510 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఈ నెల 16వ తేదీ నుంచి మధ్యాహ్నం భోజన సదుపాయాన్ని కూడా కొండల్‌రెడ్డి కల్పించారు. 130 రోజుల పాటు కొనసాగే శిక్షణ తరగతుల కోసం కొండల్‌రెడ్డి రూ.40 లక్షల సొంత డబ్బును ఖర్చు చేస్తున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితుడైన క్రమంలోనే నిరుద్యోగ యువతకు సాయపడాలనే ఆలోచన కొండల్‌రెడ్డికి వచ్చింది. వెంటనే కేంద్ర గ్రంథాలయ భవనాన్ని రూ.7 లక్షల సొంత డబ్బుతో అత్యాధునిక హంగులతో ఆధునికీకరించారు. గ్రంథాలయానికి వచ్చే నిరుద్యోగ యువతతో మాట్లాడినప్పుడు పోటీ పరీక్షల కోసం వారు హైదరాబాద్‌కు వెళ్లి శిక్షణ తీసుకోలేని స్థితిలో ఉన్నట్లు తెలిసింది. వెంటనే వారికి ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ ఇప్పించారు. కొండల్‌రెడ్డి సేవల పట్ల జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 26 నుంచి కృష్ణా ట్రైబ్యునల్‌లో వాదనలు

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జలాల వాటాల పంపకంపై బ్రిజేష్‌కుమార్ ఆధ్వర్యంలో కృష్ణా ట్రైబ్యునల్‌లో ఈనెల 26 నుంచి వాదనలు జరగనున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు మూడు రోజులపాటు తమ వాదనలను వినిపించనున్నాయి. ఈ వాదనలపై తెలంగాణ అంతర్రాష్ట్ర జల విభాగం ఇంజనీర్లు కసరత్తు మొదలు పెట్టారు. ఇరు రాష్ట్రాలూ తమకు కావాల్సిన నీటి కోటాపై ఇప్పటికే ట్రైబ్యునల్‌లో ప్రమాణపత్రాలను సమర్పించాయి. అలాగే పక్క రాష్ట్రాలకు ఉన్న నీటి కోటాను తగ్గించాలని కోరుతూ అందుకుగల కారణాలను ప్రమాణపత్రాల్లో పేర్కొన్నాయి. వీటిపై ప్రస్తుతం క్రాస్ ఎగ్జామినేషన్ జరుగుతున్నది.

## కేజ్రీ క్షమాపణలు

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ క్షమాపణల పర్వం సాగుతోంది. కేజ్రీవాల్ రోజుకొకరికి సారీ చెబుతూ, పరువు నష్టం కేసులనుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్నారు. పంజాబ్ ఎన్నికల సందర్భంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు మారుపేరంటూ అకాలీ నాయకుడు విక్రమ్ సింగ్ మజీతియా మీద విరుచుకుపడిన కేజ్రీవాల్ ఇప్పుడు ఆయనను క్షమాపణ అడగడంతో ఈ సారీల పర్వం ఆరంభమైంది. పంజాబ్ ఆమ్ ఆద్మీ నాయకుల తిరుగుబాటుకు జడవని కేజ్రీవాల్, తన చర్యకు మరింత సార్థకత జోడిస్తూ మరిన్ని పార్టీలకు చెందిన నాయకులకు కూడా దానిని విస్తరించారు. యుద్ధవీరుడిగా పేరొందిన కేజ్రీవాల్ హఠాత్తుగా శాంతికాముకుడిగా మారిపోవడం వెనుక ఆ పార్టీ చెబుతున్న కారణాలు కాక వేరే ఏవో ఉన్నాయనేది అనేకుల అనుమానం.

మనీష్ సిసోడియా మాత్రం ఇదంతా ప్రజలకోసమే చేస్తున్నట్టు చెబుతున్నారు. తాము 'ఇగోఫైట్' జోలికి పోదల్చుకోలేదనీ, విలువైన సమయాన్ని న్యాయస్థానాల్లో వృథా చేయడానికి బదులు ప్రజాసేవకు వెచ్చించదల్చుకున్నామని అంటున్నారు. 'మా మాటలు ఎవరి మనసులనైనా గాయపరిస్తే మేం అనవసరపు అహానికి పోకుండా క్షమాపణలు చెబుతాం' అంటూ సిసోడియా మీడియాకు ఇచ్చిన వివరణ అంతా ఆద్యంతమూ అద్భుతంగా ఉన్నది. కానీ, ఎప్పుడో ఏళ్ళక్రితం చేసిన వ్యాఖ్యలకు ఇప్పుడు వరుసపెట్టి ఎందుకు క్షమాపణలు చెప్పవలసి వస్తున్నదో, ప్రజాశ్రేయస్సుకు వెచ్చిస్తామని అంటున్న ఎంతో విలువైన కాలాన్ని వారు ఇంతకాలమూ న్యాయస్థానాల్లో యుద్ధాలకు ఎందుకు వృథాచేశారో మాత్రం ఆయన చెప్పలేదు. అకాలీ నాయకుడు విక్రమ్ సింగ్ మజీతియాకు కేజ్రీవాల్ క్షమాపణలు చెప్పడం ఆయన పార్టీ నాయకులను మాత్రమే కాదు, పంజాబ్‌లో అనేకులను ఆశ్చర్యాన్ని, ఆవేదనకు గురిచేసింది. కేజ్రీవాల్ పంజాబ్ మీద ఆశలు వదిలేసుకున్నారనీ, అక్కడ పార్టీ మూసేయాలని అనుకుంటున్నారని కొందరి అనుమానం. మజీతియాకు క్షమాపణలు చెప్పడం ద్వారా కేజ్రీవాల్ తనకు శిక్షపడకుండా చూసుకున్నారు కానీ, పార్టీని ఆ రాష్ట్రం లో ఒక్కదెబ్బతో భూస్థాపితం చేశారని ఆప్ నాయకులు ఆగ్రహిస్తున్నారు. పంజాబ్ ఎన్నికల్లో ఆప్ ప్రధానంగా డ్రగ్స్ అంశంపై అకాలీ నాయకులపై విరుచుకుపడింది. తాను అధికారంలోకి రాగానే జైల్లోకి తోస్తానన్న నాయకుడికే ఇప్పుడు కేజ్రీవాల్ క్షమాపణలు చెప్పడం వల్ల కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న అకాలీలకు ఇది రాజకీయంగా ఎంతగానో లబ్ధిచేకూరుస్తుంది. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి కేజ్రీవాల్ చెప్పిన క్షమాపణ తక్షణ ఫలితాన్ని ఇచ్చింది. ఇద్దరూ అంగీకారానికి రావడంతో సోమవారం కోర్టు సుదీర్ఘకాలంగా సాగుతున్న పరువునష్టం కేసును రద్దుచేసింది. దేశంలోని అత్యంత అవినీతిపరుల జాబితాలో తన పేరు చేర్చినందుకు గడ్కరీ దావా వేయడం, బెయిల్ తీసుకోవడానికి కూడా అంగీకరించని కేజ్రీవాల్ నాలుగేళ్ళ క్రితం ఓ రెండురోజులపాటు జుడీషియల్ కస్టడీలో ఉండటం తెలిసిందే. అలాగే, ఒక టెలిఫోన్ కంపెనీకి మేలు చేకూర్చారంటూ సీనియర్ న్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు కపిల్ సిబాల్, ఆయన కుమారుడు అమిత్ సిబాల్‌పై గతంలో ఆరోపణలు చేసిన కేజ్రీవాల్ ఇప్పుడు క్షమాపణలు చెప్పి ఆ బాధకూడా వదిలించుకున్నారు. ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ కూడా ఈ జాబితాలో చేరవచ్చు. 33 పరువు నష్టం కేసులు ఎదుర్కొంటున్న కేజ్రీవాల్ సార్వత్రిక ఎన్నికల్లోగా వాటిని సున్నా చేయాలనుకుంటున్నారట. ఎవరికీ తలవంచని వీరుడిగా, సామాన్యుడి పక్షాన పోరాడే యోధుడిగా, అవినీతి వ్యతిరేక ఉద్యమకారుడిగా పేరొందిన కేజ్రీవాల్ ఇంతకాలమూ తనపై ఉన్న ఈ కేసులను కూడా రాజకీయంగా ఉపయోగించుకుంటూ వచ్చారు. కేజ్రీవాల్‌ను రెండేళ్ళక్రితం వరకూ ప్రశాంత్ భూషణ్ న్యాయస్థానాల్లో కాపాడుకొచ్చేవారు. ఆయనను పార్టీనుంచి పంపేసిన తరువాత ప్రముఖ న్యాయవాదులెవరూ ఆప్‌కు లేకపోయారు. పార్టీ ఆర్థిక వనరులపైన కూడా విశేష ప్రభావం చూపుతున్న ఈ పరువు నష్టం కేసులనుంచి క్షమాపణల ద్వారా బయటకు రావాలన్న కేజ్రీ నిర్ణయం తప్పుపట్టలేనిది. అయితే, రాజకీయంగా ఈ చర్య పార్టీకి ఎంతో నష్టం చేకూరుస్తుందన్నది వాస్తవం. మోదీ సహా ఎవరినీ లక్ష్యపెట్టకుండా ఆయన ఎన్నో విమర్శలు చేశారు. అటువంటి కేజ్రీవాల్ రాబోయే ఎన్నికల్లో ఏ నాయకుడిపైనా విమర్శలు చేయదల్చుకోలేదా? ఒకవేళ అవసరార్థం చేసినా సాధారణ ఓటరు గతంలో మాదిరిగానే వాటిని స్వీకరిస్తాడా?

## నీటి ఎద్దడి–నగరవాసులు

ఢిల్లీలో తలసరి నీటి లభ్యత ఆమ్‌స్టర్‌డామ్‌లో కంటే ఎక్కువ. జనాభాపరంగా ప్రపంచ ప్రథమ స్థానంలో ఉన్న చైనా ద్వితీయ స్థానంలోఉన్న భారత్ కంటే 28 శాతం తక్కువగా మంచినీటిని వినియోగించుకొంటుంది. జలసంపద మనకు కావలసినంత ఉన్నది. అయినా తీవ్ర నీటి కొరత మనలను నిత్యం సతమతం చేస్తోంది.


మన జాతీయ జల సంపదలో 80శాతం వ్యవసాయ అవసరాలకే వినియోగమవుతోంది. నీరు అమితంగా అవసరమయ్యే ద్రాక్ష (మహారాష్ట్ర), చెరుకు (ఉత్తరప్రదేశ్), మిరప (రాజస్థాన్) మొదలైన పంటలకు మనం అత్యధిక ప్రాధాన్యమిస్తున్నాము. ఇలా వ్యవసాయానికి భారీ స్థాయిలో నీటిని వాడుకోవడమే మన నీటి సంక్షోభానికి ప్రధాన కారణం. మన నదులలోని నీటి నంతటినీ దాదాపుగా కాలువల ద్వారా పంటల సాగుకై వ్యవసాయ క్షేత్రాలకు మళ్ళిస్తున్నాం. దీనికి తోడు భూగర్భజలాలను అపరిమితంగా తోడుకొంటున్నాం. మన భూగర్భ జలస్తరాలలోని నీటి స్థాయి ఏటా 1 మీటర్ మేరకు పడిపోతోంది.

నీరు అధికంగా అవసరమయ్యే పంటలనే విస్తృతంగా సాగు చేసేలా మన రైతులను ప్రోత్సహిస్తున్నాం. అయితే రైతులు ఒక్కొక్కరూ కాలువ జలాలను ఏ పరిమాణంలో వాడుకొంటున్నది మనం కొలవడమే లేదు. నీటి పారుదల సదుపాయం పొందుతున్న భూ కమతాల వైశాల్యం ప్రాతిపదికన రైతులు ఒక నిర్ణీత మొత్తాన్ని శిస్తుగా చెల్లిస్తున్నారు. అయితే వారు ఎన్నిసార్లు కాలువ నీటిని తమ పొలాలకు పారించుకొంటున్నారన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదు. తత్ఫలితంగా రైతులు ఒక పంట కాలంలోనే అవసరమైన దానికంటే అధికంగా నీటిని వాడుకొంటున్నారు.అయితే రైతుల ఈ చర్య పంట దిగుబడుల పెరుగుదలకు తోడ్పడకపోవడమే గాక అనవసంగానీరు వృథా అవుతోంది. పైగా భూగర్భజలాలను తోడుకోవడానికి రైతులకు విద్యుత్‌ను ఉచితంగా ఇస్తున్నారు. మితిమీరిన వినియోగంతో అవి అడుగంటుతున్నాయి. ఈ పరిస్థితులలో నీటి కొరత ఏర్పడకుండా ఎలా ఉంటుంది? ఈ సమస్య పరిష్కారం కాలువ జలాలకు ఖరీదు కట్టడమే. వినియోగపరిమాణాన్ని బట్టి కాలువ నీటికి ధర నిర్ణయించాలి. అప్పుడు మాత్రమే రైతులు తమ అవసరాలకు తగ్గట్టుగానీటిని జాగ్రత్తగా వాడుకొంటారు. అప్పుడు ద్రాక్ష, చెరుకు, మిరపను సాగుచేయడం ఆర్థికంగా లాభదాయకం కాబోదు. ఈ పంటల సాగు తగ్గితే సాగునీటికి డిమాండ్ కూడా తగ్గుతుంది.

సరే, ఇప్పటికే మన రైతులు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారు. పంట దిగుబడుల విక్రయ ధరను ఉత్పత్తి వ్యయానికి అనుగుణంగా పెంచడమే మార్గాంతరం. చెరుకు సాగు ఖర్చు క్వింటాల్‌కు రూ.250 అవుతుందనుకుందాం.క్వింటాల్ చెరుకు కనీస మద్దతు ధరను రూ.300గా నిర్ణయిస్తుంది. అయితే సాగు వ్యయం రూ.30 మేరకు పెరిగిందనుకోండి. అంటే మొత్తం ఉత్పత్తి వ్యయం రూ.290కి పెరుగుతుంది . అప్పుడు చెరుకు కనీస మద్దతు ధరను కూడా రూ. 30మేరకు పెంచాలి. దీనివల్ల క్వింటాల్ చెరుకును రైతులు రూ. 330 కి అమ్ముకోగలుగుతారు. అప్పుడు సాగు వ్యయాల పెరుగుదల ప్రభావం రైతులపై ఉండదు. రైతులకు సమకూరే ఈ లబ్ధి వల్ల పట్టణ ప్రాంత వినియోగదారులకు పంచదార ప్రియం అవుతుంది. కిలో చక్కెరకు వారు గతంలో కంటే అధిక ధరను చెల్లించవలసివుంటుంది.

చెప్పవచ్చిందేమిటంటే పట్టణ/ నగర వాసులు చౌక పంచదార కావాలో లేదా పుష్కలంగా నీరు కావాలో ఏదో ఒకదాన్ని ఎంచుకోవల్సివున్నది. అవి రెండూ ఏక కాలంలో లభ్యమయ్యే అవకాశం లేదు. రైతులు వినియోగించుకొనే నీటికి ధరను పెంచాలని కోరితే పంచదార ధర పెరుగుదలను కూడా నగరవాసులు భరించాలి. దీనివల్ల సాగు నీటికి డిమాండ్ తగ్గుతుంది. నగర వాసుల అవసరాలకు నీరు సమృద్ధిగా లభిస్తుంది. ప్రత్యామ్నాయంగా రైతులు వినియోగించుకొనే నీటికి ప్రస్తుతం అనుసరిస్తున్న స్వల్ప ధర విధానాన్ని కొనసాగించాలని నగరవాసులు కోరిన పక్షంలో పంచదార కూడా వారికి చౌకగా లభిస్తుంది . నీటి సంక్షోభానికి పరిష్కారం పట్టణ ప్రాంత ప్రజల చేతుల్లో ఉందనడం సత్యదూరం కాదు.

భరతవాక్యం



■ భరత్ ఝున్‌ఝున్‌వాలా

**నీటి పంపిణీ విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రస్తుత విధానం నగర వాసులకు చౌక చక్కెరను సమకూరుస్తోంది. అయితే నీటి కొరతకు కారణమవుతోంది. ప్రత్యామ్నాయమేమిటంటే చక్కెరకు మరింత అధిక ధరను చెల్లించడానికి నగరవాసులు సిద్ధమవ్వాలి. అప్పుడు వారికి మంచినీరు సమృద్ధంగా లభ్యమవుతుంది.**

నీటి కొరత సమస్య విషమించడానికి భారీ జలాశయాలు కూడా కారణమవుతున్నాయి. తెహ్రీ, భాక్రా మొదలైన ప్రాజెక్టుల జలాశయాలలో భారీ స్థాయిలో నీటిని నిల్వ చేస్తున్నాం. ఈ నిల్వలు నీటి సమస్యను మరింత తీవ్రం చేస్తున్నాయి. ఈ జలాశయాలలో నిల్వ అవుతున్న నీరు ఎండ వేడిమికి ఆవిరైపోవడం వల్ల పది నుంచి పదిహేను శాతం నీటిని నష్టపోతున్నాం. వాననీటిని నిలవరించడం ద్వారా ఈ జలాశయాలు వరదలను తగ్గిస్తున్నాయి. ఆనకట్టల ఆటంకం లేకపోతే నదుల వరద జలాలు విస్తృత స్థాయిలో భూములను ముంచెత్తి , తమతో తీసుకొచ్చిన అవక్షేపాలను ఆ భూములలో మేట వేస్తాయి. ఆ మేటలు భూసారాన్ని పెంపొందిస్తాయి. వరదల తగ్గిపోతే భూగర్భజలాలూ తగ్గిపోతాయి. సేద్యానికి నీటి లభ్యత కూడా తగ్గిపోతోంది.

భారీ డ్యాంలు నీటి లభ్యతపై రెండు పరస్పర విరుద్ధ ప్రభావాలను చూపుతున్నాయి. సానుకూల ప్రభావమేమిటంటే జలాశయాల్లోని నిల్వలను కాలువల ద్వారా సాగు అవసరాలకు సరఫరా చేయడం వీలవుతుంది . ప్రతికూలాంశమేమిటంటే జలాశయాలలోని నీరు ఎండవేడిమికి ఆవిరైపోవడం వల్ల నిల్వ నీరు తగ్గిపోయి సాగు అవసరాలకు కొరత ఏర్పడడంతోపాటు భూగర్భ జలాలూ తగ్గిపోతాయి. డ్యామ్‌లకు బదులుగా చెక్‌డ్యామ్‌ల ద్వారా భూగర్భ జలస్తరాలలో నీటిని నిల్వ చేసుకోవచ్చు . అలాగే వ్యవసాయ క్షేత్రాలలో బండ్ ( అడ్డుకట్టలు)ల ద్వారా నీరు నిల్వచేసుకోవచ్చు . భారీ జలాశయాలలో కంటే ఎక్కువ నీటిని ఈ పద్ధతులలో నిల్వ చేసుకోవడం సాధ్యమవుతుంది. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే భూగర్భ జలస్తరాల నిల్వ సామర్థ్యం 76 బిలియన్ క్యూబిక్ మీటర్లు . తెహ్రీ జలాశయంలో 2.6 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీటిని నిల్వ చేయవచ్చు . అంటే భూగర్భ జలస్తరాలలో అంతకు 30 రెట్లు అధికంగా నీటి నిల్వచేసుకోవడం సాధ్యమవుతుంది. అంతిమంగా పట్టణ/ నగర వాసులు ఒక సముచిత నిర్ణయం తీసుకోవలసివున్నది. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రస్తుత విధానం వారికి చౌక చక్కెరను సమకూరుస్తోంది. అయితే నీటి కొరతకు కారణమవుతోంది . ప్రత్యామ్నాయమేమిటంటే చక్కెరకు మరింత అధిక ధరను చెల్లించడానికి వారు సిద్ధమవ్వాలి. అప్పుడు నగరవాసులకు మంచినీరు సమృద్ధంగా లభ్యమవుతుంది.

*(వ్యాసకర్త ఆర్థికవేత్త, బెంగుళూరు ఐఐఎం రిటైర్డ్ ప్రొఫెసర్)*



## కిచకిచల పిచ్చుకలేవీ?

జీవులన్నీ ప్రకృతిలో భాగమే. ఈరోజు అనేక కారణాలవలన ప్రకృతి విధ్వంసానికి గురవుతున్నది. అభివృద్ధిపేరిట సాగే చర్యలతో పర్యావరణం పాడవుతున్నది. భూమి, గాలి, నీరు మానవ తప్పిదాలవల్ల కలుషితం అవుతున్నాయి. ఈచర్యలతో అనేక జీవరాసులు నశించిపోతున్నాయి. మనం గతంలో చూసిన సాధారణ పిచ్చుక (హౌస్ స్పారో) ఇప్పుడు అరుదుగా తప్ప కనిపించడం లేదు. 'పిచ్చుక బొమ్మ' చూపించి, అవి గతంలో మన ఇళ్ళలోనే తిరిగేవని భావితరాలకు చెప్పవలసిన దుస్థితి వచ్చింది. పర్యావరణ వినాశనం ఏ స్థాయిలో ఉన్నదో ఈ బలహీనమైన పిచ్చుక మనలను హెచ్చరిస్తున్నది. ఇంటి కప్పులకింద, పూర్వపు రోజులలో అయితే పెంకుల అడుగుభాగంలో, పిచ్చుకలు మన ఇళ్లలోనే గూళ్లు నిర్మించుకునేవి. ఆడ, మగ పిచ్చుకలు కలసి కష్టపడి గూడు నిర్మాణం చేసి గుడ్లుపెట్టి పిల్లలు ఎదిగేవరకు కలసి బాధ్యత పడతాయి. వాటి కిచకిచలతో ఇళ్ళకు ఎంతో కళవచ్చేది. ప్రతిధాన్యంగింజా వలుచుకొని బియ్యం గింజని మాత్రం అత్యంతవేగంగా గమ్మత్తుగా తింటాయి. కానీ, ఇళ్లు ఇరుకై, వాకిలీ పెరడూ హరించుపోయి చివరకు చెట్లు కూడా లేకుండాపోతున్న కాలంలో ఇక పిచ్చుక ఎక్కడ బ్రతుకుతుంది? ఇంధన కాలుష్యం, గృహనిర్మాణంలో వచ్చిన మార్పులు, పెరుగుతున్న అపార్ట్‌మెంట్ల సంస్కృతి, సాంకేతికంగా వచ్చిన మార్పులు పిచ్చుకలు అంతరించిపోవడానికి ప్రధాన కారణాలు. విస్తృతంగా సాగుతున్న సెల్ టవర్ల నిర్మాణం వాటి ఉసురు తీస్తున్నది. సెల్‌టవర్లనుంచి వెలువడే తరంగాలతో వాటి పునరుత్పత్తి శక్తి నశిస్తున్నదని కొందరి వాదన. పంటలపై క్రిమిసంహార మందులను ప్రయోగించి మనం చంపుతున్న పురుగులను తిని పిచ్చుకలు మరణిస్తున్నాయి. పిచ్చుకలతోపాటు ఇతరపక్షులనూ రక్షించే ఉద్దేశ్యంతో మార్చి 20న 'ప్రపంచ పిచ్చుకలదినోత్సవం' జరుగుతున్నది. పర్యావరణ, పక్షిప్రేమికులు ఒకచోట కలసి తమ ఆలోచనలు, అభిప్రాయాలు పంచుకొనేందుకు వీలుగా సభలు సమావేశాలు జరిపి, అంతరించిపోతున్న పక్షి జాతుల రక్షణకు సంకల్పించడం దీని ఉద్దేశం. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ఈ కృషిలో మనమూ పాలుపంచుకుందాం. పిచ్చుకలతోపాటు అన్ని పక్షి జాతులను కాపాడుకుందాం. పక్షుల జీవనానికి అవసరమైన కృత్రిమ గూళ్ళు ఏర్పాటు చేయాలి. వేసవిలో పక్షులు నీరు దొరకక చాల ఇబ్బంది పడతాయి కనుక ఇంటిజాలీలపై, షేడ్‌లపై, ఇంటిముందున్న ఖాళీ జాగాల్లో నీరుపెడితే వాటికోసం వస్తాయి. అలాగే, రకరకాల పక్షుల కూతలతో ఒక ఆహ్లాదకరమైన వాతావరణమూ ఏర్పడుతుంది. పక్షి ఏదైనా దాన్ని బ్రతికించుకోవాలి.

■ సాయి ప్రకాష్.తిరునగరి

నేడు 'ప్రపంచ పిచ్చుకలదినోత్సవం'

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన మెయిల్:
editpage@andhrajyothy.com

## ఉన్నత విద్య ఉజ్వలమయ్యేదెలా?

'యూనివర్సిటీల్లో వీసీలు ఉన్నట్లో లేనట్లో అర్థం కావడం లేదు. ఏ యూనివర్సిటీలోనూ ఏ మార్పు రావడం లేదు. అవి గతంలో ఎలా ఉన్నాయో ఇప్పుడూ అలాగే ఉన్నాయి' అని ఇటీవల విద్యాశాఖామంత్రి కడియం శ్రీహరి విచారం వ్యక్తం చేశారు. అంతేకాదు, 'విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేబట్టాక అయిదోసారి వీసీల సమావేశాలు నిర్వహిస్తున్నాను. కాని గతంలో తీసుకున్న నిర్ణయాలు ఆశించిన మేరకు అమలు కావడం లేదు' అని కూడా ఆవేదన చెందారు.

గతంలో యూనివర్సిటీలలో జరిగిన విచ్చలవిడి వ్యయాలు, ఉద్యోగనియామకాల వలన, ఆర్థిక సుస్థిరతను కోల్పోతూ, నిధులకు సెక్రెటేరియట్ చుట్టూ 'భవతీ భిక్షాందేహి'యని తిరిగే పరిస్థితులను యూనివర్శిటీలు కొనితెచ్చుకొన్నాయి. యూనివర్శిటీలు ఒకప్పటి అటానమీని ఎప్పుడో కోల్పోయాయి. అవి వాటి పరువు ప్రతిష్ఠలు కోల్పోవడం వలన వీసీలు కూడా నోరు విప్పి సరియైన సమాధానాలు ఇవ్వగల ధైర్యసాహసాలు కోల్పోయారు. లేకపోతే, 'గతంలో తీసుకున్న నిర్ణయాలు అమలు చేయబడకపోవడానికి మేమెంత బాధ్యులమో మీరు కూడా అంతకన్నా ఎక్కువ బాధ్యులు' అని ప్రభుత్వ పెద్దలను నిలదీసి, వాటి అమలుకు కావలసిన వనరులు, వసతులు, సౌకర్యాల చిట్టా విప్పిఉండేవారు. ఆ చిట్టా విప్పదీస్తే ఈనాటి విశ్వవిద్యాలయాలు సరిపోయినన్ని వనరులు, వసతులు, సౌకర్యాలు, అండదండలు లేక ఏ దుస్థితిలో ఉన్నాయో తెలిసేది కదా? వీసీలు అడిగే అవసర, అనవసర ఖర్చుల, ఉద్యోగాల కొరకు అనుమతులిచ్చేందుకు ప్రభుత్వం వద్ద కూడా సరిపోయినన్ని వనరులు లేవన్న విషయం బయటపడి ఉండేది కదా.

విశ్వవిద్యాలయాలకు అధిక కేటాయింపులు కావాలంటే ప్రభుత్వానికి కూడా అధిక ఆదాయాలు రావాలి. అవి రావాలంటే ప్రభుత్వాలు ట్యాక్స్‌లు పెంచాలి. ట్యాక్స్‌లు ఎంత పెంచితే అంత పౌరుల ఆదాయాలు తగ్గి, జీవన ప్రమాణాలు తరిగి తుదకు కరప్షన్ పెరుగుతుంది. జనులు వారి ఆమ్దనీలు చాలక రుణాలకు ఎగబడితే ఇదువరకటి ఇన్‌ఫ్లేషన్ భారానికి వడ్డీ భారం కూడా కలిసి తడిసిమోపెడవుతుంది. ప్రభుత్వం స్వదేశీ, విదేశీ ఋణాల ద్వారా కోరినన్ని వనరులను సమకూర్చితే ఋణాలిచ్చినవారి పెత్తందారీతనం వలన అది వారి ఎన్నో ఒత్తిళ్లకు గురవుతుంది. దానివలన అది తన స్వేచ్ఛను ఎంతో కొంత కోల్పోవలసి వస్తుంది. దానివలన మనం తిరిగి మరొకసారి ఇన్‌డైరెక్ట్ బానిసత్వానికి లోను కావలసి వస్తుంది. కనుక మనం మన ఆడంబరాలపై, ఆర్భాటాలపై పాపులారిటీ కొరకు నిర్వహించే జనరంజక కార్యకలాపాలపై విచ్చలవిడిగా ఖర్చుపెట్టడం, అలా ఖర్చుపెట్టి ఋణాల కొరకు తిరగడం మానుకోవాలి. ఇకనైనా మనం ఎన్నెన్ని ఆడంబరాలకు, ఆర్భాటాలకు, డాంబికాలకు పాల్పడుతున్నామో, ఎంతెంత డబ్బు పెద్ద పెద్ద అడ్వర్‌టైజ్‌మెంట్‌లపై, పత్రికా ప్రకటనలపై, ఫ్లెక్సీలపై ఖర్చులు చేస్తున్నామో, ఎన్నెన్ని వృథా ఖర్చులు, అనవసరపు అపాయింట్‌మెంట్స్ చేస్తున్నామో సావధానంగా ఆలోచించి అలాంటి వాటినన్నింటినీ తగ్గించుకుంటే తప్ప వివిధ సంస్థలకు వివిధ విధాల అత్యవసర ఖర్చులకు కూడా వనరులు ప్రొవైడ్ చేయలేమని 'ఫ్రాంక్'గా చెప్పగలిగేవారు కదా! అది అక్షరాలా నిజమని మంత్రిగారిని సమాజం సమర్థించగలిగేది కదా!



**మన పరిపాలకులు ఉచిత విద్యలు ఇస్తే ఇవ్వవచ్చుగానీ ఉచిత ఉద్యోగాలు ఎలా ఇవ్వగలరు? ఇవ్వలేరు. మనం ఇవ్వవలసింది నాణ్యమైన విద్యగానీ ఉచిత విద్య కాదని పాలకులు, ప్రజలు గుర్తించాలి. ఉన్నత విద్యారంగం సమస్యలను సమగ్రంగా పరిశీలించి, పరిష్కారాలకి సూచనలిచ్చేందుకు ఒక కమిషన్ ఏర్పాటు చేయాలి.**

అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలలోని అన్ని విశ్వవిద్యాలయాలు ప్రధానంగా వారి ఇంటర్నల్ రిసోర్స్ పైనే ఆధారపడుతాయి కాని, ఎక్స్‌టర్నల్ రిసోర్స్‌పై కాదు. వాటి అభివృద్ధికి చెందిన చరిత్ర చదివితే అది మనకు తెలుస్తుంది. పాశ్చాత్య విశ్వవిద్యాలయాలు మన విశ్వవిద్యాలయాలవలె అసలు ఆదాయాన్నైనా, అరువడుక్కొచ్చుకున్న ఆదాయాన్నైనా విచ్చలవిడిగా ఖర్చుచేసి వారికి చాలనప్పుడు మన విశ్వవిద్యాలయాల్లా బెంగటిల్లి బావురుమని భయభీతులకు లోను కావు. వాటి వీసీలు, రిజిష్ట్రార్‌లు వారి ఆత్మ గౌరవాలు కోల్పోతూ అధిక వనరుల కెటాయింపుల కొరకు 'దేహీ' యని ప్రభుత్వం చుట్టూ, పరిపాలకుల చుట్టూ మనవారు తిరుగుతున్నట్లు తిరుగరు.

విశ్వవిద్యాలయాలు వాటి అనవసర ఖర్చులు, ఉద్యోగాలు మానివేయడమే కాదు, వాటిలో పనిచేసే ఉద్యోగులందరూ సరియైన వేళకు వారి వారి ఆఫీసులకు వెళ్ళి నీతి నిజాయితీతో, చురుకుగా, మెరుగుగా పనిచేస్తే కూడా చాలా ఆదా అవుతుంది. గొప్ప విద్యాలయాలు చేస్తున్నది చాలా వరకు అదే. అవి వాటి ఆదాయాలను పొదుపు చేసికొని వాటి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించడం చేస్తున్నాయి.

విశ్వవిద్యాలయాలకు సరిపోవునన్ని వనరులు, వసతులు, సౌకర్యాలు, తగినంత సిబ్బంది సమకూర్చకపోతే అవి బాగా పనిచేయజాలవు. (అందుకే అవి బాగా పనిచేయడం లేదు). విశ్వవిద్యాలయాలు విచ్చలవిడిగా ఖర్చుచేస్తూ, విచ్చలవిడిగా నియామకాలు చేస్తూ ప్రభుత్వాన్ని పదే పదే వనరులు కావాలని అర్థిస్తే ప్రభుత్వం వాటి అవసరాలను తీర్చజాలుతుందా? తీర్చజాలదు కదా! ఎందుకంటే ప్రభుత్వం విద్యారంగంతోపాటు ఇతర రంగాలకు కూడా నిధులు సమకూర్చవలసుంటుంది కనుక. విద్యారంగం అతి ముఖ్యరంగమే కావచ్చు కాని ఆరోగ్యరంగం కాదా? ఆహారరంగం కాదా? విద్యుత్తు రంగం కాదా? రోడ్డు, రవాణా రంగం కాదా? అలా అన్నీ ముఖ్యమైన రంగాలే! ఒకదానిపై ఒకటి ఆధారపడే రంగాలే.

అందువలన, మన విశ్వవిద్యాలయాలు కూడా పాశ్చాత్య విశ్వవిద్యాలయాలవలె నిధులు సంపాదించుకునే ప్రయత్నం చేయాలి. పూర్వ విద్యార్థులను నిధుల సేకరణకు సహకరించునట్లు ఇన్‌స్పైర్ చేయాలి. అలాగే విశ్వవిద్యాలయాల పరిశోధకులు మంచి పరిశోధనలు చేబట్టి పారిశ్రామిక వాణిజ్య రంగాలవారికి సలహాలనందిస్తూ పారిశ్రామికవేత్తలను, వ్యాపారులను కూడా నిధుల సేకరణలో భాగస్వాములను చేయాలి. ఇలాంటి మరెన్నో పద్ధతుల ద్వారా విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలలు కూడా నిధులు సమకూరుకోవాలి. అది తప్ప కావలసినన్ని వనరులు సమకూర్చుకోవడానికి మరో మార్గం లేదు.

మన ఫీజు రీయింబర్స్‌మెంట్ పాలసీ లాంటిది మరే దేశంలో లేదు, ఉండగూడదు కూడా. దానివలన ప్రభుత్వంపై లెక్కలేనంత భారం పడుతోంది. బీద విద్యార్థులకు ఉచితంగా విద్యావకాశాలు కల్పించడంలో అర్థముంది కాని ధనిక కుటుంబాల విద్యార్థులకు కూడా ఉచిత విద్య ఇవ్వడంలో అర్థం లేదు, ప్రైమరీ స్కూల్ విద్య ఉచితంగా ఇవ్వడంలో అర్థముంది కాని హయ్యర్ ఎడ్యుకేషన్ విద్య కూడా ఉచితంగా ఇవ్వడంలో అర్థం లేదు. జనరల్ ఎడ్యుకేషన్ విద్య ఉచితంగా ఇవ్వడంలో అర్థముంది కాని టెక్నికల్ ఎడ్యుకేషన్ విద్య కూడా ఉచితంగా ఇవ్వడంలో అర్థంలేదు. అలాంటి పాలసీ వలన ప్రభుత్వానికి ఆదాయం చాలక, విశ్వవిద్యాలయాలకు మంచి విద్యలకు సరిపోయే వనరులు, వసతులు సౌకర్యాలు సమకూర్చజాలక పోతోంది. ఉచిత విద్యలు ఇస్తే ఇవ్వొచ్చు. కాని ఉచిత ఉద్యోగాలు కూడా పరిపాలకులు ఎలా ఇవ్వగలరు? ఇవ్వలేరు. కనుక మనం ఇవ్వవలసింది ఉన్నత విద్య, మంచి విద్య కాని ఉచిత విద్య కాదు. ఎందుకు కొరగాని విద్య కాదని ఇటు ప్రభుత్వం, అటు ప్రజలు గుర్తించాలి.

ప్రభుత్వం ఇకనైనా ఫీజ్ రీయింబర్స్‌మెంట్ పాలసీని మార్చాలి. ధనవంతుల పిల్లలకు, బీదవారి పిల్లలందరికీ సగటుగా వర్తించే ఈనాటి ఫీజ్ రీయింబర్స్‌మెంట్ పాలసీని సవరించాలి. మంచి విద్యలకు మంచి పెట్టుబడులు తప్పనిసరే కాని ఆ పెట్టుబళ్లు అటు ప్రభుత్వం, ఇటు తలిదండ్రులు, విద్యార్థులు భరిస్తే కాని సాధ్యం కాదని తలిదండ్రులకు, విద్యార్థులకు ఇటు ప్రభుత్వం, అటు విద్యాలయాలు నచ్చచెప్పాలి. బ్యాంకులద్వారా 'బీదవారికి మాత్రమే' ఋణాలు ఇప్పించే పాలసీలను అవలంబించాలి. అవసరమైతే ఆ ఋణాల రికవరీకి ప్రభుత్వం గ్యారెంటరుగా ఉండాలి. అలా బీద విద్యార్థులకు 'రిలీఫ్' కలిగించాలి. అన్ని విషయాలనూ సావధానంగా ఆలోచించి తగిన సలహాలివ్వడానికి ఒక స్టేట్ హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ లాంటిది నియమించాలి. ఆ కమిషన్ సూచనల మేరకు తగు చర్యలు వెంటనే తీసుకుంటే తప్ప మన ఉన్నత విద్యలు బాగుపడవు. మన పిల్లలకు ఉన్నత ఉద్యోగావకాశాలు పెరగవు.

■ డా. వెల్చాల కొండలరావు

## ఆంగ్లంలో తెలుగు దీప్తి

వాడ్రేవు పాండురంగారావు ఈ నెల 12 వ తేదీ రాత్రి పుట్టపర్తిలో మరణించారు. యాభై నాలుగు సంవత్సరాల మా స్నేహబంధం ఇప్పుడు ఒక స్మృతిగా మిగిలిపోయింది. అరవై నాలుగు సంవత్సరాల క్రితం మార్చి 12 వ రోజునే న్యూఢిల్లీలో సాహిత్య అకాడమీ ఆవిర్భవించింది. ఈ సాహిత్య సంస్థే మమ్ములను కలిపింది; సన్నిహితులను చేసింది. అప్పట్లో అంటే 1964లో నేను అకాడమీ కార్యదర్శి కృష్ణ కృపలానీకి వ్యక్తిగత సహాయకుడు ( పి ఏ) గా ఉండేవాణ్ణి. ఆయన్ని కలవడానికి రంగారావు రవీంద్రభవన్‌కు వస్తుండేవారు. మేమిరువురమూ మా ఇరవైలలో ఉన్నాము. రంగారావు నా కంటే రెండేళ్ళు పెద్ద. ఆర్.కె. నారాయణ్ నవలలపై రంగారావు పరిశోధన చేసి పిహెచ్‌డీ పొందారు (ఆంగ్ల సాహిత్య కృతులకు సాహిత్య అకాడమీ తొలి పురస్కారాన్ని నారాయణ్ నవల 'ది గైడ్'కు ఇచ్చారు).

ఒకసారి ఇరువురమూ కన్నాట్ ప్లేస్‌లోని సన్నీ కాఫీ హౌజ్‌కు నడిచి వెళ్ళాము. ఆర్ కె నారాయణ్ నవలల గురించి, ఇంగ్లీషులో భారతీయుల రచనా వ్యాసంగం గురించి మాట్లాడుకున్నాం విడిపోయే ముందు మీ డాక్టోరల్ థీసిస్ అంశమేమిటని రంగారావు ప్రశ్నించారు . నేను పెద్ద పెట్టున నవ్వి నాకు పిహెచ్‌డి కాదు కదా ఎమ్ ఏ డిగ్రీ కూడా లేదని చెప్పాను. నా సమాధానానికి రంగారావు అమితంగా ఆశ్చర్యపోయారు . మేము తరచు కలుసుకుంటుండేవాళ్ళం. రంగారావు అధ్యాపకుడుగా ఉన్న శ్రీవేంకటేశ్వర కాలేజీ అప్పట్లో, మా రవీంద్రభవన్‌కు కిలో మీటర్ దూరంలో ఉన్న ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటీ ప్రాంగణంలోనే ఉండేది. కళాశాలలో తన విధులు పూర్తయిన తరువాత రంగారావు నడుచుకుంటూ అకాడమీకి వచ్చేవారు. మేము చాలవరకు సాహిత్యం గురించి మాట్లాడుకునేవాళ్ళం. ఇంగ్లీషులో లభ్యమవుతున్న టాగోర్ సాహిత్యంతో పాటు , గాంధీ, నెహ్రూల గ్రంథాలు, ఇండో–ఆంగ్లియన్ సాహిత్యం ముఖ్యంగా ముల్క్‌రాజ్ ఆనంద్, ఆర్ కె.నారాయణ్, మనోహర్ మల్గోంకర్ , భబానీ భట్టాచార్య నవలలు నేను బాగా చదివాను. ఎమ్ ఏ ఎందుకు చేయలేదని రంగారావు నన్ను పదే పదే ప్రశ్నించేవారు . డిగ్రీల మీద మోజులేదని చెప్పేవాణ్ణి. సాహిత్య అకాడమీ ముగ్గురు సహాయ కార్యదర్శులకూ పిహెచ్ డీ ఉన్నది. అయితే వారి ఇంగ్లీషును కృష్ణ కృపలానీ తరచు సరిదిద్దుతుండేవారు. ఒకోసారి పూర్తిగా తిరగరాసేవారు. న్యాయశాస్త్ర పట్టభద్రుడైన కృపలానీ, రవీంద్రనాథ్ టాగోర్ నెలకొల్పిన ప్రఖ్యాత 'విశ్వభారతి క్వార్టర్లీ'కి ఎడిటర్‌గా పనిచేశారు. నాకు జ్ఞానార్జనే ముఖ్యంగానీ డిగ్రీల సంపాదన ముఖ్యం కాదని నేను స్పష్టంగా చెప్పాను. అదీ నా యవ్వనకాలపు తెంపరితనం!

ఆంగ్ల సాహిత్యం ప్రధానాంశంగా ఎమ్ ఏ చేసి , అనంతరం పిహెచ్ డి కూడా చేయమని రంగారావు నన్ను నిరంతరం ప్రోత్సహించేవారు. నిజం చెప్పాలంటే ఒత్తిడి చేసేవారు. నేను ఎమ్ ఏ చేసేలా ఒప్పించడంలో చివరకు ఆయన సఫలమయ్యారు. పుస్తకాలు కొనుక్కునేంత ఆర్థిక స్తోమతలేకపోవడంతో రంగారావు సొంత గ్రంథాలయం మీద నేను ఆధారపడ్డాను. నాకు ఇప్పటికీ బాగా గుర్తు ఉన్నది: గ్రీన్ పార్క్ లో ఆయన అద్దెకు ఉంటున్న ఇంటికి వెళ్ళి అటక మీద ఉన్న పుస్తకాలన్నిటినీ కిందకి దించాను. దుమ్ము దులిపి వాటినన్నిటినీ చూడముచ్చటగా ఒక క్రమంలో ఉంచాను. నాకు కావలసిన పుస్తకాలను ఇంటి తెచ్చుకున్నాను. ' పుస్తకాలను ఇతరులకు ఇవ్వడం మూర్ఖత్వం, తీసుకున్న పుస్తకాలను తిరిగి ఇవ్వడం మరింత మూర్ఖత్వం'అన్న లోకోక్తి మాకు వర్తించదు సుమా! రంగారావు చాలా ఉదారంగా వ్యవహరించేవారు. తన విద్యార్థులకు అవసరమైన సహాయాన్ని చేయడానికి ఆయన ఎంత శ్రమైనా తీసుకునేవారు.

నివాళి



వాడ్రేవు పాండురంగారావు
(1936–2018)

**టెలీగ్రాఫ్ క్లర్క్‌గా ప్రారంభమైన వాడ్రేవు పాండురంగారావు ఒక ఆచార్య మహోదయుడుగా , కథారచయితగా, నవలాకర్తగా, పరిశోధకుడుగా, విమర్శకుడుగా, అనువాదకుడుగా సమున్నత శిఖరాలు అధిరోహించారు. బోధనను ఆయన ఒక ఉద్యోగంగా చూడలేదు. ఒక వృత్తిగానూ పరిగణించలేదు. భగవంతుడు తనకు నిర్దేశించిన కర్తవ్యంగా బోధనను రంగారావు భావించారు.**

రంగారావు ఎప్పుడు ఏమి రాసినా–కథ గానీ, నవల గానీ, వ్యాసం గానీ లేదా పుస్తక సమీక్షగానీ – నాకు ముందుగా చూపించేవారు. ఆయన రచనలను చిత్తు ప్రతుల దశలోనే నేను చదివాను. నడుచుకుంటూ వెళ్ళుతూనో లేక ధౌళా కువాన్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారమ్ ( అప్పట్లో దాదాపు ఖాళీగా ఉండేది) బెంచ్ మీదనో కూర్చొని రైళ్ళ రాకపోకలను వీక్షిస్తూ మాట్లాడుకునే వాళ్ళం. మా ఇరువురికీ బాల్యం నుంచీ మమ్ములను దాటిపోతున్న రైళ్ళను చూడడం చాలా ఇష్టంగా ఉండేది.

రంగారావు తన మొదటి నవల 'Fowl Filcher' రచనను ముగించిన రోజు నాకు ఇప్పటికీ బాగా గుర్తున్నది. నా అభిప్రాయం తెలుసుకోవడానికి ఆయన చాలా ఆత్రుత చూపారు. నేను ఆ రోజు రాత్రి ఆయన ఇంటిలోనే ఉండి ఆ నవల చిత్తు ప్రతిని చదివాను . మరుసటి ఉదయమంతా మేము ఆ నవల గురించే మాట్లాడుకున్నాము. ఆయన భాషా సౌందర్యం నన్ను విశేషంగా ఆకట్టుకున్నది. ఇంగ్లీషు నుడికారాన్ని విలక్షణ భారతీయ పరిమళంతో ఒక సరికొత్త రీతిలో ఉపయోగించారు. రాజారావు నుంచి భబానీ భట్టాచార్య వరకు నేను చదివిన ఇండో–ఆంగ్లియన్ రచయితలందరూ పాశ్చాత్య ఇంగ్లీషు పాఠకులను దృష్టిలో పెట్టుకొని రాసినవారే. కొన్ని సందర్భాలలో భారతీయ సంస్కృతీ ప్రత్యేకతలకు వివరణలు ఇచ్చేవారు. ఈ విషయాలను రంగారావుకు చెప్పుతూ విదేశీ పాఠకుల గురించిన స్పృహ లేకుండా కాల్పనిక సాహిత్యంలో ఆంగ్ల భాషను ఉపయోగించిన మొట్టమొదటి భారతీయ రచయిత మీరేనని అన్నాను. నా అభిప్రాయాన్ని విని రంగారావు చాలా పులకరించి పోవడమే కాదు బాగా ఉద్వేగానికి గురయ్యారు. నవలను మరింతగా మెరుగు పెట్టాల్సిన అవసరముందని నేను చెప్పగా రంగారావు వెన్వెంటనే అంగీకరించారు. పలుమార్లు తిరగ రాశారు. తిరగరాసిన ప్రతిసారీ నాకు చూపించే వారు. ఒక రచనను పలుమార్లు తిరగరాసే అలవాటు ఆయనకు చివరివరకూ ఉండిపోయింది.

రంగారావు తొలి నవలకు ప్రచురణ కర్త ఎవరూ అంత త్వరగా లభించలేదు. కుష్వంత్ సింగ్ ఆ నవల లో ఉత్కృష్ట సాహిత్య విలువలు ఉన్నాయని భావించారు. ఆయన సిఫారసుతో పెంగ్విన్ ఇండియా వారు తమ ప్రారంభ ప్రచురణలలో ఒకటిగా రంగారావు నవలను ప్రచురించారు. పాఠకులు బాగా ఆదరించారు. విమర్శకులూ బాగా ప్రశంసించారు. అనేక మార్లు ఆ నవల పునర్ముద్రితమయింది.

రంగారావు తన సృజనాత్మక రచనలకు సైతం చాలా విస్తృతస్థాయిలో పరిశోధన చేసేవారు. గ్రంథాలయాలలో గంటల తరబడి కూర్చొని చదువుతుండేవారు. అనేక విషయాలు ఎత్తిరాసుకొనేవారు. భారతదేశ చరిత్రను ఈస్టిండియా కంపెనీ పాలన నుంచి వర్తమాన కాలం వరకు భారతదేశ చారిత్రక పరిణామాన్ని ముఖ్యంగా తెలుగు ప్రాంతాలను కేంద్రంగా తీసుకొని చిత్రిస్తూ ఒక నవలా పరంపర రాయమని రంగారావుకు ఒకసారి నేను సూచించాను. నా సూచన ఆయనకు నచ్చింది. తత్ఫలితమే 'The river is Three-Quarters Full'. ఈ నవలా పరంపరలో తదుపరి నవలా రచనకు ఆయనకు రెండు దశాబ్దాలు పట్టింది . ఆయన ఆసక్తులు చాలా భిన్నమైనవి. వైవిధ్యభరితమైనవి. కళాశాల విద్యారంగంలో విలువల పతనం ఆయన్ని చాలా కలవరపెట్టింది. విద్యా విలువల పతనం ఇతివృత్తంగా రంగారావు రాసిన నవలే 'The Drunk Tantra'.

నేను 'Indian Literature' ఎడిటర్ ని అయినప్పుడు తెలుగు నుంచి ఆంగ్లంలోకి అనువాదాలు చాలా తక్కువగా వస్తున్నాయని, కనుక ఈ విషయమై శ్రద్ధ చూపాలని పదే పదే సూచించాను. మొదట నా సూచనను ఆయన అంగీకరించలేదు. ఆ అనువాదాల కృషి తన సృజనాత్మక రచనా వ్యాసంగానికి ఆటంకమవుతుందని రంగారావు అన్నారు. అంతిమంగా ఆయన ఇరవయో శతాబ్ది ప్రశస్థ తెలుగు కథలను ఆంగ్లంలోకి అనువదించి రెండు సంపుటాలుగా ప్రచురించారు. అనువాదంలో తాను ఎదుర్కొన్న సమస్యల గురించి కూడా ఆ సంపుటాలలో వివరంగా రాశారు.

రంగారావు గొప్ప అధ్యాపకుడు. విద్యార్థులు ఆయన్ని అమితంగా అభిమానించేవారు. నేను కూడా ఆయన తరగతులకు హాజరై ఏ విధంగా బోధిస్తున్నదీ గమనించేవాణ్ణి. రంగారావు నుంచి బోధనా నైపుణ్యాలనే కాదు, రచనా నైపుణ్యాలను కూడా నేర్చుకున్నాను. నా బోధనా బాధ్యతలలో కూడా ఆయన సొంత పుస్తకాలు, ఆయన రాసుకున్న నోట్స్‌ను ఉపయోగించుకున్నాను. శ్రీవేంకటేశ్వరా కాలేజీ నుంచి ఉద్యోగ విరమణ చేసిన తరువాత ఆయన పుట్టపర్తిలో స్థిరపడ్డారు.శ్రీ సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయర్‌లెర్నింగ్‌లో బోధనను కొనసాగించారు. బోధనను ఆయన ఒక ఉద్యోగంగా చూడలేదు. ఒక వృత్తిగా కూడా పరిగణించలేదు. భగవంతుడు తనకు నిర్దేశించిన కర్తవ్యంగా బోధనను రంగారావు భావించారు. మా ఇరువురి కుటుంబాల మధ్య కూడా తొలినాటి ఢిల్లీరోజుల నుంచీ సన్నిహిత సంబంధాలు ఉండేవి. ఆయన కుమార్తె సుగుణ, కుమారులు శివ, గోపాల్‌లు మా అమ్మాయి, ఇద్దరు కుమారులకు సన్నిహిత స్నేహితులు. టెలీగ్రాఫ్ క్లర్క్‌గా ప్రారంభమైన రంగారావు ఒక ఆచార్య మహోదయుడుగా , కథారచయితగా, నవలాకర్తగా , పరిశోధకుడుగా , విమర్శకుడుగా, అనువాదకుడుగా సమున్నత శిఖరాలు అధిరోహించారు. ఆయన ఆధ్యాత్మిక యాత్ర యవ్వన సహజమైన నాస్తికత్వం నుంచి ప్రశాంతినిలయంలో నడయాడుతున్న దైవాన్ని కనుగొనేంతవరకు సాగింది. అక్కడ ఆయన ఐహిక, శాశ్వత శాంతిని పొందారు. ఆయన నిజంగా ఒక పూజనీయుడు. వాడ్రేవు పాండురంగారావు అనాయాస మరణం పొందారు.

■ డి.ఎస్.రావు

*వ్యాసకర్త సాహిత్య విమర్శకుడు, విశ్రాంత ఆచార్యుడు. కేంద్ర సాహిత్య అకాడమీ ద్వైమాస పత్రిక 'Indian Literature' మాజీ ఎడిటర్.*

# శ్రీమద్ ఆండవన్‌స్వామి కాలధర్మం



చెన్నై, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): శ్రీరంగం జీయర్ శ్రీమద్ ఆండవన్‌స్వామి సోమవారం మధ్యాహ్నం చెన్నైలో కన్నుమూశారు. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కొద్ది రోజులుగా చికిత్స పొందుతున్న స్వామీజీ పరమపదం చేరుకున్నారని ఆశ్రమ నిర్వాహకులు ప్రకటించారు. శ్రీరంగం ఆశ్రమానికి శ్రీమద్ ఆండవన్ స్వామి 11వ జీయర్‌గా ఉన్నారు. విరుదాచలం సమీపం శ్రీముష్ణంలో జన్మించిన రంగరామానుజ మహదేశికర్ అక్కడి పాఠశాలలో తమిళ ఉపాధ్యాయునిగా సేవలందించారు. 28 యేళ్ల కిందట సన్యాసదీక్ష స్వీకరించి శ్రీరంగం ఆశ్రమానికి 11వ జీయర్‌గా సేవలందించారు. శ్రీమద్ ఆండవన్‌స్వామిగళ్, రంగరామానుజ మహాదేశిక స్వామిగళ్, శ్రీముష్ణం ఆండవన్ స్వామిగళ్ అంటూ భక్తులు ఆయనను పిలిచేవారు. స్వామీజీకి తమిళభాష అంటే ప్రాణం. సంస్కృతం, హిందీ, ఆంగ్ల భాషలు క్షుణ్ణంగా మాట్లాడగల, రాయగల జీయర్‌గా భక్తుల మన్ననలందుకున్నారు. జ్యోతిషశాస్త్రంలోనూ మంచి దిట్ట. తన ఎదుట నిలిచేవారి ముఖకవళికలను నిశితంగా పరిశీలించి వారికున్న రోగమేమిటో ఇట్టే చెప్పేయగలిగే శక్తి ఆయన సొంతం. విద్యకు అధిక ప్రాధాన్యమిస్తేనే మంచి సమాజం ఏర్పడుతుందని, ఆశ్రమం ఆధ్వర్యంలో శ్రీరంగం ఆండవర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలను నెలకొల్పి తక్కువ ఫీజులతో విద్యనందిస్తున్నారు. గోవులంటే ఆయనకెంతో ప్రేమ. కనుకనే శ్రీరంగం ఆశ్రమంలో 180 గోవులను పెంచి పోషించి, గోపూజలు కూడా నిర్వహించేవారు. శ్రీమద్ ఆండవన్‌స్వామి కాలధర్మం చేశారని తెలియగానే ఆశ్రమవాసులు, భక్తులు శోక సంద్రంలో మునిగిపోయారు.



అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది మిర్చి రైతుల పరిస్థితి. గత ఏడాది ధర లేక తీవ్రంగా నష్టపోయిన రైతులు.. ఈ సారి రికార్డు స్థాయిలో ధర పలుకుతున్నా నష్టపోక తప్పని పరిస్థితి నెలకొంది. జెమిని వైరస్ ప్రభావంతో దిగుబడులు సగానికిపైగా తగ్గడంతో ఆదాయం వచ్చే సూచనలేమీ కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. రంగుల్లో వినియోగించే బ్యాగడ రకం మిర్చి అత్యధికంగా క్వింటాల్‌కు రూ.14వేలు పలుకుతున్నా ఆశించిన స్థాయిలో రాబడి రాలేదని చెబుతున్నారు. - గద్వాల, ఆంధ్రజ్యోతి



## విద్యార్థులతో వెట్టి!

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుడు వారితో వెట్టిచాకిరీ చేయిస్తున్నాడు. ఉదయం పాఠశాలకు వచ్చింది మొదలు కారు కడిగించడం, తుడిపించడం, ఇతర పనులు చేయించుకుంటున్నారు. గ్రామస్థుల నుంచి వ్యతిరేకత వచ్చినా మానలేదు! ఇదెక్కడో కాదు ముఖ్యమంత్రి నియోజకవర్గమైన గజ్వేల్ పరిధిలోని వర్గల్ మండలం శేరిపల్లి ప్రాథమిక పాఠశాలలో నిత్యం జరుగుతున్న తంతు. మండల విద్యాధికారి రాములును వివరణ కోరగా తాను ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. - వర్గల్

## నా చావుకు నోట్లరద్దు, జీఎస్టీలే కారణం!

- సోషల్ మీడియాలో శివసేన కార్యకర్త 'చివరి' పోస్ట్

ముంబై, మార్చి 19: నోట్ల రద్దు, జీఎస్టీ కారణంగానే తనువు చాలిస్తున్నానంటూ శివసేన కార్యకర్త ఆత్మహత్యకు పాల్పడడం మహారాష్ట్ర అసెంబ్లీలో కలకలం సృష్టించింది. ప్రధాన ప్రతిపక్ష(కాంగ్రెస్) నేత రాధాకృష్ణ విఖే పాటిల్ ఈ అంశాన్ని అసెంబ్లీలో లేవనెత్తారు. ఎన్డీయే సర్కారు తీసుకున్న ఇలాంటి నిర్ణయాల వల్ల అమాయకులు బలవుతున్నా ఎందుకు స్పందించడం లేదని ఆయన ఉద్ధవ్ ఠాక్రేను నిలదీశారు. "కరద్ జిల్లాకు చెందిన శివసేన కార్యకర్త రాహుల్ ఫలాకే ఈ నెల 16న ఆత్మహత్యకు పాల్పడాడు. తన బలవన్మరణానికి గల కారణాలను ఆయన చివరిసారిగా సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. తన చావుకు నోట్ల రద్దు, జీఎస్టీలే కారణమని పేర్కొన్నాడు" అని పాటిల్ సోమవారం శాసన సభలో తెలిపారు. తాజాగా మిత్రపక్షాలే ఎన్డీయే సర్కారుపై అవిశ్వాస తీర్మానం పెట్టాయని.. అయినా శివసేన కేంద్రానికి ఎందుకు మద్దతిస్తోందని ప్రశ్నించారు.

# కాంగ్రెస్‌లో పదవుల లొల్లి

## ఏఐసీసీ సభ్యుల నియామకంపై అసంతృప్తులు.. పని చేసే వారికి పదవులు దక్కలేదని ఆగ్రహం

- మహిళలకూ ప్రాధాన్యం లేదని మండిపాటు
- ఉత్తమ్‌ను నిలదీయాలని పార్టీ నేతల నిర్ణయం



హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ సభ్యుల నియామకంపై కాంగ్రెస్‌లో కొందరు నేతలు రగిలిపోతున్నారు. ప్రత్యర్థులకు పదవులు దక్కడంతో పలువురు నియోజకవర్గ ఇన్‌చార్జులు గుర్రుగా ఉన్నారు. పార్టీ కోసం పనిచేసే కొందరు తమను కాకుండా చుట్టపు చూపుగా వచ్చేవారిని అందలాలు ఎక్కించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు పెద్దపీట వేస్తామని పార్టీ తరచూ చెబుతుంటుందని, కానీ, తమకు తగినన్ని స్థానాలు దక్కలేదని మహిళా నేతలు వాపోతున్నారు. మొత్తంమీద ఈ వ్యవహారం పీసీసీ అధ్యక్షునికి తలనొప్పిగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఢిల్లీ నుంచి ఆయన రాక కోసం ఎదురు చూస్తున్నారు. ఆయన రాగానే అసంతృప్తిని వెళ్లగక్కేందుకు సిద్ధంగా ఉన్నారు.స్థానికంగానే ఎంపిక!? ఏఐసీసీ సభ్యుల ఎంపికను పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి పార్టీలో ఓ కీలక నేతకు అప్పజెప్పారు. జిల్లాల్లోని ముఖ్య నేతలను సంప్రదించి ఆయన పేర్లు సేకరించినట్లు సమాచారం. పీసీసీ ముఖ్య నేతల సమాచారం ప్రకారం, జిల్లాల్లోని ముఖ్య నేతలు సూచించిన పేర్లనే జాబితాలో పొందుపరిచారు. ఈ పనిలో మరో సీనియర్ బీసీ నేత కూడా ఉన్నట్లు సమాచారం. జాబితా రూపకల్పనలో పీసీసీ అధ్యక్షుని ప్రమేయం తక్కువగా ఉందని పార్టీలోని ఓ వర్గం చెబుతుండగా, మరో వర్గం మాత్రం ఆయనే స్వయంగా జాబితా రూపొందించారని అంటోంది. బలమైన నాయకులు ఉన్నచోట ఉత్తమ్ సూచించిన పేర్లకే ప్రాధాన్యమిచ్చి కొన్ని చోట్ల మాత్రం తమ ఆసక్తి మేరకు కొందరికి చోటు కల్పించారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాగా, రాష్ట్రం నుంచి వెళ్లిన జాబితాలో ఢిల్లీస్థాయిలో కూడా చివరి క్షణంలో కొన్ని మార్పులు చేర్పులు జరిగినట్లు ఒక సీనియర్ నాయకుడు తెలిపారు. కొందరి పేర్లను ఇంకో సీనియర్ బీసీ నేత ఉద్దేశపూర్వకంగా చేర్చారని పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. మరికొందరి విషయంలో ఉత్తమ్‌ను ఆయన సన్నిహితులు ప్రభావితం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థితో తలపడి, ఆ తర్వాత కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న వ్యక్తికి మెదక్ జిల్లాలో ఏఐసీసీ సభ్యునిగా చోటు కల్పించారు. దాంతో సదరు నేత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే జిల్లాకు చెందిన మరో ముఖ్య నేత కూడా ఈ ఎంపికపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఉత్తమ్ రాగానే నిలదీయాలనే యోచనలో ఆయన ఉన్నట్లు సమాచారం. సాధారణంగా పీసీసీ సభ్యునిగా పని చేసిన వాళ్లకు ఏఐసీసీ సభ్యునిగా అవకాశం కల్పిస్తారని, ఇందుకు విరుద్ధంగా ఓ యువ నేతకు చోటు కల్పించారని మరో యువ నేత వాపోయారు. పార్టీ కోసమే శ్రమించని ఇలాంటి వ్యక్తులకు చోటు కల్పిస్తే ఎన్నికల సంవత్సరంలో పరిస్థితి ఎలా ఉండబోతోందో ఊహించుకోవచ్చునన్నారు. పార్టీలో ఎన్నడూ కనిపించని మహిళల పేర్లు జాబితాలో ఉన్నాయని, పార్టీ అప్పజెప్పిన ప్రతి పనిని భుజాన వేసుకొని చేసే తమలాంటి వారికి అవకాశం దక్కలేదని ఓ మహిళా నేత వాపోయారు. అయితే, ఏఐసీసీ జాబితా ఇంకా పూర్తిగా వెలుగులోకి రాలేదు. పూర్తిస్థాయి జాబితా వెలువడితే మరిన్ని అసంతృప్తులు భగ్గుమనే అవకాశాలు కనిపిస్తున్నాయి.



అనంతపురం జిల్లా ఎర్రమంచిలో దక్షిణ కొరియాకు చెందిన ఆటోమొబైల్ దిగ్గజ సంస్థ కియ తన కార్ల తయారీ యూనిట్‌ను స్థాపించిన వెంటనే, ఆ సంస్థకు అనుబంధంగా మరో 16 కంపెనీలు కూడా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ఈ సంస్థలతో ఏపీ పరిశ్రమల శాఖ సోమవారం నాడు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఒప్పందాలను చేసుకుంది. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌ను రెండో ఇల్లుగా మార్చుకోవాలని కొరియన్ కంపెనీలను కోరారు. తమ విధానాలు, నిబద్ధత కారణంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు జాతీయ అంతర్జాతీయ స్థాయి పారిశ్రామికవేత్తలు వేలాది కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్నారని చంద్రబాబు చెప్పారు. - అమరావతి, ఆంధ్రజ్యోతి

## 'భగీరథ' పైపులు అగ్నికి ఆహుతి




కాలిపోతున్న మిషన్ భగీరథ పైపులు

ఆదిలాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా బోథ్ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఆవరణలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో రూ.50 లక్షలు విలువైన మిషన్ భగీరథ పైపులు సహా ఒక వాహనం కాలిపోయాయి. దట్టమైన పొగలు కమ్ముకోవడంతో ఏం జరుగుతుందోనన్న భయంతో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి భారీగా ప్రజలు తరలివచ్చారు. మంటల నుంచి కొన్ని పైపు చుట్టలను పక్కకు తీయడంతో భారీ ఆస్తినష్టం తప్పింది. అరగంటకు ఇచ్చోడ మండల కేంద్రం నుంచి అగ్నిమాపక వాహనం వచ్చేసరికి చాలా పైపులు కాలి బూడిదయ్యాయి.

# మరో ఇద్దరికి కేజ్రీ 'సారీ'

- 33 మందిపై నోరు పారేసుకున్న ఢిల్లీ సీఎం
- ఇప్పటిదాకా ముగ్గురికి క్షమాపణలు



న్యూఢిల్లీ, మార్చి 19: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ క్షమాపణల పర్వం కొనసాగుతోంది. సోమవారం ఆయన మరో ఇద్దరు నేతలకు క్షమాపణలు చెప్పారు. వీరు: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి కపిల్ సిబల్. వారిపై గతంలో చేసిన వ్యాఖ్యలకు తాను చింతిస్తున్నానని, అసలు తాను అలాంటి వ్యాఖ్యలు చేసి ఉండాల్సింది కాదని కేజ్రీవాల్ వారికి విడివిడిగా రాసిన లేఖల్లో పేర్కొన్నారు. కోర్టుల్లో నడుస్తున్న పరువు నష్టం దావాలను ఇక మూసేద్దామని ఆయన ప్రతిపాదించారు. వారిద్దరూ దానికి అందుకు అంగీకరించారు. పంజాబ్‌కు చెందిన సీనియర్ నాయకుడు విక్రమ్ మంజీతాకు రెండ్రోజుల కిందట క్షమాపణ చెప్పిన ఆయన ఇపుడు గడ్కరీ, సిబల్‌లకు సారీ చెప్పారు. 2014 నుంచి వివిధ సందర్భాల్లో కేజ్రీవాల్ అనేకమందిపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. కానీ ఆయన వేటికీ ఆధారాలు చూపలేకపోయారు. ఫలితంగా 33 పరువునష్టం దావాలు దాఖలయ్యాయి. తెల్లారితే చాలు.. ఏదో ఒక కేసు తాలూకు కోర్టు హియరింగే.. అంతేకాక ఆమ్ ఆద్మీ పార్టీ నిధులన్నీ ఈ కేసుల వాదనల ఖర్చులకే అయిపోతున్నట్లు తాజా సమాచారం. దీంతో కేజ్రీవాల్ తన వైఖరిని మార్చుకున్నారు. క్షమాపణలు చెప్పి కోర్టు వెలుపల అన్నీ సెటిల్ చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. 2019 ఎన్నికల కంటే ఓ ఆరునెలల ముందే ఈ కేసుల రంధి నుంచి బయటపడి- జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించాలని కేజ్రీవాల్ భావిస్తున్నారు. నితిన్ గడ్కరీ అంత అవినీతిపరుడు యావద్దేశంలోనే లేరని కేజ్రీవాల్ గతంలో ఆరోపించారు. "ఆ ఆరోపణలో నిజం లేదు. మీపై వ్యక్తిగతంగా నాకేమీ కోపం లేదు. నేను చింతిస్తున్నాను. ఈ అంశాన్ని ఇక మర్చిపోదాం" అని కేజ్రీ- గడ్కరీకి పంపిన లేఖలో పేర్కొన్నారు. 2013లో వోడాఫోన్‌కు పన్ను తగ్గింపు వ్యవహారంలో కపిల్ సిబాల్, ఆయన కొడుకు అమిత్ సిబాల్ లాభపడ్డారని, వారు కూడా అవినీతి తిమింగలాలేలని కేజ్రీ ఆరోపించడంతో సిబాల్- క్రిమినల్ పరువునష్టం దావా వేశారు. ఆనాడు నేను చేసిన ఆరోపణలకు ఆధారాల్లేవంటూ కేజ్రీవాల్ తాజాగా లేఖ రాశారు.

### నయీం కేసుల్లో..

## 'సిట్'కు బాస్ ఎవరు!

- హైదరాబాద్ సీపీగా అంజనీకుమార్ బదిలీ

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గ్యాంగ్‌స్టర్ నయీం ఎన్‌కౌంటర్ తర్వాత అతని అనుచరులపై రెండొందల దాకా కేసులు నమోదయ్యాయి. అప్పట్లో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తుండడం.. కొందరు పోలీసులు నయీం గ్యాంగ్‌తో అంటకాగారన్న ఆరోపణలతో ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. అప్పటి అదనపు డీజీపీ (శాంతిభద్రతలు) అంజనీ కుమార్‌కు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది. ఐజీ నాగిరెడ్డిని దర్యాప్తు అధికారిగా నియమించింది. సాధారణంగా ఈ తరహా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినప్పుడు ప్రభుత్వం ఉత్తర్వుల్లో అధికారుల పేర్లను కాకుండా.. వారి ర్యాంకును పేర్కొంటుంది. కొన్ని అరుదైన సందర్భాల్లో పేర్లను ప్రస్తావిస్తుంది. అలాంటి సందర్భాల్లో.. సంబంధిత అధికారి వేరే విభాగానికి బదిలీ అయినా.. దర్యాప్తును కొనసాగిస్తారు. నయీం కేసుల సిట్ విషయంలో ప్రభుత్వం ప్రత్యేకంగా అంజనీ కుమార్ పేరును ఉత్తర్వుల్లో ప్రస్తావించింది. తాజా బదిలీల్లో ప్రభుత్వం ఆయనను హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నియమించింది. అదనపు డీజీపీ (శాంతిభద్రతలు)గా జితేందర్‌ను పోలీస్ శిక్షణ సంస్థ నుంచి బదిలీ చేసింది. ఈ నేపథ్యంలో.. వీరిరువురిలో ఎవరు సిట్‌ను పర్యవేక్షిస్తారనే చర్చ పోలీసు వర్గాల్లో కొనసాగుతోంది.

# నమ్మకమే అభివృద్ధికి పునాది: మోహన్‌బాబు

- ఘనంగా శ్రీవిద్యానికేతన్ 26వ వార్షికోత్సవం



శ్రీవిద్యానికేతన్ 26వ వార్షికోత్సవంలో మోహన్‌బాబు, స్వరూపానందేంద్రస్వామి

చంద్రగిరి, మార్చి 19: శ్రీవిద్యానికేతన్ విద్యాసంస్థ నిర్వహణ, పనితీరు అద్భుతమని విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్రస్వామి ప్రశంసించారు. చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం ఎ.రంగంపేటలోని శ్రీవిద్యానికేతన్ విద్యాసంస్థల 26వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన స్వరూపానందేంద్రస్వామి మాట్లాడుతూ శ్రీవిద్యానికేతన్ పేరులోనే శారదామాత పేరు ఉందని, ఇది విజయానికి శుభసూచకమని తెలిపారు. ఇక్కడ చదివే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శ్రీవిద్యానికేతన్ మరింత అభివృద్ధి చెందాలని ఆయన ఆశీర్వదించారు. విద్యానికేతన్ మరో నలంద, తక్షశిల విద్యాసంస్థలుగా పేరుప్రఖ్యాతులు తెచ్చుకోవాలని శాంతా బయోటిక్ ఎండీ వరప్రసాద్‌రెడ్డి ఆకాంక్షించారు. నటుడు మంచు మనోజ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఇతరులతో పోల్చుకోకుండా ఉండాలని తెలిపారు. అనంతరం శ్రీవిద్యానికేతన్ విద్యాసంస్థల చైర్మన్, సినీనటుడు డాక్టర్ ఎం.మోహన్‌బాబు మాట్లాడుతూ భగవంతుడు, తన తల్లిదండ్రుల ఆశీస్సులతో ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపారు. నమ్మకమే విజయాన్ని అందిస్తుందని అదే నమ్మకం పతనం కూడా చేస్తుందని తెలిపారు. నమ్మకం అనే ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంటే నిప్పుల్లో నడవచ్చని అంతటి ఆత్మవిశ్వాసంతోనే రైలు ప్రమాదంలో కాలు పోగొట్టుకున్న అరుణిమాసిన్హా తిరిగి పుంజుకుని ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించారని గుర్తుచేశారు. శ్రీవిద్యానికేతన్ విద్యాసంస్థను ఉన్నత పాఠశాలగా మాత్రమే స్థాపించాలనుకున్నానని, అయితే భగవంతుడు, తల్లిదండ్రుల ఆశీర్వాదం వల్ల ఇన్ని విద్యాసంస్థల సమూహంగా ఎదిగిందని పేర్కొన్నారు. శ్రీవిద్యానికేతన్ సీఈవో మంచు విష్ణు మాట్లాడుతూ శ్రీవిద్యానికేతన్ విద్యాసంస్థలు ఇక నుంచి సివిల్స్ పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.



# సభాపర్వం

## త్వరలో ప్రాసిక్యూటింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీ

▸ శాసనసభలో సీఎం కేసీఆర్



హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ కోర్టుల్లో ఖాళీగా ఉన్న ప్రాసిక్యూటింగ్ ఆఫీసర్ పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని సీఎం కేసీఆర్ వెల్లడించారు. శాసన సభా సమావేశాల్లో భాగంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ అడిగిన ప్రశ్నకు సీఎం సమాధానమిచ్చారు. ప్రాసిక్యూటింగ్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టుల భర్తీకి సంబంధించి సమీక్షించాల్సిందిగా అధికారులను ఇప్పటికే ఆదేశించానని, త్వరలో ఖాళీల భర్తీ ఉంటుందని చెప్పారు. కాగా, తరచూ నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులపై పీడీ చట్టం ప్రయోగించడం వల్లే నేరాల తీవ్రత తగ్గిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి, న్యాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నేతృత్వంలో సోమవారమిక్కడ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. కేడర్ ప్రాసిక్యూటర్ పోస్టుల మంజూరు, భర్తీకి కొంత సమయం అవసరమైనందున ప్రస్తుతం నియమిస్తున్న టెన్యూర్ ప్రాసిక్యూటర్ల నియామకానికి మరింత పటిష్ఠ విధానాన్ని అవలంబించాలని సమావేశంలో నిర్ణయించారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ కార్యాలయంలో అవసరమైన మినిస్టీరియల్ సిబ్బంది, ఫర్నిచర్, కంప్యూటర్లు, ఇతర సదుపాయాల కల్పనకు సంబంధించి ప్రభుత్వానికి పూర్తి స్థాయిలో ప్రతిపాదనలు పంపాలని మంత్రులు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌కు సూచించారు.

## అవసరాల మేరకు గిడ్డంగుల నిర్మాణం: హరీశ్



హైదరాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పాటైన మండలాల్లో అవసరాల మేరకు గిడ్డంగులను నిర్మిస్తామని మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. శాసనసభలో సభ్యులు గువ్వల బాలరాజు, చల్లా ధర్మారెడ్డి, బానోత్ మదన్‌లాల్ అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. మండలాల్లో గిడ్డంగుల నిర్మాణానికి స్థలసేకరణ చేయాలని జిల్లా కలెక్టర్లను కోరామని, అదే క్రమంలో నాబార్డు ద్వారా ఫిజిబిలిటీ నివేదికలు అందిన తర్వాత గిడ్డంగుల నిర్మాణాన్ని చేపడతామని చెప్పారు. రాష్ట్రంలో రూ.1,024 కోట్ల వ్యయంతో గిడ్డంగుల నిర్మాణం చేపట్టామన్నారు. మొత్తం 18.30 లక్షల మెట్రిక్ టన్నుల గిడ్డంగుల సౌకర్యం ఏర్పడిందని వివరించారు. ఇప్పటివరకు అందుబాటులోకి వచ్చిన 185 గిడ్డంగులను పౌరసరఫరాల శాఖ, ఇతర ప్రభుత్వ శాఖలకు చదరపు అడుగుకు రూ.2 చొప్పున అద్దెకు ఇచ్చినట్లు తెలిపారు. తక్కువ అద్దె కారణంగా ప్రభుత్వ రంగ సంస్థలకు ఏటా రూ.10 కోట్ల మేర ఆదా అవుతోందని తెలిపారు.

## ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు పెరిగాయి: లక్ష్మారెడ్డి



హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ కిట్ పథకం ప్రవేశపెట్టిన తర్వాత ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు 31% నుంచి 50 శాతానికి పెరిగాయని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి వెల్లడించారు. ఈ పథకం కింద ఇప్పటివరకు 4,41,554 మంది మహిళలు ప్రయోజనం పొందారని తెలిపారు. ఇక, ఎన్‌హెచ్‌ఎం కింద 597 మంది వైద్యాధికారులు, 1,561 స్టాఫ్ నర్సులను నియమించినట్లు చెప్పారు. వైద్య, ఆరోగ్య శాఖలో ఈ ఏడాది 10వేల పోస్టులను భర్తీ చేయనున్నామని వెల్లడించారు. మరో ప్రశ్నకు సమాధానమిస్తూ ప్రతి గ్రామంలోనూ ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ యునానీ డిస్పెన్సరీలు, ఆస్పత్రుల్లో 54 వైద్యాధికారుల పోస్టులు, ప్రభుత్వ నిజామియా టిబ్బీ కళాశాలలో 8 లెక్చరర్ పోస్టులను భర్తీ చేసే ప్రక్రియ ప్రారంభమైందని వెల్లడించారు.

## పరిశీలనలో 'నీరా' పరిశ్రమ: పద్మారావు



హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నీరా పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని ఎక్సైజ్ శాఖ మంత్రి పద్మారావుగౌడ్ ప్రకటించారు. నీరా పరిశ్రమ ఏర్పాటు విషయమై సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. నీరా పరిశ్రమ ఏర్పాటు కోసం నియమించిన కమిటీ ప్రస్తుతం అధ్యయనం చేస్తోందని, నివేదిక అందిన వెంటనే నీరా పరిశ్రమ ఏర్పాటుపై విధివిధానాలను రూపొందిస్తామని చెప్పారు.

## పట్టాదారులకే పెట్టుబడి సాయం: పోచారం

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పట్టాదారులకు మాత్రమే పెట్టుబడి సాయం అందిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. కౌలుదారులకు సంబంధించిన వివరాలు ప్రభుత్వ రికార్డుల్లో ఉండవని, అందుకే పట్టాదారులకు మాత్రమే పెట్టుబడి సాయం అందించాలని నిర్ణయించినట్లు శాసనమండలిలో చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 72,13,111 మంది రైతులకు పెట్టుబడి సాయం అందుతుందని, ఎకరాకు రూ.4వేల చొప్పున మొదటి పంటకు రూ.5,680 కోట్లను బేరర్ చెక్‌ల రూపంలో అందించనున్నట్లు తెలిపారు. రెండో పంట వేయని రైతులకు ప్రభుత్వం నుంచి రెండో విడత సాయం అందదని స్పష్టం చేశారు. వివాదాస్పద భూములను 'బి' కేటగిరీగా పరిణించి, స్పష్టత వచ్చిన తర్వాత చెల్లింపులు చేపట్టనున్నట్టు వివరించారు. కాగా, రైతు సమన్వయ వేదికల నిర్మాణం కోసం రూ.316.5 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. రైతులకు అవసరమైన యంత్రాలు, ట్రాక్టర్లు, ఇతర పనిముట్లను కొనుగోలు చేసి ఆయా క్లస్టర్లలో అందుబాటులో ఉంచుతామన్నారు.

## కోర్టు తీర్పు మేరకు పదోన్నతులు: కడియం

భాషా పండితుల అర్హతలు, సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని గత ఏడాది ఫిబ్రవరిలో 2,487 మంది భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ జారీ చేసిన ఉత్తర్వులపై హైకోర్టు స్టే విధించిందని, తుది తీర్పు తర్వాత వారికి పదోన్నతులు ఇస్తామని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి తెలిపారు. అధికార పార్టీ సభ్యులు పి. సుధాకర్‌రెడ్డి, కె.జనార్దన్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ పదోన్నతుల వివాదం కోర్టు పరిశీలనలో ఉందని, తీర్పు తర్వాత ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

## వృద్ధులకు బస్‌పాస్‌లు: మహేందర్‌రెడ్డి

సీనియర్ సిటిజన్లకు బస్ పాస్‌లు జారీ చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రప్రభుత్వం రాయితీ బస్‌పాస్‌ల కోసం రూ.580 కోట్లు ఖర్చు చేస్తుందని వెల్లడించారు. హైదరాబాద్, వరంగల్ సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం వికలాంగులకు బస్ పాస్‌లను జారీ చేసినట్లు తెలిపారు. జిల్లా ల్లో డీలక్స్ బస్సుల్లో 50% రాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3,14,771 మంది వికలాంగులు రాయితీ పాస్‌లు వినియోగించుకుంటున్నారని వెల్లడించారు. రాష్ట్రంలోని 97బస్‌స్టేషన్లలో సు మారు రూ.60 కోట్లతో సౌకర్యాలను మెరుగుపరిచినట్లు వివరించారు.

## 'పారిశుద్ధ్య' జీతాలు రెండింతలు: జూపల్లి

గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను మూడేళ్లలో రెండింతలు పెంచామని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పంచాయతీల్లో ఔట్ సోర్సింగ్ కింద 24,496 మంది పని చేస్తున్నారని, వీరిలో అర్హులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించే అవకాశం ఉందన్నారు. పంచాయతీలకు ఆర్థిక వనరులను పెంచినందున వేతనాల చెల్లింపులు అదే స్థాయిలో పెరుగుతాయన్నారు. కేంద్రం నుంచి గ్రామపంచాయతీలకు 2014-15లో రూ.1245 కోట్లు, 2015-16లో రూ.697 కోట్లు, 2016-17లో రూ. 935 కోట్లు, 2017-18లో రూ.940 కోట్లు వచ్చాయని వివరించారు.

## రాచకొండ లిఫ్ట్ పనులపై సర్వే చేపట్టాలి: కర్నె

ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలైన మునుగోడు, నల్లగొండ, ఇబ్రహీంపట్నం ప్రాంతాలకు తాగునీటి కోసం ప్రతిపాదించిన రాచకొండ ఎత్తిపోతల పథకంపై సర్వే చేపట్టాలని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ డిమాండ్ చేశారు. మండలిలో ప్రశ్నోత్తరాల అనంతరం ప్రత్యేక ప్రస్తావన సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్లగూడెం రిజర్వాయర్ పనులు కొనసాగుతున్నందున సమాంతరంగా కాలువల తవ్వకాలు చేపట్టాలని కోరారు. మునుగోడు, చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపూర్, చండూరు ప్రాంతాల్లో ఫ్లోరైడ్ సమస్యను అధిగమించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# మాది ప్రజా ఫ్రంట్

(మొదటి పేజీ తరువాయి)

చర్చించారు. ఈ సందర్భంగా వారి మధ్య దేశంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు, కేంద్రంలోని పరిస్థితులు, ఉత్తరప్రదేశ్, బిహార్ ఉప ఎన్నికల ఫలితాలు, ప్రాంతీయ పార్టీల పాత్ర, భవిష్యత్తు అంచనాలు ప్రధానంగా ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. అనంతరం, ఇద్దరు ముఖ్యమంత్రులూ మీడియాతో మాట్లాడారు. "దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు కోసం మమతా బెనర్జీతో నేను జరిపిన చర్చలు ఆరంభం మాత్రమే. కోల్‌కతా వంటి గొప్ప గడ్డపై మా ఆలోచన అమలుకు శుభారంభం జరగడం ఆనందంగా ఉంది. దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో బీజేపీ, కాంగ్రెస్ విఫలమయ్యాయి. అందుకే ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి ఏర్పాటు ఆవశ్యకత ఏర్పడింది. దేశాభివృద్ధే లక్ష్యంగా మేం ఏర్పాటు చేయబోయే ప్రత్యామ్నాయం అతి పెద్ద కూటమిగా అవతరించబోతోంది" అని కేసీఆర్ వివరించారు. మమతతో చర్చలు సుహృద్భావంగా జరిగాయని, దీనిపై మరికొందరు నేతలతోనూ చర్చిస్తామని చెప్పారు. దేశంలో గుణాత్మక మార్పు ఆవశ్యకత ఎంతో ఉందని, అందుకే వాస్తవ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని, భావ సారూప్య పార్టీల కూటమిగా ఇది ఉండబోతోందని చెప్పారు. మిగతా పార్టీలతో చర్చించిన తర్వాత కార్యాచరణ ప్రకటిస్తామని కేసీఆర్ తెలిపారు. "ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న చైనా వంటి దేశాల్లా అభివృద్ధి చెందాల్సి ఉంది. దేశంలో 60 శాతానికిపైగా యువత ఉంది. సిలికాన్ వ్యాలీలో ఎక్కువమంది మనవాళ్లే. దేశంలో ఎన్నో ప్రకృతి, ఖనిజ వనరులు ఉన్నాయి. అయినా, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల రొటీన్ పాలనతో దేశానికి ఒరిగిందేమీ లేదు. దేశంలో గడచిన 71 ఏళ్లుగా ఏం జరిగింది? అదే రొటీన్ మోడల్ మళ్లీ అవసరమా? బీజేపీ పోతే కాంగ్రెస్ వస్తుంది. అయితే ఏమవుతది? వాళ్లేమైనా అద్భుతం సృష్టిస్తారా? దేశానికి గొప్ప మార్పు అవసరం. దేశ పునర్నిర్మాణం అవసరం. అందుకే, ప్రత్యామ్నాయ ఎజెండా, ప్రత్యామ్నాయ అభివృద్ధి, ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి అవసరం. ఈ క్రమంలో మేం జరిపిన చర్చలు ఎంతో కీలకం" అని కేసీఆర్ వివరించారు. పరిస్థితులే నాయకులను సృష్టిస్తాయని ఒక ప్రశ్నకు సమాధానంగా కేసీఆర్ చెప్పారు. కూటమికి నాయకత్వ సమస్య ఏమీ లేదని, తమది సమష్టి, సమాఖ్య నాయకత్వమని చెప్పారు.



దీదీతో కవిత సెల్ఫీ

### కారు వద్దకు వచ్చి స్వాగతం.. వీడ్కోలు

▸ కేసీఆర్‌కు మమత ఆత్మీయ ఆతిథ్యం

సీఎం కేసీఆర్‌కు బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆత్మీయ ఆతిథ్యం ఇచ్చారు. సోమవారం మధ్యాహ్నం 11.40 గంటలకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరిన కేసీఆర్.. మధ్యాహ్నం 2గంటలకు కోల్‌కతా చేరుకున్నారు. నేతాజీ విమానాశ్రయంలో ఆ రాష్ట్ర మంత్రి పూర్ణేందుబసు, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. ప్రభుత్వ ప్రత్యేక కాన్వాయ్‌లో కేసీఆర్ ఆ రాష్ట్ర సచివాలయానికి వెళ్లారు. అప్పటికే కేసీఆర్‌ను స్వాగతించడానికి తన చాంబర్ నుంచి బయటికి వచ్చిన మమత.. అలైటింగ్ పాయింట్ వద్ద కొద్దిసేపు వేచి ఉన్నారు. కారు దిగిన కేసీఆర్‌కు దీదీ చిరునవ్వుతో నమస్కరించి, పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కేసీఆర్ కూడా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అనంతరం తన కార్యాలయంలో కేసీఆర్‌ను శాలువాతో సత్కరించారు. చివర్లో మళ్లీ కేసీఆర్ వాహనం వరకూ వచ్చి మరీ దీదీ వీడ్కోలు పలికారు. నిజానికి, మమత కార్యాలయం సచివాలయంలోని 14వ ఫ్లోర్లో ఉంటుంది. స్వాగతం, వీడ్కోలు సందర్భంగా రెండుసార్లూ ఆమె 14 ఫ్లోర్లూ దిగి రావడం విశేషం.



కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న పశ్చిమ బెంగాల్ సీఎం మమత

### భావ సారూప్య పార్టీలను కలుపుకొని వెళతాం: మమత

ఫెడరల్ ఫ్రంట్ బలంగా ఉండాలన్నదే తమ లక్ష్యమని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. "రాజకీయాలు నిరంతర ప్రక్రియ. దేశాభివృద్ధిలో భాగంగా, రైతాంగానికి మరింత చేయాల్సిన అభివృద్ధిపైనా మేం చర్చించాం. భవిష్యత్తులో భావ సారూప్య పార్టీలను కలుపుకొని వెళతాం. మేమేమీ తొందరపడ్డం లేదు. దేశంలో ప్రతి రాజకీయ పార్టీ కూడా గుర్తింపును కోరుకుంటుంది. ప్రతి పార్టీ కూడా మరో పార్టీని గౌరవించాలి. ఒక్క పార్టీయే దేశాన్ని పాలించాలనుకోవడం సమర్థనీయం కాదు. దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. మేం ఏర్పాటు చేయబోయేది బలమైన కూటమిగా ఆవిర్భవించబోతోంది" అని మమత తెలిపారు.

### కాంగ్రెస్‌తో వెళ్లినా..

వివిధ రాష్ట్రాల్లో రాజకీయ శక్తులుగా నిరూపించుకున్న ప్రాంతీయ పార్టీలు కేంద్రంలో బీజేపీయే కాదు.. కాంగ్రెస్ వెంట వెళ్లినా ప్రయోజనం లేదని సీఎం కేసీఆర్ మమతా బెనర్జీతో అన్నారు. ఇన్నేళ్లుగా ఆ రెండు పార్టీలే దేశాన్ని పాలిస్తూ వస్తున్నాయని, అయినా వ్యవస్థలో మార్పు తీసుకురాలేకపోయాయని చెప్పారు. ప్రధానంగా ప్రజల అజెండాను ప్రభుత్వ అజెండాగా మలిచి అమలు చేయటంలో, రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడటంలో విఫలమయ్యాయన్నారు. బీజేపీతో తీవ్రంగా విభేదిస్తున్న మమత కాంగ్రెస్‌కు కాస్త సానుకూలంగా ఉండడం, ఇటీవల సోనియా గాంధీ ఇచ్చిన విందుకు తమ పార్టీ ప్రతినిధిని పంపిన నేపథ్యంలో ఆమెతో కేసీఆర్ అన్న ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఇప్పుడు బీజేపీకి దూరంగా ఉంటున్నట్లే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి కూడా దూరంగా ఉండాల్సిన అవసరం ఉందని చెప్పిన కేసీఆర్.. అందుకు సహేతుక కారణాలను కూడా వివరించినట్లు తెలిసింది. సోనియా సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్నాక, ఆ పార్టీలోని పరిణామాలు, రాహుల్ నాయకత్వ పటిమ, కాంగ్రెస్ భవిష్యత్తు, ప్రధాని మోదీ, కేంద్రంలోని బీజేపీ సర్కారు తీరుపై తన వాదనను కేసీఆర్ ఆమెకు వివరించినట్లు సమాచారం. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కేంద్రంలో ప్రాంతీయ పార్టీల ఐక్యత కీలకం కానుందని చెప్పినట్లు తెలిసింది. దేశవ్యాప్తంగా నదీ జలాలు, ఇతర వనరుల సమర్థ వినియోగంలో ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వాల ఉదాసీనతను గణాంకాలతో సహా వివరించారని సమాచారం. అలాగే, దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో తమ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారని తెలిసింది. సీఎం కేసీఆర్ వాదనకు మమత సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. మమతతో రెండు గంటల పాటు ముఖాముఖి చర్చించిన కేసీఆర్.. ఆ తర్వాత ఇరు రాష్ట్రాల అధికారులు, నాయకులతో కలిసి రెండు రాష్ట్రాల్లోని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా త్వరలో హైదరాబాద్ వస్తానని కేసీఆర్‌కు మమత స్పష్టం చేశారు. కాగా, భేటీ చివర్లో కేసీఆర్ తన కూతురు, పార్టీ ఎంపీ కవితను లోనికి పిలిచి మమతకు పరిచయం చేశారు.

**దీదీ పాలన భేష్: కేసీఆర్**

పశ్చిమ బెంగాల్ అభివృద్ధిలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పరిపాలన ప్రశంసనీయమని కేసీఆర్ అన్నారు. రాష్ట్ర పురోభివృద్ధికి ఆమె తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని కొనియాడారు. కేసీఆర్ వెంట ఎంపీలు కేశవరావు, కవిత, రాజకీయ కార్యదర్శి, టీఎస్ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు రాజీవ్ శర్మ, అనురాగ్ శర్మ, కొందరు సీఎంవో అధికారులు ఉన్నారు.

### ఫ్రంట్ అజెండా త్వరలో ఖరారు: కవిత

మమతా బెనర్జీతో ముఖ్యమంత్రి కేసీఆర్ చర్చలు సోమవారం సహృద్భావ వాతావరణంలో జరిగాయని ఎంపీ కవిత వెల్లడించారు. అనేక అంశాలపై చర్చలు జరిగాయని, ఫ్రంట్ అజెండా అందరం కలిసి త్వరలో ఖరారు చేస్తామని ఆమె సోమవారం రాత్రి విలేకరులతో మాట్లాడుతూ పేర్కొన్నారు.



### కాళీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు

కోల్‌కతా పర్యటనలో చివరగా సీఎం కేసీఆర్ అక్కడి కాళీమాత ఆలయాన్ని సందర్శించారు. ఆయనకు ఆలయంలో సంప్రదాయాల ప్రకారం స్వాగత సత్కారాలు లభించాయి. కేసీఆర్ కాళీమాత గర్భగుడిలో ఆసీనులై ప్రత్యేక పూజలు చేశారు. కాగా, ఫ్రంట్ ప్రకటన తర్వాత కేసీఆర్ చేసిన తొలి అంతర్రాష్ట్ర పర్యటన విజయవంతమైందని, మమతతో భేటీ ఫలవంతమైందని టీఆర్ఎస్ వర్గాలు భావిస్తున్నాయి. ఇదే ఉత్సాహంతో దేశ ప్రజల కోసం మరింత చొరవతో ముందుకు వెళ్తారని పేర్కొంటున్నాయి.

# నిరా(ఆ)ధార్

▸ ఆధార్ ఇచ్చేందుకు 17,13,944 మంది విముఖత

▸ 54,80,729 ఖాతాలకే పంట సాయం, పాస్‌పుస్తకం

హైదరాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): భూరికార్డులకు ఆధార్ నంబర్లను అనుసంధానించే గడువు మంగళవారం మధ్యాహ్నంతో ముగియనుంది. రాష్ట్రవ్యాప్తంగా 30 జిల్లాల్లోని(హైదరాబాద్ కాకుండా) 71,94,673 ఖాతాలకు గాను సోమవారం నాటికి 54,80,729 ఖాతాలకే ఆధార్ నెంబర్లు అనుసంధానమయ్యాయి. 17,13,944 ఖాతాదారులు ఆధార్ నెంబర్లు ఇచ్చేందుకు ఆసక్తి చూపలేదు. పంట సాయం కోసం ఖాతాల వివరాలను మంగళవారం మధ్యాహ్నం 2 గంటల కల్లా వ్యవసాయ శాఖకు అందించనున్నారు. దీంతో పంట సాయం 54,80,729 ఖాతాదారులకే అందనుంది. ఏప్రిల్‌లో పంట సాయం అందించేందుకు ఎలక్ట్రానిక్ టైటిల్ డీడ్ కమ్ పట్టాదారు పాస్‌పుస్తకాలను ఈ నెల 20వ తేదీలోపు అందించాలని రైతులకు ప్రభుత్వం టార్గెట్‌గా పెట్టింది. రాష్ట్రంలో 68,02,130 ఖాతాలు వివాదాల్లేనివని ప్రభుత్వం గుర్తించింది. ఆధార్ అనుసంధానాన్ని జనవరిలోనే ప్రారంభించినా.. భూయాజమానులు ముందుకురావడం లేదు. ఆధార్ అనుసంధానం పూర్తయిన ఖాతాల వివరాలన్నీ వ్యవసాయ శాఖకు మంగళవారం పంపించే అవకాశాలున్నాయి. ఆ తర్వాత పట్టాదారు పాస్‌పుస్తకాల ముద్రణ కోసం డిజిటల్ సంతకాలు చేసిన వివరాలు ఆన్‌లైన్‌లో సిద్ధంగా ఉంచనున్నారు. ఒక్కో పాస్‌పుస్తకాన్ని రూ.157.50కు ముద్రించడానికి నలుగురు ప్రింటర్లు ఇప్పటికే టెండర్లు దక్కించుకున్నారు. వీరందరికీ ఆర్డర్లు ఇవ్వనున్నారు.

# సారూ.. మా స్కూళ్లో తరగతులు పెంచరా?

▸ సీఎం సహా మంత్రులకు విద్యార్థుల లేఖలు

▸ స్పందించిన మంత్రి హరీశ్ రావు

▸ పాఠశాలను అప్‌గ్రేడ్ చేయిస్తానని హామీ





పోస్టుకార్డులు రాసిన విద్యార్థులు (ఫైల్); మంత్రి హరీశ్‌రావు విద్యార్థులకు రాసిన లేఖ

గూడూరు రూరల్, మార్చి 19: అది మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం పొనుగోడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల. ఒకటి నుంచి ఐదు తరగతులున్నాయి. మొత్తం విద్యార్థుల సంఖ్య 250. ఉన్నది ఇద్దరే ఉపాధ్యాయులు. ఐదో తరగతి పూర్తయ్యాక ప్రాథమికోన్నత పాఠశాలకు సుదూర ప్రాంతాలకు వెళ్లడమా? చదువును ఆపేయడమా? అన్నవి ఇక్కడి చిన్నారుల ముందున్న సవాళ్లు. దీంతో ఐదో తరగతి తర్వాత కూడా ఊళ్లోనే బడి ఉండేలా చేయాలంటే ఎవరికి విన్నవించుకోవాలి? అని ఆలోచించారు. అధికారులతో మొరపెట్టుకున్నా.. స్పందన లేకపోవడంతో.. పోస్టు కార్డుల ఉద్యమాన్ని చేపట్టాలని నిర్ణయించారు. ఫిబ్రవరి 28న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, ఇతర మంత్రులకు లేఖలు రాశారు. ఎంతకీ సమాధానం రాకపోవడంతో తమ గోడు వినేవారే లేరనే నైరాశ్యంలో మునిగిపోయారు. ఈ నేపథ్యంలో పెద్దమనసుతో స్పందించిన మంత్రి హరీశ్‌రావు.. తన లెటర్ హెడ్‌పై అధికారికంగా హామీ ఇస్తూ.. పోస్టు ద్వారా స్కూలు పిల్లలకు లేఖ రాశారు. ఆ లేఖ సోమవారం పాఠశాలకు చేరింది. 'మీ స్కూళ్లో అదనపు గదులు నిర్మించేలా నేను చొరవ తీసుకుంటాను. పాఠశాల స్థాయిని ప్రాథమికోన్నత.. ఆ తర్వాత ఉన్నత పాఠశాలగా అభివృద్ధి చేయిస్తాను' అని ఆ లేఖలో హరీశ్ రావు పేర్కొనడంతో.. తమ కష్టాలు తీరినట్లేనని ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు ఇక్కడి విద్యార్థులు.

# జీఎస్టీ, పెద్దనోట్ల రద్దు జరగకపోతే మరింత వృద్ధి రేటు

▸ తెలంగాణ ఆర్థిక పరిస్థితి వివరించండి

▸ బ్రాహ్మణులు, మైనారిటీ నిధులు ఖర్చు చేయండి

▸ పాతబస్తీకి 5000 కోట్ల ప్యాకేజీ: అక్బరుద్దీన్



హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో వృద్ధి రేటు ఆశాజనకంగా ఉందని, ఈ నాలుగేళ్లలో జాతీయ సగటు 7 శాతం ఉంటే, రాష్ట్రంలో 9 శాతాన్ని దాటిందని మజ్లిస్ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. జీఎస్టీ అమలు, పెద్ద నోట్ల రద్దు జరగకపోయి ఉంటే.. తెలంగాణలో వృద్ధి రేటు మరింత పెరిగి ఉండేదని అభిప్రాయపడ్డారు. శాసనసభలో సోమవారం బడ్జెట్ చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. వివిధ పథకాలకు ప్రభుత్వం భారీగా అప్పులు చేస్తోందని, కేవలం వడ్డీల రూపంలోనే రూ.11,719 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. బ్రాహ్మణ పరిషత్, మైనారిటీ సంక్షేమాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నా.. ఖర్చు చేయడం లేదన్నారు. బ్రాహ్మణులు అనేక ఇబ్బందుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మైనారిటీలకు కేటాయించిన నిధులు పూర్తిస్థాయిలో ఖర్చు చేయడం లేదని, ఎస్సీ, ఎస్టీలతో సమానంగా అన్ని రంగాలు, విభాగాల్లో మైనారిటీలకు అవకాశాలు కల్పించాలని కోరారు. భారీ బడ్జెట్‌తోపాటు తెలుగు రాష్ట్రాలు వృద్ధి రేటులోనూ ముందున్నాయని ప్రశంసించారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితి ఏమిటో వివరించాలన్నారు. "విభజన హామీలను కేంద్రం విస్మరించింది. ఏపీ సీఎం చంద్రబాబు 29 సార్లు ఢిల్లీ వెళ్లినా ప్రత్యేక హోదా ఇవ్వలేదు. తెలంగాణకు ఇచ్చిన హామీలనూ నెరవేర్చలేదు. కాళేశ్వరాన్ని జాతీయ ప్రాజెక్టుగా పరిగణించలేదు. మిషన్ కాకతీయ, భగీరథలను ప్రశంసిస్తున్న కేంద్రం.. ఎలాంటి నిధులు కేటాయించలేదు. స్టీల్ ప్లాంటు, గిరిజన వర్సిటీ, ఉద్యాన వర్సిటీ ఇవ్వలేదు" అని తప్పుబట్టారు. పాతబస్తీకి రూ.5 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని అక్బరుద్దీన్ కోరారు.

### అప్పుల ఆధారంగా బడ్జెట్: సండ్ర

రాష్ట్ర ప్రభుత్వం అప్పుల ఆధారంగా 2018-19 బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని, ఇది రాష్ట్రానికి ఎంతమాత్రమూ శ్రేయస్కరం కాదని టీడీపీఎల్పీ నేత సండ్ర వెంకట వీరయ్య ధ్వజమెత్తారు. శాసనసభలో సోమవారం బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదాయ వనరులను పరిగణనలోకి తీసుకోకుండా, అప్పులే ప్రామాణికంగా వ్యయాల పద్దులను ప్రవేశపెట్టారని విమర్శించారు. సర్కారు తీసుకునే రుణాలను ఉత్పాదక రంగాలపై వ్యయం చేయాలని, కానీ.. అనుత్పాదక రంగాలపై ఖర్చు చేస్తూ ప్రజలపై అప్పుల భారాన్ని పెంచుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ పథకాలకు అధిక నిధులు కేటాయించినా ఆ స్థాయిలో వాస్తవ ఖర్చులు ఉంటాయా అన్నది అనుమానమేనని అన్నారు. నాలుగు బడ్జెట్లలో రూ.1.99 లక్షల కోట్లను ప్రగతి పద్దు కింద చూపి.. రూ.1.37 లక్షల కోట్లే ఖర్చు చేశారని తెలిపారు.

### గిరిజనులకూ పెట్టుబడి సాయం: సున్నం రాజయ్య

రాష్ట్రంలో పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న 14 లక్షల మంది గిరిజనులకు కూడా పెట్టుబడి సాయం అందించాలని సీపీఎంఎల్పీ నేత సున్నం రాజయ్య డిమాండ్ చేశారు. శాసనసభలో ఆయన బడ్జెట్‌పై మాట్లాడుతూ... బడ్జెట్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలను విస్మరించారని, కార్పొరేట్ రంగానికి ఇచ్చిన ప్రాధాన్యాన్ని పేదలకు ఇవ్వలేదని ఆరోపించారు.

### సభ నుంచి కాంగ్రెస్ పారిపోయింది: వేముల వీరేశం

ఉమ్మడి ఏపీలో సొమ్మొకడిది, సోకొకడిది అన్నట్లు ఉండేదని, బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణ ప్రాంతానికి ఏనాడూ న్యాయం జరగలేదని టీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఒకప్పుడు హాస్టళ్లలో పురుగుల అన్నం వద్దంటూ ఆందోళనలు, ర్యాలీలు జరిగేవని, ఇప్పుడు అలాంటి వాటికి అవకాశమే లేదని చెప్పారు. బడ్జెట్‌ను ప్రజలు స్వాగతిస్తున్నారని, అందుకే కాంగ్రెస్ సభ నుంచి పారిపోయిందని విమర్శించారు.

# అంకెల గారడీలా బడ్జెట్

▸ ఎన్నికల కోసం రూపొందించారు: బీజేపీ


▸ శాసనమండలిలో బడ్జెట్‌పై చర్చ

▸ అద్భుతంగా ఉందన్న అధికార పార్టీ

▸ సభ్యుల గైర్హాజరుపై చైర్మన్ అసంతృప్తి

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ సర్కారు ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రూపొందించారని బీజేపీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు విమర్శించారు. మిగులు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారని ఆరోపించారు. సోమవారం శాసనమండలిలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. కేటాయింపులు భారీగా చూపించి ఖర్చు మాత్రం చాలా తక్కువగా పెడుతున్నారని, అంతా అంకెల గారడీలా, అసంబద్ధంగా ఉందని అన్నారు. అయితే ఈ విమర్శల్ని టీఆర్ఎస్ సభ్యులు బోడకుంటి వెంకటేశ్వర్లు, భానుప్రసాద్, రాములు నాయక్ తిప్పికొట్టారు. బడ్జెట్ అద్భుతంగా ఉందన్నారు. ప్రభుత్వం అప్పులు చేయడం తప్పు కాదని, రాష్ట్రం సుభిక్షంగా ఉండటం కోసమే అప్పులు చేస్తున్నారని అన్నారు. పరిమితమైన ఆస్తుల కల్పన కోసం ఇటువంటి అప్పులు ప్రభుత్వాలు చేస్తుంటాయని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులను శరవేగంగా పూర్తిచేసేందుకు మంత్రి హరీశ్‌రావు అహర్నిశలు కృషి చేస్తున్నారని, ఉగాది పండుగ రోజు కూడా కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించారని కొనియాడారు. ఆయన బుల్లెట్‌లా దూసుకుపోతున్నారని వ్యాఖ్యానించారు. కాగా బడ్జెట్‌పై చర్చ జరుగుతుండగా అధికార పార్టీ ఎమ్మెల్సీలు సగం మంది కూడా లేకపోవడంపై మండలి చైర్మన్ స్వామిగౌడ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సభ్యుల హాజరు పెరిగేలా చూడాలని సభను వాయిదా వేసే సమయంలో చీఫ్ విప్, విప్‌లకు సూచించారు. మంత్రులు కూడా సభ ముగిసేవరకు ఉండేలా చూడాలన్నారు.

బ్యూటీకేర్



ముఖంపై, ముఖ్యంగా ముక్కుపై బ్లాక్‌హెడ్స్ ఉంటే అమ్మాయిలు బయటకు వెళ్లేందుకు సంకోచిస్తారు. అయితే వీటిని తొలగించుకునేందుకు డెర్మటాలజిస్టుల దగ్గరికో, బ్యూటీపార్లర్‌కో వెళ్లకుండా ఇంట్లోనే కొన్నిరకాల ఫేస్‌మాస్కులు తయారుచేసుకోవచ్చు. ఎలాంటి రసాయనాలు లేని, ప్రకృతిసిద్ధమైన పదార్థాలతో వంటింట్లోనే తయారుచేసుకునే కొన్ని మాస్కులు ముక్కుమీద ఉండే బ్లాక్‌హెడ్స్‌ను పోగొడతాయి. ఈ మాస్కులతో ఎంచక్కా ఫెయిర్ స్కిన్‌ను తిరిగిపొందండి.

# బ్లాక్‌హెడ్స్ బేఫికర్











**బ్లాక్‌హెడ్స్... అమ్మాయిలను విపరీతంగా వేధించే సమస్య. ముఖంపై, ముఖ్యంగా ముక్కుపై ఉండే బ్లాక్‌హెడ్స్ అమ్మాయిలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తాయి. రకరకాల సబ్బులతో రుద్దినా, ఎన్నిరకాల ఫేషియల్స్ చేసుకున్నా కొన్నిసార్లు ఈ సమస్య తీవ్రమవుతుంది. ఒక్కోసారి డెర్మటాలజిస్టులతో వారాల తరబడి చికిత్స తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. నిజానికి మొటిమలు వేరు, బ్లాక్‌హెడ్స్ వేరు. నూనె పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల, వాయు కాలుష్యం వల్ల ముఖంపై ముందుగా మొటిమల్లాగా మొదలై ఆ తర్వాత నల్లగా మారుతాయి. చర్మం పొడిబారకుండా చర్మగ్రంథుల నుంచి 'సీబమ్' ఆయిల్ వెలువడుతుంది. దీనివల్ల కూడా బ్లాక్‌హెడ్స్ ఏర్పడతాయంటున్నారు డెర్మటాలజిస్టులు. చర్మంపై బ్యాక్టీరియా ఉన్నా, మృతకణాల వల్ల, మెడికేషన్ వల్ల, హార్మోనల్ తేడాల వల్ల కూడా బ్లాక్‌హెడ్స్ వచ్చే అవకాశం ఉంటుంది.**

### లెమన్ హనీ మాస్క్

సౌందర్యసాధనలో నిమ్మకాయకు ప్రత్యేక స్థానం ఉంది. నిమ్మలోని ఆస్ట్రిజెంట్ లక్షణాలు చర్మంలోని స్వేదగ్రంథులను శుభ్రం చేస్తాయి. తేనెలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఎక్కువగా ఉంటాయి. అవి చర్మానికి రక్షణగా నిలిచి, బ్లాక్‌హెడ్స్‌ను దూరం చేస్తాయి.

**తయారీ:** ఒక టేబుల్ స్పూను నిమ్మరసం తీసుకుని, దానికి అర టీ స్పూను తేనెను చేర్చి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముక్కుపై పొరలాగా వేయాలి. 15 నిమిషాల తర్వాత పొర ఎండిపోయి గట్టిపడుతుంది. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రంగా కడగాలి. ఈ మాస్క్ వారానికి మూడు నాలుగుసార్లు వేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

### బేకింగ్ సోడా లెమన్ మాస్క్

చర్మంలోని మృతకణాలను తొలగించడంలో బేకింగ్ సోడా బాగా తోడ్పడుతుంది. బ్లాక్‌హెడ్స్‌కు మృతకణాలు కూడా ఒక కారణమే. నిమ్మతో కలవడం వల్ల బేకింగ్ సోడా మరింత శక్తివంతంగా పనిచేస్తుంది.

**తయారీ:** ఒక టేబుల్‌స్పూను బేకింగ్ సోడాలో అర టేబుల్‌స్పూను నిమ్మరసాన్ని మిక్స్ చేసి బ్లాక్‌హెడ్స్ ఉన్న చోట అప్లయ్ చేయాలి. కాసేపు అలాగే వదిలేసి ఆ తర్వాత గోరువెచ్చటి నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి.

### ఎగ్‌వైట్ మాస్క్

ఎగ్‌వైట్ (గుడ్డులోని తెల్లసొన)ను డైట్‌లో భాగంగా ఆహారంలో తీసుకుంటుంటారు చాలామంది. అయితే కేవలం డైట్‌లోనే కాదు చర్మసంరక్షణకు కూడా ఎగ్‌వైట్ ఉపయోగపడుతుంది. ఇది నీళ్లలా కాకుండా నూనెలా గాఢత కలిగి ఉంటుంది కాబట్టి ముక్కు మీద వేస్తే జారకుండా అలాగే ఉండిపోతుంది. ఇది చర్మాన్ని గట్టిపరిచి బ్లాక్‌హెడ్స్ రాకుండా చేస్తుంది.

**తయారీ:** గుడ్డులోని తెల్లసొనను మాత్రమే తీసుకుని దానికి కొద్దిగా నిమ్మరసాన్ని కలపాలి. బ్లాక్‌హెడ్స్ ఉన్న చోట ఈ మాస్క్‌ను వేయాలి. ఎగ్‌వైట్ మాస్క్ ఆరిన తర్వాత మరోసారి దానిపై ఇంకో పొర వేయాలి. ఆ తర్వాత ఇరవై నిమిషాల పాటు ఆరనిచ్చి నీటితో శుభ్రంగా ముఖాన్ని కడుక్కోవాలి. గుడ్డు సొన వాసనపోయేవరకు ముఖాన్ని సబ్బుతో కాకుండా కేవలం నీటితోనే శుభ్రంగా కడగాలి.

### ఓట్‌మీల్ స్క్రబ్

ఓట్స్ అనేవి ఆరోగ్యరీత్యా ఉదయం అల్పాహారంలోకి బాగుంటాయనేది తెలిసిన విషయమే. ఓట్స్ చర్మసంరక్షణలో కూడా అద్భుతాలు సృష్టిస్తాయి. ఇవి కేవలం బ్లాక్‌హెడ్స్‌ను పోగొట్టడమేగాక, చర్మం కాంతివంతం కావడానికి తోడ్పడతాయి.

**తయారీ:** రెండు టేబుల్ స్పూన్ల ఓట్‌మీల్‌లో మూడు టేబుల్ స్పూన్ల ప్లెయిన్ యోగర్ట్, అర టేబుల్ స్పూను నిమ్మరసం కలిపి పేస్టులా చేయాలి. ముక్కుమీద బ్లాక్‌హెడ్స్ బాగా ఉన్నచోట ఈ పేస్టును రాయాలి. పది, పదిహేను నిమిషాలు ఆరనిచ్చి ఆ తర్వాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి.

### షుగర్ స్క్రబ్

బ్లాక్‌హెడ్స్‌తో బాగా ఇబ్బంది పడుతున్నవారికి షుగర్ స్క్రబ్ చక్కని పరిష్కారాన్ని చూపుతుంది. ఈ స్క్రబ్‌లో షుగర్‌తో పాటు జొజొబా ఆయిల్‌ను వాడాల్సి ఉంటుంది. మృతకణాలపై ఇది బాగా పోరాడి బ్లాక్‌హెడ్స్ తిరిగి రాకుండా చేస్తుంది.

**తయారీ:** మూడు టేబుల్ స్పూన్ల జొజొబా ఆయిల్‌ను ఒక కప్పు తెల్ల చక్కెర (వైట్ షుగర్)లో కలపాలి. ఈ మిక్స్చర్ కాస్త గట్టిగానే ఉండాలి. జొజొబా ఆయిల్ అందుబాటులో లేకుంటే ఆలివ్ ఆయిల్‌గానీ, ఆల్మండ్ ఆయిల్‌గానీ వాడొచ్చు. ఈ మిశ్రమాన్ని బ్లాక్‌హెడ్స్ ఉన్న చోట రాసి, మసాజ్ చేయాలి. ఆ తర్వాత కాసేపు ఆరనిచ్చి, గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. వారానికి రెండుసార్లు ఈ స్క్రబ్‌ను వేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

Blackheads

---

**సమ్మర్ జ్యూస్**

## కేరీ పన్హా



**కావలసినవి:** పచ్చి మామిడి కాయలు - నాలుగు (మీడియం సైజ్‌వి), పంచదార - రెండు కప్పులు, మంచి నీళ్లు - ఒక కప్పు, బ్లాక్ రాక్ సాల్ట్ - ఒక టేబుల్ స్పూన్(కచ్చాపచ్చాగా గ్రైండ్ చేయాలి), మిరియాల పొడి - ఒక టీస్పూన్, సోంపు - రెండు టేబుల్ స్పూన్‌లు (కచ్చాపచ్చాగా గ్రైండ్ చేయాలి), జీలకర్ర - రెండు టేబుల్ స్పూన్‌లు (వేగించి, కచ్చాపచ్చాగా గ్రైండ్ చేసి), పుదీనా - కొద్దిగా (అలంకరణకు).



**తయారీ:**

- పచ్చి మామిడికాయలను శుభ్రంగా కడిగి, తొక్క తీసి, తుర మాలి. తరువాత మామిడి తురుము, పంచదార, నీళ్లను లోతైన సాస్ పాన్‌లో లేదా ప్రెషర్ కుక్కర్‌లో ఉంచి మామిడి తురుము మెత్తగా అయ్యే వరకు ఉడికించాలి.
- ఈ మిశ్రమాన్ని మిక్సీ జార్‌లో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి.
- తరువాత సాస్‌పాన్‌లో వేసి ఓ మాదిరి మంట మీద ఉంచాలి.
- మిగతా పదార్థాలన్నింటినీ ఇందులో వేసి 20 నిమిషాలు ఉడికించాలి.
- తరువాత స్టవ్ ఆపేసి ఉడికిన మిశ్రమాన్ని చల్లార్చాలి.
- చల్లారిన పచ్చిమామిడి డ్రింక్‌ను గ్లాసుల్లో పోయాలి. అవసర మనుకుంటే చల్లటి నీళ్లు కూడా పోసి బాగా కలిపి క్రష్ ఐస్ వేయాలి.
- పుదీనా ఆకులతో అలంకరించి తాగితే తియ్యగా, పుల్లగా, కారంగా... భలేగా ఉంటుంది.

**పేరెంటచ్**

## ఒత్తిడి మంచిది కాదు



సాధారణంగా పిల్లలు ఒక పరీక్ష రాసి రాగానే దాని గురించి మర్చిపోవాలి. అంతేగానీ కొందరు తల్లిదండ్రుల ఒత్తిడి పిల్లలపై అధికంగా ఉంటుంది. ఈ రోజు ఒక పరీక్ష రాసి వచ్చాడూ అంటే దాన్ని అంతటితో వదిలేయకుండా... వచ్చీ రావడమే "ఏ ఆన్సర్ బాగా చేశావు? బాగా చేయనివి ఏవి? ఇప్పటిదాకా రాసిన పేపర్లల్లో బాగా రాసినవీ, బాగా రాయనివీ కలుపుకుంటే మొత్తంగా ఎన్ని మార్కులు వస్తాయి? తర్వాత పరీక్షల్లో ఎన్ని మార్కులు స్కోరు చేస్తే అనుకున్న పర్సంటేజ్ వస్తుంది?" వంటి ప్రశ్నలతో ఒత్తిడికి గురిచేస్తారు. అంతటితో ఆగకుండా, 'ఇంకొంచెం కష్టపడి ఉంటే, ఆ పేపర్ కూడా బాగా రాసేవాడివి కదా!' అంటూ బాగా రాయని పేపర్ విషయాన్నే పదేపదే ఎత్తి చూపుతూ, మానసికంగా కుంగిపోయేలా చేస్తారు. పిల్లలపై ఆ ప్రభావం మరుసటి రోజు పరీక్ష మీద కచ్చితంగా పడుతుంది. ఫలితంగా, బాగా రాయగలిగే రోజున కూడా డీలా పడిపోతారు.

సమీక్షలు అవసరమే. కానీ, ఎప్పుడు? పరీక్షలన్నీ అయిపోయాక! అలా కాకుండా ఏ రోజుకారోజు సమీక్ష చేస్తే... ప్రయోజనం లేకపోగా, రేపటికోసం చదువుకోవాల్సిన సమయం కాస్తా వృథా అవుతుంది. అందుకే పరీక్ష రాసి ఇంటికి వచ్చిన పిల్లలను పాత పరీక్షల విషయ ప్రస్థావనలతో విసిగించకుండా, ఉల్లాసపరిచి, వారిని రేపటి పరీక్ష కోసం సిద్ధం చేయాలి. నిజానికి, పాజిటివ్ ఫలితాల సాధనకు ఉపయోగపడేవి ఇలాంటి ప్రయత్నాలే!

---

**స్ఫూర్తి**

*తండ్రి వదిలేసి వెళ్ళిన భారాన్ని భుజానికెత్తుకున్న ఆమె దుక్కిదున్నింది. కాడి మోసింది. కిలోమీటర్ల దూరం సైకిల్ మీద వెళ్ళి పాలు అమ్మింది. బట్టీల్లో ఇటుకలు కాల్చింది. అన్న కుటుంబం కోసం అవివాహితగా మిగిలింది. బాధ్యతను నెరవేర్చడాన్ని మించిన తృప్తిలేదంటున్న కడప జిల్లాకు చెందిన* ***రుక్మిణమ్మ*** *కథ కష్టాల్లో ఉన్నామనుకొనేవాళ్ళకు కొండంత స్ఫూర్తి!*

# రుక్మిణమ్మ రూటే సపరేటు!

నా కుటుంబం ఇబ్బందులు పడకూడదు. అందరిలో గౌరవంగా బతకాలి... ఇదే నా ఆశయం. నేను వేసే ప్రతి అడుగు వెనకా నాకు ధైర్యాన్నిచ్చిందీ, ముందుకు నడిపించిందీ అదే. పని చేస్తూంటే చేతులు కందిపోయి బాధపడ్డ సందర్భాలెన్నో. ఒళ్ళంతా భరించలేని నొప్పులు పుట్టిన రోజులెన్నో. అయితే నేను తలకెత్తుకున్న బాధ్యత ఏనాడూ బరువనిపించలేదు.

మాది కడప జిల్లాలోని కమలాపురం మండలం కె.జంగంపల్లె గ్రామం. మాది రైతు కుటుంబం. ఇంటిల్లిపాదీ రెక్కాడిస్తే కాని డొక్కాడని పరిస్థితి. నాకు పధ్నాలుగేళ్ళ వయసున్నప్పుడు మా అమ్మ చనిపోయింది. దీంతో మా నాన్న మానసికంగా కుంగిపోయాడు. ఒక పక్క నాన్న అనారోగ్యం, మరో పక్క ఇబ్బందులపాలైన కుటుంబం. నాన్నకు తోడుగా ఉండాలి. నాన్న కష్టాన్ని పంచుకోవాలి. అందుకే ఆయనకు పొలం పనుల్లో సాయం చెయ్యడం మొదలుపెట్టాను. పదో తరగతి పాసయ్యాక చదువు ఆపేశాను. పూర్తిగా పొలం పనులకే వెళ్ళడం మొదలు పెట్టాను. పొలం పనులన్నా, వ్యవసాయమన్నా నాకు కొట్టిన పిండి. వ్యవసాయంలో నాకు తెలియని పని లేదు. దుక్కి దున్నడం, విత్తులు విత్తడం, మందులు కొట్టడం... నాకు చిన్నప్పటి నుండి తెలుసు.



### తోబుట్టువులకు పెళ్ళిళ్ళు చేశాను

మేము నలుగురం ఆడపిల్లలం. ఒక అన్న ఉన్నాడు. నాన్న ఒక అక్కకు పెళ్లి చేశాడు. కొంతకాలానికే ఆయన మరణించాడు. మా అన్న పెద్దగా ఏదీ తెలిసినవాడు కాదు. మా వాళ్ళందరికీ ఒక దారి చూపించాల్సిన బాధ్యత నా మీద పడింది. దాన్ని నేను మనస్ఫూర్తిగా స్వీకరించాను. మా అక్క నాగమ్మకు, అన్న చిన్నపరెడ్డికి, చెల్లెలు సుమతికీ పెళ్ళిళ్ళు చేశాను. మా అన్నకు ఐదుగురు సంతానం. వారంతా ఆడపిల్లలే. వాళ్ళ చదువు, పెళ్ళిళ్ళ బాధ్యత నేను తీసుకున్నాను. ఇంట్లో చూస్తే ఆర్థిక కష్టాలు! చెయ్యీ, కాలూ ఆడని పరిస్థితి! అయినా వెనకడుగు వెయ్యలేదు. కష్టాలకు ఏనాడూ వెరవలేదు.

### ప్రాణాపాయం తప్పింది

వ్యవసాయానికి పెట్టుబడి సంపాదించడం నాకు పెద్ద సమస్యైపోయింది. దీంతో అన్నయ్య వాటాకు వచ్చే పొలం అమ్మేశాను. నా వాటా పొలంలో కూరగాయలు పండించడం మొదలుపెట్టాను. పనివారిని పెట్టుకునే స్థోమత లేక దుక్కి దున్నడం, గట్లు చెక్కడం, విత్తనం వేయడం... ఇవన్నీ నేనే చేసుకునేదాన్ని. అర్ధరాత్రి అయినా, అపరాత్రి అయినా పొలంలో మడవ కట్టేందుకు, కాపలా ఉండేందుకు వెళ్లేదాన్ని. ఒకసారి పొలంలో రాత్రివేళ పురుగు కరిచింది. అదృష్టం కొద్దీ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాను. మొదట్లో పొలాన్ని వ్యవసాయానికి అనుకూలంగా చేశాను. ముళ్లపొదలు తొలగించి చదును చేయడం, సాగులోకి తీసుకురావడం కోసం చాలా కష్టపడ్డాను. ఇప్పుడు నేను పద్దెనిమిది ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నాను. నాకు సొంత పొలం ఎనిమిది ఎకరాలు. కడపకు చెందిన డాక్టర్ ప్రసాద్‌రెడ్డి పది ఎకరాల పొలాన్ని కోరు, గుత్త లాంటివి ఆశించకుండా ఉచితంగా చేసుకోమన్నారు. ఈ మొత్తం పొలాన్ని సాగు చేస్తున్నాను. చాలాసార్లు పంటలు పండకపోవడం, పండినా ధరలు లేకపోవడం వల్ల నష్టాలు ఎదురయ్యాయి. అయినా అప్పుడూ, ఇప్పుడూ భూమి తల్లినే నమ్ముకున్నాను. ఖర్చులు పెరిగిపోవడంతో పాల వ్యాపారం పదేళ్ళపాటు చేశాను. చిన్న డెయిరీ కూడా ఏర్పాటు చేశాను వంద లీటర్ పాల క్యాన్లను సైకిల్‌కి రెండు వైపులా కట్టి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న కమలాపురంలో అమ్మేదాన్ని. తరువాత అది కష్టమైంది. బ్యాంకులో లోన్ తీసుకొని ఇటుకల ఫ్యాక్టరీ పెట్టాను. అది లాభసాటిగానే ఉంది. ఇప్పుడు ఇబ్బందుల నుంచి బయట పడ్డాను. కుటుంబాన్ని పోషించుకోవడమే కాదు, ఊళ్ళో వాళ్ళకి చేతనైన సహాయం చేస్తున్నాను.

### ఒంటరి దాన్ని ఎందుకవుతాను?

అన్న కూతుళ్ళను మంచి చదువులే చదివిస్తున్నాను. పెద్దమ్మాయి పీజీ చేస్తోంది. ఆమెకు పెళ్లి చేశాను. ఇద్దరు అమ్మాయిలను ఇంజనీరింగ్ కోర్సు చదివిస్తున్నాను. ఒకరు డిగ్రీ చేస్తున్నారు. ఇంకొక అమ్మాయి ఎనిమిదో తరగతి చదువుతోంది. వీరందరి చదువుకు ఏ లోటూ లేకుండా చూడడం కోసం ఎంత కష్టాన్నైనా భరిస్తాను. 'పెళ్లి చేసుకోకుండా ఎప్పటికీ ఒంటరిగానే ఉంటావా?' అని కొందరు అడుగుతూ ఉంటారు. నేను ఒంటరి దాన్ని ఎందుకవుతాను? అన్న పిల్లలు 'అమ్మా...' అని పిలుస్తున్నారు. ఆ పిల్లలను, వారి చదువును చూస్తే నాకు కష్టాలు గుర్తుకే రావు. ఈ ప్రయత్నంలో ఎప్పుడూ బాధపడలేదు. ఓర్పు, ధైర్యం, నిబ్బరంతో కష్టపడితే ఫలితాలు వస్తాయి. ఏ పని అయినా కష్టాన్ని నమ్ముకొని ముందుకు సాగితే నష్టపోవడం జరగదు. మహిళలయినా, పురుషులైనా కష్టపడితే ఫలితం ఉంటుంది. అన్న కుటుంబం కోసం, పిల్లల కోసం చేస్తున్న నా ప్రయత్నం ఫలించి వారు ఉన్నతమైన స్థాయికి చేరుకోవాలన్నదే నా ఆకాంక్ష.



ఫ్యామిలీతో...

• **శివరామ్,** కడప, **ఫోటోలు: మౌలానా**

### 30 మందికి ఉపాధి కల్పిస్తున్నా



నేను, నా కుటుంబం జీవించడంతో పాటు పది మందికి ఉపాధి కల్పించాలన్న సంకల్పం కూడా నా కష్టంతో నెరవేరింది. నాకు రెండు ట్రాక్టర్లు ఉన్నాయి. ఇటుకల బట్టీ నడుస్తోంది. ఇవి కాకుండా పొలాలు సాగవుతున్నాయి. ఇందుకోసం రోజుకు 30 మంది వరకు పనుల్లో ఉంటారు. ట్రాక్టర్లు నడపగలను. ఇటుకల బట్టీలో పనులన్నీ పూర్తిగా తెలుసు. వ్యవసాయంలో అనుభవం ఉంది. కాబట్టి నేను కూడా వాళ్ళతో కలిసి అన్ని పనులూ చేస్తాను. ఉదయం పూట ఫ్యాక్టరీ దగ్గరికి వెళ్లి 'ఆంధ్రజ్యోతి' పేపర్ చదువుతాను. మధ్యాహ్నం భోజనానికి వచ్చినప్పుడు కొంత సమయం ఉంటే టీవీలో వార్తలు చూస్తాను. అంతకు మించి ఎక్కువగా టీవీ చూసే సమయం కూడా ఉండదు.

### నా జోలికొస్తే ఊరుకోను

చదువుకునే రోజుల నుంచి మగాళ్ళ మాదిరిగానే దుస్తులు ధరిస్తున్నా. నాకు మొదటినుంచీ దూకుడు ఎక్కువే. నా జోలికొస్తే ఊరుకోను. ఎవరైనా హేళన లాంటివి చేస్తే వెనకా ముందూ ఆలోచించను. ఎంతవాడినైనా కొడతాను. పొలం పనులు, వ్యాపార పనుల్లో ఒంటరిగా తిరుగుతూ ఉంటా. అయితే ఇబ్బందికరమైన పరిస్థితులు ఎప్పుడూ ఎదురుకాలేదు. నా ధైర్యం నాది. ఆ ధైర్యంతోనే ముందుకు వెళుతున్నా.



మదర్ టచ్



# మగ పిల్లలకు ఇలా నేర్పండి!


సైకాలజీ

# భయమా? ఫోబియానా?



చైల్డ్ హెల్త్

# నెలలు నిండకుండా పుడితే!







# ఎన్ని గింజలైనా...

మీకు తెలుసా?

ఫిట్‌నెస్

# ఈ ఆసనంతో డిప్రెషన్ దూరం!



అక్షరాలు తికమక పెడతాయి...
పదాలు తారుమారవుతాయి...
అంకెలు చిందర వందరవుతాయి...
ఇదీ... బడిలో కొందరు పిల్లల పరిస్థితి.
లోపం... చదువులో, చదువు చెప్పే టీచర్లలో,
పిల్లల మెదడులో కాదు. అది గమనించి,
ప్రత్యేక శిక్షణనివ్వని పెద్దల మొండి ఆలోచనలో!

డిస్లెక్సియా

# ఈ పిల్లలు ప్రత్యేకం!



## డిస్లెక్సియా అంటే?

క్లాసు బోర్డు మీద టీచరు రాసిన అక్షరాలన్నీ బుర్రలో కాకుండా, గాల్లో కలిసిపోతూ ఉంటాయి. అంతా అర్థమయినట్టే అనిపిస్తుంది. కానీ రాయబోతే అన్నీ అక్షర దోషాలే! పోనీ... అప్పచెబుతామంటే, అంతా తప్పుల తడకలే! ఫలితంగా మార్కులు పడిపోతాయి. దాంతో...పిల్లలకు చదువులో మార్కులెందుకు తక్కువొస్తున్నాయో పెద్దలకు అర్థం కాదు. బడికి తోడుగా ట్యూషన్ చెప్పించినా ప్రయోజనం కనిపించదు. ఇలాంటప్పుడు పిల్లల తల్లితండ్రులు ఆందోళనకు లోనవటం సహజమే! అయితే ఇలాంటి పరిస్థితినే 'డిస్లెక్సియా' అంటారని తల్లితండ్రులు తెలుసుకోవాలి. సమర్థంగా నేర్చుకోవటం, చదవటం, రాయడం, లెక్కలు చేయడంలో ఉండే సమస్యే డిస్లెక్సియా. ఈ సమస్య ఉన్న పిల్లలు చూడటానికి అందరు పిల్లల్లాగే కనిపించినా, చదువు వీళ్లకి నోట్లో పచ్చి వెలక్కాయలా మారుతుంది. పుట్టుకతోనే ఈ సమస్య వాళ్లలో ఉంటుంది. అయితే బడికెళ్లేవరకూ వాళ్లకా సమస్య బయటపడే అవకాశం ఉండదు. కాబట్టి బడిలో చేర్చిన కొద్ది రోజులకే చదువులో వెనకబడతారు. మిగతా పిల్లలతోపాటు రాయలేక, చదవలేక, అర్థం చేసుకోలేక బడి అంటే భయాన్ని ఏర్పరుచుకుంటారు. బడికి వెళ్లటానికి ఇష్టపడరు. ఇలా స్కూలుకు వెళ్లిన తర్వాతే డిస్లెక్సియా ఉన్న విషయం బయల్పడుతుంది. కాబట్టే దీన్ని 'లెర్నింగ్ డిజెబిలిటీ' అంటారు. ఈ పిల్లలకు ఆరోగ్యపరంగా ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. కంటి చూపు, వినికిడి శక్తీ కూడా భేషుగ్గా ఉంటాయి. తెలివితేటలకూ కొదవుండదు. కానీ వీళ్లకున్న సమస్యంతా అక్షరాలు, వాటి వరుసలు, అవి చేసే శబ్దాలతోనే! పదాలను పలికేటప్పుడు వచ్చే శబ్దంతో పదాలను గుర్తించడం, పదాల కోసం అక్షరాలను పేర్చడంలో డిస్లెక్సియా పిల్లలకు ఇబ్బందులుంటాయి. ఇందుకు కారణం మెదడులో భాషను ప్రాసెస్ చేసే ప్రదేశం డిస్లెక్సియా ప్రభావానికి గురవటమే!

## డిస్లెక్సియాలో రకాలున్నాయి

ఇబ్బందిని బట్టి డిస్లెక్సియా రకాన్ని గుర్తించాలి. చదవడంలో ఇబ్బంది ఉంటే.... అది డిస్లెక్సియా! రాయడంలో ఇబ్బంది ఉంటే... అది డిస్‌గ్రాఫియా! గణితంలో ఇబ్బందులుంటే... గనుక డిస్‌కాలిక్యులియా!

## లక్షణాలనుబట్టి తేలికగానే గుర్తించవచ్చు

సాధారణంగా బడిలో చేర్చిన తర్వాతే ఈ రుగ్మత ఉన్న విషయం బయల్పడినా, డిస్లెక్సియా లక్షణాలను అంతకంటే ముందుగానే రెండేళ్ల వయసులోపే కనిపెట్టే వీలుంది. ఈ కింది లక్షణాలున్న పిల్లలు ముందు ముందు డిస్లెక్సియాకు గురయ్యే అవకాశాలు ఎక్కువ.




- మాటలు ఆలస్యంగా రావటం
- కొత్త మాటలను నేర్చుకోవడం, పలకడం ఆలస్యమవడం
- వాక్య నిర్మాణం కోసం పదాలను పేర్చడంలో తికమకపడడం
- ఒకే రకమైన శబ్దంతో పలికే పదాల మధ్య తేడా కనిపెట్టలేకపోవడం
- పదాలను తిరగేసి పలకడం
- నడిచేటప్పుడు వస్తువుల మధ్య దూరాన్ని అంచనా వేయలేక గుద్దుకుని పడిపోతూ ఉండడం
- అటెన్షన్ డెఫిసిట్ హైపర్‌యాక్టివ్ డిజార్డర్ (ఏడిహెచ్‌డి) కలిగి ఉండడం
- అక్షరాలు, అంకెలు, రంగుల పేర్లు, పలికే విధానం లాంటి వాటిని గుర్తుపెట్టుకోవడంలో ఇబ్బంది
- నర్సరీ రైమ్‌లు, రైమింగ్ గేమ్స్ ఆడడంలో ఇబ్బంది పడడం
- ఒకే రకంగా కనిపించే అక్షరాల (ఎమ్, డబ్ల్యు) మధ్య తేడాను కనిపెట్టలేకపోవడం
- విన్నది అర్థం చేసుకోలేకపోవడం
- స్పెల్లింగ్ తప్పులు
- చదువు పూర్తి చేయడానికి మిగతా పిల్లల కంటే ఎక్కువ సమయం తీసుకోవడం
- చదివేటప్పుడు కొన్ని లైన్లను వదిలేసి చదవడం
- తేలికపాటి లెక్కలు కూడా చేయలేకపోవడం

## డిస్లెక్సియా ఎవరికి?

ప్రతి పిల్లవాడిలోనూ ఏదో ఓ సందర్భంలో పైన చెప్పిన లక్షణాలు కనిపిస్తాయి. అలాగని ఆ పిల్లలందరికీ డిస్లెక్సియా ఉండకపోవచ్చు. చదువు మీద ఆసక్తి లేని పిల్లల్లో కూడా డిస్లెక్సియా లక్షణాలే కనిపిస్తాయి. కాబట్టి డిస్లెక్సియా అని నిర్ధారణకు వచ్చేముందు బడిలో టీచర్లను పిల్లల చదువు గురించి ఆరా తీయాలి. ఎలాంటి తప్పులు పదే పదే పునరావృతమవుతున్నాయో తెలుసుకోవాలి. ఆ తప్పులకు నిర్లక్ష్యం, అశ్రద్ధ, ఆసక్తి లోపం, డిస్లెక్సియాలలో అసలు కారణాన్ని కనిపెట్టాలి. ఇందుకోసం పిల్లల వైద్యులను సంప్రదించవచ్చు. ఈ జాగ్రత్తలతోపాటు డిస్లెక్సియా వచ్చే అవకాశాలను కూడా విశ్లేషించుకోవాలి. డిస్లెక్సియాకు గురయ్యే వీలుండే పరిస్థితులు ఏవంటే?

- వంశపారంపర్యం: తల్లితండ్రుల్లో ఏ ఒక్కరికి డిస్లెక్సియా ఉన్నా వారి పిల్లలకు సంక్రమించే వీలుంటుంది.
- ఎడిహెచ్‌డి ఉన్న పిల్లలకు డిస్లెక్సియా ఉండే అవకాశాలు ఎక్కువ.
- జన్యుపరమైన సమస్యలు.

## అయినా... మేధావులే!



ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తులెందరో బాల్యంలో డిస్లెక్సియా బాధితులే! వీళ్లలో ప్రధానంగా...

**ఆల్బర్ట్ ఐన్‌స్టీన్:** ఈయనకు బాల్యంలో 'లేట్ లెర్నర్' అని పేరు. పదాలను గుర్తు పెట్టుకోవటంలో ఐన్‌స్టీన్‌కు ఇబ్బందులుండేవి. టీచర్లు ఐన్‌స్టీన్‌ను బద్ధకస్తుడని, పగటి కలలు కనేవాడని విమర్శించేవాళ్లు. స్కూల్లో సులువైన లెక్కలు కూడా చేయలేకపోయిన ఐన్‌స్టీన్, వాళ్ల అంచనాలు, విమర్శలన్నిటినీ తిప్పి కొడుతూ అతి పెద్ద శాస్త్రవేత్తగా ఎదిగారు.

**థామస్ ఎడిసన్:** శాస్త్రవేత్త, రూపకర్త అయిన ఎడిసన్‌ను పన్నెండేళ్ల వయసులో, స్లో లెర్నర్, మొద్దబ్బాయి అనే నెపంతో స్కూల్ నుంచి బహిష్కరించారు.

**పాబ్లో పికాసో:** ఈ విశ్వ విఖ్యాత చిత్రకారుడికి బాల్యంలో లెర్నింగ్ డిజబిలిటీ ఉండేది. ఇతని డిస్లెక్సిక్ ప్రవర్తన వల్ల బడి జీవితం దుర్లభంగా మారింది.

**అలెగ్జాండర్ గ్రాహం బెల్:** ఇన్వెంటర్, సూంటిస్టు, ఇంజనీర్ గ్రాహం బెల్, చిన్నతనంలో చదువు నేర్వడంలో ఇబ్బందులు పడ్డారు.

**లియొనార్డో డావిన్సీ:** ఇన్వెంటర్, ఆర్కిటెక్ట్, జియాలజిస్ట్, మాథమాటీషియన్, అనాటమిస్ట్, అస్ట్రానమర్, చిత్రకారుడు, శిల్పి అయిన డావిన్సీకి బాల్యంలో డిస్లెక్సియాతోపాటు, ఎడిహెచ్‌డి కూడా ఉండేది.

డిస్లెక్సియా ఉన్నప్పటికీ, సరైన విద్యా విధానాన్ని అనుసరించగలిగితే, వాళ్లు కూడా జీవితంలో విజయం సాధించగలుగుతారని చెప్పటానికి పైన చెప్పిన ప్రముఖులే ఉదాహరణ.

### పరిష్కారం 'స్పెషల్ ఎడ్యుకేషన్'

డిస్లెక్సియా పిల్లలు మిగతా పిల్లలతో సమానంగా చదువులో రాణించాలంటే, విద్యను మనసులో ఇంకించుకోగలిగేలా వారి మెదళ్లకు శిక్షణ ఇవ్వాలి. ఇందుకోసం స్పెషల్ ఎడ్యుకేషన్ చెప్పించాలి. మహారాష్ట్రలో ఇప్పటికే ఇలాంటి పిల్లలను గుర్తించి ప్రత్యేక తరహాలో విద్యను బోధించడం కోసం అక్కడి ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ శిక్షణలోనే ప్రత్యేకంగా అదనపు శిక్షణ ఉంటుంది. ఇలా శిక్షణ పొందిన ఉపాధ్యాయులు బడిలో డిస్లెక్సియా పిల్లలను తేలికగా గుర్తించి, వారిని మిగతా పిల్లల నుంచి వేరు చేసి ప్రత్యేక విద్యా విధానాన్ని అనుసరిస్తారు. విదేశాల్లో ప్రతి స్కూల్లో ఈ పద్ధతిని అనుసరిస్తూ ఉంటారు. ఇక్కడ కూడా ప్రభుత్వాలు అదే పద్ధతిని అనుసరించగలిగితే డిస్లెక్సియా పిల్లలు విలువైన ఎకాడమిక్ ఇయర్స్ కోల్పోకుండా ఉంటారు.



**డాక్టర్ రమేష్ కోనంకి,**
కన్సల్టెంట్ పిడియాట్రిక్ న్యూరాలజిస్ట్,
రెయిన్‌బో హాస్పిటల్ ఫర్ ఉమెన్ అండ్ చిల్డ్రన్,
విక్రమ్‌పురి, హైదరాబాద్.

### స్కూలు కాదు... విద్యా బోధన మారాలి

'పొద్దున ఏం తిన్నావని ఎవరైనా అడిగితే, గుర్తు తెచ్చుకుని చెబుతాం! డిస్లెక్సియా పిల్లల విషయంలో ఈ ప్రాసెస్ మొత్తం సక్రమంగా జరగకుండా, ఎక్కడో ఒకచోట అడ్డంకి ఏర్పడుతుంది. చదువులోనూ ఇదే పరిస్థితి. ఇలాంటప్పుడు తోటి పిల్లల ఎగతాళి, చదువులో వెనకబడుతున్నామనే బాధ పిల్లలను వేధిస్తుంది. దీనికి తోడు ఇంట్లో తల్లితండ్రుల ఒత్తిడి, టీచర్లంటే భయం పిల్లలను మరింత గందరగోళానికి గురిచేస్తాయి. పెద్దలేమో... పిల్లలను మరింత మంచి స్కూల్లో వేస్తే చదువు బాగా వస్తుందే ఆశతో పదే పదే స్కూళ్లు మారుస్తూ ఉంటారు. కానీ ఏ ఒక్కరూ పిల్లలకున్న అసలు సమస్యను గుర్తించే ప్రయత్నం చేయరు. దాంతో సంవత్సరాలకొద్దీ చదువు వృథా అవుతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే పిల్లలు చదువులో వెనకబడటానికి అసలు కారణాన్ని కనిపెట్టాలి. డిస్లెక్సియా అని నిర్ధారణ జరిగితే స్పెషల్ ఎడ్యుకేషన్ ఇప్పించాలి.



**- మిస్ విలాసిని దివాకర్,**
టీచర్ ట్రైనింగ్ యాక్టివిటీ ఫ్యాకల్టీ

### వీళ్లూ చేయగలరు

10 నుంచి 15 % బడికెళ్లే పిల్లల్లో ఎంతో కొంత డిస్లెక్సియా ఉంటుంది. వీళ్లలో ఎక్కువమందికి ఐక్యు 90% అంతకంటే ఎక్కువ ఉంటుంది. వీళ్ల తెలివితేటలు భిన్నంగా ఉంటాయి. ఈ రుగ్మత ఉన్న పిల్లల్ని, వాళ్లకున్న తెలివితేటల్ని సరైన మార్గనిర్దేశం చేయగలిగితే అందరు పిల్లల్లాగే భవిష్యత్తును తీర్చిదిద్దుకోగలుగుతారు. ఈ రుగ్మత గుర్తించిన ఉపాధ్యాయులు, పెద్దల దృష్టికి తీసుకొచ్చినప్పుడు డిస్లెక్సియా అనేది మానసిక రుగ్మత అనో లేదా మెంటల్లీ రిటార్డెడ్ కోవకు చెందిన తీవ్రమైన వ్యాధి అనో పొరపాటు భావనకు లోనవుతారు తల్లితండ్రులు. దాంతో అంతటి తీవ్రమైన వ్యాధి తమ పిల్లలకెందుకొస్తుందని మొండిగా వాదించి, బడిని, టీచర్లను మారుస్తారే తప్ప పిల్లల విద్యా బోధనను మారిస్తే సమస్య సర్దుకుంటుందనే విషయాన్ని గ్రహించరు. కాబట్టి డిస్లెక్సియా రుగ్మత గురించిన సంపూర్ణ అవగాహన పెద్దల్లో ఏర్పరచాలి.



**- డాక్టర్ చంద్రశేఖర్,**
మద్రాస్ డిస్లెక్సియా అసోసియేషన్ ఫౌండర్

### ఈ పిల్లల కోసం 'అకిర'

మద్రాసు డిస్లెక్సియా ఆసోసియేషన్ అనుబంధంగా హైదరాబాద్‌లోని సెయింట్ ఆండ్రూస్ స్కూల్ ప్రత్యేకంగా డిస్లెక్సియా విద్యార్థుల కోసం 'అకిర' అనే లెర్నింగ్ సెంటర్ ప్రారంభించింది. పిల్లలు ఈ ప్రోగ్రామ్‌లో సభ్యత్వం తీసుకుంటే, రెండేళ్లపాటు ప్రత్యేక విద్యా విధానాన్ని అలవాటు చేస్తారు. ఈ రెండేళ్లలో డిస్లెక్సియా పరంగా ఎదురయ్యే విద్యా సంబంధమైన ఇబ్బందులను ఎలా అధిగమించాలో పిల్లలకు శిక్షణ ఇస్తారు. రెండేళ్ల తర్వాత తిరిగి మెయిన్ స్ట్రీమ్‌లో చదువును కొనసాగించవచ్చు. ఉపాధ్యాయులు కూడా డిస్లెక్సియా విద్యా బోధనలో ప్రత్యేక శిక్షణ పొంది ఉంటారు. లెర్నింగ్ ప్రోగ్రామ్‌తోపాటు 'హైడ్రా' అనే మల్టిపుల్ ఇంటెలిజెన్స్ సెంటర్ కూడా ఏర్పాటవుతుంది. ఇది డిస్లెక్సియా విద్యార్థుల్లో దాగిన ప్రత్యేక సామర్థ్యాలను గుర్తించి వాటికి మెరుగు పెడుతుంది. లర్నింగ్ ప్రోగ్రామ్ ద్వారా డిస్లెక్సియా పిల్లలను ప్రారంభ దశలోనే గుర్తించి, తగిన రీతిలో విద్యా బోధన చేస్తే మేలు!



**- మిసెస్ హ్యాసింథ్ ఇమాన్యుయెల్, ఎమ్‌డి**
సెయింట్ ఆండ్రూస్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్,
హైదరాబాద్.

# నెఫ్రోటిక్ సిండ్రోమ్‌తో జాగ్రత్త!



హోమియో వైద్యం

లక్షణాలుంటే జాగ్రత్త

సెక్సువల్ హెల్త్

# ఎంత సెక్స్ ఆరోగ్యకరం?





# నమ్మకమే గెలిపించింది

అది 2009 ఏప్రిల్ 20. దశాబ్దాలుగా వైద్యులు భయపడుతూ వస్తున్న సందర్భం రానే వచ్చింది.

విజేత




## దయ లేని వ్యాధి

# ఇలా సాధ్యపడింది



ప్రకృతి వరం

# శక్తినిచ్చే జీడిపప్పు



# మాస్ టు క్లాస్


నితిన్

నితిన్, మేఘా ఆకాష్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఛల్ మోహన్‌రంగ'. కృష్ణ చైతన్య దర్శకుడు. శ్రీమతి నిఖితారెడ్డి సమర్పణలో పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్, త్రివిక్రమ్ మరియు శ్రేష్ఠ్ మూవీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఎన్.సుధాకర్‌రెడ్డి నిర్మాత. తమన్ సంగీతం అందించిన ఈ చిత్రం పాటల్ని ఉగాది సందర్భంగా నేరుగా మార్కెట్‌లో విడుదల చేశారు. నిర్మాత మాట్లాడుతూ "ముందు విడుదల చేసిన పాటల్లాగే మిగిలిన మూడు పాటలు కొత్త శైలిలో ఉన్నాయి. మాస్ నుంచి క్లాస్ వరకు, ప్రేమ నుంచి విరహం వరకు, సంతోషం నుంచి బాధ వరకు అన్ని కోణాల్లోనూ ఎంతో అద్భుతంగా తమన్ పాటల్ని స్వరపరిచారు. పాటలతోపాటు ఎన్. ఎన్.నటరాజ సుబ్రమణియన్ ఫొటోగ్రఫీ సినిమాకు ఎసెట్ అవుతాయి. ఏప్రిల్ 5న సినిమాను విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నాం" అని అన్నారు.

# నిద్రపోలేను!

- అనుష్క



ఏ విషయాన్నైనా తేలిగ్గా తీసుకోగలిగేవారు నిజంగా అదృష్టవంతులు. ఆ విషయంలో నేను అంత లక్కీ ఫెలోని కాదు అని అంటున్నారు అనుష్క. ఆ విషయాన్ని గురించి ఆమె మాట్లాడుతూ "నేను తేలిగ్గా తీసుకోలేను అని చెప్పింది ఇతరులు చెప్పే మాటల గురించి కాదు. పనీపాటా లేనివాళ్ల మాట్లాడే మాటల్ని నేను పెడచెవిన పెట్టేస్తాను. కానీ నేను చేయాల్సిన పని గురించి మాత్రం తీవ్రంగా ఆలోచిస్తాను. మరుసటి రోజు సీరియస్ సీన్ చేయాల్సినప్పుడు రాత్రి అసలు నిద్ర పట్టదు. సీన్ గురించే ఆలోచిస్తూ ఉంటాను. తెల్లారగానే యూనిట్‌తో మాట్లాడుతాను. ఒకటికి పదిసార్లు సీన్‌ని అర్థం చేసుకున్నాకే కెమెరా ముందుకు వెళ్తాను" అని అన్నారు అనుష్క. అన్నట్టు ఈ భామకు ఆర్థిక వ్యవహారాల పట్ల పెద్ద ఆసక్తి ఉండదట.

# జీరో బడ్జెట్‌లో సినిమా


శ్రీవిష్ణు

***...అని డెన్మార్క్‌లో 'డోగ్మే-95' టెక్నాలజీ తీసుకొచ్చారు. అందులో పది సూత్రాలుంటే మేం ఆరేడు పాటించాం. సింక్ సౌండ్ వంటివి పరిస్థితుల వల్ల కుదరలేదు. తెలుగులో 'డోగ్మే-95'తో తీసిన తొలి చిత్రం మాదేనన్నారు శ్రీవిష్ణు. ఆయన హీరోగా వేణు ఊడుగుల దర్శకత్వంలో ప్రశాంతి, కృష్ణవిజయ్, అట్లూరి నారాయణరావు నిర్మించిన 'నీది నాది ఒకే కథ' ఈ శుక్రవారం విడుదలవుతోంది. శ్రీవిష్ణు చెప్పిన సంగతులు...***

❖ ఇందులో పక్కింటి కుర్రాడి తరహా పాత్ర చేశా. యువ ప్రేక్షకులకు తెరపై తమను తాము చూసుకుంటునట్టు ఉంటుంది. మనలో చాలామంది సమాజం ఏమనుకుంటుందోనని తమకు ఇష్టంలేని చదువులు చదువుతారు. తర్వాత నచ్చింది చేయలేకపోయామని బాధపడుతుంటారు. అటువంటి విద్యార్థుల మానసిక సంఘర్షణ కథాంశంగా గ్రామీణ నేపథ్యంలో సినిమా తీశాం. తండ్రి పాత్రను దేవిప్రసాద్‌గారు చేశారు.

❖ మాస్ సినిమాలు చేయాలని, మాస్ హీరో కావాలని అనుకోను. నేను హీరోలా ఫీలవను. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌నే అనుకుంటా! విభిన్నమైన పాత్రలు, చిత్రాలు చేయాలనేది నా లక్ష్యం. కెరీర్ కొత్తలో నచ్చకపోయానా కొన్ని సినిమాల్లో చిన్న చిన్న రొటీన్ పాత్రలు చేశా. నటుడిగా అనుభవం కోసం అవెంతగానో ఉపయోగపడ్డాయి. కానీ, నటనలో నిజాయితీ ఉండేది కాదు. అప్పుడు.. నాకు అవకాశం వస్తే కొత్త తరహా చిత్రాలు చేయాలనుకున్నా. ఇప్పుడు అటువంటివి చేస్తున్నా.

❖ నారా రోహిత్, సుధీర్‌బాబు, శ్రియ, నేను ముఖ్యతారలుగా చేస్తున్న 'వీరభోగ వసంతరాయలు'లో విభిన్నమైన గెటప్పుల్లో కనిపిస్తా. 'అసుర' ఫేమ్ కృష్ణ విజయ్ దర్శకత్వంలో 'తిప్పరా మీసం' చేస్తున్నాను. కొత్త దర్శకుడితో ఓ పోలీస్ కథ అంగీకరించా.

# శ్రీదేవి స్థానంలో మాధురి


మాధురిదీక్షిత్, శ్రీదేవి

మాధురీ దీక్షిత్‌కి శ్రీదేకి కుమార్తె జాన్వీ కపూర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఎందుకంటే... అభిషేక్ వర్మ దర్శకత్వంలో ధర్మ ప్రొడక్షన్స్ పతాకంపై కరణ్ జోహార్ నిర్మించనున్న 'శిద్దత్'లో సంజయ్ దత్ సరసన నటించేందుకు అంగీకరించినందుకు! ఆ చిత్రానికి, జాన్వీకి ఏంటి సంబంధం? అంటే... శ్రీదేవి నటించాల్సిన పాత్ర అది! కథ విన్న అతిలోక సుందరి నటించేందుకు పచ్చజెండా ఊపారు. అయితే... ఆకస్మికంగా తనువు చాలించడంతో దర్శక నిర్మాతలు మాధురిని సంప్రదించగా, ఆమె అంగీకరించారు. "అమ్మ మనసుకు బాగా దగ్గరయిన చిత్రమిది. అందమైన ఆ చిత్రంలో మాధురిగారు భాగం అవుతున్నందుకు నాన్న, ఖుషి, నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాం" అని జాన్వీ ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. ఇంకో ఆసక్తికరమైన అంశం ఏంటంటే... 21 ఏళ్ళ తర్వాత సంజయ్, మాధురి కలిసి నటించనున్న చిత్రమిది.

# కుటుంబ కథతో...


రిచాపనయ్

హర్షవర్ధన్ రాణె, రిచాపనయ్ కీలక పాత్రధారులుగా శ్రీధర్ సీపాన దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'బృందావనమది అందరిది'. జస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ క్రియేషన్స్ పతాకంపై శ్రీనివాస్ వంగల, ప్రభాకర్ రెడ్డి కూతురు నిర్మిస్తున్నారు. ఇటీవల మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకుంది. దర్శకుడు మాట్లాడుతూ "కుటుంబం మొత్తం కలిసి చూసేలా సాగే చిత్రమిది. వైజాగ్ పరిసర ప్రాంతంలో రిచా పనయ్, హర్షవర్ధన్ రాణె, ఎం.పి శివ ప్రసాద్, హీరా సాహిలి, బెనర్జి, తాగుబోతు రమేష్‌పై కీలక సన్నివేశాలు చిత్రీకరించాం. ప్రస్తుతం విశాఖ సాగరతీరంలో వేసిన హీరోయిన్ ఇంటి సెట్‌లో చిత్రీకరన చేస్తున్నాం. మొదటి షెడ్యూల్‌కు సంబంధించిన మేకింగ్ వీడియో ఆదివారం విడుదల చేశాం. దానికి స్పందన బావుంది. ఏప్రిల్ 1 నుండి రెండో షెడ్యూల్ మొదలుపెడతాం. ఏడు రోజులు బెంగళూర్‌లో, ఆ తర్వాత హైదరాబాద్‌లో షూటింగ్ చేస్తాం" అని అన్నారు.

# అనాథల కథతో 'సత్యగాంగ్'


అక్షిత, సాత్విక్

సాత్విక్ ఈశ్వర్ హీరోగా పరిచయమవుతోన్న చిత్రం 'సత్యగాంగ్'. సిద్ధయోగి క్రియేషన్స్ పతాకంపై రూపొందుతోంది. మహేశ్ ఖన్నా నిర్మాత. ఆయనే దర్శకత్వ పర్యవేక్షణ కూడా చేశారు. మహేశ్ ఖన్నా మాట్లాడుతూ "మా సినిమాలో చంద్రబోస్‌గారు అనాథల మీద అద్భుతమైన పాట రాశారు. వినగానే కళ్లెమ్మట నీళ్లు తిరిగాయి. మా అబ్బాయిని సినిమా పరిశ్రమకు పరిచయం చేస్తోన్న ఈ సందర్భంలో మా నాన్నగారి జ్ఞాపకార్థం, ఓ మంచి పనికోసం రూ.1.50కోట్లు విలువ చేసే స్థలాన్ని ఉచితంగా ఇచ్చాను. మంచి మనసుతో తీసిన ఈ సినిమా పెద్ద హిట్ అవుతుంది. సినిమా బాగాలేదని ఎవరికైనా అనిపిస్తే టికెట్ డబ్బులు తిరిగి ఇచ్చేస్తాం. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తాం" అని చెప్పారు. "అనాథలకు సంబంధించిన పాటను చాలా ఇష్టంగా రాశాను. పాట విని కీరవాణిగారు కూడా సంతోషించి, తనదైన బాణీలో ప్రమోషన్ చేస్తున్నారు" అని చంద్రబోస్ అన్నారు. మంచి సినిమాతో హీరోగా పరిచయం కావడం ఆనందంగా ఉందని హీరో సాత్విక్, హీరోయిన్ అక్షిత చెప్పారు.


# ఎడిటర్ అనిల్ మల్నాడ్ కన్నుమూత



ఎడిటర్ అనిల్ మల్నాడ్ (62) కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం ఉదయం 8 గంటలకు చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయన పార్థివదేహానికి మంగళవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు. కాగా అనిల్ మల్నాడ్‌కు భార్య, ఇద్దరు కుమారులున్నారు. కర్నాటకలోని చిక్‌మగళూరు ప్రాంతానికి చెందిన అనిల్ మల్నాడ్ తెలుగు, తమిళం, మలయళ, కన్నడ, హిందీ తదితర 9 భాషల్లో 200లకు పైగా చిత్రాలకు ఎడిటర్‌గా వ్యవహరించారు. తెలుగులో ఎడిటింగ్ చేసిన 'సితార' చిత్రానికి ఆయన జాతీయ అవార్డు అందుకున్నారు. అదేవిధంగా అన్వేషణ చిత్రానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి నంది అవార్డు స్వీకరించారు. దర్శకుడు బాపూ సహాయకుడిగా సినిమా రంగానికి వచ్చిన అనిల్ మల్నాడ్.. తదనంతర కాలంలో ఆయన వద్దే దాదాపు 22 చిత్రాలకు ఎడిటర్‌గా పని చేశారు. ఆ తరువాత దర్శకుడు వంశీతో ఎక్కువ సినిమాలకు పనిచేశారు. 'మంత్రిగారి వియ్యంకుడు' సినిమాతో ఎడిటర్‌గా ప్రస్థానం సాగించిన ఆయన.. సితార, అన్వేషణ, లేడీస్ టైలర్, పెళ్లి పుస్తకం, మహర్షి, సంకీర్తన, ప్యారీ బెహనా, అల్లితందవానమ్ వంటి 200లకు పైగా చిత్రాలకు ఎడిటర్‌గా వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, చెన్నై

# ఆద్యంతం హుషారుగా..!


వర్ణిక

వ్యాంకిష్ మీడియా పతాకంపై ఆయుష్, వర్ణిక జంటగా ఓ చిత్రం రూపొందుతోంది. రవికుమార్ పొన్నగంటి దర్శకుడు. షేక్ గౌస్ నిర్మాత. ఈ చిత్రం షూటింగ్ గుంటూరులో ప్రస్తుతం జరుగుతోంది. నిర్మాత మాట్లాడుతూ "నాన్‌స్టాప్‌గా షెడ్యూల్ జరుగుతోంది. ఆద్యంతం హుషారుగా సాగే చిత్రమిది. ఈ నెల 24తో టాకీ పూర్తవుతుంది. పాటలను కోల్‌కతా, వైజాగ్, బ్యాంకాక్‌లో చిత్రీకరిస్తాం. సినిమాను ఏప్రిల్ చివరి వారంలోగానీ, మే ఫస్ట్‌వీక్‌లోగానీ విడుదల చేస్తాం" అని చెప్పారు. సంగీత దర్శకుడు: అమ్మపండు, కెమెరా: దుర్గ ప్రసాద్.

# సస్పెన్స్ థ్రిల్లర్!


శ్రావణి,మారుతి

విశ్వనాథ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, శ్రీలక్ష్మి వెంకటాద్రి క్రియేషన్స్ సంస్థలు నిర్మిస్తున్న ఎం6' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. మారుతి, శ్రావణి, ప్రియ హీరో హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి జై రామ్ వర్మ దర్శకుడు. చిత్రం గురించి ఆయన మాట్లాడుతూ 'సస్పెన్స్ థ్రిల్లర్, ఎంటర్‌టైన్‌మెంట్ అంశాలు కలిగిన చిత్రమిది. చిన్న సందేశం కూడా ఉంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి' అని తెలిపారు. నిర్మాతల్లో ఒకరైన విశ్వనాథ్ తన్నీరు మాట్లాడుతూ 'ఈ సినిమాతో మారుతిని హీరోగా పరిచయం చేస్తున్నాం. బాగా నటించాడు. నిర్మాణపరంగా ఎక్కడా రాజీపడలేదు' అని తెలిపారు. పార్వతి సమర్పణలో విశ్వనాథ్ తన్నీరు, సురేశ్ ఎస్. ఈ సినిమాను నిర్మించారు.

## ఐఆర్‌సిటిసితో ఓలా జట్టు

న్యూఢిల్లీ: కస్టమర్లకు ఇంటి ముంగిటి వరకు కనెక్టివిటీ కల్పించడం లక్ష్యంగా రైల్వే శాఖకు అనుబంధంగా పని చేస్తున్న ఐఆర్‌సిటిసి, క్యాబ్ అగ్రిగేటింగ్ సేవలందించే ఓలా చేతులు కలిపాయి. ఐఆర్‌సిటిసి రైల్ కనెక్ట్ యాప్ లేదా ఐఆర్‌సిటిసి వెబ్‌సైట్ ద్వారా కస్టమర్లు ఓలా క్యాబ్‌లు బుక్ చేసుకునే అవకాశం ఈ ఒప్పందం కల్పిస్తుంది. ఓలా మైక్రో, ఓలా మినీ, ఓలా ఆటో, ఓలా షేర్ సర్వీసులన్నింటికీ ఇది వర్తిస్తుంది. ధరలు కూడా ఆయా క్యాబ్ సర్వీసుల ధరలతో సమానంగా ఉంటాయి. ఈ భాగస్వామ్యం కింద ఐఆర్‌సిటిసి కస్టమర్లు ఏడు రోజుల ముందే క్యాబ్ బుక్ చేసుకోవచ్చు.




## ఇకో స్పోర్ట్ టాప్ ఎండ్‌లో మాన్యువల్ ట్రాన్స్‌మిషన్

న్యూఢిల్లీ : ఫోర్డ్ ఇండియా తన కాంపాక్ట్ ఎస్‌యువి ఇకో స్పోర్ట్ టాప్ ఎండ్ పెట్రోల్ వేరియంట్‌లో మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ వెర్షన్‌ను విడుదల చేసింది. దీని ధర 10.47 లక్షల రూపాయలు (దేశ వ్యాప్తంగా ఎక్స్‌షోరూమ్ ధర). టైటానియం ప్లస్ పేరుతో తెచ్చిన ఈ కొత్త వేరియంట్‌లో త్రీ సిలిండర్ 1.5 లీటర్ పెట్రోల్ ఇంజన్, ఫైవ్ స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్, 17 అంగుళాల అలాయ్ వీల్స్, ఆరు ఎయిర్ బ్యాగులు వంటి ఫీచర్లు ఉన్నాయి. ఇకో స్పోర్ట్‌ను విడుదల చేసినప్పటి నుంచి టైటానియం ప్లస్ పెట్రోల్ వేరియంట్‌లో మాన్యువల్ వెర్షన్ కోసం కస్టమర్లు డిమాండ్ చేస్తున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కొత్త కారును తెచ్చామని ఫోర్డ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) రాహుల్ గౌతమ్ తెలిపారు. ఇప్పటిదాకా పెట్రోల్ ఇంజన్ కలిగిన టైటానియం ప్లస్ వేరియంట్ కేవలం సిక్స్ స్పీడ్ ఆటోమెటిక్ ట్రాన్స్‌మిషన్‌లోనే అందుబాటులో ఉంది.

## గృహ రుణాల కోసం చేతులు కలిపిన ఎస్‌బిఐ, ఐఎంజిసి

SBI

న్యూఢిల్లీ : నెలవారీ వేతనాలు పొందని వారు, స్వయం ఉపాధిపై ఆధారపడిన వారు కూడా గృహ రుణాలు పొందేందుకు దోహదపడే మార్ట్‌గేజ్ గ్యారెంటీ పథక అమలు కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ), ఇండియా మార్ట్‌గేజ్ గ్యారెంటీ కార్పొరేషన్ (ఐఎంజిసి)లు చేతులు కలిపాయి. ఫలితంగా గృహ రుణ అర్హత 15 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని ఎస్‌బిఐ పేర్కొంది. అందుబాటు ధరల్లో గృహాలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో తాము కొత్త పథకాన్ని తెచ్చామని, ఫలితంగా మరింత ఎక్కువ మంది గృహ రుణం పొందడానికి అవకాశం ఉంటుందని తెలిపింది. ఒప్పందం మేరకు వేతనాలు అందుకోని వారు కూడా మార్ట్‌గేజ్ గ్యారెంటీతో గృహ రుణాన్ని ఎస్‌బిఐ అందజేస్తుంది. ఐఎంజిసి డీఫాల్ట్ గ్యారెంటీ కవర్ ద్వారా కస్టమర్లు అధిక రుణాన్ని పొందడానికి అవకాశం ఉంటుందని ఎస్‌బిఐ ఎండి (రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్) పికె గుప్తా తెలిపారు.

## కరుటూరిలో ఫినిక్స్ గ్రూప్ పెట్టుబడులు

### రుణ చెల్లింపులు, కెన్యా కార్యకలాపాలకు తోడ్పాటు

BEAUTIFUL FLOWERS KARUTURI

న్యూఢిల్లీ : సింగపూర్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఫినిక్స్ గ్రూప్... సంస్థలో పెట్టుబడులు పెట్టినట్లు కరుటూరి గ్లోబల్ ప్రకటించింది. అయితే ఎంత మొత్తం పెట్టుబడులు పెట్టిందనేది మాత్రం కంపెనీ వెల్లడించలేదు. రుణాలను చెల్లించటంతో పాటు కెన్యాలో కార్యకలాపాలను పునరుద్ధరించేందుకు ఈ పెట్టుబడులు ఉపయోగపడతాయని కరుటూరి గ్లోబల్ తెలిపింది. కెన్యా హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా వారం రోజుల్లో రుణాలను చెల్లించే విధంగా ఫినిక్స్ గ్రూప్ ఈ పెట్టుబడులు పెట్టనుందని కరుటూరి గ్లోబల్ సిఇఒ రామ్ కరుటూరి తెలిపారు. 90 రోజుల్లోగా రుణాలను చెల్లించి ఫామ్‌లను విడిపించుకోవాలని ఈ ఏడాది జనవరిలో కెన్యా హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కంపెనీ ప్రస్తుత రుణ అవసరాలను తీర్చేందుకు రుణ, ఈక్విటీ రూపంలో ఈ పెట్టుబడులు ఉండనున్నాయని ఆయన తెలిపారు. అంతేకాకుండా నత్తనడక నడుస్తున్న కెన్యా కార్యకలాపాలను మళ్లీ ప్రారంభించేందుకు ఈ పెట్టుబడులు దోహదపడనున్నాయని ఆయన పేర్కొన్నారు. కెన్యాలో కరుటూరికి చెందిన నివాషా ఫామ్ 500 ఎకరాల్లో ఫామ్‌లను నిర్వహిస్తోంది. ఇందులో 300 ఎకరాల్లో గ్రీన్‌హౌసెస్‌ను నిర్వహిస్తోంది. వీటి విలువ 10 కోట్ల డాలర్లు. ఏటా 3.3 కోట్ల గులాబీ పువ్వులను ఈ ఫామ్ ఉత్పత్తి చేయటమే కాకుండా యూరోప్‌కు పెద్ద ఎత్తున ఎగుమతి చేస్తోంది. కెన్యా నుంచి ఎగుమతి అవుతున్న కట్ ఫ్లవర్స్‌లో ఈ వాటా 10 శాతం. ఈ ఫామ్ పునరుద్ధరణతో దాదాపు 2,200 మందికి ఉపాధి లభించటమే కాకుండా కరుటూరి గ్లోబల్‌ను గాడిలో పెట్టేందుకు ఈ పెట్టుబడులు దోహదపడనున్నాయని ఫినిక్స్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ గౌరవ్ ధావన్ తెలిపారు. కరుటూరి.. బెంగళూరు కేంద్రంగా భారత్, ఇథియోపియాలో ఫ్లోరికల్చర్ ఫామ్‌లతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్, రిటైలింగ్, ఐటి రంగాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది. కాగా ఫినిక్స్ గ్రూప్ 10 వ్యాపార విభాగాలతో 22కు పైగా దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది.

# అమెజాన్ మరో ఆరు కేంద్రాలు

### 62కు చేరిన ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు.. ఫర్నీచర్, భారీ గృహోపకరణాల కోసం 15 ఎఫ్‌సిలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశీయంగా ఆన్‌లైన్ కొనుగోలుదారుల సంఖ్య క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ భారీ ఎత్తున విస్తరణ కార్యకలాపాలు చేపడుతోంది. వివిధ రకాల ఉత్పత్తుల నిల్వతోపాటు వాటిని ప్రాసెస్ చేసే ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్ల (ఎఫ్‌సి) సంఖ్యను శరవేగంగా పెంచుకోవడంతోపాటు డెలివరీ స్టేషన్ల సంఖ్యను విస్తరిస్తోంది. ఫర్నీచర్, గృహోపకరణాలకూ డిమాండ్ వృద్ధి చెందుతున్న నేపథ్యంలో వీటి కోసం ప్రత్యేకంగా ఎఫ్‌సిలను ఏర్పాటు చేస్తుండటం విశేషం. దేశీయ మార్కెట్లో అమెజాన్ విస్తరణ కార్యకలాపాల గురించి అమెజాన్ ఇండియా కస్టమర్ ఫుల్‌ఫిల్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ అఖిల్ సక్సేనా సోమవారంనాడిక్కడ విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఆ వివరాలు...

#### భారీ గృహోపకరణాల కోసం ప్రత్యేక ఎఫ్‌సిలు

దేశవ్యాప్తంగా ప్రధాన పట్టణాల్లో భారీ గృహోపకరణాలు (ఎయిర్ కండీషనర్లు, ఎయిర్ కూలర్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్‌మిషన్లు, టీవీలువంటివి), ఫర్నీచర్‌ను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ కేటగిరీలో ఐదు వేలకు పైగా బ్రాండెడ్ ఉత్పత్తులను ఆఫర్ చేస్తున్నాం. డిమాండ్‌నుదృష్టిలో ఉంచుకుని ఈ ఉత్పత్తుల కోసమే ఉద్దేశించిన ఎఫ్‌సిల సంఖ్యను పెంచుకుంటున్నాం. గత ఏడాదిలో భారీ గృహోపకరణాల ఎఫ్‌సిల సంఖ్య 9 ఉంటే.. ఇప్పుడు వీటిని 15కు పెంచుకుంటున్నాం. కొత్తగా ఆరింటిని కోయంబత్తూరు, పుణె, లక్నో, గురుగ్రామ్, ముంబై, భోపాల్‌లో ఏర్పాటు చేస్తున్నాం. రెండింటిని ఇప్పటికే ప్రారంభించాం. మిగతా వాటికి కొన్ని వారాల్లోనే ప్రారంభిస్తాం. వీటితో భారీ గృహోపకరణాలను నిల్వ చేసే ప్రదేశం 25 లక్షల క్యూబిక్ ఫీట్ల నుంచి 53 లక్షల క్యూబిక్ ఫీట్లకు పెరుగుతుంది. 400 నగరాల్లోని కస్టమర్ల కోసం డెలివరీ స్టేషన్ల సంఖ్యను ఏడాది కాలంలో 35 నుంచి 60కి పెంచుకున్నాం.



#### వేగంగా విస్తరణ

అమ్మకందారులు తాము విక్రయించే ఉత్పత్తులను నిల్వ చేయడానికి అమెజాన్ తగిన సదుపాయాలు కల్పిస్తోంది. కస్టమర్ల నుంచి ఆర్డరు రాగానే వీటిని తామే ప్యాక్ చేసి పంపిస్తాం. ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి ఏర్పాటు చేసినవే ఎఫ్‌సిలు. ప్రస్తుతం ఇలాంటివి వివిధ రాష్ట్రాల్లో 62 ఉన్నాయి. వీటి నిల్వ సామర్థ్యం 1.85 కోట్ల క్యూబిక్ ఫీట్లు. వీటిలో రిటైల్ కోసం 32, అమెజాన్ నౌ కోసం 15, భారీ గృహోపకరణాల కోసం 15 ఉన్నాయి. మొత్తం ఎఫ్‌సిల్లో ఆరు తెలంగాణలోనే ఉన్నాయి. బెంగళూరు, హైదరాబాద్, కోల్‌కతా, లూథియానా, అహ్మదాబాద్‌లోని ఎఫ్‌సిలను మరింతగా విస్తరించాం. కస్టమర్లకు వేగవంతంగా ఉత్పత్తులను సరఫరా చేసేందుకువీలుగా నిల్వ ప్రదేశాన్ని, డెలివరీ స్టేషన్ నెట్‌వర్క్‌ను రెండింతలు పెంచుకున్నాం.

#### ఆన్‌లైన్‌లో ఫర్నీచర్, గృహోపకరణాలకు గిరాకీ

మౌలిక సదుపాయాలు, డెలివరీ స్టేషన్ల విస్తరణ, ఆకర్షణీయమైన ఇఎంఐ సదుపాయం వంటి వాటి వల్ల కస్టమర్ల తీరులో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అందుకే ఎక్కువ ధర ఉండే గృహోపకరణాలు, ఫర్నీచర్‌ను ఆన్‌లైన్‌లో చాలా మంది కొనుగోలు చేస్తున్నారు. అవసరమైన పూర్తి సమాచారం అందుబాటులో ఉండటం కొనుగోళ్లకు కస్టమర్లు ఆసక్తి చూపుతున్నారు. షెడ్యూల్డ్, నెక్స్ట్ డే డెలివరీ వంటి సదుపాయాలు కస్టమర్లకు మరింత వెసులుబాటు కల్పిస్తున్నాయి.

# ముంబైలో మరో బ్యాంక్ స్కామ్

### రూ. 4,000 కోట్ల టోపీ.. ముగ్గురు డైరెక్టర్ల అరెస్ట్



న్యూఢిల్లీ : యాక్సిస్ బ్యాంక్‌ను 4,000 కోట్ల రూపాయల మేర మోసం చేసిన కేసులో ముంబైకి చెందిన పరేఖ్ అల్యూమినెక్స్ అనే సంస్థ డైరెక్టర్లు ముగ్గురిని ముంబై పోలీసులు అరెస్ట్ చేశారు. యాక్సిస్ బ్యాంకు ఫిర్యాదుపై మోసం, ఫోర్జరీ, నమ్మకద్రోహం, నేరపూరిత కుట్ర ఆరోపణలతో ముంబై పోలీసు శాఖలోని ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ కేసు నమోదు చేసి భవర్‌లాల్ భండారీ, ప్రేమల్ గోరాగాంధీ, కమలేష్ కనుంగోను అదుపులోకి తీసుకుంది. యాక్సిస్ బ్యాంక్ సారథ్యంలోని 20 బ్యాంకుల కన్సార్షియం నుంచి 4,000 కోట్ల రూపాయల మేర పరేఖ్ అల్యూమినెక్స్ దండుకుంది. యాక్సిస్ బ్యాంకు నుంచే 250 కోట్ల రూపాయల మేర తీసుకుంది. ఈ కుంభకోణానికి సంబంధించి మరో ఐదుగురు డైరెక్టర్లు అమితాబ్ పరేఖ్, రాజేంద్ర గోథీ, దేవాంశు దేశాయ్, కిరణ్ పరీఖ్, విక్రమ్ మోర్దానీపై కూడా కేసులు నమోదు చేశారు. వీరంతా ఫోర్జరీ పత్రాలు, బోగస్ లావాదేవీలను చూపించి బ్యాంకులను మోసం చేశారు.

#### యాక్సిస్ బ్యాంక్ గ్యారెంటీలకు డాట్ నో

యాక్సిస్ బ్యాంక్ జారీ చేసే బ్యాంక్ గ్యారెంటీలను అనుమతించబోమని టెలికాం విభాగం స్పష్టం చేసింది. ఇంతకు ముందు జారీ చేసిన గ్యారెంటీల చెల్లింపుల విషయంలో విఫలం కావడమే ఇందుకు కారణమని పేర్కొంది. యాక్సిస్ బ్యాంక్ చర్య విశ్వాస ఉల్లంఘనతోపాటు భారత ప్రభుత్వంతో కుదుర్చుకున్న కాంట్రాక్టు ఉల్లంఘన కిందకే వస్తుందని తెలిపింది. టెలికాం కంపెనీలు తమ ఒప్పంద కట్టుబాట్ల కోసం బ్యాంకు గ్యారెంటీలనుఇవ్వాల్సి ఉంటుంది. కంపెనీలు నిబంధనలు ఉల్లంఘించిన సమయంలో ఆయా కంపెనీలను శిక్షించేందుకుగాను బ్యాంక్ గ్యారెంటీలను నగదుగా మార్చుకుంటారు. ఈ బ్యాంక్ గ్యారెంటీలను బ్యాంకులు లేదా ఇతర రుణ వితరణ సంస్థలు జారీ చేస్తాయి. ఇలాంటి బ్యాంక్ గ్యారెంటీ విషయంలోనే యాక్సిస్ బ్యాంక్ విఫలమైనట్టు డాట్ పేర్కొంది.

#### బ్యాంకు స్కామ్‌లపై జెపిసి

పిఎన్‌బి స్కామ్‌తో సహా ఇతర బ్యాంకుల స్కామ్‌లపై ప్రభుత్వం జాయింట్ పార్లమెంటరీ కమిటీతో దర్యాప్తు జరిపించాలని యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ డిమాండ్ చేసింది. 1992లో హర్షద్ మెహతా స్కామ్ తర్వాత ప్రభుత్వం జెపిసిని ఏర్పాటు చేసిన విషయాన్ని సంఘం ఈ సందర్భంగా గుర్తుచేసింది. సమగ్రమైన దర్యాప్తునకు మళ్లీ జెపిసి ఏర్పాటు చేయాలని కోరింది. ఆర్‌బిఐ నియంత్రణ వైఫల్యం వల్లనే స్కామ్‌లు జరుగుతున్నాయనీ, కింది స్థాయి ఉద్యోగులను బలిపశువులుగా చేస్తున్నారని సంఘం ఆరోపించింది. అసలు పిఎన్‌బి స్కామ్‌లో కీలకంగా ఉన్న స్విఫ్ట్ సాఫ్ట్‌వేర్‌కు ఆర్‌బిఐ ఆమోదం ఉందా అని ప్రశ్నించింది.

#### పిఎంఎల్ఏ కేసుకు మోదీ పరోక్ష సవాల్

పిఎన్‌బి స్కామ్‌లో ప్రధాన నిందితుడు నీరవ్‌మోదీకి చెందిన ఫైర్‌స్టార్ ఇంటర్‌నేషనల్ ఢిల్లీ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ పిటిషన్ చెల్లదని, మోదీ తనపై ఉన్న మనీలాండరింగ్ ఆరోపణలను ఈ పిటిషన్ ద్వారా పరోక్షంగా సవాలు చేస్తున్నారని ఇడి తరపు న్యాయవాది కోర్టులో ఆరోపించారు. నీరవ్ మోదీ కంపెనీ ఫైర్‌స్టార్ ఇంటర్‌నేషనల్ ఇడి దర్యాప్తుపై మధ్యంతర స్టేను కోరుతూ కోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్ను అనుమతిస్తే కేసు దర్యాప్తునకు విఘాతం కలుగుతుందని ఇడి న్యాయవాది చెప్పారు. పిఎన్‌బిని 12,000 కోట్ల రూపాయల మేర మోసగించిన కేసులో విచారణను ఎదుర్కొంటున్న నీరవ్ మోదీ దేశం విడిచి పరారైన విషయం తెలిసిందే. సిబిఐ, ఇడి దర్యాప్తునకు అవరోధం కలిగించే లక్ష్యంతోనే ఫైర్‌స్టార్ కోర్టును ఆశ్రయించిందని ఇడి పేర్కొంది. చట్టానికి దొరక్కుండా తప్పించుకుపారిపోయిన వ్యక్తికి రాజ్యాంగంలోని 226 అధికరణను ఉటంకిస్తూ కోర్టును ఆశ్రయించే అర్హత లేదని కూడా ఇడి పేర్కొంది. పైగా ఫైర్‌స్టార్ ఆరోపిస్తున్నట్టుగా తాము ఆస్తుల జప్తు చేపట్టలేదనీ ప్రస్తుతం ఇంకా సోదాలు, స్వాధీనాలు మాత్రమే జరుగుతున్నాయని వివరించింది. ప్రాథమిక ఆధారాలన్నీ మోదీ, ఫైర్‌స్టార్ మనీలాండరింగ్‌కు పాల్పడినట్టుగా ధృవీకరిస్తున్నట్టుగా వెల్లడించింది. పిఎన్‌బి కేసులో భాగంగా ఇడి, సిబిఐ అధికారులు జరిపిన దాడుల్లో కోట్లాది రూపాయల విలువైన వజ్రాలు, ఆభరణాలు పట్టుబడిన విషయం తెలిసిందే.

కీలకమైన డాక్యుమెంట్లు, రికార్డులు ఇడి పరం కావడంతో పాటు సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్స్ నుంచి వాంగ్మూలాన్ని కూడా ఇడి సేకరిస్తోంది. ఈ నేపథ్యంలో ఇడి ప్రొసీడింగ్స్‌ను నిలిపివేయాలని కోరుతూ ఫైర్‌స్టార్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది.

#### కెనరా బ్యాంక్ మాజీ సిఎండిపై చార్జ్‌షీట్

బ్యాంకు రుణాల ఎగవేత కేసులో కెనరా బ్యాంకు మాజీ సిఎండి ఆర్‌కె దూబే మరో ఇద్దరు మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు అశోక్ కుమార్ గుప్తా, విఎస్ కృష్ణకుమార్‌పై సిబిఐ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ కేసులో అకేషనల్ సిల్వర్ కంపెనీ డైరెక్టర్లు కపిల్‌గుప్తా, రాజ్ కుమార్ గుప్తాపై కూడాపై అభియోగాలు మోపారు. 2013లో అకేషనల్ సిల్వర్ 68 కోట్ల రూపాయలు బ్యాంకుకు ఎగవేసింది. దూబేతో అకేషనల్ సిల్వర్ డైరెక్టర్లకు ముందుగానే పరిచయం ఉందని సిబిఐ ఆరోపించింది. ఈ పరిచయంతోనే వారు రుణాలు తీసుకున్నారని పేర్కొంది.

## టాటా స్టీల్ బిడ్‌పై అభ్యంతరాలను పరిశీలించండి..

### భూషణ్ స్టీల్ రుణదాతల కమిటీతో ఎన్‌సిఎల్‌టి

న్యూఢిల్లీ: దివాలా పరిష్కార చర్యల్లో భాగంగా భూషణ్ స్టీల్ ఆస్తులను వేలం వేయగా టాటా స్టీల్ అందరికంటే అధిక మొత్తానికి బిడ్డింగ్ వేసింది. అయితే, టాటా స్టీల్ బిడ్‌పై భూషణ్ స్టీల్ ఉద్యోగులు వ్యక్తపరిచిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని సంస్థ రుణదాతల కమిటీ (సిఓసి)ని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) కోరింది. టాటా స్టీల్ సమర్పించిన దివాలా పరిష్కార ప్రణాళికపై తుది నిర్ణయం తీసుకునేందుకు సిఓసి మంగళవారం భేటీ కానుంది. ఎన్‌సిఎల్‌టి ఆదేశాల మేరకు భూషణ్ స్టీల్ సిబ్బంది అభ్యంతరాలను సైతం రుణదాతలు పరిశీలించనున్నారు. వీరి అభ్యంతరాలపై సిఓసి ఏం నిర్ణయం తీసుకుందనే విషయాన్ని తమకు తెలియజేయాలని భూషణ్ స్టీల్ దివాలా పరిష్కార నిపుణుడి (ఐపిఆర్)ని ఎన్‌సిఎల్‌టి కోరింది. సొంత అప్పులు తీర్చుకోలేని స్థితిలో ఉన్న టాటా స్టీల్.. తమ సంస్థను దివాలా నుంచి ఎలా గట్టెక్కిస్తుందని భూషణ్ స్టీల్ సిబ్బంది ప్రశ్నిస్తున్నారు.

## సగం చెల్లిస్తాం.. వేలం ఆపేయండి

### రుణదాతలకు ఉత్తమ్ గాల్వా ఆఫర్

న్యూఢిల్లీ: దివాలా పరిష్కార చర్యలను ఎదుర్కొంటున్న ఉత్తమ్ గాల్వా స్టీల్స్ లిమిటెడ్.. రుణ బకాయిలను సెటిల్ చేసేందుకు ముందుకొచ్చింది. సంస్థ ఆస్తులను వేలంలో విక్రయించకుండా ఉండేందుకు మొత్తం రూ.5,654 కోట్ల బకాయిల్లో 51 శాతం (రూ.2,884 కోట్లు) ముందుగా చెల్లిస్తామని బ్యాంకులకు ఆఫర్ ఇచ్చింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో సహా మొత్తం 18 బ్యాంకులు ఉత్తమ్ గాల్వాకు రుణాలిచ్చాయి. అందులో ఎస్‌బిఐకి సంస్థ రూ.1,529 కోట్లు చెల్లించాల్సి ఉంది. కెనరా బ్యాంక్‌కు రూ.857 కోట్లు, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.660 కోట్లు బకాయిపడింది. వన్‌టైం సెటిల్‌మెంట్ కోరుతూ ఈనెల 15న కంపెనీ ఎస్‌బిఐకి లేఖ రాసింది.

## అక్టోబరు నాటికి నాగర్నార్ ప్లాంట్ పూర్తి!

### ఎన్‌ఎండిసికి పార్లమెంటరీ ప్యానల్ సూచన

న్యూఢిల్లీ : ఎన్‌ఎండిసి లిమిటెడ్.. చత్తీస్‌గఢ్‌లో నిర్మిస్తున్న స్టీల్ ప్లాంట్ పనులను వేగవంతం చేయాలని పార్లమెంటరీ ప్యానల్ ఆదేశించింది. వచ్చే అక్టోబరు నాటికల్లా 30 లక్షల టన్నుల సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న ఉక్కు ప్లాంట్‌ను ప్రారంభించాలని ఎన్‌ఎండిసిని కోరింది. చత్తీస్‌గఢ్‌లోని నాగర్నార్ వద్ద ఎన్‌ఎండిసి లిమిటెడ్ 18 వేల కోట్ల రూపాయల పెట్టుబడితో ఏటా 30 లక్షల టన్నుల సామర్థ్యం గల సమీకృత ఉక్కు ప్లాంట్‌ను నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. 2015, మే నాటికి ఈ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎన్‌ఎండిసి తొలుత ప్రకటించింది. ఇప్పటికే 41 నెలల జాప్యం జరిగిందని, ప్లాంట్‌ను సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అవసరమైన పనులను వేగవంతం చేయాలని బొగ్గు, ఉక్కు శాఖకు చెందిన స్టాండింగ్ కమిటీ సూచించింది.

రాకేష్ సింగ్ సారథ్యంలోని 29 మంది సభ్యులతో కూడిన పార్లమెంటరీ ప్యానల్ గత వారం పార్లమెంట్‌కు ఈ ప్లాంట్‌కు సంబంధించిన నివేదికను సమర్పించింది. చట్టపరమైన క్లియరెన్సులు వంటివి ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి అవరోధాలుగా ఉన్నాయని తెలిపింది.

## ప్రైవేట్ ఇంధన రిటైలర్ల మార్కెట్ వాటా రెండింతలు

న్యూఢిల్లీ : గడచిన మూడేళ్లలో ప్రైవేట్ ఇంధన రిటైలర్లు అయిన ఎస్సార్ ఆయిల్, రిలయన్స్ ఇండస్ట్రీస్ తమ మార్కెట్ వాటాను రెండింతలు పెంచుకున్నాయని పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. ఈ కంపెనీలు పెట్రోల్ విక్రయాల్లో 7 శాతం, డీజిల్ విక్రయాల్లో 8 శాతానికి పైగా మార్కెట్ వాటాను చేజిక్కించుకున్నాయని లోక్‌సభకు తెలిపారు. 2002 మార్చిలో ప్రైవేట్ కంపెనీలను డీజిల్, పెట్రోల్ విక్రయాలకు అనుమతించగా అదే ఏడాది ఏప్రిల్ నుంచి ధరలపై నియంత్రణ ఎత్తివేసినట్లు ఆయన పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వ రంగ రిటైల్ చమురు సంస్థలైన ఐఒసి, బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్‌లకు పోటీగా రిలయన్స్, ఎస్సార్, షెల్ కంపెనీలు పెట్రోల్ పంపులను ఏర్పాటు చేశాయి. అయితే 2004-05లో చమురు ధరలు మరోసారి ప్రభుత్వ చేతుల్లోకి వెళ్లిపోవటంతో ఈ కంపెనీలు కొంత వెనకడుగేశాయి.

అనంతరం 2010 జూన్‌లో పెట్రోల్ ధరలను అంతర్జాతీయ మార్కెట్లకు అనుసంధానం చేయటం, 2014లో డీజిల్ ధరలకు అదే విధానాన్ని వర్తింప చేయటంతో ఈ కంపెనీలు మళ్లీ తెరపైకి వచ్చాయి. దీంతో ఈ కంపెనీలు మళ్లీ రిటైల్ విక్రయాల్లోకి అడుగుపెట్టి అమ్మకాలను గణనీయంగా పెంచుకుంటూ వెళుతున్నాయి.

## కలవరపెడుతోంది..

### అగ్ర రాజ్యాల స్వీయ రక్షణ చర్యలపై డబ్ల్యుటిఒ చీఫ్ రాబర్ట్ అజెవెడో



న్యూఢిల్లీ: వాణిజ్య విషయంలో అగ్రరాజ్యాలు, ముఖ్యంగా అమెరికా స్వీయ రక్షణ విధానాలు పాటిస్తుండటంపై ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) ఆందోళన వ్యక్తం చేసింది. తమ సభ్య దేశాలంతా కలిసి అంతర్జాతీయ వాణిజ్యంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించుకోవాలని డబ్ల్యుటిఒ డైరెక్టర్ జనరల్ రాబర్ట్ అజెవెడో పిలుపునిచ్చారు. ఈ విషయంలో దేశాలు పరస్పరం సహకరించుకోవాలన్నారు. డబ్ల్యుటిఒ సభ్య దేశాల మంత్రుల మినీ సమావేశంలో పాల్గొనేందుకు ఆయన భారత్‌కు వచ్చారు. సోమవారం సిఐఐ ఏర్పాటు చేసిన సమావేశంలో పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఎగుమతి ఆర్డర్లు పెరుగుతున్నాయని, సరిహద్దు వాణిజ్యం ఆశాజనకంగా కన్పిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో కొన్ని దేశాలు చేపట్టే స్వీయ రక్షణ చర్యల కారణంగా అంతర్జాతీయ వర్తకంపై భారీ ప్రభావం పడనుందని ఆయన హెచ్చరించారు.

స్టీల్, అల్యూమినియం దిగుమతి సుంకాలను అమెరికా ప్రభుత్వం భారీ పెంచడంతోపాటు ఇతర అభివృద్ధి చెందిన దేశాలు చేపట్టిన రక్షణాత్మక విధానాలను రాబర్ట్ ఈ సందర్భంగా ఉదహరించారు.

#### భారత్‌పై ప్రశంసల జల్లు

డబ్ల్యుటిఒ మంత్రుల మినీ సమావేశానికి భారత్ వేదికైంది. ఈ రెండ్రోజుల సమావేశంలో 50 దేశాలకు చెందిన వాణిజ్య మంత్రులు పాల్గొంటారు. ఈ సమావేశ నిర్వహణ విషయంలో భారత్ అత్యంత చొరవ చూపడంతోపాటు నాయకత్వ పాత్ర పోషించిందని రాబర్ట్ ప్రశంసించారు. డబ్ల్యుటిఒ విధివిధానాలను అమలుపరిచేందుకు ఈ సమావేశం దోహదపడనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

#### ప్రధాని మోదీతో భేటీ

భారత్‌కు వచ్చిన సందర్భంగా రాబర్ట్ అజెవెడో ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. రాబర్ట్‌తో భేటీ చాలా అద్భుతంగా జరిగిందని ప్రధాని ట్వీట్ చేశారు.

## ఎవరికీ విజయం దక్కదు..

### వాణిజ్య యుద్ధాలపై ఐఎంఎఫ్ చీఫ్ క్రిస్టీన్ లగార్డ్

బ్యూనస్ ఎయిర్స్: అంతర్జాతీయ స్వేచ్ఛా వాణిజ్యానికి ఆటంకం కలిగించవద్దని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) అమెరికాను హెచ్చరించింది. వాణిజ్య యుద్ధాల్లో విజేతలెవరూ ఉండరని, అందరూ నష్టపోతారని ఓ ఇంటర్వ్యూలో ఐఎంఎఫ్ చీఫ్ క్రిస్టీన్ లగార్డ్ అభిప్రాయపడ్డారు. ట్రంప్ సర్కారు స్టీల్, అల్యూమినియం దిగుమతులపై సుంకాన్ని భారీగా పెంచడంపై ఆమె స్పందిస్తూ.. గడిచిన కొన్ని దశాబ్దాల్లో అంతర్జాతీయ వాణిజ్యం భారీగా వృద్ధి చెందిన ఫలితంగా పేద దేశాలతోపాటు అగ్రరాజ్యాల్లోని పేదలు ఎంతగానో లాభపడ్డారని ఆమె పేర్కొన్నారు. కాకపోతే కొన్ని ప్రాంతాలు, ఇండస్ట్రీలు మాత్రం ఇబ్బందులు పడ్డాయన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆశాజనకంగా కన్పిస్తోందన్న లగార్డ్.. ఈ ఏడాది 3.9 శాతం వృద్ధి సాధించే అవకాశం ఉందని అంచనా వేశారు. పెట్టుబడిదారుల్లో వ్యవస్థపై నమ్మకం మరింత మెరుగుపడనుందన్నారు.

# అల్ట్రాటెక్ చేతికి బినానీ సిమెంట్!

## రూ.7,266 కోట్ల ఆఫర్




న్యూఢిల్లీ: దివాలా పరిష్కార చర్యలు ఎదుర్కొంటున్న బినానీ సిమెంట్ ఆస్తుల వేలం ప్రక్రియ అనూహ్య మలుపు తిరిగింది. బినానీ సిమెంట్‌కు చెందిన ఆస్తులను కొనుగోలు చేసేందుకు ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్ ముందుకొచ్చింది. బకాయిలు చెల్లించేందుకు వీలుగా బినానీ సిమెంట్ (బిసిఎల్) మాతృ సంస్థ బినానీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (బిఐఎల్)కు రూ.7,266 కోట్ల నిధులు సమకూర్చనున్నట్టు తెలిపింది.

"రుణాలు తిరిగి చెల్లించేందుకు అవసరమైన నిధులు సమకూర్చాలని బిసిఎల్ ప్రమోటర్ బిఐఎల్ మా సంస్థను ఆశ్రయించింది. బిఐఎల్ ప్రతిపాదనను మా కంపెనీ బోర్డు ఆమోదించింది. బిసిఎల్‌లో 98.43 శాతం వాటాకు బదులుగా రూ.7,266 కోట్ల నిధులు అందించేందుకు సిద్ధమని తెలుపుతూ కంపర్ట్ లెటర్ జారీ చేసేందుకు బోర్డు అంగీకరించింది" అని అల్ట్రాటెక్ పేర్కొంది. దివాలా పరిష్కార ప్రక్రియను రద్దు చేసేందుకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) అంగీకరించాక బినానీ సిమెంట్‌తో ఒప్పందం కుదుర్చుకోనున్నట్టు సంస్థ స్పష్టం చేసింది.

### దాల్మియా సిమెంట్స్‌కు చెక్!

బిసిఎల్ ఆస్తుల కొనుగోలుకు తమ సంస్థ దాఖలు చేసిన రూ.6,350 కోట్ల బిడ్‌ను రుణదాతల కమిటీ (సిఒసి) అంగీకరించిందని కొద్ది రోజుల క్రితమే దాల్మియా సిమెంట్స్ ప్రకటించింది. ఆస్తుల కొనుగోలుకు రూ.6,350 కోట్లు చెల్లించడంతోపాటు రుణదాతలకు బినానీలో 20 శాతం ఈక్విటీ వాటాను ఆఫర్ చేసింది. ఇక కంపెనీ దాల్మియా సిమెంట్ చేతుల్లోకి వెళ్లిపోతుందనుకున్న నేపథ్యంలో అల్ట్రాటెక్ ఎగరేసుకుపోతుందటం ఊహించని పరిణామం.

### అల్ట్రాటెక్.. వరల్డ్ నెంబర్ 4

దేశంలో అగ్రగామి సిమెంట్ తయారీదారైన అల్ట్రాటెక్ ప్రస్తుతం 9.25 కోట్ల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంది. చైనాను మినహాయిస్తే ప్రపంచంలో నాలుగో అతిపెద్ద కంపెనీ ఇదే. ఇక బిసిఎల్ ఉత్పత్తి సామర్థ్యం 62.5 లక్షల టన్నులుగా ఉంది.

### బిడ్డింగ్‌లో అల్ట్రాటెక్‌కు ఎదురుదెబ్బ

బినానీ సిమెంట్ ఆస్తులను వేలంలో కొనుగోలు చేసేందుకు ప్రయత్నించిన కంపెనీల్లో అల్ట్రాటెక్ సిమెంట్ కూడా ఉంది. కానీ అల్ట్రాటెక్ సమర్పించిన దివాలా పరిష్కార ప్రణాళికను రుణదాతల కమిటీ ఆమోదించలేదు. దాల్మియా సిమెంట్ ప్రాంక్‌కు ఓకే చెప్పింది. బిసిఎల్ దివాలా పరిష్కార నిపుణుడి (ఆర్‌పి) వ్యవహార తీరును సవాలు చేస్తూ బిఐఎల్ గతవారంలో నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. ఆమోదయోగ్యమైన పరిష్కార ప్రణాళిక ఎంపిక విషయంలో ఆర్‌పి ట్రిబ్యునల్ ఆదేశాలను పాటించలేదని ఆరోపించింది. అంతేకాదు, ఈనెల 14న జరిగిన బిసిఎల్ రుణదాతల కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రద్దు చేయాలని కోరింది. ఆ సమావేశంలో కమిటీ దాల్మియా సిమెంట్ సమర్పించిన పరిష్కార ప్రణాళికను ఆమోదించింది. కానీ, తాజా ప్రతిపాదనకు ఎన్‌సిఎల్‌టి గనుక అంగీకరిస్తే.. బినానీ సిమెంట్ అల్ట్రాటెక్ పరంకానుంది.

## బంధన్ ఇష్యూ గ్రాండ్ సక్సెస్




ముంబై: ప్రైవేట్ బ్యాంక్ బంధన్ పబ్లిక్ ఇష్యూకు ఇన్వెస్టర్ల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ ఇష్యూ 14.62 శాతం ఓవర్ సబ్‌స్క్రైబ్ అయింది. సోమవారం ఈ ఇష్యూ ముగిసింది. క్యుఐబి, హెచ్‌ఎన్‌ఐ ఇన్వెస్టర్ల నుంచి ఇష్యూకు మంచి స్పందన వచ్చింది. క్యుఐబి 38.67 శాతం, హెచ్‌ఎన్‌ఐ విభాగం 13.89 శాతం, రిటైల్ విభాగం 1.05 శాతం ఓవర్ సబ్‌స్క్రయిబ్ అయ్యాయి. రూ.10 ముఖ విలువైన షేరు కనిష్ఠ, గరిష్ఠ ధర రూ.370-375గా నిర్ణయించారు. ఈ ఇష్యూ ద్వారా రూ.4,500 కోట్లు సమీకరించాలని బ్యాంక్ లక్ష్యంగా పెట్టుకుంది.

## లెమన్ ట్రీ ఇష్యూ ధర రూ.54-56

ముంబై: హాస్పిటాలిటీ రంగంలోని లెమన్ ట్రీ హోటల్స్ పబ్లిక్ ఇష్యూలో భాగంగా షేరు కనిష్ఠ, గరిష్ఠ ధరను 54-56 రూపాయలుగా ప్రకటించింది. 1,040 కోట్ల రూపాయల సమీకరణ లక్ష్యంగా సంస్థ బరిలోకి దిగుతోంది. ప్రస్తుత షేర్‌హోల్డర్లు మాపుల్‌వుడ్, విన్సరింగ్ రియల్ట్, పాప్స్ ఇంటర్నేషనల్, ఆరెంజ్ కార్పొరేషన్ ఈ ఇష్యూలో తమ వాటాలను విక్రయించనున్నట్టు లెమన్ ట్రీ ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 26న ప్రారంభమై 28న ముగుస్తుంది. దేశవ్యాప్తంగా 24 నగరాల్లో ఈ సంస్థ 40 హోటళ్లు నడుపుతోంది. బిఎస్‌ఇ, ఎన్‌ఎస్‌ఇలలో షేర్ల లిస్టింగ్ జరుగుతుంది.

## వివోకు అమీర్‌ఖాన్ ప్రచారం



న్యూఢిల్లీ: చైనా మొబైల్ ఫోన్ల కంపెనీ వివో.. భారత మార్కెట్లో తన బ్రాండ్ అంబాసిడర్‌గా బాలీవుడ్ నటుడు అమీర్‌ఖాన్‌ను నియమించుకుంది. ఈయన కొత్తగా విడుదల చేయబోయే ఉత్పత్తుల ప్రచారం చేస్తారని, టెలివిజన్ కమ్యూనికేషన్‌లోనూ కనిపిస్తారని వివో ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ కెన్నీ జెంగ్ తెలిపారు. అమీర్‌ఖాన్ ప్రచారం ద్వారా మరింత ఎక్కువ మంది కొత్త కస్టమర్లను సంపాదించుకునే ఆస్కారం ఉంటుందని, భారత్‌లో మెరుగైన వృద్ధిని సాధించేందుకు అవకాశం ఏర్పడుతుందని ఆయన చెప్పారు. పరిశోధనా సంస్థ ఐడిసి గణాంకాల ప్రకారం.. 2017 నాలుగో త్రైమాసికంలో స్మార్ట్‌ఫోన్ల అమ్మకాల పరంగా వివో మూడో స్థానంలో ఉంది. దేశీయ మార్కెట్లో షామీ మార్కెట్ వాటా 26.8 శాతం, సామ్‌సంగ్ వాటా 24.2 శాతంగా ఉండగా.. వివో వాటా 6.5 శాతంగా ఉంది.

## ఈ ఏడాది క్యాడ్ 1.7 శాతం

న్యూఢిల్లీ: అధిక చమురు ధరల కారణంగా మార్చి 31వ తేదీతో ముగియనున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత కరెంట్ ఖాతా లోటు (క్యాడ్) జిడిపిలో 1.7 శాతం ఉండవచ్చునని బోఫా ఎంఎల్ అంచనా వేసింది. డిసెంబరు త్రైమాసికంలో ఇది జిడిపిలో 2 శాతానికి పెరిగిన నేపథ్యంలో సంవత్సరం మొత్తానికి అంచనాను 0.10 శాతం పెంచి తాజా నివేదికలో 1.7 శాతానికి సవరించింది. అలాగే 2018-19 అంచనాను కూడా 0.20 శాతం పెంచి 1.9 శాతానికి సవరించింది. ఏడాది క్రితం జిడిపిలో క్యాడ్ 1.4 శాతం (800 కోట్ల డాలర్లు) ఉంది. ఆర్‌బిఐ తాజా గణాంకాల ప్రకారం క్యాడ్ డిసెంబరు త్రైమాసికంలో 2 శాతానికి చేరడంతో పాటు ఏప్రిల్-డిసెంబరు నెలల మధ్య కాలంలో 1.9 శాతం ఉంది. ఆయిల్ ధరలు, ఎఫ్‌పిఐ ఈక్విటీ పెట్టుబడులు, చైనా మార్కెట్లోకి నిధుల వెల్లువ భారత్‌పై ఒత్తిడిని పెంచుతున్నాయని ఆ నివేదిక పేర్కొంది.

## స్కూటర్స్ ఇండియా విక్రయం

### ఇఒఐ ఆహ్వానించిన ప్రభుత్వం




న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని స్కూటర్స్ ఇండియాలో మొత్తం వాటాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి గల వర్గాల నుంచి ఆసక్తి వ్యక్తీకరణల దరఖాస్తులను (ఇఒఐ) ఆహ్వానిస్తూ ప్రభుత్వం గ్లోబల్ నోటిఫికేషన్ జారీ చేసింది. 'విక్రమ్' పేరు మీద త్రీవీలర్లు తయారుచేసే స్కూటర్స్ ఇండియా భారీ నష్టాల ఊబిలో ఉన్న కారణంగా సంస్థలో మొత్తం వాటాలు విక్రయించి యాజమాన్యాన్ని కూడా కొనుగోలుదారులకు బదిలీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆసక్తి గల వర్గాలు ఈ ఏడాది మే ఏడో తేదీలోగా ఇఒఐలు సమర్పించవచ్చని భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ పిఎస్‌యులో నూరు శాతం ఈక్విటీ వాటాలను విక్రయించాలని ప్రభుత్వం ఐంతకుముందే సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. ఈ వ్యవహారాన్ని పర్యవేక్షించేందుకు పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ మంత్రిత్వ శాఖ (దీపం).. రీసర్జెంట్ ఇండియా లిమిటెడ్‌ను సలహాదారుగా నియమించింది. ఫిబ్రవరి 26న జరిగిన సమావేశంలో స్కూటర్స్ ఇండియా డైరెక్టర్ల బోర్డు సంస్థ చేతిలో ఉన్న 147.499 ఎకరాల భూమిలో అంత ప్రాధాన్యం లేని 89.69 ఎకరాలను విక్రయించేందుకు అనుమతి ఇచ్చింది. ఆయితే ఇది షేర్‌హోల్డర్లు, నియంత్రణ సంస్థల అనుమతికి లోబడి ఉంటుంది. దేశీయ మార్కెట్‌కు విజయ్ స్కూటర్లు, విదేశీ మార్కెట్‌కు లాంబ్రెటా స్కూటర్ల తయారీ 1975లో స్కూటర్స్ ఇండియా ఉత్పత్తిని ప్రారంభించింది. 1997లో సంస్థ ద్విచక్రవాహనాల తయారీ నుంచి వైదొలగి త్రీవీలర్ల తయారీ పైనే దృష్టి కేంద్రీకరించింది.

## వెన్నాడిన యుఎస్ వడ్డీ రేట్ల భయాలు

### ఐదో రోజూ దిగజారిన మార్కెట్, సెన్సెక్స్ 253 పాయింట్లు డౌన్

ముంబై: దేశంలో కరెంట్ ఖాతా లోటు పెరుగవచ్చుననే అంచనాతోపాటు అమెరికన్ ఫెడరల్ వడ్డీ రేట్లు పెంచవచ్చన్న భయాలు వెన్నాడడంతో స్టాక్ మార్కెట్ వరుసగా ఐదో రోజు కూడా నష్టాల బాటలోనే నడిచింది. మెటల్, టెలికాం, బ్యాంకింగ్ విభాగాల్లో అమ్మకాలు వెల్లువెత్తాయి. సెన్సెక్స్ కీలక 33000, నిఫ్టీ 10100 పాయింట్ల కన్నా దిగజారాయి. భారీ అమ్మకాల ఒత్తిడి కారణంగా సెన్సెక్స్ 252.88 పాయింట్లు దిగజారి 32923.12 పాయింట్ల వద్ద ముగియగా నిఫ్టీ 100.10 పాయింట్లు దిగజారి 10094.25 పాయింట్ల వద్ద క్లోజయింది. ఇది డిసెంబరు ఆరో తేదీ తర్వాత సెన్సెక్స్ నమోదు చేసిన కనిష్ఠ స్థాయి ఇదే.

ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి ఆటుపోట్లకు గురి అయింది. డిసెంబరు త్రైమాసికంలో కరెంట్ ఖాతా లోటు పెరగడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీంతో భారీ ఆటుపోట్లకు గురైన రూపాయి చివరికి 23 పైసలు నష్టంతో 65.17 వద్ద ముగిసింది. మార్చి 9వ తేదీ తర్వాత కనిష్ఠ స్థాయి ఇదే.

### 23 పైసలు దిగజారిన రూపాయి

స్థాయి ఇదే. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ క్షీణత కూడా మార్కెట్‌పై ప్రభావం చూపింది.

### మెటల్స్ షేర్లకు భారీ నష్టం

బేస్ మెటల్ ధరలు అంతర్జాతీయ విపణిలో భారీగా పడిపోవడంతో మెటల్ విభాగంలోని ఎన్ఎండిసి, సెయిల్, హిండాల్కో, జెఎస్‌డబ్ల్యు స్టీల్, వేదాంత, టాటా స్టీల్ అండ్ పవర్, హిందుస్తాన్ జింక్, వేదాంత షేర్లు 6.5 శాతం మేరకు నష్టపోయాయి.

- గెయిల్‌లో వాటాలు కొనుగోలు చేయనున్నట్టు వచ్చిన వార్తల ఆధారంగా ఐఒసి, బిపిసిఎల్ షేర్లు 4.01 శాతం నష్టపోయాయి.
- సెన్సెక్స్ కంపెనీల్లో టాటా స్టీల్ 4.24 శాతం నష్టంతో, 4.16 శాతంతో భారతి ఎయిర్‌టెల్ నష్టాల్లో తొలి వరుసలో ఉన్నాయి.

## 10100 దిగువకు...

### టెక్ వ్యూ

నిఫ్టీ పాజిటివ్‌గానే ప్రారంభమైనా కొద్ది సేపటికే నెగెటివ్ జోన్‌లోకి వెళ్లి 10200 కన్నా దిగజారింది. రోజంతా బలహీన ధోరణిని ప్రదర్శిస్తూ కీలక స్థాయి 10100కన్నా దిగువన క్లోజయింది. టెక్నికల్‌గా డౌన్‌ట్రెండ్ కొనసాగుతోంది. కీలక మద్దతు స్థాయి 10000కి చేరువవుతోంది. 200 డిఎంఎ కన్నా కూడా దిగువకు వచ్చింది. ఇక్కడ స్వల్పకాలిక కన్సాలిడేషన్‌కు ఆస్కారం ఉంది. స్వల్పకాలిక ఓవర్‌సోల్డ్ స్థితికి కూడా చేరువవుతోంది.

మంగళవారం స్థాయిలివే...

నిరోధం : 10150 మద్దతు : 10000

- దిగువన ప్రధాన మద్దతు జోన్ 10000-9950. స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌ను నిలబెట్టుకోవాలంటే ఈ కీలక స్థాయిలో కొద్ది రోజుల పాటు కన్సాలిడేట్ కావలసి ఉంది.
- రికవరీ బాట పడితే మైనర్ అప్‌ట్రెండ్ కోసం మైనర్ నిరోధం 10150 పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 10300.
- బ్యాంక్ నిఫ్టీ ప్రధాన మద్దతు స్థాయి 24000కి చేరువలోకి వచ్చింది.

■ వి.సుందర్ రాజా

## మిడ్‌సెషన్ నిస్తేజం

### ఆస్ట్రో వ్యూ

తిథి : చైత్ర శుద్ధ తదియ నక్షత్రం : అశ్విని

రోహిణి, హస్త, శ్రవణం నక్షత్ర జాతకులు, వృషభ, కన్య రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10094.25 (-100.10)

ట్రెండ్ మార్పు వేళలు : మధ్యాహ్నం 1.51 గంటలు

ధోరణి : గ్రహగతులను బట్టి నిలకడగా ప్రారంభమై ఉదయం 10.10 గంటల నుంచి 2.25 గంటల వరకు నిస్తేజంగా ఉండి తదుపరి చివరి వరకు నిలకడగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 10.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 2.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

నిరోధం : 10135, 10170

మద్దతు స్థాయిలు : 10055, 10020

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinanciala strologer.blogspot.in

## బులియన్

| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 31,180 | 31,170 | 31,280 | 31,150 | 30,300 |
| క్రితం ముగింపు | 31,260 | — | 31,180 | 31,200 | 30,410 |
| 22 క్యారెట్లు | 28,870 | 28,900 | 28,770 | 28,900 | 28,860 |
| క్రితం ముగింపు | 28,950 | — | 28,680 | 28,930 | 28,950 |
| వెండి (కిలో) | 38,900 | 39,400 | 39,100 | 39,100 | 41,000 |
| క్రితం ముగింపు | 39,000 | — | 38,900 | 39,300 | 41,100 |

### రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 3.90 నెక్ (100 గుడ్లు)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 330.00 | చిత్తూరు | 363.00 |
| వరంగల్ | 332.00 | చెన్నై | 370.00 |
| విజయవాడ | 317.00 | నమక్కల్ | 360.00 |
| గోదావరి | 317.00 | బెంగళూరు | 365.00 |
| విశాఖపట్నం | 325.00 | ముంబై | 370.00 |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 66.00 | విజయవాడ | 67.00 |
| కరీంనగర్ | 67.00 | గుంటూరు | 67.00 |
| వరంగల్ | 66.00 | ఒంగోలు | 69.00 |
| మహబూబ్‌నగర్ | 66.00 | చిత్తూరు | 63.00 |
| కర్నూలు | 66.00 | నెల్లూరు | 63.00 |
| విశాఖపట్నం | 70.00 | అనంతపురం | 62.00 |
| గోదావరి | 67.00 | | |

### ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| యుఎస్ డాలర్ | 59.16 | 68.60 |
| పౌండ్ | 82.43 | 95.58 |
| యూరో | 72.59 | 84.20 |
| ఆస్ట్రేలియా డాలర్ | 45.56 | 52.71 |
| బహ్రెయిన్ దినార్ | 160.22 | 183.61 |
| కువైట్ దినార్ | 179.27 | 223.16 |
| ఒమని రియాల్ | 156.90 | 179.51 |
| సౌదీ రియాల్ | 15.73 | 18.64 |
| సింగపూర్ డాలర్ | 44.88 | 53.17 |
| యుఎఇ దిరమ్ | 16.10 | 18.82 |

## బిఎస్‌ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు BSE

AGRO TECH FO 662.15(657.8)682
AISHWARYA TE 6.03(6.28)3801
ALPHAGEO (I) 755.4(763.75)6772
ALU FLUORIDE 106.15(107.1)6484
AMAR RAJA BA 772.5(783)19944
ANDHRA BANK 41.85(41.8)800048
ANDHRA CEMEN 10.37(10.91)23406
ANDHRA PETRO 55.5(57.15)43067
ANJANI PORTL 177.6(183.5)419
ASTRA MICRO 82.95(84.9)40825
AUROB.PHARMA 571.95(572.7)81937
AVANTEL LTD 520.35(531.6)8178
AVANTI FEEDS 2298.35(2351.2)7240
B.N.RATHI SE 38.95(39)21898
BALAJI AMINE 582.9(597.35)4892
BAMBINO AGRO 226.7(224.85)1182
BARTRONICSIN 11.44(11.85)10144
BHAGIRA.CHEM 286(288)1323
BHAGYA INL 45.8(47.45)24213
BHARATFIN 1065.2(1059.9)35058
BNR UDYOG 28.75(27.6)235
CAMBRIDGE 68.75(70.15)2564
CAT TECHN. .89(.93)200
CCHHL 12.7(13.28)32888
CCL PRODUCTS 284.25(294.85)6857
CELESTIAL 15(15.25)41369
CIL SECURITS 26.15(27.8)1495
COROM INTER 508.55(525.15)98792
CUBEX TUBING 22.9(21.85)1260
CYBERMATE 2.85(2.77)55504
CYIENT 639.2(631.5)10954
DANLAW TECH. 71.1(73.3)7184
DECAN CEMENT 524.85(548.95)287
DIAMONPOWER 11.09(11.57)77880
DIVI'S LAB. 1087.4(1087.15)31147
DQ ENT 12.75(13.07)121589
DR.REDDY'S 2118.2(2138.1)76435
EMPEE SUGARS 3(3.02)9003
EVEREST ORG. 128.05(132)3273
FACOR ALLOYS 2.52(2.62)341242
FIRSTOBJ 15.15(15.85)9370
GATI LTD. 101.25(104.85)93288
GAYATRI BIO 7(6.76)375
GAYATRI PROJ 186.95(198.35)33553
GENNEX LAB 4.01(4.22)216462
GMR INFRASTR 17.65(17.9)2835903
GODAVARI DRU 32.35(33.2)6844
GOLDST INFRA 197.95(201.5)29758
GOLDSTONE EN 13.6(13.43)1390
GRANULES (I) 108.3(110)98448
GVK POWERINF 14.5(15.25)668674
HBL P SYS 49.5(51.35)31878
HERITGFOOD 743.7(755.55)1147
HIND.FLUROCA 9.98(10.5)2300
I.C.S.A. IND 3.21(3.37)6505
IKF TECHNO .6(.6)116209
INCAP LTD. 83(84)1342
IPAPPM 292.25(297.25)8568
IVRCL LTD 3.65(3.78)158750
KAKATIYA CEM 259.65(268.35)6941
KALLAM SPG. 31.5(31.9)80907
KARAN WOO-SN 1.91(1.91)100
KAVERI SEED 483.35(475.9)23816
KCP LTD 112.05(115.3)26825
KERNEX MICRO 39.1(38.2)8611
KNR CONST 289.15(293.7)13056
KREBS BIOCHM 175.5(180.95)6351
LANCO INFRA 1.27(1.21)2168955
LOKESH MACH 55.9(58.7)12115
LOTUS CHOC 50.25(50.95)900
MADHUCON PRJ 23.1(24.2)238067
MOLD-TEK TEC 53.5(53.35)50190
MOSCHIP SEMI 36.55(37.9)107076
MSR INDIA 43.3(48.35)6534
N C L IND. 216.3(224.75)6693
NACLIND 40.45(42.8)20147
NATCO PHARM 764.25(792.05)20564
NCC 119.2(122.5)268955
NEHA INTER. 6.14(6.34)9222
NETTLINX LTD 76.55(77.5)9426
NEULAND LAB. 733.2(722.55)3896
NIHAR INFO 14.8(14.1)1300
NILE LTD. 715.65(746)8889
NTL 3.82(3.64)23706
OIL COUNTRY 36.5(37.95)3446
PADMALAYA TE 3.29(3.14)13880
PALRED 70.85(73.55)12642
PANYAM CEMEN 42.2(42.9)14406
PENNAR STEEL 53.4(54.65)61689
PFL INFOTECH 8.15(8.53)545
PHYTOCHEM I. 64.6(65.8)4222
PITTI LAMIN. 83.75(86.35)7544
POKARNA LTD 192.1(192.6)1049
PRAJAY ENGS. 12.53(12.71)6292
PREMIER EXPL 351.65(353)1669
PRISM CEMENT 112.55(115.4)67013
RAIN 373.35(386.5)419503
RAJ PACKAGIN 38.05(41.3)6654
RAJVIR IND 41.15(43)25
REG.CERAMIC 4.73(4.97)608
RESTILE CER. 6.74(7.11)326
SAGAR CEM. 908(900.55)1225
SAMKRG PIST. 286.55(292.9)3124
SAMPRE NUTRI 48.85(51.4)3300
SANGHI IND. 118.3(123.65)22616
SATVAH.ISPAT 19.45(19.55)17869
SMPL 1.21(1.27)22716
SMS PHARMACE 76.6(77.4)6341
SREE RAYALA 150.45(157.3)5163
STEEL EXCH 26.95(26.85)20528
SUJANA INDUS .71(.7)94525
SURANATP 5.08(5)35567
SURYACHAKRA .86(.9)42209
SURYAMBA SP 71(71)1000
SURYLAK.COTT 69.8(70)21902
SUVEN LIFE S 173.15(178.7)58386
TAJ GVK HOTL 162(158.15)5026
TANLA 33.6(35)107298
TRANSCORP IN 34.3(33.6)2351
TRANSGENE BI 2.29(2.21)13820
TRANSPORT CO 256.55(264.3)5166
USHER AGRO 4.98(5.1)56964
VICEROY HOTE 14.8(15.6)50197
VIJAY TEXTIL 43.95(44.5)915
VIMTA LABS 197(199)2217
VIRAT CRANE 58.6(60.5)4906
VIRINCHI 103.2(107.7)50263
VISAKA IND. 673.15(695.4)5101
VISTA PHARMA 40.7(41.85)119233
VIVIMED LABS 76.95(77.8)107555
VST INDUS. 2917.9(2950.45)131
WATERBASE 281.5(295.65)221149
XLENERGY 2.2(2.28)4747
YBRANTDIGI 4.94(5.12)241147
ZEN TECH 118.2(124.7)129367
ZENOTECH 42.35(44.55)5200

## ఎన్‌ఎస్‌ఇ-500 NSE

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 540.8(550.15)6720
AARTIIND 1141.15(1155.85)24683
ABAN 158.7(162.25)450477
ABB 1317.3(1336.8)53198
ABFRL 138.35(141)1647705
ABGSHIP 8.95(9)19692
ACC 1562.9(1567.95)195095
ADANIENT 160.6(160.5)11657832
ADANIPORTS 364.3(370.5)5253759
ADANIPOWER 26.1(27.3)13720511
ADANITRANS 186.75(190.85)1406753
AEGISCHEM 245.2(254.3)388520
AHLUCONT 392.3(395)13262
AIAENG 1354.95(1347.05)61516
AJANTPHARM 1391.15(1410.45)276778
AKZOINDIA 1771.9(1771.55)2820
ALBK 49.4(51.15)5676916
ALLCARGO 151.3(158.55)364148
ALOKTEXT 3.05(2.95)1341463
AMARAJABAT 775.2(782.5)656348
AMBUJACEM 231.15(234.75)2932815
AMTEKAUTO 23.95(24.35)809040
ANANTRAJ 52.1(54)1059695
ANDHRABANK 41.9(42.2)13097052
APARINDS 749.1(738.1)9684
APLLTD 540.95(536.4)27972
APOLLOHOSP 1056.2(1071.65)357297
APOLLOTYRE 261.25(265.65)1384506
ARVIND 386.15(393)1189356
ASHIANA 158.45(163.65)54705
ASHOKA 229.9(226.05)372677
ASHOKLEY 145.7(147.15)17441635
ASIANPAINT 1102.55(1122.75)855444
ASTRAL 843.45(854.6)35872
ASTRAZEN 950.35(963.05)3834
ATUL 2604.25(2626.35)17717
AUROPHARMA 572.9(572.55)1558962
AVANTIFEED 2297.15(2346)71630
AXISBANK 519.45(522.6)4656613
BAJAJ-AUTO 2849.45(2910.45)231927
BAJAJCORP 462.05(465.8)37676
BAJAJELEC 557.55(586.35)632953
BAJAJFINSV 4963.45(5011.35)84292
BAJAJHIND 10.1(10.35)1641803
BAJAJHLDNG 2531.9(2602.5)9005
BALKRISIND 1060.1(1087.8)453818
BALLARPUR 13.5(13.9)1119590
BALMLAWRIE 222.1(227.5)83909
BALRAMCHIN 81.8(86.4)6432023
BANKBARODA 133.35(143.8)39455304
BANKINDIA 100.4(104)14579471
BASF 1992.4(2016.5)10500
BATAINDIA 676.9(699.6)533543
BBTC 1187.6(1214.65)167965
BEML 1029.3(1071.45)892905
BERGEPAINT 245.15(252.45)567905
BFUTILITIE 393.4(408.85)367859
BGRENERGY 102.3(107.45)110177
BHARATFIN 1064.8(1067)965866
BHARATFORG 709.25(736.6)1020740
BHARTIARTL 399.65(416.75)5408078
BHEL 83.75(86.4)6406121
BHUSANSTL 40.6(41.35)2288859
BIOCON 579.1(586.3)1346682
BIRLACORPN 743.2(767.6)56938
BLISSGVS 196.35(195.95)622859
BLUEDART 4054.8(4069.4)12458
BLUESTARCO 785.5(786.6)68017
BOMDYEING 267.7(259.95)4658419
BOSCHLTD 17515.05(17921.7)15211
BPCL 430.75(447.55)4955340
BRFL 46.65(48.8)148468
BRIGADE 264.3(271.75)16179
BRITANNIA 4815.55(4860.6)111828
CADILAHC 376.95(379.1)617450
CANBK 264.2(268.35)10968040
CAPF 635.15(648.45)508193
CARERATING 1271.15(1301.4)97410
CASTEXTECH 4.25(4.4)1612342
CASTROLIND 200.65(205.15)1950392
CCL 282.65(294.15)66105
CEATLTD 1538.2(1572.75)382128
CENTRALBK 77.2(83.8)2300379
CENTURYPLY 325.25(326.6)198605
CENTURYTEX 1160.4(1183.9)517004
CERA 3288.85(3285.9)12651
CESC 919.75(956.05)658816
CHAMBLFERT 165.55(164.7)297826
CHENNPETRO 338.6(346.3)266286
CHOLAFIN 1436.45(1463.8)124452
CIPLA 559.75(559.4)1447941
CLNINDIA 545.8(553.05)9117
COALINDIA 272.3(278.2)3588096
COLPAL 1034(1044.45)398192
CONCOR 1199.1(1208.5)234108
COROMANDEL 510.85(525.45)193263
CORPBANK 30.25(31.45)613565
COX&KINGS 238.05(236)92787
CRISIL 1950.15(1950.25)5199
CUB 176.3(174.85)320954
CUMMINSIND 755.15(765.65)231290
CYIENT 641.95(633.05)257795
DABUR 319.7(321.25)1008579
DALMIABHA 2841.35(2842.25)195711
DBCORP 315.7(321.65)40478
DBREALTY 53.9(56.7)459779
DCBBANK 161.8(163.25)957344
DCMSHRIRAM 454.3(477)80559
DEEPAKFERT 318.4(325.4)94976
DELTACORP 296.4(308.4)2126489
DEN 90.75(92.15)114093
DENABANK 19.85(20.55)1785018
DHANUKA 571.25(586.65)13258
DHFL 496.9(510.35)2505264
DISHTV 67.25(68.95)2738775
DIVISLAB 1088(1087.15)614731
DLF 214.35(226.3)6851893
DREDGECORP 651.15(672.5)172312
DRREDDY 2119.85(2142.15)292149
DYNAMATECH 1725.8(1745.85)1167
ECLERX 1233.5(1279.75)16464
EDELWEISS 253.45(265.25)1634876
EICHERMOT 27403.05(28079.15)19513
EIDPARRY 282.25(292.35)95875
EIHOTEL 166.05(167.15)169406
ELECTCAST 27.1(28.55)284624
ELGIEQUIP 274.75(278.85)19863
EMAMILTD 1025.65(1022)239427
ENGINERSIN 157.95(160.25)2071149
EROSMEDIA 175.85(179.95)354728
ESCORTS 827.65(830.45)764926
ESSDEE 48.8(47.3)8965
ESSELPACK 244.85(248.5)23857
EVEREADY 381.5(407)94824
EXIDEIND 210.2(213.65)1192750
FCONSUMER 55(59.1)11400647
FDC 266.6(281)91610
FEDERALBNK 90.7(93.3)5690125
FINCABLES 659.9(677.1)51346
FINPIPE 664.1(667.75)52986
FLFL 411.05(406.3)303670
FORTIS 153.5(155.9)6711812
FSL 48.15(49.7)5782451
GAIL 442.05(441)3006066
GATI 100.95(104.95)500274
GDL 190.55(191.7)119403
GEPIL 815.45(829.2)6870
GESHIP 347.7(350.05)198194
GET&D 398.1(384.85)59524
GILLETTE 6438.3(6430.65)7591
GLAXO 2227.65(2228.25)8689
GLENMARK 543.85(546.2)246463
GLOBOFFS 25.6(26.8)14018
GMDCLTD 126.8(127.7)152195
GMRINFRA 17.6(17.95)32078964
GODFRYPHLP 832.5(876.6)134343
GODREJCP 1047.3(1056)1302290
GODREJIND 540.95(546.7)267059
GODREJPROP 735.75(741.6)79177
GPPL 132.5(132.25)350006
GRANULES 108.1(110.55)1162186
GREAVESCOT 116.95(117.5)342104
GREENPLY 334.45(334.75)80148
GRINDWELL 495.05(503.3)30718
GRUH 543.55(546.65)98372
GSFC 121.95(123)1823272
GSKCONS 6527.5(6516.6)4156
GSPL 188.1(192.2)285666
GUJFLUORO 782.95(788.15)43175
GUJGASLTD 825.9(834.95)22253
GULFOILLUB 920(944.95)13477
GVKPIL 14.45(15.2)2601020
HATHWAY 34.5(34.15)224606
HAVELLS 506.5(516.6)951135
HCC 31.15(32.15)3908804
HCL-INSYS 53.55(56.8)1837117
HCLTECH 926.5(967.6)1659374
HDFC 1774.5(1791.4)3986719
HDFCBANK 1847.25(1853)1959685
HDFCBANK 1880(1900)276457
HDIL 42(43.05)8326449
HEIDELBERG 151.05(153.6)111064
HEROMOTOCO 3515.3(3546.1)252482
HEXAWARE 361.55(370.05)837971
HFCL 27.3(27.95)8750190
HIMATSEIDE 338.8(344.7)24160
HINDALCO 214.55(221.7)6780348
HINDCOPPER 67.3(71.7)2738187
HINDPETRO 352.35(364.75)2272318
HINDUNILVR 1309.4(1299.15)1244199
HINDZINC 308.7(314.9)2354765
HMT 29.85(31.3)3381
HMVL 227(228.9)20954
HONAUT 15346.35(15795.65)868
HOTELEELA 17.65(18.25)285532
HSIL 399.7(405.6)100143
HTMEDIA 86.2(87.75)220258
IBREALEST 197.85(204.65)3739729
IBULHSGFIN 1187.85(1207.45)940906
ICICIBANK 294.55(298.1)13601784
ICRA 3609.8(3626.45)10788
IDBI 73.75(78.95)73322120
IDEA 77.8(81.05)11052168
IDFC 49.75(51.15)5470939
IFBIND 1287.1(1328.2)7084
IFCI 20.45(21)12858229
IGARASHI 800(799.6)250973
IIFL 733.6(773.35)293534
IL&FSTRANS 67.3(69.45)289912
INDHOTEL 129.45(130)608262
INDIACEM 141.7(147)2393687
INDIANB 293.65(306.05)1925760
INDOCO 251.35(253.5)34703
INDUSINDBK 1718.8(1724.7)1392321
INEOSSTYRO 861.8(877.55)5018
INFRATEL 325.35(334.45)2261162
INFY 1146.75(1171.9)3763310
INGERRAND 691.7(702.4)7697
INOXLEISUR 257.2(263)22487
INOXWIND 116.85(120.5)285662
INTELLECT 169.9(184.95)552243
IOB 18.3(18.15)1019578
IOC 177.9(184.75)19625875
IPAPPM 290.7(297.4)54244
IPCALAB 657.9(667.55)303033
IRB 219.05(220.85)1358105
ITC 259.15(260.5)12926158
J&KBANK 59(58.9)1572094
JAGRAN 163.65(164.4)73291
JAICORPLTD 140.05(147.2)1490363
JBCHEPHARM 289.35(295.15)44132
JBFIND 112.6(140.75)1598567
JCHAC 2462.95(2482.6)5277
JETAIRWAYS 673.35(703.8)2389666
JINDALPOLY 332.65(344.4)78892
JINDALSTEL 220.95(226.2)8793211
JISLJALEQS 106.2(109.85)5217331
JKCEMENT 1023.2(1039.1)40909
JKIL 300.25(301.75)62330
JKLAKSHMI 419.85(424.25)409762
JKTYRE 149.7(152.5)569603
JMFINANCIL 126.8(131.95)763454
JPASSOCIAT 19.55(20.85)134200393
JPINFRATEC 10.2(10.7)7230023
JPPOWER 5.6(6.15)7666118
JSWENERGY 73.55(77.9)2805790
JSWHL 1680.15(1700.1)6684
JUBILANT 802.5(852.95)460564
JUBLFOOD 2113.15(2111.65)988750
JUSTDIAL 423.4(444.55)1766654
JYOTHYLAB 364.5(359.1)242862
KALPATPOWR 451.95(456.75)53003
KANSAINER 491.2(496.85)96561
KEC 380.15(385.05)257878
KESORAMIND 114.65(121.5)386239
KIRLOSENG 353.15(367.45)16124
KITEX 236.55(243.25)43698
KOLTEPATIL 314.25(323.2)138842
KOTAKBANK 1049(1060.75)1880023
KPIT 226.2(229.35)1746640
KRBL 444.35(444.05)218163
KSCL 483.2(476.6)452358
KSK 9.85(10.35)425330
KTKBANK 117.6(121.25)3666013
KWALITY 87.65(90.85)1753874
L&TFH 157.3(160.45)3439129
LAKSHVILAS 98(101.35)352076
LAOPALA 649.1(650.15)104965
LAXMIMACH 6633.1(6897.55)5661
LICHSGFIN 511.25(513.45)1273623
LITL 1.25(1.2)2317981
LT 1279.55(1269.3)4452882
LUPIN 766.6(761.85)1196025
M&M 742.7(740.75)2081202
M&MFIN 431.8(433.5)1162688
MAGMA 150.75(154.9)53650
MAHINDCIE 219.1(223.4)72009
MAHLIFE 435.4(438.55)60865
MANAPPURAM 102.95(104.65)2910475
MANPASAND 367.3(380.65)128891
MARICO 303.25(301.25)1182981
MARKSANS 34.75(35.7)1604581
MARUTI 8773.5(8676.55)571830
MAYURUNIQ 487.8(496.45)5789
MCDOWELL-N 3038.25(3121.55)271657
MCLEODRUSS 147.8(148.7)144700
MERCK 1509.45(1504.95)8742
MHRIL 281.95(287.85)88213
MINDACORP 185.35(191.45)173226
MINDTREE 779.4(812.35)2165988
MMTC 66.15(67.2)9131856
MOIL 193.6(199.65)287576
MONSANTO 2559.25(2518.25)6261
MOTHERSUMI 306.65(307.45)2691750
MOTILALOFS 1127.55(1154.3)74471
MPHASIS 855.6(875.75)113904
MRF 70074.85(70211.65)3928
MRPL 112.1(116.7)944570
MTNL 19.7(20.4)1014123
MUTHOOTFIN 388.8(396.65)817041
NATCOPHARM 763.15(794.3)231511
NATIONALUM 67.5(66.25)11711093
NAUKRI 1255.6(1285.5)209528
NAVKARCORP 154(161.75)212312
NCC 119.15(122.45)2942957
NETWORK18 56.3(56.85)1176102
NHPC 26.45(26.6)6115902
NIITTECH 881.8(927.15)1899704
NITINFIRE 4.4(4.55)346244
NLCINDIA 95.45(92)2359011
NMDC 117.9(126.3)9711235
NTPC 167(164.85)5021670
OBEROIRLTY 495.5(511.2)212187
OFSS 3880.05(3888.35)22342
OIL 337(337.25)892681
OMAXE 226.3(225.8)479701
ONGC 176.85(177.15)5782668
ORIENTBANK 95.05(100.8)8428995
ORIENTCEM 138.65(143.8)173800
ORISSAMINE 1627.8(1655.65)2391
PAGEIND 20282.1(20533.6)19630
PARSVNATH 15.95(16.75)651826
PCJEWELLER 365.15(371.5)4808217
PEL 2492.25(2491.75)414772
PERSISTENT 802.3(816)82012
PETRONET 233.65(235)1399557
PFC 87.7(88)12226065
PFIZER 2144.55(2139.7)8980
PFS 27.45(28.25)873462
PGHH 9304.3(9427.5)5078
PHOENIXLTD 592.45(608.65)97887
PIDILITIND 907.65(916.3)235720
PIIND 830.7(825.75)92873
PNB 96.55(98.85)33530881
POLARIS 473(469.25)31291
POWERGRID 194.2(192.25)7591581
PRAJIND 81.95(83.65)417882
PRESTIGE 299.85(296.8)172689
PRISMCEM 112.35(115.65)1684321
PTC 92.5(95.2)1684693
PUNJLLOYD 17.75(18.15)861247
PURVA 138.55(144.35)390182
PVR 1267.75(1292.9)181903
RADICO 321.7(322.25)715248
RAIN 373(386.25)2502566
RAJESHEXPO 748.15(769.1)111623
RALLIS 227.3(231)178844
RAMCOCEM 746.35(740.8)293973
RAMCOSYS 394.2(415)30382
RATNAMANI 891.8(893.7)6172
RAYMOND 904.65(926.15)364530
RCF 74.85(77.75)1394567
RCOM 23(23.45)43793755
RECLTD 124.75(128.5)7905991
REDINGTON 133.35(137.55)206901
RELAXO 617(631.55)32507
RELCAPITAL 418.85(429.65)3882432
RELIANCE 895.5(900.05)5774392
RELINFRA 424.25(428.6)2088481
RENUKA 15.4(15.35)4590687
REPCOHOME 563.45(567.85)170907
RIIL 440.7(458.15)356134
RKFORGE 738.45(751.9)135997
RNAVAL 32.85(34.4)3977521
ROLTA 60.95(62.65)841777
RPOWER 38.45(39.2)4648780
RTNPOWER 5.6(5.7)3236113
RUCHISOYA 17.7(18.45)1188706
SADBHAV 379.85(381.45)102498
SADBHIN 129(133.35)145830
SAIL 68.9(72.85)22155007
SANOFI 5063.55(5092.05)5933
SBIN 247.95(252.3)18167594
SCHAEFFLER 5343.05(5389.45)1713
SCHNEIDER 115(116.05)164367
SCI 65.2(67)500688
SHARDACROP 372.75(377.15)10253
SHILPAMED 490.2(456.45)1309206
SHK 246.2(252.65)125704
SHOPERSTOP 536(541.45)29918
SHREECEM 16015.5(16424.4)24406
SHRIRAMCIT 2101.4(2148.35)6615
SIEMENS 1090.5(1105.1)84885
SIMPLEXINF 495.85(524.3)26928
SINTEX 20.5(20.2)10915570
SITINET 14.95(15.3)83879
SJVN 33.75(34.35)1000295
SKFINDIA 1724.25(1731.15)782
SMLISUZU 760.6(764.2)13055
SNOWMAN 47.05(48.35)386958
SOBHA 502.75(508.15)533247
SOMANYCERA 655.9(655.85)14343
SONATSOFTW 311.35(310.25)314519
SOUTHBANK 24.3(25.1)5110194
SPARC 394.1(398.2)359478
SREINFRA 77.85(82.15)1580847
SRF 1875.45(1872.75)105208
SRTRANSFIN 1404(1445.8)662003
STAR 695.6(691.9)429023
STCINDIA 147.6(154.6)81223
SUNDARMFIN 1626.1(1626.65)70179
SUNDRMFAST 562.4(595.85)258154
SUNPHARMA 497.65(503.05)5580228
SUNTV 907.3(903.15)1271551
SUPREMEIND 1201.4(1200.1)29015
SUVEN 173.55(178.65)150965
SUZLON 11.25(11.7)39208677
SWANENERGY 180.1(181.6)232940
SYMPHONY 1764.5(1776.8)10352
SYNDIBANK 60.5(62.7)7453611
SYNGENE 544(547.3)47254
TAKE 159.55(163.1)358028
TATACHEM 667.05(682.1)668773
TATACOFFEE 118.65(121.95)396752
TATACOMM 626(624.15)380151
TATAELXSI 979.2(1012.75)374276
TATAGLOBAL 260.6(272.4)3665423
TATAMOTORS 335.7(339.75)9391347
TATAMTRDVR 188.9(189.45)2624214
TATAPOWER 79.55(79.95)4114695
TATASPONGE 958.2(990.1)83837
TATASTEEL 574.95(600.2)12542317
TBZ 95.05(100)169556
TCS 2831(2825.7)1744970
TECHM 609.9(634.7)1731324
TECHNO 360.85(334.8)553419
TEXRAIL 86.85(87.7)429096
THERMAX 1158.7(1155.05)57577
THOMASCOOK 268.25(273.85)256053
TIDEWATER 6210.25(6323.85)1225
TIMKEN 744.85(728.8)11439
TITAN 869(879.25)2536517
TNPL 356.35(375.6)71439
TORNTPHARM 1261.65(1268.45)115788
TORNTPOWER 240(251.15)1368083
TREEHOUSE 10.6(11.1)265898
TRIDENT 66.35(67)262492
TRITURBINE 110(110.95)470129
TTKPRESTIG 6351.4(6461.25)2250
TTML 6.4(6.7)816541
TV18BRDCST 64.15(66.5)11386182
TVSMOTOR 614.3(631.8)1083263
TVSSRICHAK 3188.4(3333.25)6065
TVTODAY 464.3(521.1)702341
UBL 995.25(1005.05)312559
UCOBANK 23.4(23.15)645697
UFLEX 355.5(365.7)121903
ULTRACEMCO 3972.4(4026.3)193770
UNICHEMLAB 343.2(349.8)43595
UNIONBANK 96.4(99.85)8460284
UNITECH 6.1(6.35)17238180
UPL 701.85(719.7)910706
VAIBHAVGBL 704.5(703.85)47724
VAKRANGEE 260.3(248.05)7297601
VEDL 307.2(308.9)10063284
VIDEOIND 14.35(15.05)1586443
VIJAYABANK 54.85(56.1)635580
VINATIORGA 797.65(804.25)23119
VIPIND 297.1(302.35)510608
VOLTAS 620.9(627.2)822733
VRLLOG 389.35(388.05)98344
VSTIND 2937.55(2957.6)1071
VTL 1241.25(1286.05)35651
WABAG 493.2(503.2)227899
WABCOINDIA 7470.75(7275.35)4057
WELCORP 148.6(150.45)312863
WELSPUNIND 58.8(60.4)706231
WHIRLPOOL 1536.35(1553.9)50618
WIPRO 288.65(295.75)1486227
WOCKPHARMA 750.4(759.8)902069
WONDERLA 344.85(342.7)28227
ZEEL 566.45(570.35)1501099
ZEELEARN 37.05(38.6)197750
ZENSARTECH 881.45(907.6)4134
ZYDUSWELL 1200.8(1225.2)7764

## జూనియర్ కళాశాలలుగా గురుకులాలు

**త్వరలో ప్రభుత్వ ఉత్తర్వులు**

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కేజీ టు పీజీ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. తెలంగాణ గురుకుల విద్యాసంస్థ పరిధిలోని స్కూళ్లను జూనియర్ కళాశాలలుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. గురుకుల విద్యా సంస్థల సొసైటీ పరిధిలో 35 స్కూళ్లు ఉండగా.. 2017-18 విద్యా సంవత్సరంలో ఆరు స్కూళ్లను జూనియర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేసింది. వీటిలో ఇప్పటికే ఎంపీసీ, బైపీసీ కోర్సులను ప్రారంభించింది. మిగతా 29 స్కూళ్లను అప్‌గ్రేడ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ స్కూళ్లలో డిమాండ్ మేరకు మౌలిక వసతులు కల్పించి కళాశాలలుగా మార్చనుంది. ఈ స్కూళ్లను రెసిడెన్షియల్ విధానంలో 10వ తరగతి వరకు నిర్వహిస్తోంది. 2018-19 విద్యా సంవత్సరంలో ఇంటర్ ఫస్టియర్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ కోర్సులు ప్రారంభించనుంది. విద్యాశాఖ స్పెషల్ సీఎస్ రంజీవ్ ఆర్ ఆచార్య త్వరలో ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలిసింది.

### ● వెబ్‌సైట్‌లో దోస్త్ కాలేజీల వివరాలు

హైదరాబాద్, మార్చి19 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే 'దోస్త్' నోటిఫికేషన్ వెబ్‌సైట్‌లో రాష్ట్రంలోని అన్ని కాలేజీల వివరాలు అందుబాటులో పెట్టాలని ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. యూనివర్సిటీల వారిగా కాలేజీలు, కోర్సులు, సీట్ల సంఖ్య, ఫీజుల వివరాలతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల వివరాలను కూడా పొందుపర్చనున్నట్లు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ పాపిరెడ్డి తెలిపారు. సోమవారం మండలి కార్యాలయంలో దోస్త్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం వివరాలను వెల్లడించారు. ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్‌లో వెళ్లి కాలేజీల వివరాలకు సంబంధించిన బటన్ నొక్కగానే వివరాలన్నీ ఒకే దగ్గర ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నోటిఫికేషన్ తేదీలు, దరఖాస్తుల ప్రక్రియ, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ, వెబ్ ఆప్షన్లను వెబ్‌సైట్‌లో సమకూర్చుతామని తెలిపారు.

### ● మైనారిటీ గురుకులాలకు గడువు ఏప్రిల్ 20

హైదరాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మైనారిటీ రెసిడెన్షియల్ స్కూళ్లలో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 20 వరకు ఆహ్వానిస్తున్నామని టీఎంఆర్ఈఐఎస్ కార్యదర్శి షఫీయుల్లా తెలిపారు. 2018-19 విద్యా సంవత్సరంలో 5 నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలు పొందే విద్యార్థులు పాస్‌పోర్టు సైజ్‌ఫొటో, ఆధార్‌కార్డులతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 107 బాలుర, 97 బాలికల పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. దరఖాస్తులను tmreis.telangana.gov.in అనే వెబ్‌సైట్‌లో స్వీకరిస్తామన్నారు. ఈ-సేవ, మీసేవ కేంద్రాల నుంచి కూడా దరఖాస్తులు పంపవచ్చని ఆయన సూచించారు.

### ● భాషా కాలేజీల గుర్తింపునకు దరఖాస్తులు

హైదరాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): భాషా పండితుల శిక్షణా కళాశాలల(తెలుగు, హిందీ) గుర్తింపునకు ఈ నెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల విద్యాకమిషనర్ కిషన్ తెలిపారు. ఒక్కో కాలేజీ అఫిలియేషన్‌కు రూ.75 వేల డీడీ చెల్లించి, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ కార్యాలయంలో సమర్పించాలని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

### ● కడియంతో టీచర్ల పండిత పరిషత్తు భేటీ

హైదరాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): భాషా పండితుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి హామీ ఇచ్చారని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలిపింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్, ప్రధానకార్యదర్శి నర్సింహులు సోమవారం కడియంతో పండితుల సమస్యలపై చర్చించారు.

### ● నేడు కాంట్రాక్ట్ ఉద్యోగుల చలో అసెంబ్లీ

హైదరాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ మంగళవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. కనీస వేతనాలు పెంచాలన్న ప్రధాన డిమాండ్‌తో ఉదయం 11.30 గంటలకు బాగ్‌లింగంపల్లి నుంచి అసెంబ్లీకి బయల్దేరుతామని ఫెడరేషన్ నాయకుడు వెంకటేశ్ సోమవారం తెలిపారు.

### ● భూరికార్డులపై ర్యాండమ్ సర్వే: సీఎస్

హైదరాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): భూరికార్డుల నవీకరణలో సిద్ధం చేసిన రికార్డులను ర్యాండమ్‌గా సర్వే చేయించాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషి ఆదేశించారు. సోమవారం సచివాలయంలో రైతులకు పెట్టుబడి సాయం, భూరికార్డులపై ఆయన వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. రైతుల ఖాతాల వివరాలను ఈనెల 28లోగా వ్యవసాయశాఖకు అందించాలని ఆదేశించారు. గ్రామాల్లోని భూవిస్తీర్ణం, సర్వే నంబర్లు, ఖాతాల వివరాలు, రైతుల వివరాలను తహసీల్దార్లే సర్టిఫై చేయాలన్నారు. రైతులకు వ్యవసాయ పెట్టుబడిచెక్కులను సీఎం కేసీఆర్ ఏప్రిల్ 19న పంపిణీ చేస్తారన్నారు.

### ● పీఆర్సీపై మంత్రి హరీశ్ సమక్షంలో చర్చలు

హైదరాబాద్,మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులకు కొత్త పీఆర్సీ వేతనాలపై మంత్రి, టీఎంయూ గౌరవాధ్యక్షుడు హరీశ్‌రావు సమక్షంలో చర్చలు జరిగాయి. అసెంబ్లీ కమిటీ హాల్‌లో సోమవారం నాటి చర్చల్లో రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, ఆర్టీసీ ఎండీ రమణారావు, టీఎంయూ ప్రధానకార్యదర్శి అశ్వత్థామరెడ్డి తదితరులు పాల్గొన్నారు. 2017 ఏప్రిల్ 1నుంచి కొత్త పీఆర్సీ ప్రకారం వేతనాలు ఇవ్వాల్సి ఉందని కార్మిక నేతలు మంత్రులకు వివరించారు. మంగళవారం మరోసారి సమావేశమై పూర్తిస్థాయిలో చర్చిద్దామని మంత్రులు తెలిపారు.

### ● పేదల సంక్షేమమే ధ్యేయం: జోగు రామన్న

హైదరాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పేదలు, బడుగు బలహీనవర్గాల సంక్షేమమే రాష్ట్రప్రభుత్వ ధ్యేయమని బీసీ సంక్షేమం, అటవీ శాఖల మంత్రి జోగురామన్న అన్నారు. ఎంబీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గడ్డం సాయికిరణ్ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచార పోస్టర్‌ను సోమవారం మంత్రి ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

### ● తాగునీటి కొరత రానీయొద్దు: ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఈ వేసవిలో తాగునీటి కొరత రానీయొద్దని అధికారులను మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదేశించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ప్రతి ఆవాసానికి భగీరథ నీటిని బల్క్‌గా అందించాలన్నారు. భగీరథ పనుల పురోగతిపై అధికారులతో ఆయన సోమవారంసమీక్షించారు. 7 వేల ఆవాసాలతో పాటు 18 పురపాలికలకు భగీరథ నీటిని అందించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

### ● మోదీ చేతిలో పావుగా కేసీఆర్: జీవన్‌రెడ్డి

జగిత్యాల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ చేతిలో సీఎం కేసీఆర్ పావుగా మారారని సీఎల్పీ ఉపనేత, జగిత్యాల ఎమ్మెల్యే టి.జీవన్‌రెడ్డి విమర్శించారు. లోక్‌సభలో అవిశ్వాసతీర్మానం చర్చకురాకుండా టీఆర్ఎస్ ఎంపీలు ఆందోళన చేస్తున్నారని, ఇది మోదీ ఆడిస్తున్న నాటకంలో భాగమన్నారు. అవిశ్వాస తీర్మానాన్ని ఎన్డీయేతర పక్షాలన్నీ సమర్థిస్తున్నాయని, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతాబెనర్జీ కూడా మద్దతు ఇచ్చారన్నారు. మోదీకి వ్యతిరేకంగా అందరం ఏకం కావాలని మాట్లాడుతూనే అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వలేని కేసీఆర్‌కు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీని కలిసే నైతికత లేదని దుయ్యబట్టారు.

**ప్రభుత్వాన్ని కించపరుస్తూ పోస్టు..**

## పాత్రికేయుడి అరెస్టు

నల్లగొండ క్రైం, మార్చి 19: ముఖ్యమంత్రి, నల్లగొండ జిల్లా పోలీసు అధికారి స్థాయిని దిగజార్చే విధంగా సోషల్‌మీడియాలో పోస్టు చేసిన హైదరాబాద్‌లోని తార్నాకకు చెందిన ఓ పత్రిక న్యూస్ ఇన్‌చార్జి ఆనం చినవెంకటేశ్వర్‌రావును సోమవారం అరెస్టు చేశారు. ఈ నెల 18న తనకు వచ్చిన మెసేజ్‌లపై పోలీసు సంఘం కో ఆప్షన్ మెంబర్ హెచ్‌సీ సోమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన్ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ టూటౌన్ ఎస్సై మధు తెలిపారు. పోలీసులంటే ప్రజల్లో చెడు అభిప్రాయం కలిగేలా, ప్రభుత్వాన్ని కించపరిచే విధంగా ఆనం చినవెంకటేశ్వర్‌రావు సోషల్‌మీడియాలో పోస్టులు చేస్తున్నట్లు తమ విచారణలో తేలిందని పేర్కొన్నారు. నిందితుడిపై ఖమ్మం వన్‌టౌన్, కరీంనగర్ వన్‌టౌన్‌లో, వరంగల్ జిల్లా మట్వాడాలోనూ కేసులు నమోదయ్యాయన్నారు. అతడి నుంచి 10 సెల్‌ఫోన్లు, నాలుగు సిమ్‌కార్డులు, ఒక ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పోలీసుల ప్రతిష్టను దిగజార్చే విధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని నల్లగొండ టు టౌన్ ఎస్ఐ మధు ఒక ప్రకటనలో తెలిపారు.





# నేల దిగనున్న మెట్రో

హైదరాబాద్ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఒంటి స్తంభంపై ఒయ్యారాలు ఒలకబోస్తూ నగర వాసులను కనువిందు చేస్తోంది మొదటి దశ మెట్రో రైలు. దీనికి పూర్తి భిన్నంగా రెండో దశ మెట్రో రైలు సరికొత్త రూపంలో అందుబాటులోకి రానుంది. రెండోదశలో ఔటర్ రింగు రోడ్డు పొడవునా నేల మీద మెట్రో కారిడార్ నిర్మాణం జరగనుంది. కేవలం ఇంటర్‌చేంజ్ వద్ద మాత్రమే పిల్లర్లు నిర్మించనున్నారు. మరో ఏడాదిన్నర కాలంలోనే మెట్రో రెండో దశ మార్గాన్ని నిర్మించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. హైదరాబాద్ మెట్రో ఎయిర్‌పోర్టు ఎక్స్‌ప్రెస్ కారిడార్‌గా పిలిచే ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వమే త్వరితగతిన పూర్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. నాగోల్ నుంచి హైటెక్ సిటీ వరకు, అక్కడి నుంచి రాయదుర్గం వరకు నిర్మించే మెట్రో మొదటి దశ కారిడార్-3 మార్గానికి అనుసంధానంగా మెట్రో ఎయిర్‌పోర్టు ఎక్స్‌ప్రెస్ కారిడార్ నిర్మాణం కానుంది. గచ్చిబౌలి నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు ఉన్న ఔటర్ రింగు రోడ్డు పొడవునా నిర్మించే మెట్రో కారిడార్‌ను అత్యంత వేగంగా నిర్మించేందుకు అవకాశం ఉంది. సుమారు 31 కిలోమీటర్ల పొడవునా ఉండే మెట్రో ఎయిర్‌పోర్టు ఎక్స్‌ప్రెస్ కారిడార్ కోసం భూసేకరణ పెద్దగా అవసరం లేదు. కేవలం మెట్రో స్టేషన్‌లు, మెట్రో డిపోల కోసమే 60- 70 ఎకరాలు సేకరించాల్సిన అవసరం ఉంది.

### భూసేకరణ చేయాల్సిన అవసరం లేదు

హైదరాబాద్ మహానగరం చుట్టూ 158 కిలోమీటర్ల మేర ఔటర్ రింగు రోడ్డు ఉంది. ఇందులో గచ్చిబౌలి నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు ఉన్న ఓఆర్ఆర్ ఇప్పుడు మెట్రో ఎయిర్‌పోర్టు ఎక్స్‌ప్రెస్ కారిడార్‌కు కీలకంగా మారింది. సుమారు 31 కిలోమీటర్ల మేర ఉండే ఈ మార్గంలో భూసేకరణ సమస్య పెద్దగా లేదు. ఓఆర్ఆర్ ప్రణాళికలోనే రైల్వే కారిడార్ కోసం నగరం వైపు 25 మీటర్ల వెడల్పు తో ప్రత్యేకంగా భూమిని సేకరించి ఉంచారు. దీంతో మెట్రో రైలు మార్గం ప్రత్యేకంగా భూసేకరణ చేయాల్సిన అవసరం లేదు. 4 లేదా 5 చోట్ల మాత్రమే మెట్రో స్టేషన్‌లను నిర్మించనున్నారు. ఇందుకోసం స్థలాలు అందుబాటులో ఉన్నాయని మెట్రో అధికారులు పేర్కొంటున్నారు. గచ్చిబౌలి, రాయదుర్గం ప్రాంతాలతోపాటు విమానాశ్రయంలో మాత్రమే ప్రత్యేకంగా భూములను సేకరించాల్సి ఉంది. మెట్రో రైలు ను ఎయిర్‌పోర్టు వరకు నడిపేందుకు జీఎంఆర్ సంస్థ అంగీకరించడంతో పాటు ప్రాజెక్టులో తనవంతు వాటాగా సుమారు రూ.400 కోట్లను పెట్టుబడి పెట్టనుంది.



### 31 కి.మీ... 18 నిమిషాల్లోనే

గచ్చిబౌలి, రాయదుర్గం ప్రాంతాల నుంచి ప్రారంభమయ్యే మెట్రో ఎయిర్‌పోర్టు ఎక్స్‌ప్రెస్ కారిడార్ సుమారు 31 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ దూరాన్ని మెట్రో రైలులో కేవలం 18 నిమిషాల్లోనే చేరుకునేలా మెట్రో కారిడార్‌ను నిర్మిస్తున్నారు. రాయదుర్గంలో నిర్మించే ఇంటర్‌చేంజ్ స్టేషన్‌లోనే విమానాశ్రయ ప్రయాణికులకు సంబంధించిన తనిఖీ మొత్తాన్ని పూర్తి చేసి, నేరుగా ఎయిర్‌పోర్టు టర్మినల్‌లోకి వెళ్లేందుకు అనుమతించేలా మెట్రో మార్గాన్ని డిజైన్ చేస్తున్నామని మెట్రో అధికారి తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీ తర్వాత విమానాశ్రయంతో అనుసంధానమయ్యే మెట్రో మార్గంగా హైదరాబాద్ మెట్రో నిలవనుంది. కేవలం 4 లేదా 5 మెట్రో స్టేషన్‌లను గచ్చిబౌలి, నార్సింగి, అప్పా జంక్షన్, హిమాయత్‌సాగర్, శంషాబాద్ ప్రాంతాల్లోనే నిర్మించనున్నారు.

### ఇనుప కంచెల మధ్య రోడ్డు, మెట్రో మార్గాలు

158 కిలోమీటర్ల పొడవునా ఉన్న ఓఆర్ఆర్‌పై 19 చోట్ల మాత్రమే ఇంటర్‌చేంజ్‌లు ఉన్నాయి. ఆయా ఇంటర్‌చేంజ్‌ల వద్ద మాత్రమే మనుషులు, జంతువులు, ఇతర వాహనాలు రోడ్డు కింద నుంచి అటు, ఇటూ మారేందుకు అవకాశం ఉంది. మరెక్కడా ఔటర్ దాటేందుకు వీలు లేకుండా ఇనుప తీగలతో కూడిన రక్షణ కంచెను ఏర్పాటు చేశారు. దీంతో ఔటర్‌పై వాహనాలు ఎక్కడా ఆగకుండా గంటకు 100 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయే అవకాశం ఉంది. అదేవిధంగా మెట్రో రైలు సైతం గంటకు 135 కిలోమీటర్ల వేగంతో వెళ్లేలా ఓఆర్ఆర్ పొడవునా మెట్రో రైలు కారిడార్‌ను నిర్మించనున్నారు. ఓఆర్ఆర్ పొడవునా రైలు మార్గం కోసం అందుబాటులో ఉంచిన స్థలంలో మెట్రో రైలు మార్గాన్ని నిర్మించి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఎక్కడ రోడ్డుపై వెళ్లే ట్రాఫిక్‌తో ఆటంకాలు ఎదురు కాకుండా నిర్మాణాలను డిజైన్ చేస్తున్నారు.

### జీఎంఆర్ భాగస్వామ్యం

ఈ ప్రాజెక్టును ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో చేపట్టనున్నారు. ఇందులో హెచ్ఎంఆర్ వాటా 51 శాతం ఉంటే, హెచ్ఎండీఏ వాటా 48.09 శాతం. కాగా, మిగతా వాటాను టీఎస్ఐఐసీ, జీఎంఆర్ ఎయిర్ పోర్టు కలిగి ఉంటుంది. ఈ ప్రాజెక్టు కోసం సుమారు రూ.4వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా ఉండగా, ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.400 కోట్లు, హెచ్ఎండీఏ రూ.400 కోట్లు, హెచ్ఎంఆర్ రూ.400 కోట్లు, జీఎంఆర్ మరో రూ.400 కోట్లు వెచ్చించనుంది. మిగతా మొత్తాన్ని వివిధ ఆర్థిక సంస్థల నుంచి రుణాలు తీసుకొని నిర్మాణం చేపట్టనున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్టు పట్ల అన్ని సంస్థలు ఆసక్తిగా ఉండడంతో పాటు నిధులు వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నాయి. రికార్డులు సృష్టిస్తున్న శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మెట్రో కారిడార్ మరింత ఊపునివ్వనుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.



స్పీకర్ మధుసూదనాచారిని కలిసి తమ సమస్యలపై వినతి పత్రం ఇస్తున్న విశ్వకర్మ కులస్తులు

## కుల వృత్తులను ప్రోత్సహించాలి: స్పీకర్

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కుల వృత్తులను ప్రోత్సహించడంలో ప్రతిఒక్కరూ ప్రభుత్వానికి సహకరించాలని స్పీకర్ మధుసూ దనాచారి పిలుపునిచ్చారు. ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, ప్రతినిధులు అసెంబ్లీలో స్పీకర్‌ను సోమవారం కలిశారు. రానున్న వేసవి తీవ్రత దృష్ట్యా చల్లటి నీటికోసం మట్టితో తయారుచేసిన మంచినీటి ఫ్లాస్క్‌ను ఈ సందర్భంగా తాడూరి శ్రీనివాస్.. స్పీకర్‌కు బహూకరించారు. కులవృత్తులను ప్రోత్సహించేందుకే మట్టితో తయారుచేసిన ఫ్లాస్క్‌ను రూపొందించారని ఆయన అన్నారు. ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులకు వీటిని అందించనున్నట్టు శ్రీనివాస్ తెలిపారు. మరోవైపు విశ్వకర్మలను ఆదుకునేందుకు సీఎం కేసీఆర్ ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారని మధుసూదనాచారి అన్నారు. తాండూర్, వికారాబాద్‌కు చెందిన పలువురు విశ్వకర్మలు సోమవారం మంత్రి మహేందర్‌రెడ్డి నేతృత్వంలో స్పీకర్‌ని కలిశారు. ప్రతిజిల్లాలో విశ్వకర్మ భవన్‌ని నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని స్పీకర్ చెప్పారు. విశ్వకర్మలను బీసీ-ఏ జాబితాలో చేర్చాలని, 50 ఏళ్లు నిండిన విశ్వకర్మలకు పింఛన్లు ఇప్పించేలా చూడాలని వారు కోరారు.

## ప్లాట్లోయ్ ప్లాట్లు!

(మొదటి పేజీ తరువాయి)



హెచ్ఎండీఏ ప్లాట్ల వేలాన్ని నిర్వహిస్తోంది. నగరంతోపాటు శివారు ప్రాంతాల్లో గతంలో హుడా అభివృద్ధి చేసిన లే అవుట్లలో మిగిలిపోయిన ప్లాట్లు.. వివిధ ప్రైవేటు రియల్ ఎస్టేట్ సంస్థలు అభివృద్ధి చేసిన లే అవుట్లలో గిఫ్ట్ డీడ్ కింద హెచ్ఎండీఏకు సంక్రమించిన ప్లాట్లను వేలం వేస్తున్నారు. సుమారు 229 ప్లాట్లలో 1.16 లక్షల గజాల స్థలం విక్రయిస్తున్నారు. ప్రాంతాలవారీగా సబ్ రిజిస్ట్రేషన్ల పరిధిలో ఉన్న ధరలను పరిగణనలోకి తీసుకొని, వాటిపై 1.5 రెట్లు పెంచి అప్‌సెట్ ప్రైస్‌ను నిర్ణయించారు.

### రూ.300 కోట్లు ఆదాయ లక్ష్యం

హెచ్ఎండీఏ ప్లాట్ల వేలం ద్వారా సుమారు రూ.250 కోట్ల నుంచి 300 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. రానున్న 6 నెలల్లో ఉప్పల్-భగాయత్ లే అవుట్‌లోని ప్లాట్లను సైతం వేలం వేయనున్నారు. వాటిద్వారా మరో రూ.700 కోట్లు వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది ప్లాట్ల వేలం ద్వారా వచ్చే సుమారు రూ.1000 కోట్లను హెచ్ఎండీఏ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకే వెచ్చించనున్నారు.

**ఈ వేలం జరిగే తేదీలు:**
**ఏప్రిల్ 9, 10, 11, 12**
**సమయం:** ఉదయం 10 నుంచి 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు
**మొత్తం ప్లాట్లు:** 229
**ప్లాట్ల మొత్తం విస్తీర్ణం:** 1,16,046
**రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** ఏప్రిల్ 7

### పారదర్శకంగా ఈ వేలం

హెచ్ఎండీఏలో మొట్టమొదటిసారిగా పూర్తిస్థాయిలో ప్లాట్ల వేలాన్ని ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నామని హెచ్ఎండీఏ కమిషనర్ చిరంజీవులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎంఎస్‌టీసీతో కలిసి పారదర్శకంగా ఈ వేలాన్ని నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఆన్‌లైన్ వేలంలో పాల్గొనే వారు తొలుత రూ.10 వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, తర్వాత తాము ఎంచుకున్న ప్లాట్ల వివరాలను ఆన్‌లైన్‌లో తెలుసుకొని 10 శాతం ఈఎండీని ఆన్‌లైన్‌లోనే చెల్లించవచ్చని తెలిపారు. సమగ్ర సమాచారాన్ని హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. క్షేత్ర స్థాయిలో ప్లాట్ల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వెబ్‌సైట్‌లోనే జియో ట్యాగింగ్ ద్వారా గూగుల్ మ్యాప్స్‌లో అక్షాంశాలను, రేఖాంశాలను పొందుపర్చామన్నారు. ఈ-వేలంపై అవగాహన లేని వారికి తార్నాకలోని హెచ్ఎండీఏ కార్యాలయంలో ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తామన్నారు.

### ప్రతిరోజు 72 ప్లాట్ల వేలం

నాలుగు రోజుల్లో రోజుకు 72 ప్లాట్లకు వేలం నిర్వహిస్తామని, ఉదయం, మధ్యాహ్నం 36 చొప్పున ఈ ప్రక్రియ ఉంటుందని చిరంజీవులు చెప్పారు. ప్లాట్లను సొంతం చేసుకున్న వ్యక్తులు వేలానికి ముందు చెల్లించే 10 శాతం ఈఎండీతోపాటు మరో 20 శాతం చెల్లించాలని, మిగతా డబ్బులను 30 రోజులు లేదా 10 శాతం వడ్డీతో ఏడాదిలోపు చెల్లించే వెసులుబాటు కల్పించామని తెలిపారు. వాయిదాల పద్ధతిలో కూడా ప్లాటు ధరను చెల్లించవచ్చని చెప్పారు. ప్లాట్లను సొంతం చేసుకున్న వారికి సర్టిఫికెట్ ఇస్తామని, దాంతో బ్యాంకు లోను పొందే అవకాశం ఉందని తెలిపారు.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఖాళీ చేసిన మండలిలోని భవనాలను పరిశీలిస్తున్న శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ తదితరులు

**అవిశ్వాస తీర్మానానికి**

## టీఆర్ఎస్ మద్దతివ్వాలి: రావుల

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విభజన హామీల అమలు కోసం పార్లమెంట్‌లో బీజేపీ ప్రభుత్వంపై టీడీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి టీఆర్ఎస్ మద్దతు ఇవ్వాలని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలుగు ప్రజల ప్రయోజనాలను పరిరక్షించేందుకు టీఆర్ఎస్, తమకు సహకరించాలని అన్నారు. విభజన చట్టంలో తెలంగాణకు రావాల్సిన బయ్యారం స్టీల్ ప్లాంటు, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన, ఉద్యాన వర్సిటీలు, ఎయిమ్స్ వంటి హామీల అమలు కూడా అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉందని రావుల ఒక ప్రకటనలో తెలిపారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీల అమలుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చే బాధ్యత టీఆర్ఎస్‌పై ఉందన్నారు.

## ప్లాట్ విక్రయంపై ఇంటెలిజెన్స్ ఆరా

**ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన**

రంగారెడ్డి అర్బన్, మార్చి19 : 'ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు. దీంతో ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చలేకపోయా. నా పేరుతో ఉన్న ప్లాట్ ను విక్రయించి వచ్చే డబ్బు అభివృద్ధి పనులకు వెచ్చిస్తా' అంటూ రంగారెడ్డి జిల్లా చేవెళ్ల జడ్పీటీసీ సభ్యురాలు చింపుల శైలజ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ విషయమై రెండు రోజుల కిందట ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు ప్లాట్ అమ్మకానికి పెట్టారా? లేదా? అనే విషయాన్ని పోలీసు వర్గాల ద్వారా అధికారులు తెలుసుకుంటున్నారు. సోమవారం చేవెళ్ల సబ్‌రిజిస్ట్రార్‌లో సర్వే నంబర్ 56/ఆలో వంద గజాల స్థలం ఉందా? లేదా?అన్న విషయాన్ని నిర్ధారించుకున్నారు. కాగా, ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం 35-40 లక్షలు వస్తే ప్లాట్‌ను విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నానని, ఈ మొత్తాన్ని అభివృద్ధి కోసం కేటాయిస్తానని శైలజ స్పష్టం చేశారు.

## బార్లపై 10 ఎక్సైజ్ కేసులు

**ఎమ్మార్పీ ఉల్లంఘనలు, మద్యం కల్తీపై కేసులు**

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వారం పది రోజుల నుంచి ఎక్సైజ్ అధికారులు బార్లపై దృష్టి పెట్టారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేట్లకు మద్యాన్ని విక్రయిస్తున్నారనీ, మద్యాన్ని కల్తీ చేస్తున్నారన్న ఆరోపణలతో కేసులు పెడుతున్నారు. అయితే... ఎక్సైజ్ శాఖపై కోర్టుకు వెళ్లామన్న కక్షతోనే తమపై కేసులు పెట్టి వేధిస్తున్నారని బార్ల యాజమాన్యాలు వాపోతున్నాయి. ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాష్ట్రంలోని డిప్యూటీ కమిషనర్లు బార్లను తనిఖీ చేస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘించిన బార్లపై కేసులు నమోదు చేస్తున్నారు. కొన్ని బార్ల యజమానులు గరిష్ఠ చిల్లర ధర కంటే ఎక్కువ ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నారని, ఇంకా కొన్ని బార్లలో ఖరీదైన మద్యంలో చీప్ లిక్కర్‌ను, నీటిని కలుపుతున్నారని ఎక్సైజ్ అధికారులు వివరించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో మొత్తం 10 వరకు కేసులు నమోదు చేశారు. ఇందులో ఎక్కువగా ఖమ్మం జిల్లాలోనే నమోదు చేశారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని మియాపూర్, వరంగల్ జిల్లాలో కేసులు పెట్టారు. ఇలా కేసులు పెడుతూ హైకోర్టు కేసును విరమించుకోవాలని ఒత్తిడి తెస్తున్నారని యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి.

## జైల్లో అస్వస్థతకు గురైన గాంధీ

**ఆసుపత్రికి తరలింపు.. కోర్టుకు ఏసీబీ నివేదిక**

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయి, చంచల్‌గూడ జైలులో ఉన్న లేబర్ కోర్టు న్యాయాధికారి ఎం. గాంధీ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గత శనివారం అరెస్టయిన గాంధీని తొలుత ఏసీబీ అధికారులు కస్టడీకి తీసుకున్నారు. విచారణలో ఆయన అస్వస్థతకు గురవ్వడంతో గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆయన కోలుకున్న తర్వాత న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి, చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఆ తర్వాత న్యాయమూర్తి ఆదేశంతో జైలు అధికారులు మెరుగైన చికిత్స కోసం అతణ్ని మళ్లీ గాంధీ ఆసుపత్రిలో చేర్పించారు. 'ఆయన మూత్రపిండాలు, కాలేయ సంబంధ సమస్యలతో బాధపడుతున్నారు. అత్యవసర సేవల విభాగంలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది' అని గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రవణ్ కుమార్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

## ప్రజల దృష్టి మళ్లించేందుకే ఫ్రంట్: లక్ష్మణ్

మేడ్చల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను నెరవేర్చని ముఖ్యమంత్రి కేసీఆర్.. థర్డ్ ఫ్రంట్ అంటూ ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఆరోపించారు. మేడ్చల్ జిల్లాలోని గోసాయిగూడలో బీజేపీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీర్ ఫ్రంట్.. టెంటు సర్దుకుపోయే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ధనిక రాష్ట్రమని అందరినీ నమ్మిస్తూ అప్పుల ఊబిలో నెడుతున్నారని ఆరోపించారు.

## పాలకుర్తి నుంచే పోటీ చేస్తా: ఎర్రబెల్లి

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ పాలకుర్తి నియోజకవర్గం నుంచే పోటీచేస్తానని ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. జనగామ నుంచి పోటీ చేసే ఉద్దేశమే లేదని ఆయన స్పష్టం చేశారు. అసెంబ్లీ లాబీలో ఆయన మాట్లాడుతూ జనగామలో తనకు కొంత స్థలం ఉందని, అక్కడ ఇల్లు కట్టుకుంటే సౌకర్యంగా ఉంటుందన్న ఉద్దేశంతో ఆ స్థలం చూసేందుకు వెళ్లానని తెలిపారు. దీన్నిచూసి కొంత మంది తాను పోటీ చేస్తానంటూ ప్రచారం మొదలుపెట్టారని చెప్పారు.

## రాజ్యసభ ఎన్నికలపై నేడు మాక్ పోలింగ్

హైదరాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాల భర్తీకి ఈనెల 23న నిర్వహించే పోలింగ్‌పై తమ పార్టీ ఎమ్మెల్యేలకు ఓటువేసే విధానంపై అవగాహన కల్పించాలని టీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. ఓటింగ్ సందర్భంగా ఎమ్మెల్యేలు పొరపాట్లు చేయకుండా ఉండేందుకు తెలంగాణ భవన్‌లో మంగళవారం సాయంత్రం 5 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది.



దేశంలో పారిశ్రామిక, వ్యాపార రంగాల్లో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. కంపెనీ, కార్పొరేట్ చట్టాల్లో కాలానికి అనుగుణంగా నిరంతరం సవరణలు లేదా కొత్త చట్టాలను ప్రవేశపెడుతున్నారు. ఈ పరిస్థితుల్లో కంపెనీలు, వ్యాపార సంస్థల నిర్వహణలో కీలకంగా ఉండే కంపెనీ సెక్రటరీ (సీఎస్) బాధ్యత మరింత పెరిగింది. మార్పులను దృష్టిలో పెట్టుకొని అప్‌డేట్‌గా ఉంటూ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో కంపెనీ సెక్రటరీ కెరీర్‌ను ఎంచుకొనే అభ్యర్థులకు అవసరమైన నూతన నైపుణ్యాలను అందిచండానికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ).. సీఎస్ కోర్సులో కొన్ని మార్పులు చేసి కొత్త సిలబస్‌ను ప్రవేశపెట్టింది. ఈ వివరాలను చూద్దాం..

# సరికొత్త నైపుణ్యాలతో.. సీఎస్ కోర్సు

పద్దులు, చిట్టాల లెక్కల గణింపు అంటే ఆందోళన చెందే విద్యార్థులకు కార్యనిర్వాహక నైపుణ్యాలు సొంతం చేస్తూ వైట్ కాలర్ జాబ్‌ను అందించే కోర్సు కంపెనీ సెక్రటరీషిప్ (సీఎస్). ఈ కోర్సును ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) నిర్వహిస్తుంది. ఒక కంపెనీలోని బోర్డ్ మీటింగ్‌ల నిర్వహణ, ఎజెండా, మినిట్స్ రూపకల్పన, వాటి ఆచరణపై పర్యవేక్షణ వంటి ఎన్నో ఉన్నత స్థాయి బాధ్యలు నిర్వర్తించేది కంపెనీ సెక్రటరీలే.

### మార్పు ఎందుకంటే?

కార్పొరేట్ రంగంలో మారుతున్న పరిస్థితులు, వాటికి అనుగుణంగా ఔత్సాహికులను తీర్చిదిద్దడం, కోర్సు పూర్తయ్యేసరికి పరిపూర్ణ సీఎస్‌లుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో సిలబస్‌లో మార్పులు చేశారు. ఈ క్రమంలో ఐసీఎస్ఐ.. ఎగ్జిక్యూటివ్, ప్రొఫెషనల్ ప్రోగ్రామ్‌ల సిలబస్‌లో నూతన అంశాలను చేర్చారు. విద్యార్థులకు నూతన నైపుణ్యాలు అందించడమే కాకుండా ఇటీవల కార్పొరేట్ చట్టాలు, ఇతర అంశాల పరంగా విస్తృతంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వీటికి అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేసేందుకు నూతన సిలబస్‌ను ప్రవేశ పెట్టారు.

### కొత్తగా చేర్చినవి

కొత్త సిలబస్ ప్రకారం ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లో ఎనిమిది పేపర్లు, ప్రొఫెషనల్ ప్రోగ్రామ్‌లో తొమ్మిది పేపర్లు ఉంటాయి. ప్రొఫెషనల్ ప్రోగ్రామ్‌లో తొమ్మిదో పేపర్‌లో ఎనిమిది ఐచ్ఛిక పేపర్లు ఉన్నాయి. వీటిల్లోంచి ఏదో ఒక పేపర్‌ను విద్యార్థులు ఎంచుకోవాలి. అవి.. బ్యాంకింగ్ - లా అండ్ ప్రాక్టీస్, ఇన్సూరెన్స్ - లా అండ్ ప్రాక్టీస్, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ - లా అండ్ ప్రాక్టీసెస్, ఫోరెన్సిక్ ఆడిట్, డైరెక్ట్ ట్యాక్స్ - లా అండ్ ప్రాక్టీస్, లేబర్ 'లా'స్ అండ్ ప్రాక్టీస్, వాల్యుయేషన్స్ అండ్ బిజినెస్ మోడలింగ్, ఇన్‌సాల్వెన్సీ - లా అండ్ ప్రాక్టీస్.

### అప్రెంటీస్‌షిప్ తప్పనిసరి

సీఎస్ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్, ప్రొఫెషనల్ ప్రోగ్రామ్ సిలబస్‌లో మార్పులు చేసిన ఐసీఎస్ఐ.. ఫౌండేషన్ నుంచి ప్రొఫెషనల్ వరకు అమలు చేస్తున్న పలు రకాల శిక్షణ విధానాల్లోనూ మార్పు చేసింది. ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ విద్యార్థులకు స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రామ్, కంప్యూటర్ ట్రైనింగ్ నుంచి మినహాయింపు ఇచ్చింది. సీఎస్ కోర్సు పూర్తిచేసే క్రమంలో విద్యార్థులు కేవలం రాత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడమే కాకుండా.. తప్పనిసరిగా అప్రెంటీస్‌షిప్ పేరుతో ఉండే ప్రాక్టికల్ ట్రైనింగ్ పూర్తిచేయాల్సి ఉంటుంది. ఈ అప్రెంటీస్‌షిప్ గరిష్ఠ వ్యవధి మూడేళ్లు. అభ్యర్థులు సీఎస్ కోర్సు ఏ దశలో చేరారో దానికి అనుగుణంగా ఈ వ్యవధిలో మార్పు ఉంటుంది.

### మూడు దశల్లో

కంపెనీ సెక్రటరీషిప్ కోర్సు మూడు దశల్లో ఉంటుంది. అవి.. ఫౌండేషన్ ప్రోగ్రామ్, ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్, ప్రొఫెషనల్ ప్రోగ్రామ్. సీఎస్ కోర్సులో ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన అర్హతో అడుగుపెట్టొచ్చు. గ్రాడ్యుయేషన్ / పోస్ట్‌గ్రాడ్యుయేషన్ (ఫైన్ ఆర్ట్స్ మినహా) లేదా సీఏలో ఫౌండేషన్ కోర్సు పూర్తి చేసిన వారికి నేరుగా ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశం కల్పిస్తారు. డిసెంబర్‌లో పరీక్షలు రాయాలనుకునే వారు మార్చి 31లోపు, జూన్‌లో రాయాలనుకునే వారు సెప్టెంబర్ 30లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వెబ్‌సైట్: www.icsi.edu

### నైపుణ్యాలు

కంపెనీ సెక్రటరీ వృత్తిలో స్థిరపడాలనుకునే విద్యార్థులకు ప్రాథమికంగా కావాల్సిన లక్షణం సునిశిత, తార్కిక పరిశీలన, నిరంతర అభ్యసనం. కంపెనీ సెక్రటరీ అంటే సదరు సంస్థకు సంబంధించి షేర్ హోల్డింగ్స్ నుంచి న్యాయపరమైన అంశాల వరకు అన్నిటిని పర్యవేక్షించాల్సి ఉంటుంది. కాబట్టి ఈ విషయంలో నిరంతరం వస్తున్న మార్పులను గమనిస్తూ ఉండాలి. ఎప్పటికప్పుడు కొత్త విషయాలను అవగాహన చేసుకుంటూ ముందుకు సాగాలి.

### ధోకా లేని కెరీర్

సీఎస్ కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగం గ్యారెంటీ అని చెప్పొచ్చు. 1956 కంపెనీల చట్టం ప్రకారం రూ. 5 కోట్ల అధీకృత మూలధనం ఉన్న ప్రతి సంస్థ ఒక పూర్తి స్థాయి కంపెనీ సెక్రటరీని నియమించుకోవాలి. ఒక సంస్థ ప్రారంభ సమయంలో సమర్పించాల్సిన డాక్యుమెంట్లను కంపెనీ సెక్రటరీ ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఆయా సంస్థల విలీన ప్రక్రియ, ఖాయిలా పరిశ్రమల పునరుద్ధరణ, దివాలా పిటిషన్ అంశాల్లో కంపెనీ సెక్రటరీలది కీలక పాత్ర. మరోవైపు దేశంలో కంపెనీ సెక్రటరీల కొరత తీవ్రంగా ఉంది. కాబట్టి అవకాశాలకు ధోకా ఉండదు.

- ఐసీఎస్ఐ చాప్టర్లలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ కూడా ఉంటాయి. సొంతంగా ప్రాక్టీస్ కూడా చేయవచ్చు. అసిస్టెంట్ కంపెనీ సెక్రటరీగా కెరీర్ ప్రారంభమవుతుంది. అనుభవం ఆధారంగా ఉన్నత స్థాయిలోని హోదాలను అందుకోవచ్చు.

## ఎప్పటి నుంచి..?

2018, మార్చి 1 నుంచి ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ (మాడ్యూల్ 1 - 4 పేపర్లు; మాడ్యూల్ 2 - 4 పేపర్లు)కు కొత్త సిలబస్ అమల్లోకి వచ్చింది. ఎగ్జిక్యూటివ్ ప్రోగామ్ నూతన సిలబస్ ప్రకారం మొదటి పరీక్షను 2018, డిసెంబర్‌లో నిర్వహిస్తారు. పాత సిలబస్ ప్రకారం ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ చివరి పరీక్ష 2019, డిసెంబర్‌లో ఉంటుంది. 2020, జూన్ నుంచి ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ పరీక్షలను పూర్తిగా కొత్త సిలబస్‌తోనే నిర్వహిస్తారు.

- ప్రొఫెషనల్ ప్రోగ్రామ్ (3 మాడ్యూళ్లలో 9 పేపర్లు)కు 2018, సెప్టెంబర్ 1 నుంచి కొత్త సిలబస్ అమలవుతుంది. ప్రొఫెషనల్ ప్రోగామ్ నూతన సిలబస్ ప్రకారం మొదటి పరీక్షను 2019, జూన్‌లో నిర్వహిస్తారు. పాత సిలబస్ ప్రకారం ప్రొఫెషనల్ ప్రోగ్రామ్ చివరి పరీక్ష 2020, జూన్‌లో ఉంటుంది. 2020, డిసెంబర్ నుంచి ప్రొఫెషన్ ప్రోగ్రామ్ పరీక్షలను పూర్తిగా కొత్త సిలబస్‌తోనే నిర్వహిస్తారు.

### ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ కొత్త సిలబస్

**మాడ్యూల్ - 1 :**

1. జ్యూరిస్‌ప్రుడెన్స్, ఇంటర్‌ప్రెటేషన్ అండ్ జనరల్ 'లా'స్.
2. కంపెనీ లా.
3. సెటింగ్ అప్ ఆఫ్ బిజినెస్ ఎంటిటీస్ అండ్ క్లోజర్ (వ్యాపార సంస్థల ఏర్పాటు, మూసివేత).
4. ట్యాక్స్ 'లా'స్.

**మాడ్యూల్ - 2 :**

5. కార్పొరేట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్.
6. సెక్యూరిటీస్ 'లా'స్ అండ్ క్యాపిటల్ మార్కెట్స్.
7. ఎకనామిక్, బిజినెస్ అండ్ కమర్షియల్ 'లా'స్.
8. ఫైనాన్షియల్ అండ్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్.

### ప్రొఫెషనల్ ప్రోగ్రామ్ కొత్త సిలబస్

**మాడ్యూల్ - 1 :**

1. గవర్నెన్స్, రిస్క్ మేనేజ్‌మెంట్, కంప్లయన్సెస్ అండ్ ఎథిక్స్.
2. అడ్వాన్స్‌డ్ ట్యాక్స్ 'లా'స్.
3. డ్రాఫ్టింగ్, ప్లీడింగ్స్ అండ్ అపీయరెన్సెస్.

**మాడ్యూల్ - 2 :**

4. సెక్రటేరియల్ ఆడిట్, కంప్లయన్స్ మేనేజ్‌మెంట్ అండ్ డ్యూ డిలిజెన్స్.
5. కార్పొరేట్ రీస్ట్రక్చరింగ్, ఇన్‌సాల్వెన్సీ, లిక్విడేషన్ అండ్ వైండింగ్ అప్.
6. రిజల్యూషన్ ఆఫ్ కార్పొరేట్ డిస్ప్యూట్స్, నాన్ కంప్లయెన్సెస్ అండ్ రెమిడీస్.

**మాడ్యూల్ - 3 :**

7. కార్పొరేట్ ఫండింగ్ అండ్ లిస్టింగ్స్ ఇన్ స్టాక్ ఎక్స్ఛేంజెస్.
8. మల్టీ డిసిప్లినరీ కేస్ స్టడీస్.
9. ఎలక్టివ్ పేపర్.

- బ్యాంకింగ్- లా అండ్ ప్రాక్టీస్
- ఇన్సూరెన్స్ - లా అండ్ ప్రాక్టీస్.
- ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ - లా అండ్ ప్రాక్టీసెస్.
- ఫోరెన్సిక్ ఆడిట్.
- డైరెక్ట్ ట్యాక్స్ లా అండ్ ప్రాక్టీస్.
- లేబర్ 'లా'స్ అండ్ ప్రాక్టీస్.
- వాల్యుయేషన్స్ అండ్ బిజినెస్ మోడలింగ్.
- ఇన్‌సాల్వెన్సీ - లా అండ్ ప్రాక్టీస్. (వీటిలో ఒక దాన్ని ఎంపిక చేసుకోవాలి).

# రెండంచెల వ్యూహంతో గేట్‌లో విజయం

టాపర్స్ వాయిస్

కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, అత్యుత్తమ ఇన్‌స్టిట్యూట్ నుంచి ఉన్నత విద్యను అభ్యసించాలనే ఆశయమే గేట్ - సీఎస్ఈ పేపర్‌లో జాతీయ స్థాయిలో నాలుగో ర్యాంక్ సాధించడానికి స్ఫూర్తిగా నిలిచాయి అంటున్నారు **భార్గవ్ థాంకీ.** ఈ నేపథ్యంలో తన ప్రిపరేషన్ వ్యూహం, భవిష్యత్ ఔత్సాహికులకు సలహాలు తదితర అంశాలను దిక్సూచితో పంచుకున్నాడు. ఆ విశేషాలు అతని మాటల్లోనే..

గేట్‌లో జాతీయ స్థాయిలో నాలుగో ర్యాంక్ రావడం ఆనందంగా ఉంది. కుటుంబ సభ్యులు ఎంతో ప్రోత్సహించే వారు. ఫలితాలు లేదా మార్కుల గురించి ఎప్పుడూ ఒత్తిడికి గురి చేసే వారు కాదు. దేశంలోనే అత్యుత్తమ ఇన్‌స్టిట్యూట్ నుంచి ఉన్నత విద్యను అభ్యసించాలని మొదటి నుంచి అనుకొనేవాడిని. ఈ అంశాలు నా విజయానికి స్ఫూర్తిగా నిలిచాయి.

### నేపథ్యం

మాది గుజరాత్‌లోని అహ్మదాబాద్. మొదటి నుంచి చదువులో చురుగ్గా ఉండే వాణ్ని. అహ్మదాబాద్‌లోనే పాఠశాల విద్య, ఇంజనీరింగ్ పూర్తి చేశాను. ప్రస్తుతం గేట్‌లో వచ్చిన ర్యాంక్‌తో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ) - బెంగళూరు నుంచి ఎంటెక్ చేయాలనుకుంటున్నాను.

### కీలకం మాక్ టెస్ట్‌లు

ఐసీఈ ఇన్‌స్టిట్యూట్ నుంచి 2016లో గేట్ కోచింగ్ తీసుకున్నాను. గేట్ ప్రిపరేషన్‌లో రెండంచెల వ్యూహాన్ని అనుసరించాను. మొదట నాకు ఆసక్తి ఉన్న సబ్జెక్ట్‌లు అల్గారిథమ్స్, థియరీ ఆఫ్ కంప్యూటేషన్ చదివాను. ఇందుకోసం స్టాండర్డ్ రిఫరెన్స్ పుస్తకాలను అనుసరించాను. యూనివర్సిటీ లెక్చర్ నోట్స్‌కు అనుబంధంగా చదువుతున్నప్పుడు ఆయా పుస్తకాల్లోంచి సొంతంగా నోట్స్ రూపొందించుకున్నాను. తరవాత కంప్యూటర్ నెట్‌వర్క్స్, కంపైలర్ డిజైన్ వంటి సబ్జెక్ట్‌ల కోసం కోచింగ్ నోట్స్‌ను చదివాను. ఈ నాలుగు సబ్జెక్ట్‌లను యూనివర్సిటీ పరీక్షల కంటే ముందే.. అంటే నవంబర్ నాటికే పూర్తి చేశాను. వాస్తవంగా చెప్పాలంటే నవంబర్ 19 నుంచే గేట్ కోసం సీరియస్‌గా ప్రిపరేషన్ ప్రారంభించాను. యూనివర్సిటీ పుస్తకాల కంటే స్టాండర్డ్ పుస్తకాలు చదవడం వల్ల కాన్సెప్ట్స్‌పై పట్టు పెరిగింది. జనవరి 15 నాటికే అన్ని సబ్జెక్ట్‌లను చదవడం పూర్తి చేశాను. తరవాత నుంచి రోజుకు ఒక సబ్జెక్ట్‌ను పునశ్చరణ చేసుకోవడం, ఆ సబ్జెక్ట్‌పై మాక్ టెస్ట్‌తోపాటు ఫుల్ కోర్సు టెస్ట్ ప్రయత్నించేవాణ్ని. ఈ క్రమంలో గత గేట్ ప్రశ్నపత్రాలను సాధించడం, సాధ్యమైనన్ని మాక్ టెస్ట్‌లు రాయడం విజయానికి కారణాలుగా భావిస్తున్నా.

### ఇన్ని గంటలని కాదు

ప్రత్యేకంగా ఇన్ని గంటలు చదవాలనే షెడ్యూల్‌ను ఏమీ రూపొందించుకోలేదు. ఒక్కోసారి రోజుకు 10 గంటలు చదివే వాణ్ని. ఒక్కో రోజు సబ్జెక్ట్‌తో సంబంధం లేని ఇతర పుస్తకాలను చదివేవాణ్ని. రోజులవారీగా కాకుండా ఒక వారంలో ఇవి చదవాలని నిర్ణయించుకునేవాణ్ని.

### ఒత్తిడి లేకుండా

ప్రశ్నపత్రం పూర్తిగా చదవకుండా.. అందులో ఇచ్చిన క్రమంలో సమాధానాలను రాశాను. చాలా టెస్ట్ సిరీస్‌లు రాయడం వల్ల పరీక్షలో ఎటువంటి ఒత్తిడికి గురికాలేదు. నిర్ణీత సమయంలోగానే పరీక్షను పూర్తి చేశాను. కాకపోతే ఆన్‌లైన్ కాలిక్యులేటర్‌ను ఉపయోగించడంలో కొన్ని సార్లు తప్పు చేశాను.



### ఔత్సాహికులకు సలహా

సాధ్యమైనంత త్వరగా గేట్‌పై ఒక నిర్ణయానికి రావాలి. ఐదో సెమిస్టర్‌లోపే గేట్ రాయాలా? వద్దా? అనే విషయంలో స్పష్టతకు రావాలి. గేట్ కోసం ఇంజనీరింగ్ మొదటి, రెండో సంవత్సరం పుస్తకాలు చదివితే సరిపోతుంది. మూడో సంవత్సరంలో కొశ్చన్ బ్యాంక్స్ లేదా స్థానికంగా ఉండే ప్రొఫెసర్లు రాసిన పుస్తకాలు అధ్యయనం చేయాలి. అప్పటికీ కూడా కాన్సెప్ట్‌లపై పట్టు రాకుంటే కోచింగ్‌లో చేరటం మంచిది.

- ప్రిపరేషన్‌లో ఒత్తిడికి గురికాకుండా చూసుకోవాలి. ఆత్మవిశ్వాసంతో ఉండాలి. రోజు మొత్తం చదవాల్సిన అవసరం లేదు. నా దృష్టిలో కోచింగ్ తప్పనిసరి కాదు. కాకపోతే విజయం సాధించడానికి కోచింగ్ చాలా వరకు ఉపయోగపడుతుంది. ఆన్‌లైన్‌లో ఎన్నో టెస్ట్ సిరీస్‌లు అందుబాటులో ఉంటాయి. పరీక్షకు నెలరోజుల ముందు నుంచి వాటిని ప్రయత్నించడం చాలా ప్రయోజనకరం. సక్సెస్ వచ్చే వరకు కృషి చేస్తూనే ఉండాలి.

# జాబ్ కార్నర్

## ఎయిమ్స్ భువనేశ్వర్

భువనేశ్వర్‌లోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)- ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ రెసిడెంట్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

- విభాగాలు: పాథాలజీ / జనరల్ సర్జరీ / అనెస్తీషియాలజీ / మైక్రో బయాలజీ / సైకియాట్రీ / రేడియో డయాగ్నసిస్ / జనరల్ మెడిసిన్ / మెడికల్ అంకాలజీ.
- అర్హత: సంబంధిత విభాగంలో ఎండీ / డీఎం పూర్తిచేసి ఉండాలి.
- వయసు: ఇంటర్వ్యూ నాటికి 37 ఏళ్లు మించకూడదు.
- ఒప్పంద వ్యవధి: 11 నెలలు
- వేతనం: నెలకు రూ.66,000
- దరఖాస్తు ఫీజు: జనరల్ & ఓబీసీ అభ్యర్థులకు రూ.1000 ఎస్సీ / ఎస్టీలకు రూ.800
- ఇంటర్వ్యూ: ఏప్రిల్ 7
- వెబ్‌సైట్: www.aiimsbhubaneswar.edu.in

## ఎన్ఐఈపీఐడీ

సికింద్రాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చ్యువల్ డిజెబిలిటీస్ (ఎన్ఐఈపీఐడీ) - డైరెక్ట్ ప్రాతిపదికన కింది ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఉద్యోగాలు: స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్, హోం విజిటర్/ టీచర్, జూనియర్ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్, స్టెనోగ్రాఫర్.
- అర్హత: (డిగ్రీ / డిప్లొమా) (స్పెషల్ ఎడ్యుకేషన్) / బీఈడీ / బీఆర్ఎస్ /పీజీ (సోషల్ వర్క్) / ఇంటర్ / పదోతరగతి / టైపింగ్ / షార్ట్‌హ్యాండ్ అర్హతలు ఉండాలి.
- వయసు: 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 9
- వెబ్‌సైట్:www.niepid.nic.in

## ఏఎస్ఆర్‌బీ

న్యూఢిల్లీలోని అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ఏఎస్ఆర్‌బీ) కింది ఖాళీలను భర్తీ చేయనుంది.

- ఖాళీలు: **20**
- ఉద్యోగాలు: ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ 9, హెడ్ ఆఫ్ డివిజన్ 11
- అర్హత: సంబంధిత విభాగంలో డాక్టోరల్ డిగ్రీ.
- వయసు: దరఖాస్తు నాటికి 60 ఏళ్లు మించకూడదు
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 16
- వెబ్‌సైట్: www.asrb.org.in

## ఐఐఎస్ఈఆర్

పుణెలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్)- నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఖాళీలు: **28**
- ఉద్యోగాలు: లైబ్రేరియన్ 1, డిప్యూటీ రిజిస్ట్రార్ 1, ప్రిన్సిపల్ టెక్నికల్ ఆఫీసర్ 2, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ 3, అసిస్టెంట్ లైబ్రేరియన్ 1, టెక్నికల్ ఆఫీసర్ 5, నర్స్ 1, టెక్నికల్ అసిస్టెంట్ 12, ల్యాబొరేటరీ టెక్నీషియన్ 1, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ 1
- అర్హత: ఉద్యోగ నిబంధనల ప్రకారం ఇంటర్ / డిప్లొమా / డిగ్రీ / పీజీ / పీహెచ్‌డీ ఉత్తీర్ణులై ఉండాలి. నిర్దేశించిన మేర అనుభవం తప్పనిసరి.
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 6
- వెబ్‌సైట్: www.iiserpune.ac.in

# ఏఏఐలో జూనియర్ ఎగ్జిక్యూటివ్‌లు

**గేట్ 2018 ఫలితాలు వచ్చేశాయి. ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల్లో నియామకాల సందడి ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) నుంచి భారీ ప్రకటన విడుదలైంది. వివిధ ఇంజనీరింగ్ విభాగాల్లో 542 మంది జూనియర్ ఎగ్జిక్యూటివ్‌లను గేట్ స్కోరు ద్వారా భర్తీ చేయనున్నారు. మంచి హోదాతోపాటు అయిందకెల జీతాన్ని అందించే ఈ సువర్ణావకాశానికి సంబంధించిన వివరాలు ...**

**ఖాళీల వివరాలు:** జనరల్ అభ్యర్థులకు 298, ఓబీసీలకు 136, ఎస్సీలకు 69, ఎస్టీలకు 39 పోస్టులను కేటాయించారు.

| విభాగం | జనరల్ | ఓబీసీ | ఎస్సీ | ఎస్టీ |
|---|---|---|---|---|
| సివిల్ | 50 | 27 | 15 | 8 |
| ఎలక్ట్రికల్ | 50 | 27 | 15 | 8 |
| ఎలక్ట్రానిక్స్ | 189 | 80 | 39 | 22 |
| ఆర్కిటెక్చర్ | 9 | 2 | - | 1 |

### అర్హత

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 60 శాతం మార్కులతో బీఈ / బీటెక్ (సివిల్ / ఎలక్ట్రికల్ / ఎలక్ట్రానిక్స్ / టెలీ కమ్యూనికేషన్స్ / ఎలక్ట్రికల్ - ఎలక్ట్రానిక్స్ / ఆర్కిటెక్చర్) ఉత్తీర్ణులై ఉండాలి. ఆయా విభాగానికి నిర్దేశించిన గేట్ కోడ్ పేపర్‌లో అర్హత మార్కులు సాధించి ఉండాలి. దూరవిద్యా విధానంలో లేదా పార్ట్ టైం కోర్సులు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు. ఏఎంఐఈ సంబంధిత కోర్సులు చేసిన అభ్యర్థుల దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోరు. ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ అభ్యర్థులు మాత్రం డిగ్రీ స్థాయిలో వచ్చిన మార్కుల జాబితాను జతచేయాల్సి ఉంటుంది. దరఖాస్తుకు వృత్తిపరమైన ఎలాంటి అనుభవం అవసరం లేదు.

### వయసు

ఏప్రిల్ 30 నాటికి జనరల్ అభ్యర్థులకు 27 ఏళ్లు, ఓబీసీలకు 30 ఏళ్లు, ఎస్సీ / ఎస్టీలకు 32 ఏళ్లు మించరాదు.



ఎక్స్ సర్వీస్‌మెన్, జమ్ము, కశ్మీర్ అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

### ఎంపిక

అభ్యర్థులు తమ దరఖాస్తుతోపాటు గేట్ 2018 స్కోరు కార్డును విధిగా జతచేయాలి. గేట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ ప్రకారం అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. తదుపరి ఢిల్లీలో డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు. డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ కోసం అభ్యర్థుల ఈమెయిల్‌కు కాల్ లెటర్ పంపుతారు.

- కాల్ లెటర్ ప్రతిని తమ వెంట తీసుకురాని అభ్యర్థులను వెరిఫికేషన్ ప్రక్రియకు అనుమతించరు. ఇప్పటికే ప్రభుత్వ / ప్రైవేటు రంగ సంస్థల్లో పనిచేస్తున్న అభ్యర్థులు విధిగా తమ సంస్థ నుంచి అనుమతి పత్రాన్ని సమర్పించాలి. అప్పటికప్పుడు రాజీనామా పత్రాన్ని రాయడం, పనిచేస్తున్న సంస్థ అనుమతి కోసం దరఖాస్తు చేసిన పత్రాలను, అనుభవానికి సంబంధించిన సర్టిఫికెట్లను పరిగణనలోకి తీసుకోరు.
- వెరిఫికేషన్ సమయంలో అభ్యర్థులు విద్యార్హతలకు సంబంధించి ఒరిజినల్ సర్టిఫికెట్లను అధికారులకు చూపించాల్సి ఉంటుంది. వారికి ఏ మాత్రం అనుమానం వచ్చినా, దరఖాస్తులో ఇచ్చిన సమాచారంతో వివరాలు సరిపోలకపోయినా అభ్యర్థులను వెనక్కి పంపే ప్రమాదముంది. వయసు, అర్హత, కులం, మెడికల్ ఫిట్‌నెస్ సంబంధిత పత్రాలపై వెరిఫికేషన్ ప్రక్రియ నిర్విఘ్నంగా ముగిస్తే ఉద్యోగం వచ్చినట్లే. ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్‌ను వారి ఈ మెయిల్‌కు పంపుతారు.

### వేతనం

ఏడాదికి రూ.9 లక్షల వరకు ప్యాకేజీ ఉంటుంది. దీనితోపాటు బేసిక్ పేలో మూడు శాతం ఇంక్రిమెంట్, 35 శాతం డియర్‌నెస్ అలవెన్స్ ఇస్తారు. సంస్థ నిబంధనల ప్రకారం సీపీఎఫ్, గ్రాట్యుటీ, సోషల్ సెక్యూరిటీ స్కీమ్‌లు, మెడికల్ బెనిఫిట్స్, యూనిఫామ్ అలవెన్స్ వంటి సౌకర్యాలు ఉంటాయి.

### ముఖ్య సమాచారం

- దరఖాస్తు ఫీజు: రూ.300 (ఎస్సీ / ఎస్టీ / దివ్యాంగులు / మహిళలకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: మార్చి 28
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 27
- దరఖాస్తు ఫీజు చెల్లించేందుకు ఆఖరు తేదీ: మే 2
- వెబ్‌సైట్: www.aai.aero

# దుబాయ్‌లో గుండెపోటుతో సిద్దిపేట వాసి మృతి

**ఈ నెల 14న ఘటన.. మృతదేహం కోసం కుటుంబసభ్యుల ఎదురుచూపులు**


వడ్లూరి బాలయ్య (ఫైల్)

సిద్దిపేట రూరల్, మార్చి 19: సిద్దిపేటలోని కాళ్లకుంటకాలనీకి చెందిన వడ్లూరి బాలయ్య (50) దుబాయ్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. ఉపాధి కోసం పదేళ్ల క్రితం దుబాయ్‌కి వెళ్లిన బాలయ్య.. అక్కడ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 14న తన గదిలోనే గుండెపోటుతో ప్రాణాలు విడిచాడు. బాలయ్య మృతిచెంది ఐదు రోజులు గడుస్తున్నా మృతదేహం ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు నిద్రాహారాలు మరిచి ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం స్పందించి మృతదేహాన్ని స్వస్థలానికి తెప్పించాలని వేడుకుంటున్నారు. బాలయ్యకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.



# ఎడారిలో పూల తోట

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఎడారి దేశాలంటే సాధారణంగా మనకు మండే ఎండలు, ఇసుక మైదానాలే గుర్తొస్తాయి. కానీ.. మండుతున్న ఎడారిలో మల్లెపూల సౌరభాలు మత్తెక్కిస్తే? గులాబి బాలల గుబాళింపులు గుమ్మెక్కిస్తే? అలాంటి అద్భుతమైన దృశ్యం సౌదీలోని యాన్బు అనే పారిశ్రామిక పట్టణంలో ఏటా మార్చి నెలలో ఆవిష్కృతమవుతుంది. స్థానికంగా పెరిగే పూలతో నిర్వహించే ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంటుంది.. తీవ్ర ఉష్ణోగ్రత ఉన్నప్పటికి చెట్ల పెంపకంపై గల్ఫ్ దేశాలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తాయి. నగరాల సుందరీకరణకు.. ప్రత్యేకించి రోడ్లకు ఇరువైపులా పూల మొక్కల పెంపకానికి ప్రత్యేక విభాగాలను ఏర్పాటుచేస్తాయి. రోజుకు రెండు- మూడు సార్లు ట్యాంకర్ల ద్వారా నీరు పోస్తూ, ఎరువులు వేస్తూ మొక్కలను పరిరక్షిస్తాయి. గులాబీ, మల్లె, చామంతితో సహా అన్ని రకాల, రంగుల పువ్వులూ గల్ఫ్ దేశాల్లో పూస్తాయి. ఇక.. యాన్బులో 12 సంవత్సరాలుగా జరుగుతున్న పూల ఉత్సవానికి లక్షలాది మంది విచ్చేసి పూబాలల సోయగాలను చూసి మైమరచిపోతారు. ఈ ఏడాది మార్చి 1న మొదలై 25 దాకా జరగనున్న ఈ ప్రదర్శనను ఇప్పటిదాకా 15 లక్షల మంది దీన్ని సందర్శించారు. గల్ఫ్ దేశాల్లోనే అతిపెద్దదైన యాన్బు పూల ఉత్సవం (గత ఏడాది 1,73,665 చదరపుటడుగుల విస్తీర్ణంలో నిర్వహించారు) గిన్నీస్ బుక్ రికార్డులో మూడు సార్లు చోటు సంపాదించుకుంది.

# న్యాయ ప్రపంచంలో ఒకే ఒక్కడు

**కోట్లు కురిపించే కోర్ట్ ఆటోమేషన్ సాఫ్ట్‌వేర్ రూపొందించిన మన తెలుగోడు.. సూర్య ప్రకాశ్**



విదేశీ గడ్డపై మన జెండా ఎగరవేసిన తెలుగు వాళ్లు మనకు అనేక రంగాల్లో కనిపిస్తారు. అలాంటి వారిలో ఒకరు సూర్యప్రకాశ్. మెకానికల్ ఇంజనీరింగ్ చదివి.. కొద్దిగా లేటుగా సాఫ్ట్‌వేర్ రంగంలోకి ప్రవేశించిన సూర్య రూపొందించిన కోర్ట్ ఆటోమేషన్ సాఫ్ట్‌వేర్ ఈ రోజు న్యాయప్రపంచంలో ఒక సంచలనం. హేగ్ (నెదర్లాండ్స్)లోని అంతర్జాతీయ నేర న్యాయస్థానం (ఐసీసీ) నుంచి ఆస్ట్రేలియాలో రాయల్ కమిషన్స్ దాకా అనేక జాతీయ, అంతర్జాతీయ కోర్టులు ఈ సాఫ్ట్‌వేర్‌నే ఉపయోగిస్తున్నాయి. ఆస్ట్రేలియా కోర్టుల విషయంలో సూర్యాది ఏకఛత్రాధిపత్యమే! అక్కడ ఉన్న కోర్టులన్నీ ఈ సాఫ్ట్‌వేర్‌నే ఉపయోగిస్తున్నాయి. ప్రపంచంలోని టాప్ 100 న్యాయ సంస్థలు వాడేది కూడా సూర్యా కంపెనీ రూపొందించిన సాఫ్ట్‌వేరే. అవకాశం లభిస్తే మన జడ్జీలందరికీ ఉచితంగా సాఫ్ట్‌వేర్‌ను అందిస్తాననే సూర్య విజయప్రస్థానం ఆయన మాటల్లోనే..

సాధారణంగా పెద్ద పెద్ద కేసుల్లో ఐదారుగురు లాయర్లు పనిచేస్తూ ఉంటారు. వీరందరికీ ఒకేసారి సమాచారం అందించడంతో పాటు.. కోర్టులో జరిగే ప్రొసీడింగ్స్ అన్నీ ఎప్పటికప్పుడు దీనిలో రికార్డు అయిపోతూ ఉంటాయి. ఉదాహరణకు ఒక సాక్షి

## సాఫ్ట్‌వేర్ ఎలా పనిచేస్తుంది?

మొదట్లో కత్తిని ఉపయోగించానని చెప్పి.. ఆ తర్వాత మాట మార్చి బాకు వాడానని చెప్పాడనుకుందాం. ఈ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్న లాయర్లు వెంటనే అతను గతంలో ఏం చెప్పాడనే వీడియోను వెంటనే చూడవచ్చు. అంతే కాకుండా జూనియర్.. సీనియర్ లాయర్లు తమ వద్ద ఉన్న సమాచారాన్ని సులభంగా షేర్ చేసుకోవటానికి కూడా ఇది పనికొస్తుంది. ఇలాంటి ఫీచర్లు దీనిలో ఎన్నో ఉన్నాయి.

మాది మధ్యతరగతి కుటుంబం. నేను చదివింది మెకానికల్ ఇంజనీరింగ్. చదువు అయిపోయిన తర్వాత ఆయిల్ అండ్ గ్యాస్ ప్లాట్‌ఫాంలకు సంబంధించిన పరికరాలను డిజైన్ చేసే ఒక అంతర్జాతీయ కంపెనీలో పనిచేసేవాడిని. 1997లో ఆస్ట్రేలియాకు ఉద్యోగం కోసం వెళ్లా. ఆ దేశ పౌరసత్వం కూడా తీసుకున్నా. నేను ఆస్ట్రేలియాకు వెళ్లే సమయానికే సాఫ్ట్‌వేర్ బూమ్ వచ్చింది. నాతో చదివిన మిత్రులందరూ సాఫ్ట్‌వేర్ రంగంలోకి మారిపోయారు. అందరూ పెద్ద పెద్ద కంపెనీల్లో సెటిల్ అయిపోయారు. నేను మాత్రమే మెకానికల్ ఇంజినీరింగ్ రంగంలోనే ఉండిపోయా! 1999లో ఆస్ట్రేలియా, ఇండోనేషియాల మధ్య ఈస్ట్ తైమూర్ వివాదం ముదిరింది. ఆస్ట్రేలియా కంపెనీలకు ఇచ్చిన రిగ్ ప్రాజెక్టుల్నంటినీ ఇండోనేషియా రద్దు చేసింది. దీంతో ఆస్ట్రేలియా కంపెనీలలో పనిచేసే సాఫ్ట్‌వేర్ మినహా ఇతర ఉద్యోగులకు ఉపాధి పోయే ముప్పు ఏర్పడింది. దీంతో నేను కూడా సాఫ్ట్‌వేర్‌కు మారాలనుకున్నా. పెద్ద పెద్ద కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చాయి కానీ లైవ్‌నోట్ అనే కంపెనీలో చేరా. ఆ కంపెనీ న్యాయరంగానికి సంబంధించిన కొన్ని ప్రాజెక్టులు చేసేది. నా పనితీరు నా యాజమాన్యానికి బాగా నచ్చింది. ఆ సమయంలో భారతీయులంటే తమ ఉద్యోగాలను తీసుకువెళ్లిపోయేవారనే భావన స్థానికులకు ఉండేది. నాకు కూడా ఏదో చేయాలనే తపన నిద్ర పట్టనివ్వకుండా చేసింది. బయటకు వచ్చేసి ఏదో ఒక బిజినెస్ పెట్టాలనుకున్నా. రకరకాల ఆలోచనల తర్వాత న్యాయవ్యవస్థకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేయాలనిపించింది. అలా పుట్టిందే లీగల్ క్రాఫ్ట్.

### పేరు కోసం పోరాటం..

లీగల్ అంటే చట్టపరమైన అంశాలని అర్థం. క్రాఫ్ట్ (craft) అంటే కోర్ట్‌రూమ్ ఆటోమేషన్ అండ్ ఫెసిలిటేషన్ టెక్నాలజీస్ అని అర్థం. ఈ రెండింటినీ కలిపి 'లీగల్ క్రాఫ్ట్' అని పేరుపెట్టాం. కానీ ఈ పేరును అధికారులు ఆమోదించలేదు. 'లీగల్ క్రాఫ్ట్' అనే పదం లేదంటారు. చాలా కాలం పోరాటం చేసిన తర్వాత ఈ పేరును రిజిస్ట్రర్ చేశారు. మన దేశంలోని కోర్టుల్లో జరిగే వాదప్రతివాదాలు, ఇతర ప్రొసీడింగ్స్ అన్నింటినీ నిక్షిప్తం చేయటానికి కాగితాలు




వాడతారు. కానీ విదేశాల్లో వీటిని రికార్డు చేయటానికి క్యాట్ మెషీన్స్ ఉంటాయి. వాటిని ఆపరేట్ చేయటానికి రిపోర్టర్లు ఉంటారు. వీరిని కోర్టు రిపోర్టర్స్ అంటారు. వీరు షార్ట్‌హ్యాండ్ మాదిరిగా ఉండే భాషలో నిష్ణాతులు. శబ్దాల ఆధారంగా నిమిషానికి 250 పదాల వరకూ ఆ మెషీన్లలో టైప్ చేయగలుగుతారు. ఈ సమాచారాన్ని కంపెనీలు కంప్యూటర్లలో నిక్షిప్తం చేస్తాయి. దీన్ని కోర్టు సిబ్బంది, లాయర్లు, ప్రజలు వాడుకుంటారు. ఇంత దీర్ఘ ప్రక్రియ కాకుండా కోర్టులో జరుగుతున్న ప్రొసీడింగ్స్ రియల్ టైమ్‌లో ఎప్పటికప్పుడు లాయర్లకు, వాదులకు, ప్రతివాదులకు చేరిపోతే ఎలా ఉంటుంది? అనే ఆలోచనే మా సాఫ్ట్‌వేర్‌కు పునాది. మేము సాఫ్ట్‌వేర్ రూపొందిస్తున్న సమయంలోనే ఒక బంపర్ ఆఫర్ తగిలింది.

### ఒరాకిల్ చేయలేనిది..

అంతర్జాతీయ నేర న్యాయస్థానం(ఐసీసీ)లో 18 విభాగాలుంటాయి. ఈ విభాలన్నింటిలోని సమాచారాన్ని నిక్షిప్తం చేయటానికి అవసరమైన వ్యవస్థను రూపొందించటానికి ఐసీసీ.. ప్రముఖ కంపెనీ ఒరాకిల్‌కు కాంట్రాక్టు ఇచ్చింది. కానీ ఆ ప్రాజెక్టు అనుకున్నట్లుగా సాగకపోవటంతో దాన్ని సమీక్షించే అవకాశం మాకు వచ్చింది. మా సమీక్షతో సంతృప్తి చెందిన ఐసీసీ.. తమకు కావాల్సిన వ్యవస్థను కూడా మమ్మల్నే రూపొందించమంది. దాంతో మా దగ్గర ఉన్న సాఫ్ట్‌వేర్ ప్రొడక్ట్‌కు వెనువెంటనే మార్కెట్ లభించినట్లయింది. ఒకసారి ఐసీసీలో ప్రవేశపెట్టిన తర్వాత వెనక్కి తిరిగి చూడలేదు. ప్రపంచంలోని అనేక న్యాయ సంస్థలు, వివిధ దేశాల కోర్టులు మా వ్యవస్థను ఉపయోగించటం మొదలుపెట్టాయి. ఆస్ట్రేలియాలో జరిగే రాయల్ కమిషన్స్‌లో వాడేది మా సాఫ్ట్‌వేరే! ఇంగ్లాండ్‌లోని కోర్టుల్లో.. న్యాయ కంపెనీల్లో వాడేది మా సాఫ్ట్‌వేరే!

### హైదరాబాద్‌లో లభ్యం

మా సాఫ్ట్‌వేర్‌ను మన దేశంలో పెద్ద పెద్ద కేసుల్లో ఉపయోగించారు. ఉదాహరణకు రిలయన్స్ గ్యాస్‌కు భారత ప్రభుత్వానికి మధ్య జరిగిన ఆర్బిట్రేషన్‌లో.. ఎన్రాన్ కేసులో.. న్యూఇండియా ఇన్సూరెన్స్ కేసుల్లో దీనినే వాడారు. అయితే వారికి ఈ సాఫ్ట్‌వేర్ హైదరాబాద్‌లోనూ లభ్యమవుతుందని తెలియక.. ఇతర దేశాల నుంచి లైసెన్స్‌లు కొనుక్కున్నారు. కానీ ఆర్బిట్రేషన్ జరిగే సమయంలో సహాయానికి మా టీమ్ మెంబర్స్‌నే పంపాం.

### మన దేశంలో..

అంతర్జాతీయంగా ఇంత పేరు పొందిన సాఫ్ట్‌వేర్‌ను మన దేశంలోని కోర్టుల్లో ప్రవేశపెడితే అనేక లాభాలుంటాయి. ఈ సాఫ్ట్‌వేర్ గురించి ప్రభుత్వంలోని పెద్దలకు వివరించటానికి గతంలో ప్రయత్నించా. ఇటీవలే మేము క్లౌడ్ ఆధారిత వ్యవస్థను రూపొందించాం. ఇది మన దేశానికి తగినట్టి వ్యవస్థ. మన దేశంలో ఉన్న జడ్జీలకు ఈ సాఫ్ట్‌వేర్‌ను ఉచితంగా ఇవ్వటానికి నేను సిద్ధంగా ఉన్నా. దీనికి ప్రతిఫలంగా ప్రతి జడ్జిని రెండు వేల రూపాయల లైసెన్స్ ఫీజు నల్సార్‌కు ఇవ్వమని అడుగుతా! దీనితో నల్సార్‌లో ఒక అత్యాధునిక ఆర్బిట్రేషన్ సెంటర్‌ను కట్టించాలనేది నా ఆలోచన. అక్కడికి ప్రపంచ ప్రఖ్యాతి చెందిన న్యాయశాస్త్ర కోవిదులను తీసుకువచ్చి టెక్నాలజీ వాడటం వల్ల కేసులు ఎంత సులభంగా పరిష్కరించవచ్చో చూపించాలనేది నా ఉద్దేశం.

– స్పెషల్ డెస్క్

# సంపన్న దేశంలో పేదరికం

**జర్మనీలో పేదల అవసరాలు తీరుస్తున్న 'డైనింగ్ టేబుల్'**


Photo tafel deutschland dagmar Schwelle



జర్మనీ చాలా సంపన్న దేశం. ఇతర దేశాలతో పోలిస్తే నిరుద్యోగ సమస్య లేదనే చెప్పాలి. జర్మనీ జనాభాలో 3.9 శాతం నిరుద్యోగులంటే, ఫ్రాన్స్‌లో 10.1 శాతం, ఇటలీలో 11.1 శాతం, గ్రీసులో 21.7 శాతం నిరుద్యోగులున్నారు. ప్రతి జర్మన్ పౌరుడి సంవత్సర సగటు ఆదాయం మన కరెన్సీలో దాదాపు రూ.31 లక్షలు. దాదాపు 8 కోట్ల జర్మన్లు రోజుకు 1.8 కోట్ల లీటర్ల పాలు తాగుతారు. 2 కోట్ల కిలోల కూరగాయలు, 2 కోట్ల కిలోల మాంసం, 1.5 కోట్ల కిలోల పండ్లు తింటారు. పెంపుడు కుక్కలకు, పిల్లులకు రోజుకు రూ.6800 కోట్ల ఖరీదు చేసే మేత పెడతారు. ఇలాంటి దేశంలో పేదరికం ఉందంటే నమ్మశక్యం కాదు. కానీ గత 20 ఏళ్లుగా జర్మనీలో పెరుగుతున్న పేదల సంఖ్య రాజకీయ నాయకులు, మేధావి వర్గాలను కలవరపెడుతోంది. ప్రభుత్వం దృష్టిలో సంవత్సరానికి 12,726 యూరోలకన్నా (దాదాపు రూ.10 లక్షలు) తక్కువ ఆదాయం ఉన్న ప్రతి వ్యక్తీ పేదవాడే! ఎటువంటి ఆదాయం లేనివారికి గది అద్దె, ఆరోగ్య బీమా చెల్లించడమేకాక, నెల ఖర్చులకి ప్రభుత్వం 416 యూరోలు డబ్బిస్తుంది. మరి ఈ పైకం చాలనివారి సంగతి? భర్త సహాయం లేకుండా పిల్లల్ని పెంచుతున్న తల్లులు, ఎక్కువ పెన్షన్ లేని వృద్ధులు, ఆర్థిక రంగంలో వచ్చే మార్పుల వల్ల నిరుద్యోగులైనవాళ్లు, 18 ఏళ్ల నిండని మైనర్లు, కాందిశీకులు ఈ వర్గానికి చెందుతారు. వీరంతా కలిస్తే జనాభాలో 20 శాతం ఉంటారు. ఇదే జర్మనీ పేదరికం! ఇలాంటి ప్రజా వర్గానికి అండగా నిలుస్తూ స్వచ్ఛంద సేవకులు 'డైనింగ్ టేబుల్' అనే దుకాణాన్ని 1993లో మొదటిసారి స్థాపించారు. ప్రస్తుతం జర్మనీలో 2100 డైనింగ్ టేబుల్ షాపులున్నాయి. ఇంకెన్నో ఫుడ్ బ్యాంకులు ఏర్పడ్డాయి. హోటళ్లు, బేకరీలు, సూపర్ మార్కెట్ల నుంచి తినదగ్గ, చెడిపోని ఆహార పదార్థాల్ని సేకరించి.. ఫుడ్ బ్యాంకులకు తెచ్చి పేదలకు పంచుతున్నారు. మొదట ప్రతి వినియోగదారుడి నుంచి ఒక యూరో ప్రవేశ రుసుము వసూలు చేస్తారు. ఆపై ఎప్పుడు కావాలన్నా.. కూరగాయలు, పళ్లు, పాలు, పెరుగు, రొట్టెలు, మాంసం, గుడ్లు, చాక్లెట్లు, తాజాగా వండిన భోజనం, కుర్చీలు, మంచాలు ఉచితంగా అందజేస్తారు. కొద్ది రోజుల క్రితం ఎసన్ నగరం కాందిశీకులకు 'డైనింగ్ టేబుల్'లో ప్రవేశాన్ని నిషేధించింది. అయితే జర్మనీ చాన్సలర్ ఏంజెలా మార్కెల్ ఈ విషయంలో కలుగజేసుకున్నారు. పేదల విషయంలో ఇలాంటి సంస్థలకు భేదభావం ఉండకూడదని హితవు పలికారు. 'ఫుడ్‌బ్యాంకులు పేదల అవసరాలు తీరుస్తాయి. దేశంలో ఎవ్వరూ ఆకలితో బాధపడకూడదు' అని ప్రకటించి మానవత్వాన్ని చాటారు.

–వనమాలి

# ఊరి బడికి.. ఊపిరి

**విద్య నేర్పిన పాఠశాలకు ఎన్నారైల చేయూత.. విద్యార్థులకు సౌకర్యాల కల్పన**

**ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు .. పూర్వ విద్యార్థుల సంఘం సేవలపై ప్రశంసలు**


మాచవరం విద్యార్థులతో ఎన్ఆర్ఐలు

వారు చదివింది సర్కారీ బడిలో.. ఆ చదువే వారిని విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దింది. ఉన్నత హోదాలో నిలిచేలా చేసింది. వారిలో పెద్ద పెద్ద చదువులు చదివినవారు విదేశాల్లోనూ స్థిరపడ్డారు. మంచి స్థాయిలో ఉన్నారు. తాము చదువుకున్న సమయంలో బడిలో ఎలాంటి సౌకర్యాలు ఉండేవి కావని.. తమ లాగా ఇప్పటి విద్యార్థులకు ఆ సమస్యలు ఎదురుకావొద్దని, ఇందుకు తమవంతు సాయమందించాలని సంకల్పించారు. ఊరి బడికి ఊపిరి పోస్తూ.. పలు అభివృద్ధి, సేవా కార్యక్రమాలు చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఆ ఎన్నారై పూర్వ విద్యార్థులు.

మెదక్ జిల్లా మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకొని విదేశాల్లో స్థిరపడిన వారు 70 మంది వరకు ఉన్నారు. వివిధ దేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న వారంతా కలిసి.. పూర్వ విద్యార్థుల సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. 1975 తర్వాత ఇక్కడ విద్యనభ్యసించిన వారికి తమ బడిని అభివృద్ధి చేయాలన్న సంకల్పం ఏర్పడింది. పూర్వ విద్యార్థుల్లో బెల్లం శేషగిరిరావు (ఖతర్‌లో ఉన్న కాలంలో), అమెరికాలో ఉంటున్న సాంబశివరావు, రామకోటేశ్వర్‌రావు, సత్యనారాయణ, రాధాకృష్ణ, గిరిధర్‌రావు, నగేశ్, మాండవ రమేశ్‌లతో పాటు వివిధ దేశాల్లో ఉంటున్న మరికొంత మంది పూర్వ విద్యార్థుల సంఘంలో ఉన్నారు. ఈ సంఘం ఆధ్వర్యంలో పాఠశాల భవనానికి మరమ్మతులు చేపట్టారు. ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థులకు డిక్షనరీలు, స్పోర్ట్స్ డ్రెస్‌లు, ఇతర మెటీరియల్, గ్రంథాలయానికి వివిధ రకాల పుస్తకాలు అందించారు. రూ. 30 వేల విలువ చేసే డిజిటల్ ప్రొజెక్టర్‌ను అందజేశారు. ప్రతి ఏటా పదో తరగతిలో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు నగదు పురస్కారాలను అందిస్తూ సన్మానిస్తున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సెప్టెంబరు 5న టీచర్లను కూడా సన్మానిస్తూ వివిధ కార్యక్రమాలను చేపడుతున్నారు. బడి అభివృద్ధికి పాటుపడుతున్న పూర్వ విద్యార్థుల సంఘం సేవలను గ్రామస్థులు ప్రశంసిస్తున్నారు. –మెదక్ రూరల్

### విద్య నేర్పిన బడికి తమవంతుగా సాయం

విద్య నేర్పి.. విజ్ఞానాన్ని ప్రసాదించిన ఊరి బడికి ఉపకారం చేయాలన్న సంకల్పంతో సౌకర్యాలు కల్పిస్తున్నాం. ప్రతి ఏటా ఉత్తమ విద్యార్థులకు నగదు పురస్కారాలతో పాటు స్కూల్లో అవసరం మేరకు తమవంతు సహకారం అందజేస్తున్నాం. పాఠశాలలో విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా సాయం అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాం. –శేషగిరిరావు, పూర్వ విద్యార్థి (యూఎస్ఏ)




### స్కూల్ మరమ్మతుల నుంచి సేవా కార్యక్రమాలు

మాచవరం స్కూల్లో తరగతి గదులు శిథిలావస్థలో ఉండడంతో అప్పటి నుంచి తమవంతు సాయం చేసేందుకు ముందుకొచ్చాం. ఇక్కడ చదివి.. విదేశాల్లో ఉన్న వారందరితో మాట్లాడాం. వారంతా ఆర్థిక సాయం అందించేందుకు ముందుకొచ్చారు. 30 మంది నుంచి ప్రారంభమైన మా సేవలు ప్రస్తుతం 70 మంది వరకు చేరింది. మా బడిని మేం బాగు చేసుకునేందుకు ఆర్థిక సహకారం అందిస్తున్నాం.

–రామకోటేశ్వర్‌రావు, పూర్వ విద్యార్థి

# ప్రకృతిని గౌరవించే దేశం మంగోలియా!

**ఏ దేశంలో ఏముంది? Foreign**



*చైనా, రష్యా సరిహద్దులుగా ఉన్న ఒక చిన్న అందాల దేశం మంగోలియా. ఈ దేశం పేరు చెప్పగానే చాలా మందికి ప్రపంచాన్ని గడగడ వణికించిన చెంఘిజ్‌ఖాన్ గుర్తుకు వస్తాడు. కొండల్లో చిన్న చిన్న ఇళ్లు.. వాటిలో రంగు రంగుల బట్టలు కట్టుకొని నివసించే ప్రజలు.. రేసు గుర్రాలు గుర్తుకొస్తాయి. అలనాటి రాజులు, రాజ్యాలు పోయినా- ఆ నాటి సంస్కృతి సంప్రదాయాలను ఆ దేశ ప్రజలు ఇప్పటికీ పాటిస్తూనే ఉన్నారు. అలాంటి మంగోలియా విశేషాలేమిటో చూద్దాం.*

### అన్ని పల్లెలే!

మంగోలియాలో అతి పెద్ద నగరం ఉల్లాన్ బాటర్. ఇదే ఆ దేశ రాజధాని. ఇక్కడ కొంత పట్టణ వాతావరణం కనిపిస్తుంది.. కానీ మిగిలిన ప్రాంతాలలో పల్లె వాతావరణమే ఉంటుంది. ఇక్కడి ప్రజలు తాము అనుసరించే సంప్రదాయాలను పర్యాటకులు కూడా పాటించాలని భావిస్తూ ఉంటారు. అందువల్ల మంగోలియా వెళ్లే ముందు కొన్ని సంప్రదాయాలను తెలుసుకోవటం మంచిది. మంగోలియాలో ఎవరూ ఇంటి గుమ్మంలో నిలబడి మాట్లాడకూడదు. ఎవరైనా అలా మాట్లాడితే అది అమంగళమైనది అని అక్కడి ప్రజలు భావిస్తారు. అదే విధంగా ప్రతి ఇంట్లోను ఒక పొయ్యి ఉంటుంది. ఈ పొయ్యి ఎప్పుడూ మండుతూనే ఉంటుంది. ఇది పగలు వంట చేసుకోవటానికి ఉపయోగపడుతుంది. రాత్రి చలి నుంచి కాపాడుతుంది. సాధారణంగా ఇక్కడ ఇళ్లన్నీ ఈ పొయ్యి చుట్టూ వృత్తాకారంలో కడతారు. తమకు ఇంత మేలు చేసే పొయ్యిలో పొరపాటున కూడా నీళ్లు పడనివ్వరు. ఎవరైనా దానిలో నీరు పోస్తే అది అరిష్టమని నమ్ముతారు. అందువల్ల మంగోలియాలో పర్యాటకులు ఈ విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి. వీటితో పాటుగా అక్కడి ప్రజలు ప్రకృతిని ఎంతో ఆరాధిస్తారు.. పూజిస్తారు. నీరు, పాలు వంటివి తమకు దేవుడు ప్రసాదించినవని నమ్ముతారు. అందువల్ల చెరువులు, నీటి ప్రవాహాల పక్కన మలమూత్ర విసర్జన చేస్తే కఠినమైన శిక్షలు ఉంటాయి. ఈ విషయంలో పర్యాటకులు చాలా జాగ్రత్తగా ఉండాలి –స్పెషల్ డెస్క్



## గాడిదల ప్రదర్శన!

ఉగాది ఉత్సవాల్లో భాగంగా ఏపీలోని కర్నూలు జిల్లా కల్లూరులో రజకులు చేపట్టిన గాడిదల ప్రదర్శన ఆకట్టుకుంది. వందేళ్ల నుంచి వస్తున్న ఆచారంలో భాగంగా సోమవారం చౌడేశ్వరి అమ్మవారి ఆలయం చుట్టూ మోకాలి లోతు బురద వేశారు. గాడిదలను అలంకరించి నగర వీధుల్లో ఊరేగించి అమ్మవారి ఆలయం వద్దకు వచ్చారు. అనంతరం ఆలయం చుట్టూ బురదలో గాడిదలను పరిగెత్తించారు. మొక్కులు తీర్చుకోవడంలో భాగంగా ఏటా గాడిదల ప్రదర్శన చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. -కల్లూరు



## పిడకల సమరం!

కర్నూలు జిల్లా ఆస్పరి మండలం కైరుప్పల గ్రామంలో వీరభద్రస్వామి జాతర మహోత్సవంలో నుగ్గులాట (పిడకల సమరం) ప్రత్యేకాకర్షణగా నిలిచింది. గ్రామస్థుల ఆరాధ్య దైవమైన వీరభద్రస్వామి, భద్రకాళికాదేవి మధ్య తలెత్తిన వివాదం నేపథ్యమే ఈ పిడకల సమరం. ఉగాది మరుసటి రోజు ఈ జాతరను ఎన్నో ఏళ్లుగా సాగిస్తున్నారు. సోమవారం గ్రామస్థులు వీరభద్రస్వామి వర్గంగా కొందరు, భద్రకాళికాదేవి వర్గంగా మరికొందరు విడిపోయారు. ఊరివాకిలి ప్రధాన వీధికి చేరుకుని ఒకరిపై ఒకరు పిడకలు విసురుకున్నారు. 40 మందికి స్వల్ప గాయాలయ్యాయి. - ఆదోని

# నిధులే ముఖ్యం!

## 'హోదా' అనే పేరు ముఖ్యం కాదు.. కేంద్రం ఆర్థిక సాయం చేయాలి

- 7 జిల్లాల అభివృద్ధికి డబ్బివ్వాలి
- బీజేపీతో రాజీ ప్రసక్తి లేదు
- బాబు అవినీతిపై దర్యాప్తు చేయాలి
- పొత్తులపై తర్వాత నిర్ణయం
- 'సీఎన్ఎన్-న్యూస్ 18' చానల్‌తో పవన్
- 'హోదా'పై జనసేన పార్టీ వివరణ
- రిపోర్టర్ తప్పుగా అర్థం చేసుకున్నారని వెల్లడి



అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చి తీరాలని.. ప్రత్యేక ప్యాకేజీ పాచిపోయిన లడ్డూవంటిదన్న జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్.. ఇప్పుడు రాష్ట్రానికి ప్రత్యేక ఆర్థిక సాయం చేసినా చాలన్నారు. ప్రత్యేక హోదా పెద్ద విషయమే కాదని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వంపై వస్తున్న అవినీతి ఆరోపణలపై కేంద్రం దర్యాప్తు జరపాలని సీఎన్ఎన్-న్యూస్ 18 చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన డిమాండ్ చేశారు. "ప్రత్యేక హోదా అనేది సెంటిమెంట్ కాదు. ఇది రాష్ట్రానికి చాలా అవసరం. రాష్ట్రంలో ఏడు జిల్లాలు యూపీలోని బుందేల్‌ఖండ్ తరహాలో.. చాలా దుర్భర పరిస్థితుల్లో ఉన్నాయి. ఇక్కడ పరిస్థితిని మెరుగుపరిచేందుకు కేంద్రం నుంచి ఎక్కువ నిధులు కోరుతున్నాం. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ట్యాగ్ ఇస్తారో లేదో అప్రస్తుతం. పేరు, స్థాయి ముఖ్యం కాదు. కేంద్రం నుంచి ఆర్థిక సాయం మాకు అవసరం. మా జనసేన పార్టీ డిమాండ్లను నెరవేర్చేవరకు బీజేపీతో ఎలాంటి రాజీకి ఆస్కారం లేదు" అని పేర్కొన్నారు. అదే సమయంలో, హోదా అన్నది పార్లమెంటులో ఇచ్చిన మాట అని, దానికి రాజ్యాంగ బద్ధత ఉందని చెప్పారు. ఇప్పటివరకు జనసేన ఒంటరిగానే పయనిస్తోందని.. ఎన్నికల సమయం వచ్చినప్పుడు పొత్తులు అవసరమా.. ఒంటరిగా పోటీచేయాలా అన్నది నిర్ణయిస్తామని చెప్పారు. సదరు చానల్ అడిగిన మరిన్ని ప్రశ్నలకు ఆయన జవాబులు ఇవీ..

**టీడీపీ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు ఎందుకు చేస్తున్నారు?**

నేను అకస్మాత్తుగా ఈ ఆరోపణలు చేయడం లేదు. నాలుగేళ్లుగా చంద్రబాబు వద్ద ఈ విషయం ప్రస్తావిస్తూనే ఉన్నాను. ఆయన సీరియస్‌గా తీసుకోలేదు. తన ప్రభుత్వంలో అవినీతి జరుగుతోందని ఆయనకూ తెలుసు. 40 మంది ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు నాకు ఫిర్యాదు చేశారు. జరుగుతున్న అవినీతి గురించి ఆయనకు చెప్పాలని నన్ను కోరారు. ఆయన వద్ద ప్రస్తావించడానికి ప్రయత్నించాను. కానీ వాటిని పరిశీలించడానికి ఆయన సుముఖత కనబరచలేదు. అందుకే ఇప్పుడు నేను మాట్లాడుతున్నాను. కేంద్రం రంగంలోకి దిగి అక్రమాలపై విచారణ జరపాలి. పోలవరం ప్రాజెక్టును ఓ ప్రైవేటు కాంట్రాక్టరుకు అప్పగించడం వెనుక ఏదో నిగూఢ ఉద్దేశం ఉంది.

**ఈ విషయాన్ని ప్రధాని వద్ద ఎందుకు ప్రస్తావించలేదు?**

ప్రధాని మోదీ నాకు బాగా సన్నిహితంగా తెలుసు. కానీ నాకంటూ కొన్ని పరిమితులున్నాయి. నేను పార్లమెంటేరియన్‌ను కాదు. టీడీపీ, బీజేపీ మధ్య సరైన సంబంధాల్లేవు. వాళ్ల వ్యవహారాల్లో తలదూర్చే ఉద్దేశం నాకు లేదు. ఇప్పుడు నేను మాట్లాడేసరికి.. టీడీపీ నేతలంతా నా వెనుక బీజేపీ ఉందని ఆరోపిస్తున్నారు. ఇంతక్రితం వైసీపీ నేత జగన్ కూడా చంద్రబాబు నా వెనుక ఉన్నారని అనేవారు. వాస్తవానికి వారిద్దరిదీ తప్పే. నేను జనం మాటే వింటాను.

**బీజేపీ పట్ల మీ వైఖరి ఎలా ఉండబోతోంది?**

బీజేపీతో రాజీ సాధ్యం కాదు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు బీజేపీ తీరుపై తీవ్ర మనస్తాపం చెందారు. వారు ఆ పార్టీని విశ్వసించడంలేదు.

**మూడో కూటమిపై మీ అభిప్రాయమేంటి?**

దేశంలోని పలు రాష్ట్రాల్లోని ప్రాంతాల సమస్యలను అర్థం చేసుకోవడంలో కాంగ్రెస్, బీజేపీ రెండూ విఫలమయ్యాయి. అందుకే మూడో కూటమి ఏర్పాటు యత్నాలు జరుగుతున్నాయి. అయితే ప్రాంతీయ పార్టీలు జాతీయ అంశాల గురించి ఆలోచించాలి. తెలంగాణ సీఎం కేసీఆర్‌నుకలిసి మూడో కూటమి గురించి చెప్పాను. సవివరంగా మాట్లాడలేదు.

**ప్రభుత్వాలపరంగా చంద్రబాబు, కేసీఆర్‌లకు పదికి ఎన్ని మార్కులు వేస్తారు?**


కేసీఆర్‌కు ఆరు... చంద్రబాబుకు రెండున్నర.

### తప్పుగా అర్థం చేసుకున్నారు: జనసేన

ప్రత్యేక హోదాయే అక్కర్లేదని, నిధులు రావడమే ముఖ్యమని పవన్ పేర్కొన్నట్లుగా సీఎన్ఎన్-18లో వచ్చిన ఇంటర్వ్యూ కలకలం సృష్టించింది. హోదాపై ఆయన యూటర్న్ తీసుకున్నారని విమర్శలు చెలరేగాయి. దీంతో... జనసేప పార్టీ దీనిపై 'ట్విట్టర్'లో స్పందించింది. "ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధనకోసం కట్టుబడి ఉన్నాం. మా పార్టీ అధ్యక్షుడి అభిప్రాయాన్ని న్యూస్ 18 రిపోర్టరు పొరపాటుగా అర్థం చేసుకున్నారు" అని పేర్కొంది.

# ద్రోహులకు డిపాజిట్లు రావు

- కేసుల కోసం వైసీపీ దొంగాట
- ఫొటోలతో సహా దొరికిపోయారు
- పవన్ యూటర్న్ ఎందుకో అందరికీ తెలుసు
- న్యాయం కోరినోళ్లపై యుద్ధం చేస్తారా?
- లాలూచీ రాజకీయాలతో జాగ్రత్త!
- కీలక సమయం.. అప్రమత్తంగా ఉండండి
- పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు



అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాజకీయ లబ్ధి కోసం రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న వాళ్లకు ఎన్నికల్లో డిపాజిట్లు కూడా రావని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. కేసుల మాఫీ కోసం వైసీపీ లాలూచీ రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. రాష్ట్రానికి కీలకమైన ఈ సమయంలో అప్రమత్తంగా ఉండి... సమష్టిగా పోరాడాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ ఎంపీలు, నాయకులతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ, జనసేన, బీజేపీ తీరును ఆయన తూర్పారబట్టారు. "మనం అడుగుతోంది న్యాయం చేయాలని. న్యాయం కోరిన వారిపై యుద్ధం చేస్తారా? ఏపీకి హోదా ఇస్తామని కాంగ్రెస్ కూడా ప్లీనరీలో చెప్పింది. అలాంటప్పుడు కేంద్రానికి ఉన్న అభ్యంతరం ఏంటి? కేసుల మాఫీ కోసం జగన్ అప్పుడు కాంగ్రెస్‌తో లాలూచీ పడి, ఇప్పుడు బీజేపీతో లాలూచీ పడుతున్నారు. ఆ రోజు కూడా తెలుగుదేశం ఎంపీల చాటున లోక్‌సభలో దాక్కున్నారు. ఇది లాలూచీ రాజకీయాలకు పరాకాష్ఠ. కేంద్ర పెద్దలను పదేపదే కలవడం, ప్రధానమంత్రి కార్యాలయంలో విజయసాయిరెడ్డి తిష్టవేయడం కన్నా రుజువులు ఏం కావాలి? తప్పుడు పనులు చేసేవారు దొంగాట ఆడుతున్నారు. రెడ్ హ్యాండెడ్‌గా ఫొటోలతో సహా దొరికిపోయారు. కేవలం వీళ్ల కేసుల కోసం రాష్ట్రాన్ని, భావితరాల భవిష్యత్తును తాకట్టు పెడతారా? పవన్ కల్యాణ్ యూ టర్న్ ఎందుకు తీసుకున్నారో అందరికీ తెలుసు. నాలుగేళ్లుగా విమర్శించని వ్యక్తి ఇప్పుడే ఎందుకు విమర్శలు చేస్తున్నారు. ద్రోహులు ఎవరికీ డిపాజిట్లు కూడా రావు. కుట్ర రాజకీయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి" అని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రయోజనాలు, ఏపీ హక్కుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. విభజన చట్టంలోని 19అంశాలు, పార్లమెంట్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, పొరుగు రాష్ట్రాలతో సమాన స్థాయికి వచ్చేవరకూ చేయూతనివ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర హక్కుల కోసం మన ఎంపీలు వీరోచితంగా పోరాడుతున్నారని చంద్రబాబు ప్రశంసించారు. 'ఇది కీలక సమయం. అప్రమత్తంగా ఉండాలి. ఒక పార్టీతో అవిశ్వాసం పెట్టించడం, మరో పార్టీతో గొడవ చేయించడం ద్వారా సభను వాయిదా వేసుకుపోవాలని చూస్తున్నారు. ఎవరూ అధైర్య పడొద్దు. అవిశ్వాసంపై అన్ని పార్టీల మద్దతు తీసుకుంటున్నాం. ఏపీకి జరిగిన అన్యాయంపై జాతీయస్థాయిలో చర్చ జరుగుతోంది' అని చంద్రబాబు చెప్పారు. మరోవైపు, నీరు-ప్రగతి, వ్యవసాయం పురోగతిపైనా వివిధశాఖల అధికారులతో సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వ హించారు. 'కేంద్రం నుంచి అరకొర తోడ్పాటు ఉన్నప్పటికీ, మన కాళ్లపై మనం నిలబడే స్థితికి వచ్చాం. రాష్ట్ర హక్కుల కోసం పోరాడుతున్నాం. ఏపీ గురించి దేశవ్యాప్తంగా చర్చ నడుస్తోంది. ఒక సవాల్‌గా తీసుకుని బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలి' ఉద్యోగులకు సూచించారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని, ప్రతి పనిని తనిఖీ చేస్తానని చెప్పారు.

### పార్టీ ఎంపీలందరూ మాట్లాడేలా వ్యూహం

టెలికాన్ఫరెన్స్‌లో ఎంపీ గల్లా జయదేవ్ మాట్లాడుతూ టీడీపీ రెండు, మూడు అవిశ్వాస నోటీసులు ఇస్తే పార్టీ ఎంపీలందరికీ మాట్లాడే అవకాశం వస్తుందన్నారు. ప్రతి అవిశ్వాస తీర్మానం నోటీసులో మొదటిపేరు తెలుగుదేశం ఎంపీది, ఆ తర్వాత ఇతర పార్టీల ఎంపీల సంతకాలు పెట్టించవచ్చని, ఇలా ఎన్ని నోటీసులు ఇస్తే అంతమందీ మాట్లాడేందుకు అవకాశం ఉంటుందని చెప్పగా... ఆ పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎంపీ గరికపాటి మోహన్‌రావు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక ప్రాంతీయ పార్టీ వైదొలగడం జాతీయస్థాయిలో ఒక కుదుపు సృష్టించిందన్నారు. దీని ప్రభావం స్టాక్‌మార్కెట్‌పైనా పడిందంటూ జాతీయ మీడియాలో వచ్చిన కథనాలను ప్రస్తావించారు. జాతీయ రాజకీయాల పట్ల ఆసక్తి లేదని ముఖ్యమంత్రి మాట్లాడడం సబబుగా లేదని, ఈ పరిస్థితుల్లో అవసరమైతే జాతీయ రాజకీయాల్లో క్రియాశీలంగా మారతానని చెప్పడం సముచితంగా ఉంటుందని సూచించారు.టీడీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి తృణమూల్, సమాజ్‌వాదీ పార్టీ, ఇతర పార్టీల నేతలు మద్దతు ప్రకటించారని తోట నరసింహం చంద్రబాబుకు వివరించారు. ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ సభ సజావుగా జరగకుండా అడ్డంకులు సృష్టించాలని లోక్‌సభలో ఇతర పార్టీలను బీజేపీయే ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. ఎమ్మెల్యే శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ కాపు రిజర్వేషన్లపై అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. వర్ల రామయ్య మాట్లాడుతూ అవిశ్వాసంపై చర్చ రానీయకుండా అడ్డుకునేందుకు ఇతర పార్టీలను రెచ్చగొట్టడం అంబేద్కర్ ఆశయాన్ని కాలరాయడమేనన్నారు. ఎమ్మెల్సీ సునీత మాట్లాడుతూ...కేంద్రం నుంచి వైదొలగడంపై మైనార్టీలు, దళితుల్లో మంచి స్పందన వచ్చిందన్నారు. ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ ఏపీకి జరిగిన అన్యాయం, టీడీపీ పోరాటం గురించి ప్రముఖంగా రాసిన హిందూ దినపత్రిక ఎడిటోరియల్ గురించి ప్రస్తావించారు.

## చర్చ జరిగేదాకా నోటీసులు

- టీఆర్ఎస్ మాకు వెన్నుపోటు పొడవద్దు
- వైసీపీ ఎంపీ వరప్రసాద్

న్యూఢిల్లీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అవకాశం ఉన్నంత వరకు సభలో అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెడుతూనే ఉంటామని వైసీపీ ఎంపీ వరప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. అవిశ్వాస తీర్మానం చర్చకు వచ్చే వరకూ ఉన్న అన్ని అవకాశాలనూ ఉపయోగించుకుని తీర్మానాలను ప్రవేశపెడుతూనే వుంటామని ఆయన తెలిపారు. సభ వాయిదా వేస్తున్న బీజేపీని తప్పు పట్టిన ఆయన ఆ విషయంలో తమ పార్టీ తప్పు లేదన్నారు. ధైర్యముంటే బీజేపీ చర్చకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా సభలో గొడవకు దిగుతున్న టీఆర్ఎస్ ఎంపీలను ఉద్దేశించి, 'మాకు వెన్నుపోటు పొడవద్దు' అంటూ విజ్ఞప్తి చేశారు. అవిశ్వాస తీర్మానం చర్చకు రావాలని ప్రతీ రోజూ ఎంపీలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. వైసీపీ అవిశ్వాస తీర్మానానికి మద్దతిస్తానని ప్రకటించిన చంద్రబాబు తమ పార్టీతో అవిశ్వాసం ఎందుకు పెట్టించారో అర్థం కావడం లేదన్నారు.

## అవిశ్వాసమంటే భయమెందుకు?

- మీ ఎంపీలపై నమ్మకం లేకేనా?
- బీజేపీపై యనమల ధ్వజం

అమరావతి/గుంటూరు/కందుకూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): 'మీ పార్టీ ఎంపీలపై నమ్మకం లేకేనా? అవిశ్వాసం అంటే అంత భయమెందుకు' అని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఏపీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు నిలదీశారు. ప్రధాని మోదీపై అసంతృప్తితో ఉన్న బీజేపీ ఎంపీలు అవిశ్వాసంపై చర్చ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేస్తారని భయపడుతున్నారా అని ప్రశ్నించారు. అవిశ్వాస తీర్మానంపై చర్చను అనుమతించేందుకు అవసరమైనంత మంది సభ్యులు సంతకాలు పెట్టి.. సభ్యులు లేచి నిలబడితే ఎలాంటి సంకోచం లేకుండా నోటీసును ఆమోదించాలన్నారు. చర్చకు తేదీని నిర్ణయించాలని తెలిపారు. కానీ ఈ నిబంధనలకు విరుద్ధంగా కేంద్రం వ్యవహరిస్తోందని ఆక్షేపించారు. ఇది అప్రజాస్వామికం, పార్లమెంటు సంప్రదాయాలకు వ్యతిరేకమని సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. విభజన సమయంలో తల్లిని చంపి బిడ్డను కాపాడారని ఆవేదన వ్యక్తం చేసిన మోదీ.. ఇప్పుడు ఆ శిశువునూ చంపడానికి ప్రయత్నిస్తున్నారని మంత్రి ఆనందబాబు గుంటూరులో మండిపడ్డారు. గుజరాత్ అల్లర్ల సమయంలో మోదీని పదవి నుంచి దిగిపోవాలని సీఎం చంద్రబాబు డిమాండ్ చేసిన విషయాన్ని మనసులో పెట్టుకుని సాధిస్తున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే ఏ1, ఏ2 నిందితులకు పీఎంవో రెడ్ కార్పెట్ వేసి స్వాగతం పలుకుతోందన్నారు.నవ్యాంధ్రకు కేంద్రం చేసిన అన్యాయంపై దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తమవుతోందని, ముఖ్యమంత్రి చంద్రబాబుకు నైతిక మద్దతు లభిస్తోందని రాష్ట్ర అటవీ మంత్రి శిద్ధా రాఘవరావు కందుకూరులో పేర్కొన్నారు.

## మోదీ నాటకంలో పవన్ పాత్రధారి

- ఏపీ ఉపముఖ్యమంత్రులు, మంత్రుల ఆగ్రహం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ప్రత్యేక హోదా కోసం ఢిల్లీలో దీక్ష చేస్తానన్న జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మాటమార్చారని ఏపీ ఉపముఖ్యమంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, కేఈ కృష్ణమూర్తి, మంత్రులు అచ్చెన్నాయుడు, దేవినేని ఉమ, అమరనాథ్‌రెడ్డి, అయ్యన్నపాత్రుడు, సుజయ్‌కృష్ణ రంగారావు విరుచుకుపడ్డారు. సోమవారం వారు వేర్వేరు చోట్ల విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ ఆడిస్తున్న నాటకంలో పవన్ పాత్రధారిగా మారారని.. రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బదీస్తున్నారని చినరాజప్ప ధ్వజమెత్తారు. 'గుంటూరు సభ జరిగినప్పటి నుంచి ఈ మూడు రోజుల్లో ఆయన మూడు రకాలుగా మాట్లాడారు. ప్రత్యేక హోదా కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని.. ఇప్పుడు హోదా పెద్ద విషయం కాదని.. రాష్ట్రానికి ఆర్థికపరమైన సహాయం అందించాలని అన్నారని గుర్తుచేశారు. వైసీపీ అధినేత జగన్ తన పార్టీ ఎంపీలతో రాజీనామా చేయిస్తానని.. ఆరు నెలలుగా అవిశ్వాసం అంటూ అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే మద్దతు కూడగడతానన్న పవన్ ఢిల్లీ వెళ్లకుండా రాష్ట్రంలో రచ్చ చేస్తున్నారని కేఈ కృష్ణమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి అన్యాయం జరిగిందని 5 కోట్ల మంది ప్రజలు ముక్తకంఠంతో అంటుంటే.. అందుకు భిన్నంగా ప్రధాని హోదా హామీ ఇవ్వలేదని పవన్ అనడం ఆశ్చర్యం కలిగిస్తోందని అచ్చెన్నాయుడు అన్నారు. ప్యాకేజీ పాచిపోయిన లడ్డూ అని పదే పదే విమర్శించిన పవన్.. నేడు అదే పాచిపోయిన లడ్డూ కావాలని కోరుతున్నారని మంత్రి అమరనాథ రెడ్డి ధ్వజమెత్తారు. చంద్రబాబుకు మార్కులు వేసే స్థాయి ఆయనకు ఉందా అని నిలదీశారు. విభజన చట్టంలో హామీలు తుంగలోతొక్కి ప్రధాని మోదీ రాజకీయ వ్యభిచారిగా మారారని అయ్యన్నపాత్రుడు అన్నారు. కేసుల మాఫీ కోసం జగన్, ప్యాకేజీలకోసం పవన్ బీజేపీతో మిలాఖత్ అయ్యారని సుజయ్ కృష్ణ రంగారావు ఆరోపించారు. జగన్, పవన్ పోలవరం ప్రాజెక్టును అడ్డుకోవాలని రాళ్లేస్తే చరిత్రహీనులవుతారని దేవినేని ఉమ హెచ్చరించారు.

### పవన్ వ్యాఖ్యలను సమర్థిస్తున్నా: హరిబాబు



న్యూఢిల్లీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక హోదా బదులు తగిన ప్రయోజనాన్ని రాష్ట్రానికి అందిస్తే అభ్యంతరం లేదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను తాను సమర్థిస్తున్నానని ఏపీ బీజేపీ అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు అన్నారు. సోమవారం ఆయన ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. పవన్ బీజేపీతో ఉన్నారో లేదో తనకు తెలియదని, ఏపీకి డబ్బులు రావాలని ఆయన చేసిన వ్యాఖ్యలను మాత్రం సమర్థిస్తానని తెలిపారు. ఆ సాయం చేయాలని కేంద్రాన్ని కోరుతామన్నారు. ఏపీ ప్రజలకు అన్ని ప్రయోజనాలు కల్పించడానికి బీజేపీ సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్ర విభజన చట్టంలో ప్రత్యేక హోదా అంశాన్ని ఎందుకు పెట్టలేదని కాంగ్రెస్‌ను ప్రశ్నించారు. ఏపీ పట్ల కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని, ఆ పార్టీ మొసలికన్నీరు కారుస్తోందని ఆరోపించారు.

# బీజేపీలో లుకలుకలు!

న్యూఢిల్లీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో అంతర్గతంగా లుకలుకలు చెలరేగినట్లు ప్రచారం జరుగుతోంది. టీడీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరిగితే కమలదళం సభ్యులే ఎంతమంది హాజరవుతారో చెప్పలేని పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే అవిశ్వాస తీర్మానం నెగ్గినా ఆశ్చర్యపోనక్కర్లేదని విశ్వసనీయ వర్గాలు అంటున్నాయి. ఇప్పటికే బీజేపీ ప్రధాన కార్యాలయంలో అవిశ్వాస తీర్మానంపై లెక్కలు తీశారు. దీని ప్రకారం 302 మంది మద్దతు తమకు లభిస్తుందని అంచనాకు వచ్చారు. ప్రస్తుతం లోక్‌సభలో బీజేపీకి 271 మంది సభ్యులుండగా, శివసేన నుంచి 18 మంది, అకాలీదళ్ నుంచి నలుగురు, రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ, జేడీయూ నుంచి ఇద్దరేసి, పీడీపీ, నేషనల్ పీపుల్స్ పార్టీ, స్వాభిమాన్ పక్ష నుంచి ఒక్కొక్కరు తమకు మద్దతిస్తారని.. అన్నాడీఎంకెకు చెందిన 37 మంది, సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్ నుంచి ఒక్కరు తటస్థంగా ఉంటారని అనుకున్నారు. అంతర్గత వర్గాల కథనం ప్రకారం ఎన్డీఏలోని మిత్రపక్షాలు, అన్నాడీఎంకే తదితర పార్టీల సంగతి అటుంచితే అసలు బీజేపీ ఎంపీల్లోనే ఎంతమంది ఓటింగ్‌కు హాజరవుతారన్న భయం పార్టీ పెద్దల్లో నెలకొన్నట్లు తెలుస్తోంది. ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు అమిత్ షా వైఖరి నచ్చని అనేక మంది సభ్యులు గైర్హాజరయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఇటీవల త్రిపురలో ముఖ్యమంత్రి విప్లవ్‌కుమార్ దేబ్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన సందర్భంగా బీజేపీ అగ్ర నేత లాల్‌కృష్ణ ఆడ్వాణీని మోదీ అవమానించిన తీరు చాలా మంది పార్టీ ఎంపీల మనసు గాయపరిచింది. పార్లమెంటరీ పార్టీ సమావేశాలకు పూర్తి సంఖ్యలో ఎంపీలు రాకపోవడం.. విప్ జారీ చేసినా ఉభయసభల్లో ట్రెజరీ బెంచీలు ఖాళీగా కనపడడం పార్టీ అగ్ర నేతలను కలవరపరుస్తోంది. అవిశ్వాస పరీక్షకు అంగీకరించడమో లేదా విశ్వాస పరీక్షను ఎదుర్కోవడమో చేసి.. పార్లమెంటు సమావేశాలు సజావుగా జరిగేందుకు వీలు కల్పించాలని కేంద్ర హోం మంత్రి, బీజేపీ సీనియర్ నేత రాజ్‌నాథ్‌సింగ్ సూచిస్తున్నప్పటికీ అందుకు మోదీ, అమిత్ షా అంగీకరించడం లేదని తెలిసింది. సోమవారం లోక్‌సభలో రాజ్‌నాథ్ లేచి అవిశ్వాస పరీక్షకు తాము సిద్ధమేనని, అందుకు ఎంపీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పీకర్ సుమిత్రా మహాజన్.. దానిపై చర్చకు అవకాశమివ్వకుండా గందరగోళం మధ్యలో అవిశ్వాస తీర్మానం చేపట్టడం కుదరదని ప్రకటించి సభను మంగళవారానికి వాయిదా వేయడం గమనార్హం. చర్చకు అంగీకరించాలని బీజేపీ నేతలు కొందరు భావిస్తున్నా.. మోదీ-షా సుముఖంగా లేరు. చర్చ జరిగితే ప్రభుత్వ వైఫల్యాలు బయటకు వస్తాయని, అది కర్ణాటక ఎన్నికల్లో తమకు నష్టం చేకూరుస్తుందని వారు భావిస్తున్నట్లు సమాచారం. ఒకవేళ చర్చ జరిగి ఓటింగ్‌కు వస్తే.. బీజేపీ సభ్యులు కొందరు డుమ్మాకొడితే మిత్రపక్షాల ఎంపీలు కూడా గైర్హాజరవుతారని.. అప్పుడు ప్రతిపక్షాలన్నీ కలిసికట్టుగా మోదీ సర్కారుకు వ్యతిరేకంగా ఓటు వేసే ప్రమాదం ఉందని మోదీ-షా భయపడుతున్నట్లు తెలిసింది. అవిశ్వాస తీర్మానాన్ని అంగీకరించకపోతే తాము దానికి భయపడుతున్నట్లు దేశమంతా సంకేతాలు వెళ్తాయని.. అంగీకరిస్తే సభలో పరువు పోతుందనీ ఆందోళన చెందుతున్నారు. ఇంత కంటే ఈ వారంలోనే పార్లమెంటు ఉభయసభలను నిరవధికంగా వాయిదా వేయడం మంచిదని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం.

## అవిశ్వాసంపై భయం లేదు

- బాబువి రాజకీయ గిమ్మిక్కులు
- మరో అపవిత్ర కూటమి వస్తోంది: రాంమాధవ్



న్యూఢిల్లీ, మార్చి 19: ఎన్డీఏ ప్రభుత్వంపై టీడీపీ పెట్టిన అవిశ్వాస తీర్మానానికి బీజేపీ భయపడడం లేదని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ స్పష్టం చేశారు. 'మాకు లోక్‌సభలో మెజారిటీ ఉంది. టీడీపీది రాజకీయ నిరసన. ఆకస్మికంగా భావోద్వేగ అంశాలను పట్టుకుని.. అవిశ్వాసం పెట్టడంపై ఆ పార్టీయే ప్రజలకు సమాధానం చెప్పాలి' అని సోమవారమిక్కడ వ్యాఖ్యానించారు. రాజకీయ గిమ్మిక్కులు ప్రయోగించడంలో ఏపీ సీఎం చంద్రబాబు సిద్ధహస్తుడని ఆరోపించారు. 'రాజకీయ క్రీడల్లో ఆయన్ను ఎవరూ కొట్టలేరు. రాష్ట్రాభివృద్ధికి సంబంధించినంతవరకు మేం ఆయనతోనే ఉన్నాం. కానీ రాజకీయ డ్రామాలాడుతున్నామని అంటున్నారు. టీడీపీయే అలాంటి గేమ్‌లు ఆడుతోంది' అని విమర్శించారు. దేశంలో ఎన్ని కూటములైనా ఏర్పడవచ్చని, కానీ ఏ సవాల్‌నైనా ఎదుర్కొనే సత్తా బీజేపీకి ఉందని తేల్చిచెప్పారు. తెలంగాణ, బెంగాల్ సీఎంలు కేసీఆర్, మమతా బెనర్జీ కోల్‌కతాలో సమావేశం కావడాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ.. మరో అపవిత్ర కూటమి ఏర్పాటుకు ప్రయత్నాలు మొదలైనట్లు కనిపిస్తోందని ఆయన అన్నారు.

## నిధులిచ్చినా ఖర్చు చేయరేం?

- తెలుగు రాష్ట్రాలను తప్పుబట్టిన స్థాయీ సంఘం

న్యూఢిల్లీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన చట్టం ప్రకారం పారిశ్రామిక అభివృద్ధి నిమిత్తం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు రాయితీలిచ్చినా వాటిని ఉపయోగించుకోలేకపోతున్నారని వాణిజ్య శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం తప్పుబట్టింది. ఈ రెండు రాష్ట్రాల్లో ఏర్పాటు చేసే పారిశ్రామిక యూనిట్లకు వడ్డీ రాయితీ ఇవ్వాలని విభజన చట్టంలో పేర్కొన్నారని, దాని ప్రకారం 2015-16 నుంచి ప్రతీ ఏటా బడ్జెట్‌లో రూ.100 కోట్ల చొప్పున కేంద్రం కేటాయిస్తూ వస్తోందని కమిటీ వివరించింది. అయితే, ఈ రాయితీలకు సంబంధించి పథకాలు ఖరారుకానందున నిధులు ఖర్చు చేయలేకపోతున్నామని తమకు కేంద్ర వాణిజ్య శాఖ సమాచారం అందించిందని వెల్లడించింది. ఈ రాయితీ కింద తమ రాష్ట్రంలో ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిందని, కానీ సమగ్ర ప్రతిపాదన పంపాలని ఆ ప్రతిపాదనను కేంద్రం తిప్పిపంపిందని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతీ జిల్లాలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఫెసిలిటేషన్ సెంటర్‌ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిందని, అవి పరిశీలనలో ఉన్నాయని కేంద్రం తమకు సమాచారం ఇచ్చిందని పార్లమెంటరీ కమిటీ స్పష్టం చేసింది. రెండు రాష్ట్రాలు పూర్తి వివరాలు ఇవ్వని కారణంగా ప్రతిపాదనలు ముందుకెళ్లలేదని సంబంధిత విభాగం చెప్పిందని వెల్లడించింది.సమన్వయలోపం కొట్టొచ్చినట్లు కనబడుతోందని, పారిశ్రామిక విధానం, ప్రోత్సాహక విభాగం, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాల మధ్య సమాచార లోపం, సమన్వయ లేమి వల్ల నేటి వరకూ వడ్డీ రాయితీల నిధులను వినియోగించడంలో పురోగతి లేదని స్థాయీ సంఘం తేల్చిచెప్పింది.

## 22న రహదారులు బంద్!

అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మలిదశ ఉద్యమానికి ఈనెల 22 నుంచి శ్రీకారం చుట్టాలని ప్రత్యేక హోదా సాధన సమితి, ఉభయ కమ్యూనిస్టుపార్టీలు, ప్రజాసంఘాల నాయకులు నిర్ణయించారు. సోమవారం విజయవాడలో ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారంతా కీలక తీర్మానం ఆమోదించారు. ఈ సమావేశానికి ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, 13 జిల్లాల నుంచి వివిధ రాజకీయ శ్రేణులు, విద్యార్థి, యువజన, మేధావులు, న్యాయవాదులు పాల్గొన్నారు. "ప్రత్యేక హోదా డిమాండ్‌తో ఈనెల 22న జాతీయ రహదారులు దిగ్బంధనం చేద్దాం. అన్ని జిల్లాల్లో జేఏసీలను ఏర్పాటు చేద్దాం. హోదా ఉద్యమకారులపై నమోదు చేసిన కేసులను తొలగించాలని సీఎం చంద్రబాబును కలిసి కోరదాం. ఉద్యమకారులపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్న తీరును వ్యతిరేకిద్దాం. ఏప్రిల్ ఒకటో తేదీనుంచి రాష్ట్రవ్యాప్తంగా హోదా కోసం సమష్టిగా ఉద్యమిద్దాం" అంటూ ఆరు తీర్మానాలను ఆమోదించారు. ఢిల్లీకి పెద్ద షాక్ తగిలేలా ఉద్యమ రూపాలు ఉండాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సూచించారు. సీఎం చంద్రబాబుకు నిజంగా ప్రత్యేక హోదాపై మమకారం ఉంటే, తమ ఉద్యమాన్ని సమర్థించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని పట్టణ కేంద్రాల్లో విద్యార్థి, యువజన సంఘాలతో కలిసి ప్రత్యేక హోదా సాధన సమితి కమిటీలను ఏర్పాటు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు సూచించారు.

## కామన్వెల్త్ క్రీడలకు బోల్ట్

**సిడ్నీ:** వచ్చేనెల ఆస్ట్రేలియాలో జరగనున్న కామన్వెల్త్ క్రీడల్లో స్ప్రింట్ లెజెండ్ ఉసేన్ బోల్ట్ పాల్గొననున్నాడు. రిటైర్మెంట్ ఇచ్చాడు కదా.. ఇదేంటీ! అనుకుంటున్నారా? ఆటగాడిగా కాదు..ప్రేక్షకుడిగా అతను క్రీడలకు వస్తున్నాడు. 100మీ. పరుగు ఫైనల్ ను బోల్ట్ వీక్షించనున్నట్టు జమైకా అథ్లెట్ యొహాన్ బ్లేక్ వెల్లడించాడు.



## అంతర్జాతీయ కిక్‌బాక్సింగ్‌లో శ్రీవర్ధన్‌కు పతకం

**మేడిపల్లి:** హైదరాబాద్‌కు చెందిన కిక్ బాక్సింగ్ క్రీడాకారుడు కొండు శ్రీవర్ధన్ అంతర్జాతీయ వేదికపై సత్తాచాటాడు. ఉప్పల్ సమీపంలోని పీర్జాదిగూడ, పర్వతాపూర్‌కు చెందిన శ్రీవర్ధన్ అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో పతకం కొల్లగొట్టాడు. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరిగిన ఈ మెగా ఈవెంట్‌లో బాలుర అండర్-14 కే వన్ ఈవెంట్‌లో శ్రీవర్ధన్ రెండోస్థానంలో నిలిచి రజత పతకం సాధించాడు. బోడుప్పల్‌లోని ముద్రా స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న శ్రీవర్ధన్‌కు తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కమలాకర్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. థాయ్‌లాండ్‌లో పతకం నెగ్గి సోమవారం నగరానికి చేరుకున్న శ్రీవర్ధన్‌ను రాష్ట్ర అసోసియేషన్ ప్రతినిధులు, అతని స్కూల్ యాజమాన్యం అభినందించింది.

### జీవితాంతం గుర్తుండే జ్ఞాపకం

**బం**గ్లాదేశ్‌తో ఫైనల్లో చివరి బంతిని సిక్సర్‌గా మలచి భారత్‌కు విజయాన్నందించడం తనకు జీవితకాలం గుర్తుండిపోయే ఇన్నింగ్స్ అని దినేశ్ కార్తీక్ అన్నాడు. 'ఫైనల్లో నేనాడిన ఇన్నింగ్స్ అద్భుతంగా అనిపిస్తోంది. ఇలాంటి జ్ఞాపకాలే జీవితాంతం గుర్తుండిపోతాయి. ఏడాది కాలంగా మా ప్రయాణం గొప్పగా సాగుతున్నందుకు సంతోషంగా ఉంది. ఇప్పుడు ఈ విజయంలో భాగంగా ఉన్నందుకు సంతోషంగా ఉంది. మేం పడిన కష్టానికి తగిన ప్రతిఫలమిది' అని కార్తీక్ తెలిపాడు. మరోవైపు కెప్టెన్ రోహిత్ శర్మ సహచరుడు దినేష్ చివరి బంతికి సిక్సర్ కొట్టి జట్టుకు అపురూప విజయం అందించిన క్షణాన్ని కనులారా తిలకించలేకపోయాడు. అదేంటి..అన్న అనుమానం వస్తోంది కదా? అవును.. భారత్ గెలవాలంటే ఆఖరిబంతికి 5రన్స్ అవసరమైన సంగతి తెలిసిందే. కనీసం బౌండరీ కొడితే.. మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారితీస్తుంది. అలా జరిగితే ఓపెనర్‌గా దిగాల్సిన రోహిత్ ప్యాడ్లు కట్టుకొనేందుకు డగౌట్ నుంచి డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లిపోయాడు. దాంతో రోహిత్ ఆ చిరస్మరణీయ షాట్‌ను చూడలేకపోయాడన్నమాట!

చివరి బంతికి సిక్సర్ ద్వారా మ్యాచ్‌ను గెలిపించడం ఇదేమీ తొలిసారి కాదు.. అంతర్జాతీయ, లీగ్ క్రికెట్‌లో ఇలాంటివి ఎన్నో చూసుంటాము.. మరి ఆదివారం నాటి ఉత్కంఠ పోరులో దినేశ్ కార్తీక్ బాదిన ఆ సిక్సర్‌పై ఎందుకు అంతటా ప్రశంసల జల్లు కురుస్తోంది? అతడి 8 బంతులకున్న ప్రత్యేకత ఏమిటి? ఎందుకంటే.. ఇప్పటిదాకా టీ20ల్లో భారత్‌పై గెలవని బంగ్లాదేశ్‌కు విజయం ఖాయమవుతుందా అని అనుకున్న వేళ.. అయ్యో మ్యాచ్‌ను గెలిపించే వాడే లేడా.. అని అభిమాని మూగగా రోదిస్తున్న సమయాన.. ఇదిగో నేనున్నానంటూ బరిలోకి దిగాడు.. దినేశ్ కార్తీక్. అతడిపై అభిమానులకైతే ఆశలున్నాయి కానీ 12 బంతుల్లో 34 పరుగులు చేయడమెలా..? అనే సందేహాన్ని కూడా ఎంతో కూల్‌గా పటాపంచలు చేస్తూ క్రికెట్‌లోనే అత్యుత్తమ ఫినిషింగ్ ఇన్నింగ్స్‌లో ఒకటిగా మ్యాచ్‌ను ముగించాడు. ఇదంతా ఓ ఎత్తు.. మరి సీనియర్ జట్టులోకి ఎప్పుడో హఠాత్తుగా వచ్చి సరైన చాన్స్ రాకుండానే తెరమరుగవుతున్న దినేశ్ కార్తీక్‌కు ఈ ఇన్నింగ్స్ బ్రేక్ ఇచ్చినట్టేనా..? వికెట్ కీపర్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోగలడా..? పడుతూ, లేస్తూ సాగుతున్న తన కెరీర్ గాడిన పడినట్టేనా..? అసలు ధోనీ నీడన అతడికున్న అవకాశమెంత..?





## ఫెడరర్‌కు డెల్‌పొట్రో షాక్

**ఇండియన్‌వెల్స్:** వరుస విజయాలతో అజేయంగా దూసుకెళ్తున్న స్విస్ టెన్నిస్ యోధుడు రోజర్ ఫెడరర్‌కు ఈ సీజన్‌లో తొలి ఓటమి ఎదురైంది. ఇండియన్ వెల్స్ మాస్టర్స్ టోర్నీలో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన టాప్‌సీడ్ ఫెడరర్‌కు ఫైనల్లో అర్జెంటీనా స్టార్ జువాన్ మార్టిన్ డెల్‌పొట్రో షాకిచ్చాడు. రెండు గంటల 42 నిమిషాలపాటు సాగిన హోరాహోరీ పోరులో డెల్‌పొట్రో 6-4, 6-7 (8-10), 7-6(7-2)తో ప్రపంచ నంబర్ వన్ ఫెడరర్‌ను ఓడించి విజేతగా నిలిచాడు. 29ఏళ్ల డెల్‌పొట్రోకిది సీజన్‌లో రెండో టైటిల్ కాగా, ఓవరాల్‌గా 22వది. దీంతో ఆరోసారి ఈ టైటిల్‌ను గెలవాలనుకున్న ఫెడరర్ ఆశలకు బ్రేక్ పడింది. ఫెడరర్‌తో 25సార్లు ముఖాముఖి పోరులో డెల్‌పొట్రోకిది ఏడో విజయం. ఈ విజయంతో డెల్‌పొట్రో తిరిగి టాప్-10ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకున్నాడు.

**మహిళల విజేత ఒసాకా**

ఇండియన్ వెల్స్ మహిళల సింగిల్స్‌లో జపాన్ యువ సంచలనం నవొమి ఒసాకా విజేతగా నిలిచింది. 20 ఏళ్ల ఒసాకా ఫైనల్లో 6-3, 6-2తో రష్యా యువ క్రీడాకారిణి డారియా కసట్కినాను ఓడించి టైటిల్ అందుకుంది. ఇవనోవిచ్ తరువాత ఈ టైటిల్‌ను గెలుచుకున్న పిన్న వయస్కురాలుగా ఒసాకా నిలిచింది. అన్‌సీడెడ్ ఒసాకా టైటిల్‌ను సాధించే నేపథ్యంలో హేమాహేమీలు షరపోవా, ప్లిస్కోవా, ప్రపంచ నంబర్ వన్ సిమోనా హాలెప్‌లను దాటుకుని ఫైనల్ చేరుకుంది. ఈ విజయంతో తాజా ర్యాంకింగ్స్‌లో ఒసాకా తన కెరీర్‌లోనే అత్యుత్తమంగా 22వ ర్యాంక్‌కు చేరుకోనుంది.

## షమిని కలిశాను కానీ..


- పాక్ మహిళ అలీష్బా

**ముంబై:** భార్య హసీన్ జహా ఆరోపణలు, ఆమె పెట్టిన గృహ హింస కేసుతో దిక్కుతోచని స్థితిలో పడిన టీమిండియా పేసర్ మహ్మద్ షమికి గొప్ప ఊరట ఇచ్చే విషయమిది. పాకిస్థాన్ మహిళ అలీష్బా నుంచి తన భర్త షమి డబ్బులు తీసుకొన్నాడని, ఆమెతో అతడికి వివాహేతర సంబంధం ఉందని హసీన్ ఆరోపించిన నేపథ్యంలో..ఎట్టకేలకు ఆ పాక్ మహిళ స్పందించింది. ట్విట్టర్‌లో షమికి ఉన్న ఫాలోవర్లలో తానూ ఒకరినని, అతడి అభిమానినని తెలిపింది. దుబాయ్‌లో షమిని తాను కలవడం నిజమేనని వెల్లడించింది. అయితే, అతని భార్య ఆరోపించినట్టు తమ మధ్య వివాహేతర సంబంధం ఏదీలేదని స్పష్టంజేసింది. గతేడాది ఇంగ్లండ్‌లో చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో పాక్‌పై భారత్ ఓటమి అనంతరం షమితో తనకు పరిచయం ఏర్పడిందని తెలిపింది. ఒక అభిమానిగా అతడికి మెసేజ్ పంపానని పేర్కొంది. 'ఒక వ్యక్తిగా షమిని ఎంతో ఇష్టపడతా. సాధారణంగా తమ ఆరాధ్య దైవాన్ని కలుసుకోవాలని ఏ అభిమాని అయినా కల కంటాడు. షమి అంటే నాకు గౌరవం. మేం మంచి స్నేహితులం మాత్రమే. మా సంభాషణ కూడా సాధారణంగా ఉండేది' అని వివరించింది. 'షార్జాలో నా సోదరి ఉంటుంది. అందువల్ల తరచూ దుబాయ్ వెళుతుంటా. ఆ క్రమంలోనే.. దక్షిణాఫ్రికా నుంచి వస్తున్న షమిని యాదృచ్ఛికంగా దుబాయ్‌లో కలిశా. అయితే అతడు బస చేసిన హోటల్‌కు వెళ్లలేదు. నా సోదరి ఇంటికి వెళ్లి మరునాడు ఉదయం 9 గంటలకు అతడితో బ్రేక్‌ఫాస్ట్ చేశా. అంతేతప్ప మా ఇరువురి నడుమ ఎలాంటి వ్యవహారాలు చోటుచేసుకోలేదు. అతడికి డబ్బులు కూడా ఇవ్వలేదు' అని అలీష్బా వివరించింది.



**కోర్టుకు హసీన్..:** ఇక..సోమవారం కోల్‌కతాలోని అలిపోర్ మేజిస్ట్రేట్ కోర్టుకు హాజరైన హసీన్.. తన ఆరోపణలకు సంబంధించి వాంగ్మూలం ఇచ్చింది. అనంతరం..షమిపై తన పోరాటంలో మద్దతు ఇవ్వాలని కోరేందుకు కాళీఘాట్‌లోని సీఎం మమతా బెనర్జీ నివాసానికి వెళ్లింది. కోర్టు వెలుపల హసీన్ విలేకరులతో మాట్లాడుతూ.. షమిపై తాను చేసిన అన్ని ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని మరోసారి స్పష్టంజేసింది. 'అలీష్బా.. షమికి ఓ స్నేహితురాలు, అభిమాని కాదు. గౌరవనీయురాలైన ఓ మహిళ పెళ్లయిన వ్యక్తితో హోటల్ గదికి వెళుతుందా? అతడితో పడక పంచుకుంటుందా? నా వైవాహిక జీవితాన్ని నాశనం చేసే ఉద్దేశంతోనే ఆమె అలా చేసింది' అని జహా ఆరోపించింది.

### అచ్చం మహీలాగే ..



**ఫై**నల్ మ్యాచ్.. పైగా చివరి రెండు ఓవర్లలో భారీగా పరుగులు చేయాల్సిన స్థితి.. కానీ అప్పుడే క్రీజులోకి అడుగుపెట్టిన డీకే ముఖంలో ఎలాంటి అలజడీ కనిపించలేదు. అచ్చు ధోనీలాగే ప్రశాంత చిత్తంతో కనిపించడం అందరినీ అబ్బురపరిచింది. అత్యంత కీలక సమయంలో వరుసగా బంతులను వదిలేస్తున్న విజయ్ శంకర్‌ను చూసిన కళ్లతో డీకే 'కూల్' ఊచకోత మండు వేసవిలో పన్నీటి జల్లులా అనిపించింది. ఆఖరికి కచ్చితంగా సిక్సర్ కొట్టాల్సిందే అనే స్థితిలోనూ అదే కూల్‌నెస్. అచ్చు 2011 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో ధోనీ తరహాలోనే ఫినిషింగ్ టచ్ ఇచ్చి చిద్విలాసంగా బ్యాట్ పైకెత్తాడు. అందుకే అభిమానులు ఇప్పుడు వీరిద్దరినీ పోల్చుకుంటున్నారు.



## సన్నీ..నాగిని డ్యాన్స్ !

**కొలంబో:** నాగిని డ్యాన్స్.. ముక్కోణపు టీ20 సిరీస్‌లో అభిమానులను అలరించిన నృత్యం. తొలుత..శ్రీలంకతో తమ తొలి లీగ్ మ్యాచ్‌లో విజయవంతంగా 214 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి సంచలనం సృష్టించిన క్షణాన బంగ్లా బ్యాట్స్‌మన్ ముష్ఫికర్ రహీమ్ నాగిని డ్యాన్స్ చేశాడు. ఆఖరి లీగ్ మ్యాచ్‌లో అదే లంకేయులను చిత్తుచేసి ఫైనల్ చేరిన ఆనందంలో బంగ్లాదేశ్ జట్టంతా ఆ నృత్యం చేయడం ఈ టోర్నీకి ప్రత్యేకతగా నిలిచింది. ఈ డ్యాన్స్‌ను చూసి ముచ్చటపడిన ఆసీస్ మాజీ పేసర్ బ్రెట్ లీ ఆదివారం భారత్-బంగ్లా ఫైనల్ సందర్భంగా సహచర వ్యాఖ్యాత సునీల్ గవాస్కర్‌ను నాగిని నృత్యం చేయాలని కోరాడు. దాంతో కామెంట్రీ బాక్స్‌లో సన్నీ ఆ డ్యాన్స్ చేయడంతో బ్రెట్‌లీ పడీపడీ నవ్వాడు. అయితే తమ జట్టు తుదిపోరులో ఓడిపోవడంతో డీలాపడ్డ బంగ్లా అభిమానులు గవాస్కర్ డ్యాన్స్‌పై విమర్శలు కురిపించారు.



## ఖడేకు స్వర్ణం

**సింగపూర్:** భారత యువ స్విమ్మర్ వీర్‌ధవళ్ ఖడే సింగపూర్‌లో జరుగుతున్న జాతీయ ఏజ్ గ్రూప్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించాడు. 100మీ. ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో 23.02 సెకన్లలో గమ్యాన్ని చేరి స్వర్ణం అందుకున్నాడు. 50మీ. ఫ్రీస్టయిల్‌లోనూ పోటీపడ్డ ఖడే.. ఈ ఈవెంట్‌లో రెండోస్థానంతో రజతం గెలుచుకున్నాడు.



## అ'మ్మా' ఇవనోవిచ్

**ముంబై:** టెన్నిస్ మాజీ నెంబర్ వన్ అనా ఇవనోవిచ్ తల్లయింది. సెర్బియాకు చెందిన ఈ ఫ్రెంచ్ ఓపెన్ మాజీ చాంపియన్ 2016లో ఆటకు గుడ్‌బై చెప్పిన అనంతరం జర్మన్ ఫుట్‌బాల్ ఆటగాడు బాస్టియన్ ష్వీన్‌స్టీగర్‌ను పెళ్లాడింది. తమకు మగబిడ్డ జన్మించినట్టు ఇవనోవిచ్, బాస్టియన్ సోమవారం వెల్లడించారు.

# ఈ ఇన్నింగ్స్ సరిపోదా!

- జట్టులో సుస్థిర స్థానం ఆశిస్తున్న దినేశ్ కార్తీక్
- బ్యాకప్ కీపర్‌గానే పరిగణిస్తున్న మేనేజ్‌మెంట్
- నిలకడైన ఆటతీరుపై అంతటా ప్రశంసలు

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

నిదహాస్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ అనంతరం అవార్డుల కార్యక్రమం అది.. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ ట్రోఫీని అందుకునేందుకు వస్తున్న దినేశ్ కార్తీక్ అడుగులు పోడియం ఎక్కుతుండగా తడబడ్డాయి.. ఇది సాధారణమే అనిపించినా ఓ విధంగా భారత జట్టులో అతడి ప్రస్థానానికి సంకేతంగా అనిపించింది. అవును.. దినేశ్ కార్తీక్ అంటే చాలామందికి ఐపీఎల్‌లో కనిపించే క్రికెటర్‌గానే తెలుసు కానీ అతడు 14 ఏళ్ల క్రితమే భారత జట్టు సభ్యుడయ్యాడనే విషయం తెలిస్తే ఆశ్చర్యమేస్తుంది. 2004లో అతడు తొలిసారిగా వన్డేల్లో పార్థివ్ పటేల్‌కు రీప్లేస్‌మెంట్‌గా జట్టులోకి వచ్చాడు. వెంటనే అదే ఏడాది టెస్టు అరంగేట్రం చేసినా పది మ్యాచ్‌ల్లో ఒక అర్ధ సెంచరీ కారణంగా వేటు పడింది. అప్పటి నుంచి జట్టులోకి వస్తూ పోతూ ఉన్నాడు. కానీ అందరికీ ఓ రోజంటూ వస్తుందన్న చందంగా డీకేకు కూడా ఆ అవకాశం వచ్చింది. తానూ ఓ సీనియరే అయినా 'సీనియర్లు' లేని యువ జట్టులో చోటు దక్కించుకుని లంకకు వచ్చాడు. అరుదుగా వచ్చే అవకాశాన్ని రెండు చేతులా సద్వినియోగం చేసుకున్నాడు. ఎంతలా అంటే.. ఈ ముక్కోణపు టోర్నీలో అతడు బరిలోకి దిగిన ఐదుసార్లూ నాటౌట్‌గానే నిలిచాడు. ఆఖర్లో వచ్చినా కూడా వీలైనంత వేగంగా ఆడి జట్టుకు పరుగులు సాధించి పెట్టాడు.

### ధోనీ ప్రభతో వెనక్కి...

భారత జట్టులో కీపింగ్ అంటే ధోనీ.. ధోనీ అంటే కీపింగ్ అని అభిమానులు భావిస్తుంటారు. అతడి సత్తా అలాంటిది. కానీ తనకన్నా మూడు నెలల ముందే దినేశ్ కార్తీక్ అంతర్జాతీయ క్రికెట్‌లో కీపర్‌గా అరంగేట్రం చేశాడు. దురదృష్టం కొద్దీ అతడి ధనాధన్ ఆటతో ఒక్కసారిగా తెర వెనక్కి వెళ్లిపోవాల్సి వచ్చింది. ఇక ధోనీ కెప్టెన్ కావడం.. వ్యూహాల్లో దిట్టగా పేరు తెచ్చుకుని జట్టుకు రెండు వరల్డ్‌కప్‌లు అందించడంతో అంతా డీకేను మర్చిపోయారు. దేశవాళీ క్రికెట్‌లో ఎన్ని పరుగులు చేసినా భారత్‌కు ధోనీ ఉన్నాడు కాబట్టి నో చాన్స్ అన్నట్టుగా పరిస్థితి ఉండేది. కీపర్‌గా తొలి ప్రాధాన్యత అతడికే ఉండడంతో డీకేకు చోటు దొరకడం అసాధ్యమైంది. 2014లో ధోనీ టెస్టుల నుంచి తప్పుకొన్నాక వికెట్ కీపర్‌గా డీకే పేరు వినిపించినా అప్పుడు వృద్ధిమాన్ సాహా తనకన్నా మెరుగు అనే అభిప్రాయంతో ఆ అవకాశమూ పోయింది. కానీ ఎవరూ పట్టించుకోకపోయినా తన ప్రయాణాన్ని మాత్రం డీకే ఆపలేదు. దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటుకుంటూ పరుగుల వరద పారించాడు. అవకాశం వచ్చినప్పుడు జాతీయ జట్టులోకి వచ్చాడు. ఓపెనింగ్ చేయడానికీ సిద్ధపడ్డాడు. ఒక్కోసారి ఎవరో గాయపడితే పిలుపు అందేది. మరోసారి తనకు పిలుపు వచ్చినా గాయం కారణంగా దూరమయ్యే వాడు. ఇలా రావడం.. పోవడంతో అతడి కెరీర్ పడుతూ లేస్తూ వస్తోంది. 2010లో తను ఆఖరి టెస్టు ఆడగా 14 ఏళ్ల కెరీర్‌లో ఆడిన వన్డేలు 78 కాగా టీ20లు 18 మాత్రమే..



**ది**నేశ్ కార్తీక్ దక్షిణాఫ్రికా పర్యటనలోనూ మాతోనే ఉన్నా ఎక్కువ మ్యాచ్‌లు ఆడలేపోయాడు. కానీ ఆదివారం నాటి ఆటతో అతడి ఆత్మవిశ్వాసం రెట్టింపవుతుంది. జట్టులో ఎలాంటి స్థానంలో అయినా ఆడేందుకు సిద్ధంగా ఉండడం అతడి బలం. అయితే ఏడో నంబర్ స్థానంలో ఆడేందుకు మొదట తను ఇష్టపడలేదు. కానీ ఆఖరి మూడు, నాలుగు ఓవర్లలో ప్రత్యర్థి ప్రధాన బౌలర్లను ఎదుర్కొనేందుకు అలాంటి ఆటగాడు అవసరమని నేను భావించాను. అదే విషయం అతడితో చెప్పాను. అందుకే నేను అవుటయ్యాక డీకేను పంపలేదు. ముంబై ఇండియన్స్ తరఫున ఆడినప్పుడు అతడి సత్తా ఏమిటో నాకు తెలుసు. **- రోహిత్ శర్మ**

### చిన్న గదిలో అష్టకష్టాలు..

రెండేళ్లకు ముందు అతడి కెరీర్ ఒడిదుడుకుల్లో సాగింది. 2014లో ఢిల్లీ జట్టు కార్తీక్‌ను రూ.12.5 కోట్లకు కొనుగోలు చేస్తే ఆ తర్వాత ఏడాది రూ.10.5 కోట్లకు బెంగళూరు జట్టు తీసుకుంది. 2016లో అయితే గుజరాత్ లయన్స్ కేవలం రూ. 2.3 కోట్లకు తీసుకుంది. దీంతో డీకే ఒక్కసారిగా హడలిపోయాడు. ఈసారి విఫలమైతే పట్టించుకునే నాథుడుండడనే అనుమానం వెంటాడింది. ఫిట్‌నెస్ మెరుగుపరుచుకోవడం.. ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా దీటుగా నిలబడడం అతడి ముందున్న లక్ష్యం. ఇందుకు తన మిత్రుడు, ముంబై ఆటగాడు అభిషేక్ నాయర్ సహాయాన్ని డీకే తీసుకున్నాడు. ఓ అతి చిన్న గదిలో ఉంటూ.. ఎప్పుడు పనిచేస్తుందో తెలీని షవర్‌తో.. పగిలిన మగ్గులతో స్నానం చేస్తూ తన సహజశైలికి భిన్నంగా జీవించాడు. 'ఆ గది కార్తీక్‌కు నరకం లాంటిది. చెన్నైలో అతడు పెద్ద బంగ్లాలో ఉన్నా నా దగ్గరికి వచ్చినప్పుడు అతడు ఎప్పుడూ చూడని పరిసరాల్లోకి తీసుకెళ్లాలనుకున్నాను. అక్కడ ఉండడం చాలా కష్టం. కొన్నిసార్లు నాపై కోప్పడేవాడు. కనీసం ఓ రాత్రి అయినా హోటల్లో ఉండేలా చూడమని ప్రాధేయపడేవాడు' అని నాయర్ తెలిపాడు. ఈ రూమ్ కష్టాలతో పాటు మధ్యాహ్న సమయాల్లో ప్రాక్టీస్, జిమ్, మెడిటేషన్‌తో రాటుదేలాడు. గుజరాత్ తరఫున లీగ్‌లో సక్సెస్ కావడంతో పాటు 2016-17 రంజీ సీజన్‌లో 704 పరుగులు బాదాడు. దేశవాళీ వన్డేల్లో 118 సగటుతో 9 మ్యాచ్‌ల్లో 607 రన్స్ చేశాడు. కెప్టెన్ హోదాలో తమిళనాడుకు విజయ్ హజారే ఫైనల్లో సెంచరీతో టైటిల్‌ను అందించాడు.

### మూడేళ్ల అనంతరం జట్టులోకి..

దేశవాళీల్లో చూపిన ప్రతిభ కారణంగా మూడేళ్ల అనంతరం 2017లో దినేశ్ కార్తీక్ తిరిగి జట్టులో చోటు దక్కించుకున్నాడు. చాంపియన్స్ ట్రోఫీ కోసం జట్టులో ఉన్నా బెంచీకే పరిమితమయ్యాడు. ఆ తర్వాత విండీస్ పర్యటనలో రెండు మ్యాచ్‌ల్లో ఓ అర్ధ సెంచరీ చేశాడు. అనంతరం న్యూజిలాండ్, శ్రీలంక జట్లతో ఆడినా రాణించలేకపోయాడు. ఇటీవలి సఫారీ పర్యటనలో కూడా జట్టులోనే ఉన్నా చివరి టీ20లో ఆడి 6 బంతుల్లో 13 పరుగులు చేశాడు. ఇక ధోనీ విశ్రాంతితో నిదహాస్ ట్రోఫీలో తుది జట్టులో ఉన్న తను సంచలనమే సృష్టించగలిగాడు. ఇదంతా తను రెండేళ్లుగా పడుతున్న కష్టానికి ప్రతిఫలం లాంటిది. ధోనీ ఆటతీరు ఇప్పుడు మునుపటిలా లేదనే విషయం అందరికీ తెలుసు.. మరి తనకు ప్రత్యామ్నాయంగా డీకే సెలెక్టర్లకు కనిపిస్తున్నాడా.. అనేది ఇప్పుడు ఆసక్తికరం. ఇక అతడికి ఎలాంటి అవకాశమివ్వాలనేది వారి చేతుల్లోనే ఉంది.

### కొసమెరుపు

ఒక్కటి మాత్రం నిజం.. భారత జట్టులో దినేశ్ కార్తీక్‌ను ఇక రెగ్యులర్‌గా మనం చూస్తామో.. లేదో కానీ ఈ ఒక్క ఇన్నింగ్స్‌తో మాత్రం తను అభిమానుల హృదయంలో కలకాలం గుర్తుండిపోవడం ఖాయం.

## రెండో ర్యాంక్‌కు చాహల్

**దుబాయ్:** ఐసీసీ టీ-20 ర్యాంకింగ్స్‌లో భారత స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్ రెండో స్థానానికి చేరుకున్నాడు. ముక్కోణపు టోర్నీలో విశేష ప్రతిభ ప్రదర్శించిన చాహల్ ర్యాంకింగ్స్‌లో 12 స్థానాలు మెరుగుపరచుకున్నాడు. మరో భారత బౌలర్ వాషింగ్టన్ సుందర్‌కూడా గణనీయంగా తన ర్యాంకింగ్‌ను మెరుగుపరచుకున్నాడు. అతడు 151 స్థానాలు ఎగబాకి 31వ ర్యాంకుకు చేరుకున్నాడు. మిగతా బౌలర్లలో జయ్‌దేవ్ ఉనాద్కట్ 52వ, శార్దూల్ ఠాకూర్ 76వ ర్యాంకుల్లో కొనసాగుతున్నారు.




## 'వంద'లో వరల్డ్ రికార్డు

**మేరీల్యాండ్ (అమెరికా):** వందేళ్ల వయస్సంటే నడవడమే కష్టం. కానీ వారు పరుగులే తీస్తున్నారు. ఏకంగా వరల్డ్ రికార్డులు నెలకొల్పారు. మేరీల్యాండ్‌లోని ల్యాండోవర్‌లో జరిగిన అమెరికా ట్రాక్, ఫీల్డ్ మాస్టర్స్ ఇండోర్ చాంపియన్‌షిప్స్ ఈ అరుదైన ఘటనలకు వేదికైంది. 102 ఏళ్ల జూలియా మహిళల 100ప్లస్ వయస్సు కేటగిరీ 60 మీ.పరుగును 24.79 సెకన్లలో పూర్తి చేసి కొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. వందేళ్ల వయస్సులో ఆమె పోటీల్లో పాల్గొనడం ప్రారంభించడం మరో విశేషం. ఇక పురుషుల 60 మీ.లలో 100 ఏళ్ల ఆర్విల్లె రోజర్స్ 19.13 సెకన్లలో గమ్యం చేరి వరల్డ్ రికార్డు లిఖించాడు. రెండో ప్రపంచ యుద్ధంలో బాంబర్ పైలెట్‌గా విధులు నిర్వర్తించిన రోజర్స్ 50 ఏళ్ల వయస్సులో 'రన్నింగ్' ప్రారంభించాడు. గుండెపోటుతో ఎడమ చేయి, పాదం, తుంటి తాత్కాలికంగా చచ్చుబడినా..పరుగు పందేల్లో పోటీపడడం అతడు ఆపకపోవడం గమనార్హం.

## పారితోషికంలో ఇంత తేడానా..?

- బీబీసీని నిలదీసిన నవ్రతిలోవా



**లండన్:** పారితోషికం విషయంలో ప్రఖ్యాత ప్రసారసంస్థ బీబీసీ పక్షపాత వైఖరి ప్రదర్శించిందని టెన్నిస్ గ్రేట్ మార్టినా నవ్రతిలోవా ఆరోపించింది. వింబుల్డన్ కామెంటేటర్‌గా అమెరికా మాజీ ప్లేయర్ జాన్ మెకెన్రోకు తనకంటే 10 రెట్లు ఎక్కువగా చెల్లించడం షాక్‌కు గురిచేసిందని చెప్పింది. వింబుల్డన్‌లో కామెంటేటర్‌గా నవ్రతిలోవాకు బీబీసీ రూ. 13.64 లక్షల పారితోషికాన్ని చెల్లించింది. సహ వ్యాఖ్యాత అయిన మెకెన్రోకు రూ. 1.37 కోట్ల నుంచి రూ 1.74 కోట్ల మధ్య ముట్టినట్టు ఆమె తెలిపింది. కాగా మార్టినా ఆరోపణలను బీబీసీ ఖండించింది. పని భారం ఆధారంగానే చెల్లింపులు చేశామని చెప్పింది. ఎటువంటి లింగ వివక్ష చూపించలేదని ప్రకటించింది.



## టీచరమ్మకు 6.5 కోట్ల బహుమతి

ప్రతిష్ఠాత్మకమైన 'గ్లోబల్ టీచర్ ప్రైజ్' బ్రిటన్ ఉపాధ్యాయురాలు ఆంగ్రియా జాఫిరాకో (39)ను వరించింది. దుబాయ్ రాజు షేక్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ అవార్డు కింద ఆంగ్రియాకు రూ. 6.5కోట్లను బహూకరించారు.

# చిరు ఉద్యోగులకు పెద్ద కానుక?

## కనీస మూలవేతనం 21వేలు.. ఏడో వేతన సంఘం సిఫారసు 18వేలు

**▸▸ త్వరలోనే కేంద్రం నిర్ణయం తీసుకోనుందంటూ వార్తలు**

న్యూఢిల్లీ, మార్చి 19: కేంద్ర ప్రభుత్వ చిరు ఉద్యోగులకు మోదీ సర్కారు పెద్ద కానుక ఇవ్వనుంది. కనీస మూల వేతనాన్ని రూ.21,000లకు పెంచనుంది. ఏడో వేతన సవరణ సంఘం (సీపీసీ) సిఫారసులలో భాగంగా ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు వార్తలు వస్తున్నాయి. వాస్తవానికి సీపీసీ ఈ మొత్తాన్ని ప్రస్తుతం ఉన్న రూ.7వేల నుంచి రూ.18 వేలకు పెంచాలని సిఫారసు చేసింది. కానీ, కేంద్ర ప్రభుత్వం మరో రూ.3వేలు పెంచాలని నిర్ణయానికొచ్చినట్లు సమాచారం. ఏడో వేతన సవరణ సంఘం చేసిన సిఫారసులకు 34 సవరణలు చేసి గత జూన్‌లో కేంద్రం ఆమోదించింది. వాటిని అమలు చేయడం ద్వారా ప్రభుత్వ ఖజానాపై రూ.30,748 కోట్ల అదనపు భారం పడుతుంది. ఇందులో భాగంగా గత జూలై నుంచే అన్ని భత్యాలను చెల్లిస్తోంది. డీఏ, డీఆర్‌ల పెంపుపైనా ఈ నెల తొలి వారంలో నిర్ణయం తీసుకుంది. ఫలితంగా ప్రభుత్వంపై ఏటా మరో రూ.6వేల కోట్లకుపైగా భారం పడనుంది. అయితే ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చేలా కనీస వేతనం, ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌పై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఉద్యోగులు కూడా దీనిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో... పే మ్యాట్రిక్స్ లెవల్ 1 నుంచి 5 లోపు ఉన్న వారిపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది. ఏప్రిల్ తొలివారంలో జరిగే కేబినెట్ భేటీలో దీనిపై నిర్ణయం తీసుకోనుంది. ఏడో వేతన సవరణ సంఘం సిఫారసులు 47 లక్షలకుపైగా ఉద్యోగులు, 53 లక్షలకుపైగా పెన్షనర్లపై ప్రభావం చూపనున్నాయి. ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నట్లుగా వేతనాలు పెంచడానికి రెవెన్యూ లోటే ఆర్థికశాఖకు ప్రధాన అవరోధంగా ఉంది. అంతటి పెంపువల్ల తమ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని పలు రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేయడంతో కేంద్రం కొంత వెనకడుగు వేసింది. కానీ, ఇటీవల కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంది. గత అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి వృద్ధి రేటు 7.2శాతంగా ఉంది. చివరి త్రైమాసికంలోనూ వృద్ధిరేటు కొనసాగుతుందని అంచనాలు రావడంతో ఉద్యోగులకు ప్రయోజనం కల్పించడంపై కేంద్రం దృష్టి పెట్టింది.



## రైల్వేలో నియామకాలకు రెడ్ సిగ్నల్!

చెన్నై, మార్చి 19: రైల్వేలో ఉద్యోగ నియామకాలకు 'రెడ్ సిగ్నల్' పడుతోంది. అవసరమైన చోట ఉద్యోగ విరమణ చేసిన వారిని, నిపుణులైన వ్యక్తులను కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలని భారతీయ రైల్వే నిర్ణయించింది. ఖాళీగా ఉన్న 1.50 లక్షల సాంకేతిక ఉద్యోగాలలో కనీసం 50శాతం ఉద్యోగాలను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. లోకోపైలట్లతో సహా, సాంకేతికపరమైన పోస్టులన్నింటినీ రెండేళ్లపాటు ప్రయోగాత్మకంగా కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తున్నట్లు రైల్వే పేర్కొంది.

## ఇంకెక్కడ 'అచ్చే దిన్'?

**▸▸ ఆ ప్రచారానికి కాలంచెల్లింది: రాహుల్**



న్యూఢిల్లీ, మార్చి 19: ప్రధాని నరేంద్ర మోదీ 'అచ్చే దిన్' ప్రచారానికి కాలం చెల్లిందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. భారత్‌లో నిరుద్యోగ సమస్యపై అమెరికా ఆర్థిక వేత్త, నోబెల్ బహుమతి గ్రహీత పాల్ కుర్గ్‌మన్ హెచ్చరిక నేపథ్యంలో మోదీపై రాహుల్ విమర్శల దాడి కొనసాగించారు. 'నిరాకరణల్లోనే ప్రధాని జీవిస్తుంటార'ని ఎద్దేవా చేశారు. రెండేళ్లుగా తాము ఏం చెబుతున్నామో దానినే కుర్గ్‌మన్ ధ్రువీకరించారని ట్విటర్‌లో పేర్కొన్నారు. నిరుద్యోగం భారత్ ఎదుర్కొంటున్న అతి పెద్ద ముప్పు అని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగాలు ఇవ్వకపోగా నోట్ల రద్దు నిర్ణయంతో, వస్తు సేవా పన్ను (జీఎస్టీ) అస్తవ్యస్త అమలుతో ఉన్న ఉద్యోగాలు పీకేశారని ధ్వజమెత్తారు.

## గొడవ పేరుతో తప్పించుకోలేరు

**▸▸ లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ ఆచార్య**

న్యూఢిల్లీ, మార్చి 19: సభ గందరగోళంగా ఉందన్న కారణంగా అవిశ్వాస తీర్మానంపై నిర్ణయం తీసుకోకుండా వాయిదా వేయటం సరికాదని లోక్ సభ విశ్రాంత సెక్రటరీ జనరల్ పీడీటీ ఆచార్య అభిప్రాయపడ్డారు. రెండోరోజూ లోక్‌సభలో అవిశ్వాస తీర్మానంపై స్పీకర్ నిర్ణయం తీసుకోకుండా "సభ సుజావుగా లేనందున తీర్మానంపై నిర్ణయం తీసుకోలేకపోతున్నాను" అంటూ వాయిదా వేయటంపై ఆయన పీటీఐతో మాట్లాడారు. ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని మిగిలిన తీర్మానాలతో పోల్చలేమని అన్నారు. ఎంతో ప్రత్యేకత కలిగిన ఈ తీర్మానం గురించి సభ్యులకు స్పీకర్ తెలియచెప్పాల్సిందేనని చెప్పారు. తీర్మానం నిబంధనల మేరకు ఉంటే చాలుననీ, స్పీకర్ ముందుకు వెళ్ళవచ్చని ఆయన వివరించారు. తీర్మానానికి మద్దతుగా 50 మంది సభ్యులుంటే చాలుననీ, తీర్మానంపై చర్చ తేదీని, సమయాన్ని నిర్ణయించే అధికారం స్పీకర్‌కు ఉంటుందని ఆయన వివరించారు. మరో విశ్రాంత సెక్రటరీ జనరల్ బాల్ శేఖర్ పీటీఐతో మాట్లాడుతూ, సభ గొడవగా ఉన్నప్పుడు అవిశ్వాస తీర్మానం వంటి ముఖ్యమైన అంశాలను చేపట్టడంలో ఆచరణాత్మక ఇబ్బందులు ఉంటాయని వివరించారు. తీర్మానానికి మద్దతుగా కొందరు, గొడవ చేస్తూ వెల్‌లో మరికొందరు ఉన్నప్పుడు లెక్కింపు ఇబ్బందికరంగా మారుతుందని శేఖర్ అభిప్రాయపడ్డారు. ఓటింగ్ లేకుండా కేవలం లెక్కింపునకు మాత్రమే పరిమితమయ్యే ఈ సందర్భంలో అలాంటి వాతావరణం మరికొన్ని వివాదాలకు కారణం అవుతుందన్నారు. నిలబడిన వారు తీర్మానానికి మద్దతుగా కాదని, నిరసన తెలుపుతున్నారని అనే అవకాశం ఉందని వివరించారు.

# మళ్లీ అదే సీన్!

(మొదటి పేజీ తరువాయి)



నోటీసులు ఇచ్చారు. సోమవారం ఉదయం లోక్‌సభ ప్రారంభమైన వెంటనే ప్రత్యేక హోదా, ఇతర సమస్యలపై టీడీపీ, వైసీపీ ఎంపీలు, రిజర్వేషన్లపై రాష్ట్రాలకు స్వేచ్ఛ ఇవ్వాలంటూ టీఆర్ఎస్ సభ్యులు, కావేరీ వాటర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఏర్పాటుపై అన్నా డీఎంకే ఎంపీలు నిరసనకు దిగారు. వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు చేశారు. దీంతో... సభ మొదలైన 20 క్షణాల్లోనే స్పీకర్ సుమిత్రా మహాజన్ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైన తర్వాత కూడా గందరగోళం కొనసాగింది. సభ్యులు ఎటువంటి చర్చ కోరుకున్నా ప్రభుత్వం స్వాగతిస్తుందని, అవిశ్వాసంపైనా చర్చకు సిద్ధమని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సభలో ప్రకటించారు. దీంతో.. అవిశ్వాస తీర్మానంపై నోటీసులను పరిగణనలోకి తీసుకోవడం ఖాయమని అంతా భావించారు. ఆ తర్వాత అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభలో స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటన చేశారు. "కేంద్ర మంత్రి మండలిపై తమకు విశ్వాసం లేదని టీడీపీ ఎంపీలు ఎంపీ తోట నరసింహం, గల్లా జయదేవ్, వైసీపీ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి నుంచి నోటీసులు అందాయి. ఈ విషయం సభ తెలియజేయడం నా బాధ్యత. హౌస్ ఆర్డర్‌లో ఉంటే దీనికి మద్దతుగా వారి స్థానాల్లో నిలబడే 50 మంది సభ్యులను నేను లెక్కించగలను. అప్పుడే తీర్మానాన్ని పరిగణనలోకి తీసుకోవాలా వద్దా అనేది నిర్ణయించగలను' అంటూ రూలింగ్ ఇచ్చారు. అంతే... అన్నా డీఎంకే సభ్యులు అత్యంత నాటకీయంగా తమ ఆందోళనను మరింత ఉద్ధృతం చేశారు. 'ఊ...ఊ...' అంటూ నోటితో వింత శబ్దాలు కూడా చేశారు. ప్లకార్డులను మరింత జోరుగా ప్రదర్శించారు. మరోవైపు... అవిశ్వాసానికి మద్దతుగా కాంగ్రెస్, తృణమూల్, ఎస్పీ, ఆర్జేడీ, ఆప్, ఎంఐఎం, ఎన్సీపీ, జేడీఎస్, బీజేడీ, వామపక్షాల ఎంపీలు తమతమ స్థానాలలో లేచి నిల్చున్నారు. అయితే, వెల్‌లో అన్నాడీఎంకే, టీఆర్ఎస్ సభ్యులు ఉండటంవల్ల అవిశ్వాసానికి ఎవరు మద్దతు ఇస్తున్నారో కనిపించడం లేదని స్పీకర్ పేర్కొన్నారు. వెంటనే టీడీపీ, వైసీపీతో పాటు ఇతర విపక్ష ఎంపీలంతా మద్దతుగా ఉన్నామంటూ చేతులుకూడా పైకెత్తారు. వెల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న అన్నాడీఎంకే, టీఆర్ఎస్ సభ్యులు కూడా చేతులెత్తి ఆందోళన చేశారు. దీంతో ఎవరు నిరసన వ్యక్తం చేస్తున్నారో, ఎవరు అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా నిల్చున్నారో తనకు తెలియడంలేదని స్పీకర్ తేల్చేశారు. 'సభ సవ్యంగా ఉంటేనే నోటీసులను పరిగణనలోకి తీసుకోగలను' అని చెప్పారు. విపక్ష సభ్యులు 'మేమున్నాం' అనేలా చేతులు పైకెత్తి, తీర్మానాన్ని స్వీకరించాలని స్పీకర్‌ను కోరారు. అయినప్పటికీ స్పీకర్ పట్టించుకోలేదు. సభను మంగళవారానికి వాయిదా వేశారు. వివిధ రాష్ట్రాల కొత్త సంవత్సరాల సందర్భంగా స్పీకర్ లోక్‌సభలో ఎంపీలకు సోమవారం విందు ఇచ్చారు. అవిశ్వాస తీర్మానాన్ని పరిగణనలోకి తీసుకోనందుకు నిరసనగా టీడీపీ, వైసీపీ ఎంపీలు ఆ విందును బహిష్కరించారు. మంగళవారం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు వీలుగా టీడీపీ లోక్‌సభాపక్ష నేత తోట నరసింహం, వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మరోసారి స్పీకర్ కార్యాలయంలో విడివిడిగా నోటీసులు ఇచ్చారు.

### ఏపీపై మహారాష్ట్ర ఎంపీ వాయిదా తీర్మానం

ఏపీకి హోదా అంశంపై మహారాష్ట్రకు చెందిన కాంగ్రెస్ ఎంపీ రాజీవ్‌సతవ్ లోక్‌సభలో వాయిదా తీర్మానాన్ని అందజేశారు. ప్రత్యేక హోదా ప్రకటించాలన్న న్యాయమైన డిమాండ్‌పై కేంద్రం నుంచి స్పందన లేదని నోటీసులో పేర్కొన్నారు. పదేపదే ఇచ్చిన హామీలు, నిర్ణయాలను కేంద్రం విస్మరించిందని, దాంతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహం నెలకొందని, ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిందేనని స్పష్టం చేశారు. అయితే, ఈ వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తోసిపుచ్చారు.

### ప్రజలు నవ్వుతున్నారు: వెంకయ్య

న్యూఢిల్లీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ పనితీరుపై ఛైర్మన్ వెంకయ్య నాయుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సభ జరగనివ్వాలని ఎంపీలకు పదేపదే విజ్ఞప్తి చేశారు. అయినా ఎంపీలు ఆందోళనలు విరమించలేదు. సోమవారం ఉదయం సభా కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలంటూ టీడీపీ ఎంపీలు సీఎం రమేశ్, తోట సీతారామలక్ష్మి, టీజీ వెంకటేశ్, గరికపాటి మోహన్ రావు వెల్‌లోకి వచ్చి నినాదాలు చేశారు. ప్లకార్డులను ప్రదర్శించారు. అదే సమయంలో ఏపీ అంశంపై ప్లకార్డులు పట్టుకొని కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి కూడా వెల్‌లోకి వచ్చారు. మరో పక్క, కావేరి నది యాజమాన్య మండలిని ఏర్పాటు చేయాలంటూ తమిళనాడు అధికార పార్టీ అన్నాడీఎంకే, విపక్ష డీఎంకే ఎంపీలు ఛైర్మన్ పోడియాన్ని చుట్టుముట్టారు. గందరగోళ పరిస్థితి నెలకొనడంతో ఛైర్మన్ వెంకయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రజలు నవ్వుతున్నారు. పార్లమెంటు నవ్వులపాలవుతోంది. సభను నడవనివ్వండి" అని హితవు పలికారు. ఏ అంశంపైనైనా చర్చకు తాను అనుమతిస్తానని ఇప్పటికే చెప్పానని గుర్తు చేశారు. "ఇలా ఇంకెంత కాలం కొనసాగిస్తాం? మీ స్థానాలకు వెళ్లకపోతే సభను వాయిదా వేస్తా" అని హెచ్చరించారు.

### టీడీపీ నిరసనకు మేం అడ్డుకాదు: టీఆర్ఎస్



పార్లమెంటు ఆవరణలో టీఆర్ఎస్ ఎంపీల నిరసన

న్యూఢిల్లీ, మార్చి19 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లపై రాష్ట్రాలకు స్వేచ్ఛ ఇచ్చేవరకూ పార్లమెంట్‌లో పోరాటం ఆపేది లేదని టీఆర్ఎస్ తేల్చిచెప్పింది. వరుసగా పదకొండో రోజూ లోక్‌సభ కార్యకలాపాలను అడ్డుకుని తమ నిరసన తెలిపింది. సోమవారం సభ ప్రారంభమైన వెంటనే టీఆర్ఎస్ ఎంపీలు జితేందర్‌రెడ్డి, వినోద్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, నగేష్, కొండా విశ్వేశ్వరరెడ్డి, కొత్త ప్రభాకర్, బాల్క సుమన్, బీబీ పాటిల్ ప్లకార్డులు తీసుకుని సభమధ్యలోకి వెళ్లారు. కాగా.. ఏపీ ఎంపీలు తెచ్చిన అవిశ్వాసం ఆమోదించాలా వద్దా అనే నిర్ణయం తీసుకొనే సమయంలో సభలో నిరసన హోరు వినిపించడాన్ని టీఆర్ఎస్ సమర్థించుకుంది. 'మా డిమాండ్లను పరిశీలిస్తామని మాటిస్తే సభలో కూర్చునేందుకు తాము సిద్ధమని' పేర్కొంది.

## మోదీకి టీడీపీ దెబ్బ: శివసేన



ముంబై, మార్చి 19: వచ్చే పాతికేళ్లపాటు నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని ఎవరూ కదిలించలేరన్న భ్రమలను టీడీపీ అవిశ్వాస తీర్మానం మటుమాయం చేసిందని ఎన్డీఏ భాగస్వామ్య పక్షమైన శివసేన వ్యాఖ్యానించింది. ఎన్డీఏ సర్కారుపై అపనమ్మకం ఏర్పడిందని, ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని.. వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో వారి నిరసన జ్వాలలు ఒక్కసారిగా భగ్గుమంటాయని పేర్కొంది. భారీ మెజారిటీతో ఆ అవిశ్వాసం గెలుస్తుందని తన పత్రిక 'సామ్నా' సోమవారంనాటి సంపాదకీయంలో జోస్యం చెప్పింది. ఇదే సమయంలో టీడీపీ తన వ్యక్తిగత రాజకీయ అవసరాల కోసమే అవిశ్వాసం ప్రతిపాదించిందని ఆరోపించింది. జాతీయ కారణాలతో కాదని వ్యాఖ్యానించింది. ఎన్డీఏకి పూర్తి మెజారిటీ ఉన్నందున అవిశ్వాసం నిష్ఫలమని స్పష్టం చేసింది.

## 'ప్రత్యేక హోదా'ను క్షణం కూడా వదల్లేదు: నితీశ్




పట్నా, మార్చి 19: బిహార్‌కు ప్రత్యేక హోదా డిమాండ్‌ను ఒక్క క్షణం కూడా విడిచిపెట్టలేదని ఆ రాష్ట్ర సీఎం నితీశ్ కుమార్ స్పష్టం చేశారు. రాష్ట్రానికి హోదా కోసం పదమూడేళ్ల కిందటే తాను మొదటిసారిగా డిమాండ్ చేశానని, అప్పటినుంచి దీనిపై పోరాడుతూనే ఉన్నానని చెప్పారు. ఈ అంశంపై తాను మౌనంగా ఉన్నానంటూ లాలూప్రసాద్ చేసిన వ్యాఖ్యలను కొట్టిపారేశారు.

## అవిశ్వాస తీర్మానానికి మద్దతివ్వండి : స్టాలిన్



చెన్నై, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కావేరి నిర్వాహక మండలి కోసం అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం చేసి పంపినా పట్టించుకోని కేంద్రం మెడలు వంచాలంటే టీడీపీ అవిశ్వాస తీర్మానానికి అన్నాడీఎంకే మద్దతు ఇవ్వాలని డీఎంకే సభాపక్ష నాయకుడు ఎంకే స్టాలిన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ కావేరి బోర్డును ఏర్పాటు చేస్తుందో లేదో కేంద్రం ఇప్పటివరకూ స్పష్టం చేయలేదన్నారు.

## 4వ సారీ రష్యా అధ్యక్షుడిగా పుతిన్



మాస్కో, మార్చి 19 : రష్యా అధ్యక్షుడిగా వ్లాదమీర్ పుతిన్ వరుసగా నాలుగోసారి ఎన్నికయ్యారు. ఆయన మరో ఆరేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. ఈ ఎన్నికలు చక్కని ఫలితాలను అందించాయని పుతిన్ సంతృప్తి వ్యక్తంచేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఆయన క్రెమ్లిన్‌లో తన అభిమానులు, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. బతికినంతకాలం పదవిలోనే ఉండాలన్న ఆకాంక్ష తనకు లేదంటూ, నియంతలా పేరుపడిన స్టాలిన్ పాలనాతీరును ఘాటుగా విమర్శించారు. అదేసమయంలో కమ్యూనిస్టు చైనా పరిణామాలపై కూడా పరోక్షంగా వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో బరిలో నిలుస్తారా అని మీడియా ప్రశ్నించగా.. 'అంటే.. నేను వందేళ్లపాటు ఈ పదవిలోనే ఉండాలనేది మీ ఉద్దేశ్యమా? మీ తీరు హాస్యాస్పదంగా ఉంది' అని పుతిన్ వ్యాఖ్యానించారు. కాగా, ఈ ఎన్నికల్లో ఆయనకు అనుకూలంగా 76.67% ఓట్లు పోల్ కావడం విశేషం. ఆయన అధ్యక్షుడిగా ఎన్నికయిన ఇన్నేళ్లకాలంలో ఇంత భారీ మెజారిటీ నమోదు కావడం ఇదే తొలిసారి. స్టాలిన్ తర్వాత, అంత సుదీర్ఘకాలం అధ్యక్ష పదవిలో కొనసాగిన వ్యక్తి పుతినేనని ఆయన మద్దతుదారులు సంబరపడుతున్నారు. అయితే, ఈ ఎన్నికల్లో భారీ ఎత్తున రిగ్గింగ్ జరిగిందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. అయితే, ఈ విమర్శలను ఎన్నికల సంఘం కొట్టివేసింది. కాగా, ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ ఒక ప్రకటనలో పుతిన్‌కు అభినందనలు తెలిపారు.



## లాలూ మళ్లీ దోషే

**నాలుగో దాణా కేసులో సీబీఐ కోర్టు నిర్ధారణ**

రాంచీ, మార్చి 19: బిహార్ మాజీ సీఎం, ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్‌కు మరోసారి కోర్టులో చుక్కెదురైంది. పశు దాణా కుంభకోణానికి సంబంధించి నాలుగో కేసులోనూ శిక్ష ఖాయమైంది. 1995-96 మధ్య దుమ్‌కా ట్రెజరీ నుంచి చట్టవిరుద్ధంగా రూ.3.13 కోట్లు స్వాహా చేశారన్న ఆరోపణలకుగాను ఆయనతో పాటు మరో 18 మందిని రాంచీలోని సీబీఐ ప్రత్యేక కోర్టు సోమవారం దోషులుగా నిర్ధారించింది. మాజీ సీఎం జగన్నాథ్ మిశ్రా, ఉమ్మడి బిహార్ పీఏసీ మాజీ ఛైర్మన్లు జగదీశ్ శర్మ, ధ్రువ్ భగత్, మాజీ మంత్రి విద్యాసాగర్, ఆర్‌కే రాణా సహా 12 మందిని న్యాయమూర్తి నిర్దోషులుగా ప్రకటించారు. దోషులకు శిక్షల ఖరారు పై బుధవారం నుంచి వాదనలు వింటారు. ఈ తీర్పును హైకోర్టులో సవాల్ చేస్తామని ఆర్జేడీ నేత రఘువంశ్ ప్రసాద్ సింగ్ చెప్పారు.



### మంచు పొరల్లో దాగిన 'ముత్యం'

ఈ ఇల్లును చూశారా? మంచు పొరల్లో దాగిన ముత్యంలా ఉంది కదూ. సముద్రపు తీరంలోని కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడి ఇల్లుపై పడితే.. శీతల గాలులు సంద్రపు నీటిని వెనక్కి వెళ్లకుండా మంచులా మార్చేశాయి. అందమైన ఇల్లును శ్వేత వర్ణ శోభితంగా తీర్చిదిద్దాయి. డెన్మార్క్‌లోని ఫాక్సే బేలో కొలువుదీరిందే ఈ మంచు ముత్యం.

## మాపై భారతీయుల వివక్ష

**▸▸ అమెరికాలో కాగ్నిజెంట్ మాజీ ఉద్యోగుల ఆరోపణ**

బ్లూమ్‌బర్గ్, మార్చి 19: కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ కంపెనీ అమెరికాలో ఉద్యోగాలు ఆశించే ఐటీ నిపుణులకు హెచ్-1బీ వీసాలు స్పాన్సర్ చేస్తుంది. ఈ సంస్థ భారతీయేతర ఉద్యోగులపై పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుందని మాజీ ఉద్యోగులు ఆరోపించారు. భారత్‌కు చెందిన సూపర్‌వైజర్లు, సహచరుల వల్లే తాము బలవంతంగా ఉద్యోగాలు మానుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఈ మేరకు కంపెనీపై పౌర హక్కుల దావా వేశారు. అయితే ఈ ఆరోపణలను కాగ్నిజెంట్ సంస్థ ఖండించింది. వారి ఆరోపణలు ఫెడరల్ పౌర హక్కుల కిందకు రావని వివరణ ఇచ్చుకుంది. కాగా.. కంపెనీ వాదనలు విన్న అమెరికా డిస్ట్రిక్ట్ కోర్టు జడ్జి డాలీ జీ ఈ దావాను కొట్టివేస్తున్నట్టు తెలిపారు.

## 'విష్ణు స్తంభ్'గా కుతుబ్‌మినార్




హిందూ మహాసభ కేలండర్,(ఇన్‌సెట్లో) 'విష్ణు స్తంభ్'గా కుతుబ్‌మినార్

**▸▸ తేజో మహాలయంగా తాజ్‌మహల్.. వివాదాస్పదంగా హిందూ మహాసభ కేలెండర్**

ఆగ్రా, మార్చి 19: హిందూ మహాసభ అలీగఢ్ విభాగం విడుదల చేసిన కొత్త కేలండర్ వివాదాస్పదంగా మారుతోంది. ఈ కేలండర్‌లో పలు ఇస్లామిక్ కట్టడాలను హిందూ దేవాలయాలుగా పేర్కొంటూ.. వాటి పేర్లను మార్చారు. కుతుబ్‌మినార్‌ను 'విష్ణు స్తంభం'గా, తాజ్‌మహల్‌ను 'తేజో మహాలయ శివ్ మందిర్'గా పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని కమల్ మౌలా మసీదును 'భోజ్‌శాల'గా, కాశీలోని జ్ఞానవ్యాపి మసీదును 'విశ్వేశ్వర మందిరం'గా మార్చారు. జౌన్‌పూర్‌లోని అతలా మసీదును 'అతలాదేవి ఆలయం' అని.. బాబ్రీ మసీదును 'రామ జన్మభూమి' అని అచ్చు వేయించారు. ఇలా పలు ఇస్లామిక్ కట్టడాలను హిందూ పేర్లతో మార్పు చేశారు. దీనిపై ముస్లిం పర్సనల్ లా బోర్డ్ తీవ్రంగా మండిపడింది.



Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Balanagar (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.